

ఈనాడు



విజయవాడ 22-2-2026 ఆదివారం సిటీ సంపుటి 52 . సంచిక 193

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 8-00 పేజీలు 16+28 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



ప్రపంచంపై మళ్లీ పిడుగు

- సుంకాలను 15%కి పెంచుతానన్న ట్రంప్
- కోర్టు తీర్పును అధ్యయనం చేశాకే నిర్ణయానికి వచ్చామని వెల్లడి
- భారత్‌కూ ఇవే వర్తిస్తాయని స్పష్టీకరణ
- ఆ దేశమే సుంకాలను చెల్లిస్తుందని, తమపై ఉండబోవని స్పష్టీకరణ
- నరేంద్ర మోదీ గొప్పవారని ప్రశంస

న్యూయార్క్, వాషింగ్టన్: సుంకాల విషయంలో సుప్రీం కోర్టు షాకిచ్చినా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెనక్కి తగ్గడం లేదు. ప్రపంచ దేశాలపై శుక్రవారం 10 శాతం సుంకాలను విధించిన ఆయన.. వాటిని 15 శాతానికి పెంచుతానని శనివారం ప్రకటించారు. భారత్‌కూ 15 శాతమే వర్తిస్తాయని స్పష్టం చేశారు. వాస్తవానికి సుప్రీం తీర్పు తర్వాత తనకున్న అధికారాలతో అన్ని దేశాలపై 10 శాతం సుంకాలను విధిస్తున్నట్లు శుక్రవారం ఆయన అధికారికంగా ప్రకటించి.. ఉత్తర్వులపై సంతకం చేశారు. ఈ నెల 24వ తేదీ నుంచి అవి (మిగతా 15లో)

వాళ్లు మూర్ఖులు

సుప్రీంకోర్టు జడ్జీలు మూర్ఖులు.. పెంపుడు శునకాల్లాంటివారు. దేశానికి ఏది మంచో అది చేయలేని అసమర్థులు.

\- ట్రంప్, అమెరికా అధ్యక్షుడు



భార్యకు వీలైనచోటే విడాకుల కేసు విచారణ

ఆ మేరకు ప్రాధాన్యమివ్వాలని హైకోర్టు స్పష్టీకరణ

రెండు కేసుల్లో ఆ మేరకు బదిలీ

ఈనాడు, అమరావతి: వివాహ సంబంధ వివాదాల కేసులను విచారించే ప్రదేశాలను నిర్ణయించే విషయంలో భర్తకు కలిగే అసౌకర్యం కన్నా.. భార్యకు కలిగే అసౌకర్యాన్ని పరిగణనలోకి తీసుకోవాలని హైకోర్టు స్పష్టం చేసింది. వైవాహిక వివాదాల కేసులను ఒక కోర్టు నుంచి మరో కోర్టుకు బదిలీ చేయాలనే అభ్యర్థనలు వచ్చినప్పుడు.. ఇరుపక్షాల సామాజిక, ఆర్థిక స్థితిగతులతోపాటు, వారి జీవన ప్రమాణాలను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంది. భార్యకు అనుకూలత ఉన్న ప్రదేశానికే ప్రాధాన్యం ఇవ్వాలని (మిగతా 3లో)

పోలవరం నిర్మాణ పనులు 81.45% పూర్తి

భూసేకరణ, సహాయ, పునరావాసం 27.40%

2025 అక్టోబరు నాటికి పనుల పురోగతి వెల్లడించిన జలశక్తి శాఖ

లోపలి పేజీలో

హృదయం అతనిది.. స్పందన ఆమెది

బ్రెయిన్‌డెడ్ అయిన యువకుడి గుండెతో యువతికి పునర్జన్మ

డైలేటెడ్ మయోకార్డియోపతి నరకం నుంచి విముక్తి

యువకుడి అవయవాలతో మరో ఏడుగురి జీవితాల్లో వెలుగు

లోపలి పేజీలో



వాసుదేవరెడ్డిని విజయవాడలోని అవినీతి నిరోధక శాఖ ప్రత్యేక కోర్టు నుంచి గుంటూరు జైలుకు తరలిస్తున్న పోలీసులు

మద్యం స్కాంలో వాసుదేవరెడ్డి అరెస్టు

ఈ నెల 27 వరకూ రిమాండ్ విధింపు

గుంటూరు జిల్లా జైలుకు తరలింపు

మద్యం కుంభకోణం శరీరమైతే.. వాసుదేవరెడ్డి తలలాంటి వారు

గతంలో ఏసీబీ కోర్టు వ్యాఖ్యలు

ఈనాడు, అమరావతి: జగన్ హయాంలో జరిగిన రూ.వేల కోట్ల మద్యం కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మొత్తం కుంభకోణంలో అన్నీ తానై ప్రధానపాత్ర పోషించిన రెండో నిందితుడు (ఏ-2), అప్పటి బెవరేజెస్ కార్పొరేషన్ ఎండీ డి.వాసుదేవరెడ్డిని సిట్ అధికారులు శనివారం మధ్యాహ్నం అరెస్టు చేశారు. ఈ కేసులో విచారణకు రావాలని ఈ నెల 9న సిట్ అధికారులు నోటీసులివ్వగా వాసుదేవరెడ్డి శనివారం ఉదయం హాజరయ్యారు. దర్యాప్తు బృందం ఎన్నిసార్లు ప్రశ్నించినా.. కుంభకోణంలోని కీలకాంశాలపై నోరు విప్పలేదు. విచారణకు సహకరించలేదు. దీంతో మధ్యాహ్నం 2 గంటల సమయంలో వాసుదేవరెడ్డిని అరెస్టు చేశారు. ఆయన వద్ద రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం విజయవాడ ఏసీబీ కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి భాస్కర్‌రావు ఈ నెల 27వ తేదీ వరకూ రిమాండ్ విధించారు. వాసుదేవరెడ్డిని గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. వాసుదేవరెడ్డి ఈ కేసులో అప్రూవర్‌గా మారతారని మొదట్లో ప్రచారం జరిగింది. దర్యాప్తు అధికారులకు ఆయన సహకరించలేదు. పైగా ఆ ముసుగులో ముందస్తు బెయిల్ పొందేందుకు యత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే వైకాపా మద్యం ముఠా తరఫున అన్నీ తానై కుంభకోణంలో కీలకంగా వ్యవహరించిన వాసుదేవరెడ్డిని (మిగతా 3లో)

మద్యం కుంభకోణంలో వాసుదేవరెడ్డి సహ కుట్రదారు

రిమాండ్ రిపోర్టులో వెల్లడించిన సిట్ 3లో



కాంగ్రెస్ ప్రవర్తన సిగ్గుచేటు

అంతర్జాతీయ సదస్సులో అర్ధనగ్న ప్రదర్శన దారుణం

రాష్ట్రంలో బూతులు తిట్టేవారిని పరామర్శిస్తున్నారు

వినుకొండ స్వచ్ఛాంధ్ర సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, నరసరావుపేట: 'ఏఐ సదస్సులో కాంగ్రెస్ ప్రవర్తించిన తీరు ఆవేదన కలిగించింది. 70కి పైగా దేశాల ప్రతినిధులు పాల్గొన్న సదస్సులో కాంగ్రెస్ కార్యకర్తల అర్ధనగ్న ప్రదర్శన దేశ ప్రతిష్ఠకు నష్టం. ఇలాంటి చర్యల్ని ఖండిస్తున్నా' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. పల్నాడు జిల్లా వినుకొండలో శనివారం నిర్వహించిన స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర సభలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. అంతకు ముందు మంత్రులు నారాయణ, గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభితో కలిసి స్వచ్ఛ రథాలను ప్రారంభించారు. చంద్రబాబు మాట్లాడుతూ 'ఏఐ సదస్సులో ప్రపంచంలోని చాలా దేశాలు ఆవిష్కరణలు ప్రదర్శించగా, మన ఆవిష్కరణల్ని చూపించి ప్రపంచ దేశాల అభినందనలు అందుకున్నాం. ఐటీ, ఏఐల్లో ముందుండటంతో ప్రపంచ నాలెడ్జ్ ఎకానమీకి నాయకత్వం వహించే ఏకైక దేశం మనదేనని అందరూ కితాబిచ్చారు. మన యువత ప్రయోజనాలు కాపాడాల్సిన కాంగ్రెస్ బాధ్యతారహితంగా వ్యవహరించడం దుర్మార్గం. మన రాష్ట్రంలోనూ వైకాపా వంటి పార్టీని ఎప్పుడూ చూడలేదు. నేను బాంబులకు భయపడలేదు. అలిపిరిలో నాపై దాడి చేసినప్పుడు వేంకటేశ్వరస్వామి నన్ను కాపాడారు. ఆ స్వామికి అపచారం కలిగే పనులు వైకాపా నాయకులు (మిగతా 3లో)

సర్వజన హితాయ సుఖాయ

- ఏఐ ప్రయోజనాలు అందరికీ
- అదే మన సూత్రం కావాలి
- న్యూదిల్లీ డిక్లరేషన్‌కు ప్రపంచ దేశాల ఆమోదం

దిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో ప్రపంచవ్యాప్త సహకారం ఉండాలని, దాని ప్రయోజనాలు అన్ని దేశాలకూ అందాలని ఏఐ అంతర్జాతీయ సదస్సు తీర్మానించింది. సర్వజన హితాయ.. సర్వజన సుఖాయ (అందరి సంక్షేమం.. అందరి సుఖం) అనే సూత్రం ఆలంబనగా ఈ మేరకు 'న్యూదిల్లీ డిక్లరేషన్'ను ప్రకటించింది. దిల్లీలో ఈ నెల 18, 19 తేదీల్లో జరిగిన 'ఏఐ ఇంపాక్ట్ సమిట్-2026'లో ఈ తీర్మానానికి అమెరికా, భారత్, ఫ్రాన్స్, బ్రిటన్, చైనా సహా 88 దేశాలు/అంతర్జాతీయ సంస్థలు ఆమోదం తెలిపాయి. ఏఐ లబ్ధిని మానవాళి అంతా పంచుకోవాలని పిలుపునిచ్చాయి. ఏఐపై అన్ని దేశాల సహకారానికి తీర్మానం చేయడం కీలక మైలురాయి అని శనివారం విడుదలైన అధికారిక ప్రకటన పేర్కొంది.

విస్తృత ఏకాభిప్రాయం: "అంతర్జాతీయ సహకార బలోపేతం, వేర్వేరు వ్యవస్థల్ని భాగస్వాముల్ని చేయడం, అన్ని దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవించడం, అందుబాటులో ఉండే విశ్వసనీయ వ్యవస్థల ద్వారా ఏఐని (మిగతా 3లో)



వీళ్లు 'ఏఐ' కృష్ణార్జునులు

ఏఐ ఇంపాక్ట్ సదస్సులో అద్భుత దృశ్యం సాక్షాత్కారం

-వివరాలు 3లో





17 ఏళ్ల వయసులోనే తొలి ఉద్యోగం... ఆ అనుభవంతో దిగ్గజ సంస్థల్లో కొలువులు.. ఇప్పుడు మైక్రోసాఫ్ట్ సంస్థలో సీఈవో.. భారతీయ మూలాలున్న ఆశా శర్మ ప్రస్థానమిది. ఏఐ ప్లాట్‌ఫామ్ నుంచి గేమింగ్ విభాగం పగ్గాలు అందుకునే వరకూ ఆమె ప్రయాణం..

గేమింగ్ సామ్రాజ్యంలో 'ఆశా' కిరణం వసుంధరలో

గంజాయి స్మగ్లర్లపై 'నాట్స్' నిఘా

నిందితులందరినీ ట్రాక్ చేస్తున్నాం

టోల్‌ఫ్రీ నంబర్ 1972కి ఎవరైనా ఫిర్యాదు చేయొచ్చు

ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ


'ఈగల్ వార్షిక నివేదిక-2025' విడుదల

2లో

ఫిబ్రవరిలోనే భానుడి ప్రతాపం

నందిగామ, కర్నూలులో 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు 2లో

ఇదీ సంగతి!



అనంతబాబుతో అంటకాగిన ఖాకీలపై వేటు!



వి.భీమారావు



ఆకుల మురళీకృష్ణ



పి.మురళీకృష్ణారెడ్డి



ఎన్.సతీష్‌బాబు

- డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్యకేసులో నిందితునితో కుమ్మక్కైన ఫలితం
- అదనపు ఎస్పీ, ఎస్‌డీపీవో, సీఐ, ఎస్‌ఐల సస్పెన్షన్
- నాటి విచారణలో లోపాలపై శాఖాపరమైన విచారణకు ఆదేశం

ఈనాడు, కాకినాడ: కాకినాడకు చెందిన దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యం హత్యకేసులో ప్రధాన నిందితుడు, వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబుకు అనుకూలంగా వ్యవహరించిన నాటి పోలీసు అధికారులపై సస్పెన్షన్ వేటు పడింది. నాడు నిందితునితో పోలీసులు కుమ్మక్కైనట్లు కనిపిస్తోందని, వారిపై ఇప్పటి ప్రభుత్వమైనా చర్యలెందుకు తీసుకోలేదని సుప్రీంకోర్టు ఘాటు వ్యాఖ్యలు చేయడంతో ఉన్నతాధికారులు స్పందించారు. ఈ కేసులో పరిపాలన, (మిగతా 3లో)

విజయవాడలో 14 కి.మీ. ఎలివేటెడ్ ఫ్లై ఓవర్

- కనకదుర్గ వారధి నుంచి గంగూరు క్రాస్ వరకు
- హైదరాబాద్-విజయవాడ-మచిలీపట్నం హైవే మార్గంలో నిర్మాణం
- ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేలా.. ప్రతిపాదన

ఈనాడు, అమరావతి: హైదరాబాద్-మచిలీపట్నం జాతీయ రహదారి.. విజయవాడ నగర పరిధిలో ఉన్నంత మేరకు, ఆ మార్గంలో ఎలివేటెడ్ ఫ్లై ఓవర్ నిర్మించే ప్రతిపాదనను అధికారులు పరిశీలిస్తున్నారు. పండిట్ నెహ్రూ బస్టాండ్ సమీపంలోని రాజీవ్ పార్క్ వద్ద కనకదుర్గ ఫ్లైఓవర్ నుంచి మచిలీపట్నం వైపు వెళ్లే మార్గంలోని గంగూరు కూడలి వరకు దాదాపు 14 కి.మీ. మేర ఆరు వరుసలతో ఈ పైవంతెన నిర్మించాలని యోచిస్తున్నారు. దీనివల్ల హైవేలో ప్రయాణించే వారికి ఏ ఆటంకాలూ ఉండవని, విజయవాడ నగర ట్రాఫిక్ కష్టాలు కూడా తీరుతాయని అంచనా వేస్తున్నారు. ఈ ప్రాజెక్టను ఎలా చేపట్టవచ్చన్న భిన్న ప్రణాళికలపై దిల్లీ స్థాయిలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) అధికారులు చర్చిస్తున్నారు.

మొత్తంగా ఆరు వరుసలతో ఉండేలా..


◆ హైదరాబాద్-విజయవాడ-మచిలీపట్నం హైవే-65.. విజయవాడ పరిధిలో ఇబ్రహీంపట్నం, గొల్లపూడి, భవానీపురం, కనకదుర్గ ఫ్లైఓవర్, కృష్ణలంక, వారధి జంక్షన్, బెంజ్ సర్కిల్, ఆటోనగర్ గేట్, కానూరు, పోరంకి, పెనమలూరు మీదుగా వెళ్తుంది.

◆ ప్రస్తుతం హైదరాబాద్-విజయవాడ మధ్య హైవేను ఆరు వరుసలుగా విస్తరించే ప్రాజెక్ట్ చేపట్టారు. దీన్ని గొల్లపూడి వద్ద విజయవాడ బైపాస్ క్రాస్ అయ్యే పాయింట్ వరకే విస్తరించాలని తొలుత భావించారు. రాష్ట్ర ప్రభుత్వ ఒత్తిడి వల్ల భవానీపురం వద్ద కనకదుర్గ ఫ్లైఓవర్ దాకా విస్తరించేందుకు ఎన్‌హెచ్ఏఐ సమ్మతించింది. ఈ మేరకు డీపీఆర్ సిద్ధమవుతోంది.

◆ మరోవైపు విజయవాడ-మచిలీపట్నం హైవేను ఆరు వరుసలుగా విస్తరించే ప్రాజెక్ట్ కూడా చేపడుతున్నారు. దావులూరు టోల్‌ప్లాజా సమీపంలో ఔటర్ రింగ్‌రోడ్ క్రాస్ అయ్యే చోటు నుంచి మచిలీపట్నం వరకు ఆరు వరుసలుగా విస్తరించనున్నారు.

◆ దీంతో విజయవాడ నగర పరిధిలో కనకదుర్గ ఫ్లైఓవర్ తర్వాతి నుంచి కృష్ణలంక, వారధి జంక్షన్, స్క్యూబ్రిడ్జి, బెంజ్ సర్కిల్ వరకు, అక్కడి నుంచి మచిలీపట్నం వైపు కానూరు, పోరంకి, పెనమలూరు, గంగూరు, కంకిపాడు మీదుగా దావులూరు టోల్‌ప్లాజా వరకు నాలుగు వరుసలుగానే ఈ హైవే మిగిలిపోనుంది.

◆ ఇటీవల ఎన్‌హెచ్ఏఐ ఉన్నతాధికారుల సమావేశంలో ఈ అంశం చర్చకు వచ్చింది. విజయవాడకు ఇరువైపులా ఆరు వరుసలుగా విస్తరించి, వాహన రద్దీ ఎక్కువగా ఉండే నగరం మధ్యలో మాత్రం నాలుగు వరుసలుగా మిగిలిపోతే ఎలాగన్న ప్రశ్న తలెత్తింది. దీనికి నగరంలో ఆరు వరుసలతో ఎలివేటెడ్ ఫ్లై ఓవర్ నిర్మించడమే పరిష్కారమన్న అంచనాకు వచ్చారు. తద్వారా కనకదుర్గ ఫ్లైఓవర్ నుంచి గంగూరు కూడలి వరకు ఆరు వరుసలతో ఎలివేటెడ్ వంతెన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.



ఎలివేటెడ్ ఫ్లై ఓవర్ నిర్మించే మార్గం

ఒకటా? రెండా?

◆ ఎలివేటెడ్ ఫ్లై ఓవర్ నిర్మాణానికి బెజవాడ నగర పరిధిలో పెద్దగా భూసేకరణ అవసరం ఉండదు. వివిధ కూడళ్ల వద్ద వంతెనపైకి వెళ్లేందుకు (ఎంట్రీ), బయటకు వచ్చేందుకు (ఎగ్జిట్) నిర్మించే అప్రోచ్‌లకు మాత్రం భూమిని సేకరించాల్సి ఉంటుంది.

◆ అయితే మొత్తంగా 14 కి.మీ. పొడవునా ఒకే వంతెన నిర్మించాలా, లేక రెండు భాగాలుగా విభజించాలా అన్న చర్చ నడుస్తోంది. మొత్తం ఒకే వంతెన నిర్మించాలంటే మధ్యలో బెంజ్ సర్కిల్ వద్ద ఇప్పటికే రెండు వంతెనలు ఉండటంతో, వాటిపై నుంచి బందరు వైపు మలుపు తిరిగేలా ఎలివేటెడ్ ఫ్లైఓవర్ డిజైన్ చేయాల్సి ఉంటుంది.

◆ దీనికి బదులు కనకదుర్గ వారధి నుంచి కృష్ణలంక, వారధి కూడలి మీదుగా బెంజ్ సర్కిల్ సమీపం వరకు 5 కి.మీ. ఒక ఎలివేటెడ్ ఫ్లై ఓవర్, బెంజ్ సర్కిల్ నుంచి గంగూరు కూడలి వరకు 9 కి.మీ. మరో ఫ్లై ఓవర్ నిర్మిస్తే ఎలా ఉంటుందనేది పరిశీలించనున్నారు. ఒకట్రెండు వారాల్లో దీనిపై స్పష్టత వస్తుందని అధికారులు చెబుతున్నారు.

◆ మొత్తంగా హైదరాబాద్-విజయవాడ మధ్య, విజయవాడ-మచిలీపట్నం మధ్య హైవే విస్తరణ పేరిట ఒకే హైవేపై రెండు ప్రాజెక్టులకు డీపీఆర్ తయారు చేస్తున్నారు. అందులోనే ఈ ఎలివేటెడ్ ఫ్లై ఓవర్‌ను కూడా చేర్చే అంశాన్ని పరిశీలిస్తున్నారు.

ఆయేషా మీరా కేసులో పోరాటం కొనసాగిస్తాం

తల్లిదండ్రులు షంషాద్ బేగం, ఇక్బాల్ బాషా

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ఆయేషా మీరా కేసులో అసలైన నిందితులకు శిక్ష పడే వరకు పోరాటం కొనసాగిస్తామని తల్లిదండ్రులు షంషాద్ బేగం, ఇక్బాల్ బాషా తెలిపారు. శనివారం వారు 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. 'సీబీఐ కోర్టులో మాకు న్యాయం దక్కలేదు. తొలిదశలో ఎఫ్ఐఆర్‌లో ఆయేషా మీరా వయసు తప్పుగా నమోదు చేశారు. అప్పటి నుంచి అనేక తప్పులు జరిగాయి. అన్ని అంశాలను తాము తెలియజేసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని కోరతాం' అని చెప్పారు.

9 వరకు పీజీసెట్ దరఖాస్తుల స్వీకరణ

తిరుపతి (ఎస్వీయూ), న్యూస్‌టుడే: రాష్ట్రంలోని 17 వర్సిటీల్లో పీజీ కోర్సుల ప్రవేశాల కోసం నిర్వహించే ఏపీ పీజీసెట్-2026కు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సెట్ కన్వీనర్, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య వి.విజయ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో మార్చి 9 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు. ప్రవేశ పరీక్షలు మే 8 నుంచి 11 వరకు జరుగుతాయని తెలిపారు.

ప్రకటన

ఈటీవీ భారత్ యాప్/ website లోని వార్తలు, కథనాలను మొత్తంగా లేదా పాక్షికంగా ఈటీవీ భారత్ వారి అనుమతి లేకుండా ఎటువంటి హక్కు లేని కొంతమంది వ్యక్తులు, సంస్థలు కాపీ చేసి తీసుకొని తమ వాణిజ్య ప్రయోజనాల (వెబ్‌సైట్లలో, న్యూస్‌యాప్‌లలో, యూట్యూబ్ ఛానళ్లలో) కోసం వినియోగిస్తున్నట్టు మా దృష్టికి వచ్చింది. ఈ విధమైన అనుమతి లేని చర్యలు కాపీరైట్ చట్టానికి విరుద్ధం మరియు శిక్షార్హమైన నేరం. అందువల్ల ఎవరైనా వ్యక్తులు, సంస్థలు ఈటీవీ భారత్‌లోని వార్తలు, వ్యాసాలను అనుమతి లేకుండా అప్‌లోడ్ చేయడం నేరం. అట్టి చర్యలను ఈటీవీ భారత్ తీవ్రంగా పరిగణించి, బాధ్యులపై సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకుంటుందని హెచ్చరిక జారీ చేయడమైనది.

ఇట్లు/- వెల్లంకి రత్నకుమార్,
చీఫ్ మేనేజర్, లీగల్ డిపార్ట్‌మెంట్

రేపటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు

- ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించరు

ఈనాడు, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా 1,537 కేంద్రాల్లో సోమవారం (ఈనెల 23) నుంచి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. ఈ ఏడాది ప్రథమ, ద్వితీయ సంవత్సరాల విద్యార్థులు కలిపి 10,57,312 మంది పరీక్ష రాయనున్నారు. ఎలాంటి లోపాలకు తావివ్వకుండా పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేశామని ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి పి.రంజిత్ బాషా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభం అవుతుందని, ఒక్క నిమిషం ఆలస్యమైనా నిబంధనల ప్రకారం పరీక్షకు అనుమతించబోమని స్పష్టంచేశారు. విద్యార్థులు గంట ముందే కేంద్రానికి చేరుకోవాలన్నారు. విద్యార్థులు తమ వ్యక్తిగత వివరాలు ఓఎంఆర్ షీట్‌పై సరిచూసుకోవాలని సూచించారు. పరీక్షల సమయంలో విద్యార్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకునేలా అదనపు బస్సు సర్వీసులు నడపాలని ఆర్టీసీ అధికారులను కోరామన్నారు. అత్యవసర సమస్యల కోసం బోర్డు కార్యాలయంలో ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉండేలా టోల్ ఫ్రీ నంబర్ 1800 425 1531తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు.

ఏర్పాట్లు ఇలా..

◆ పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్తు, గాలి, వెలుతురు ఉండేలా ఏర్పాట్లు చేశారు.

◆ ప్రతి పరీక్ష గదిలో సీసీ టీవీ కెమెరాల నిఘా వ్యవస్థ

◆ మొబైల్స్, స్మార్ట్ వాచ్‌లు, కాలిక్యులేటర్లు, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు.

కౌన్సెలింగ్ ద్వారా డీటీలకు పోస్టింగ్

ఈనాడు, అమరావతి: రెవెన్యూశాఖలో డీటీ పోస్టింగులకు సీసీఎల్ఏ జయలక్ష్మి శనివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. మంగళగిరిలోని కార్యాలయంలో ఏపీపీఎస్సీ ద్వారా ఎంపికైన 110 మంది డిప్యూటీ తహసీల్దార్లతో ఆమె సమావేశమయ్యారు. ప్రతి ఒక్కరితో వ్యక్తిగతంగా మాట్లాడి.. సీనియారిటీకి అనుగుణంగా 13 కొత్త జిల్లాలకు జోన్ల వారీగా కేటాయింపులు చేశారు. రెవెన్యూశాఖలో తొలిసారిగా కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగులు ఇవ్వడం ద్వారా జయలక్ష్మి కొత్త ఒరవడి సృష్టించారని ఆ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

రెవెన్యూ శాఖకు నోటీసులిచ్చి.. ఆ భూములు వెనక్కి

- అర్హులకు వారి ప్రాంతాల్లోనే స్థలాలు ఇద్దాం
- 'ఆర్5 జోన్' భూములపై సీఎం ఆదేశం
- ముఖ్యమంత్రి అధ్యక్షతన సీఆర్‌డీఏ సమావేశం

ఈనాడు, అమరావతి: అమరావతి మాస్టర్‌ప్లాన్‌కి విఘాతం కలిగిస్తూ.. బయటి ప్రాంతాలకు చెందిన 51వేల మందికి వైకాపా హయాంలో రాజధానిలో సెంటు చొప్పున కేటాయించిన స్థలాల్ని వెనక్కి తీసుకునేలా రెవెన్యూశాఖకు తుది నోటీసులు ఇవ్వాలని సీఆర్‌డీఏని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. వారిలో అర్హులకు... రాష్ట్రప్రభుత్వ విధానానికి అనుగుణంగా వారి ప్రాంతాల్లోనే ఇళ్లస్థలాలు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని, అనువైన స్థలాల్ని గుర్తించాలని ఆయా జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. శనివారం ఉండవల్లిలోని క్యాంప్ కార్యాలయంలో సీఎం అధ్యక్షతన సీఆర్‌డీఏ 58వ సమావేశం జరిగింది. వైకాపా హయాంలో రాజధానిలో సీఆర్‌డీఏకి చెందిన 900 ఎకరాల్ని రెవెన్యూశాఖకు బదలాయించారు. మాస్టర్‌ప్లాన్‌కి భంగం కలిగిస్తూ... కొత్తగా ఆర్5 జోన్ ఏర్పాటుచేశారు. ఆ భూముల్ని తీసుకున్నందుకు సీఆర్‌డీఏకి చెల్లించాల్సిన నగదు రెవెన్యూశాఖ ఇంతవరకు కట్టలేదు. ఆ కారణంతో... రెవెన్యూశాఖకు తుది నోటీసులు జారీ చేసి, సీఆర్‌డీఏ ఆ భూముల్ని వెనక్కి తీసుకోనుంది.



క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఏపీ సీఆర్డీయే సమావేశంలో మంత్రి నారాయణ, అధికారులు

◆ రాజధాని హరిత ప్రణాళికలో భాగంగా... మొదట రహదారుల పక్కన, పార్కుల్లో మొక్కలు నాటాలని సీఎం ఆదేశించారు. పార్కుల్లో ల్యాండ్‌స్కేప్‌ల్ని ఇప్పుడే అభివృద్ధి చేసినా పాడవుతాయని, ప్రధాన మౌలిక వసతుల పనులు పూర్తయి, జనాభా పెరిగే కొద్దీ... క్రమంగా అభివృద్ధి చేద్దామని ఆయన తెలిపారు. ఇతర దేశాల్లో పార్కుల్ని, వాటి నిర్వహణ విధానాల్ని అధ్యయనం చేయాలని సూచించారు.

◆ రాజధానిలో నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నందున బాగా దుమ్ము లేస్తున్న విషయాన్ని సీఎం ప్రస్తావించారు. దుమ్ము లేవకుండా చూసేందుకు, చెట్లపై పేరుకున్న మట్టిని తొలగించేందుకు రెయిన్ గన్‌లు వినియోగించాలని సూచించారు.

◆ ప్రభుత్వ భవనాల నిర్మాణాలు, మౌలిక వసతులే అభివృద్ధి చేస్తే సరిపోదని... ప్రైవేటు సంస్థలు, వ్యక్తులు నిర్మాణాలు చేపట్టేలా చొరవ తీసుకోవాలని సీఎం పేర్కొన్నారు.

◆ రాజధాని పరిధిలోని కొండలనూ అభివృద్ధి చేయాలని, వాటికి ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు.

◆ కొత్తగా ఏడు సంస్థలకు భూ కేటాయింపులు చేస్తూ, గతంలో కొన్ని సంస్థలకు చేసిన కేటాయింపుల్లో మార్పులు చేస్తూ మంత్రివర్గ ఉపసంఘం ఇటీవల తీసుకున్న నిర్ణయాలకు అథారిటీ ఆమోదం తెలిపింది.

◆ భాజపా కార్యాలయానికి గతంలో 2.8 ఎకరాలు కేటాయించగా, సాంకేతిక ఇబ్బందులు రావడంతో, దాన్ని 1.43 ఎకరాలకు తగ్గించి వేరేచోట కేటాయించినట్లు మంత్రి నారాయణ తెలిపారు.

◆ శాసనసభ, హైకోర్టు భవనాల ఎంఈపీ పనులకు టెండర్లు పిలిచేందుకు అథారిటీ ఆమోదం తెలిపింది.

◆ రాజధానిలో ప్రభుత్వ భవనాల నిర్మాణ పనుల పర్యవేక్షణను సీఆర్‌డీఏ నుంచి కొత్తగా ఏర్పాటైన ఏజీఐసీఎల్‌కు బదలాయిస్తూ అథారిటీ నిర్ణయం తీసుకుంది.

ఫిబ్రవరిలోనే భానుడి ప్రతాపం

నందిగామ, కర్నూలులో 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

ఈనాడు, విశాఖపట్నం: వేసవి రాకముందే రాష్ట్రంలో భానుడి ఉష్ణ ప్రతాపం మొదలైంది. ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతున్నాయి. వేడి, ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శనివారం నందిగామ, కర్నూలులో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 37 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. విశాఖపట్నం, తుని, నరసాపురం, బాపట్ల తదితర ప్రాంతాల్లోనూ గరిష్ఠ ఉష్ణోగ్రతలు 2-3.5 డిగ్రీలు అధికంగా నమోదయ్యాయి.

కొనసాగుతున్న అల్పపీడనం

నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతోంది. ఇది పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ ఆదివారం నాటికి తీవ్ర అల్పపీడనంగా బలపడే అవకాశముందని భారత వాతావరణ విభాగం పేర్కొంది. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన మరో ఉపరితల ఆవర్తనం.. ఈ అల్పపీడనంతో కలిసిపోయింది. దీని ప్రభావంతో రానున్న మూడు రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురవొచ్చని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. ఆది, సోమవారాల్లో తూర్పు గోదావరి జిల్లాలో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ అంచనా వేస్తోంది. పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో తేలికపాటి వానలు పడొచ్చని తెలిపింది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) వారి కార్యాలయం
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

Ref. B1/15/2026 — Dt. 21-02-2026

ఫారమ్ నెం.VI (ఎ)

(2013, భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో నిష్పాక్షిక నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టం నందలి సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ (19), సబ్ రూల్(1) ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

ఈ దిగువ షెడ్యూలులో చూపబడిన ఏలూరు జిల్లా, బుట్టాయిగూడెం మండలం, దొరమామిడి గ్రామము నందలి భూమి ప్రజాహిత కార్యాలకు అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు క్రింద వి.ఆర్.పురం మండలం, శబరిరావిగూడెం గ్రామంలోని గిరిజన రైతుల నుండి సేకరించిన భూమికి బదులుగా, పునరావాస, పునఃస్థాపనల క్రింద, వారికి భూమిని కేటాయించు నిమిత్తం భూమి అవసరమైనట్లు ప్రాజెక్ట్ ఆఫీసర్, ఐ.టి.డి.ఎ., చింతూరు మరియు ఆర్&ఆర్ అధికారి, చింతూరు యూనిట్, పోలవరం జిల్లా వారు భావించినందున 2013, భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో నిష్పాక్షిక నష్టపరిహారం పొందే హక్కు, పారదర్శకత చట్టం నందలి 11వ విభాగపు 1వ ఉపవిభాగములోని నిబంధనలననుసరించి ఈ విషయం గురించి ఇందుకు సంబంధించిన యావన్మందికి తెలియజేయడం కొరకు ఇందుమూలముగా నోటీసు జారీచేయబడినది.

పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించి పర్యావరణ ప్రభావం మదింపు (ఇఐఎ) క్లియరెన్స్ భారత ప్రభుత్వం వారి అటవీ మరియు పర్యావరణ మంత్రిత్వశాఖ వారి లేఖ నెం.జె-12011/74/2005-1ఎ1, తేది. 25-10-2005 ప్రకారం జారీ చేయబడినది.

చట్టంలోని విభాగం 43(1) క్రింద ప్రభావిత కుటుంబాలకు పునరావాసం మరియు పునఃస్థాపన కొరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ ది.10-05-2020వ తేదీన జారీ చేసిన జి.ఓ.యమ్.యస్. నెం.42 ప్రకారం ప్రాజెక్ట్ నిర్వాహకులు నియమించబడినారు.

ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు చట్టంలోని విభాగము 12 క్రింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించేందుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, వరరామచంద్రపురం యూనిట్-2, చింతూరు వారికి, వారి సిబ్బందికి ఇందుమూలముగా అధికారము ఇచ్చియున్నారు.

పై చట్టంలోని సెక్షన్ 11(4)ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేదీ నుండి ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం / స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, వరరామచంద్రపురం యూనిట్-2, చింతూరు వారి ముందస్తు అనుమతి లేనిదే ఏవ్యక్తి ఈ ప్రకటనలో తెలిపిన భూమిని ఏవిధమైన అమ్మకం/కొనుగోలు (క్రయ, విక్రయాలు) లేదా ఏవిధమైన లావాదేవీలు జరపరాదని తెలియజేయడమైనది.

పై చట్టంలో సెక్షన్-15 ననుసరించి భూసేకరణపై ఏమైనా అభ్యంతరములు/ ఆక్షేపణలు ఉన్నయెడల సంబంధించిన వ్యక్తి/వ్యక్తులు ఈ ప్రకటనను ప్రచురించబడిన తేదీ నుండి 60 (అరువది) దినములలోగా కలెక్టరు/ప్రత్యేక కలెక్టర్, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూలు

జిల్లా: ఏలూరు — మండలం: బుట్టాయిగూడెం — గ్రామం: దొరమామిడి

క్రమ సంఖ్య	సర్వే నెంబరు	భూసేకరణ క్రింది విస్తీర్ణం (య.సెంట్లు)	భూమి తరగతి	సంబంధిత ఆసామి పేరు మరియు చిరునామా	పరిహద్దులు: తూర్పు	పడమర	ఉత్తరం	దక్షిణం	చెట్లు, కట్టడములు ఇతరముల వివరములు
1	631/5	3.40	స.పు	సంకురు వేణు కుమార్ రెడ్డి	631	630	644	632	మామిడి తోట, కొబ్బరి తోట
2	636/2	1.29	స.పు		637	630	643	634	మామిడి తోట, కొబ్బరి తోట, టేకు చెట్లు
3	637/3	4.30	స.పు		637	636	643	638	టేకు చెట్లు, తాడి చెట్లు, రేగు-01
4	637/2A	3.44	స.పు		637	637	642	638	మామిడి తోట, కొబ్బరి తోట, తాడి చెట్లు
5	637/2B	3.60	స.పు		637	637	642	638	రేకుల షెడ్-01, బోరు -01, వాటర్ ట్యాంక్-01, మామిడి తోట
మొత్తం:		16.03							

కె.ఆంజనేయులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసే), వి.ఆర్.పురం యూనిట్-2, చింతూరు — సం/- వి.అభిషేక్, ఐ.ఎ.ఎస్., స్పెషల్ కలెక్టర్ (భూసే) (ఎఫ్ఏసి), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ప్రదేశం: వి.ఆర్.పురం యూనిట్ -II, తేది: 17-02-2026.

పవన్‌కల్యాణ్ దత్తత గ్రామం కొణిదెలకు కొత్తదశ

- రూ.50 లక్షల విరాళంతో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం
- వివిధ పథకాల కింద రూ.6 కోట్లతో అభివృద్ధి పనులు

ఈనాడు, అమరావతి: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చొరవతో నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం కొణిదెల గ్రామంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. పవన్‌కల్యాణ్ ఇంటి పేరు, ఆ ఊరి పేరు ఒకటే కావడం విశేషం. 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో ఆయన కర్నూలు జిల్లా పర్యటనలో ఉండగా కొణిదెల గ్రామస్థులు కొందరు తమ గ్రామాన్ని దత్తత తీసుకోవాలని కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. కిందటేడాది నందికొట్కూరు నియోజకవర్గ పర్యటనకు వెళ్లి కొణిదెల అభివృద్ధికి రూ.50 లక్షల విరాళం అందించారు. జిల్లా యంత్రాంగం సూచన మేరకు ఆ నిధులతో 90 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న ఓవర్‌హెడ్ నీటి ట్యాంకు నిర్మించారు.

◆ కొణిదెల గ్రామానికి 'పల్లె పండుగ 1.0'లో రూ.20 లక్షలకు పైగా వెచ్చించి 3 అంతర్గత రోడ్లు నిర్మించారు. 'పల్లె పండుగ 2.0'లో రూ.45 లక్షలతో చేపట్టిన 7 సీసీ రోడ్ల పనులు పురోగతిలో ఉన్నాయి.

◆ ఉప ప్రణాళిక నిధులతో స్థానిక జిల్లా పరిషత్తు స్కూలు నుంచి పగిడ్యాల మండల పరిధిలోని లక్ష్మాపురం వరకు 5 కి.మీ. మేర బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.4 కోట్లు, ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి గ్రామం వరకు రోడ్డు పునరుద్ధరణకు రూ.45 లక్షలు ఉప ముఖ్యమంత్రి మంజూరు చేయించారు.

◆ ఆ గ్రామస్థుల అభ్యర్థన మేరకు 4 గోకులాలు, గృహ నిర్మాణశాఖ సహకారంతో 19 ఇళ్లు, నీటితొట్టెలు నిర్మించారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద రైతుల కోసం 49 ఫీడర్ ఛానళ్లు అభివృద్ధి చేశారు.

◆ రెండు చిన్న కాలువల పునరుద్ధరణ, 3 కమ్యూనిటీ చెక్‌డ్యాంలు బాగు చేశారు.

గంజాయి స్మగ్లర్లపై 'నాట్స్' నిఘా

- నిందితులందరినీ ట్రాక్ చేస్తున్నాం
- ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ

ఈనాడు, అమరావతి, విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: గంజాయి, మాదకద్రవ్యాల స్మగ్లింగ్, సరఫరా, విక్రయాలు, నిల్వ చేసేవారిపై నిఘా కోసం 'నార్కోటిక్ అఫెండర్స్ ట్రాకింగ్ సిస్టమ్ (నాట్స్)' పేరిట అధునాతన సాంకేతిక వ్యవస్థను అందుబాటులోకి తెచ్చామని ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ చెప్పారు. ఈ వ్యవస్థ ద్వారా గత 11 ఏళ్లలో నమోదైన మాదకద్రవ్యాలకు సంబంధించిన కేసుల్లో నిందితులుగా ఉన్న వారందరినీ ట్రాక్ చేస్తున్నామని తెలిపారు. వారిలో పద్ధతి మార్చుకోకుండా ఇప్పటికీ నేరాలకు పాల్పడుతున్న వారిని వదిలిపెట్టబోమని హెచ్చరించారు. 'ఈగల్ వార్షిక నివేదిక-2025'ను విజయవాడలోని ఈగల్ కార్యాలయంలో శనివారం రవికృష్ణ విడుదల చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ కేసుల్లో జైలు జీవితం గడిపి, ప్రస్తుతం బెయిల్‌పై ఉన్న 4,500 మంది కార్యకలాపాలపై నిఘా కొనసాగుతోందని తెలిపారు. రాష్ట్రంలో గంజాయి సాగు పూర్తిగా నిర్మూలించామని, ప్రస్తుతం ఒడిశా నుంచి రవాణా అవుతోందని పేర్కొన్నారు. ప్రధానాంశాలివి.



ఈగల్ వార్షిక నివేదిక విడుదల చేస్తున్న ఐజీ రవికృష్ణ, చిత్రంలో ఎస్పీ కేఎం మహేశ్వరరాజు, ఇతర అధికారులు

◆ గంజాయి, డ్రగ్స్ కేసుల్లో చిక్కుకుంటే 10-20 ఏళ్ల పాటు జైలుశిక్ష తప్పదు. బెయిల్ రాదు. పాస్‌పోర్టు రద్దవుతుంది. వీసా లభించదు. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ నిర్వహించే నిదాన్ పోర్టల్‌లో పేరు చేరుతుంది. విద్యార్థుల భవిష్యత్తు నాశనమవుతుంది. అందుకే వాటికి దూరంగా ఉండాలని పదేపదే చెబుతున్నాం.

◆ గంజాయి, డ్రగ్స్‌కు సంబంధించిన ఎలాంటి సమాచారమైనా 1972 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి చెప్పొచ్చు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంటాయి. అంతేకాదు, మత్తు బారినపడ్డ పిల్లలను వాటి నుంచి విముక్తి చేయాలనుకున్న తల్లిదండ్రులు కూడా 1972కు కాల్ చేయొచ్చు.

గ్రహం అనుగ్రహం

22-2-2026 ఆదివారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; శిశిర రుతువు, ఫాల్గుణ మాసం, శుక్ల పక్షం
పంచమి: మ. 12-09 తదుపరి షష్ఠి
అశ్విని: రా. 7-01 తదుపరి భరణి
వర్జ్యం: మ. 3-13 నుంచి 4-45 వరకు
తిరిగి తె. 4-02 నుంచి 5-32 వరకు
అమృత ఘడియలు: మ. 12-11 నుంచి 1-42 వరకు
దుర్ముహూర్తం: సా. 4-27 నుంచి 5-13 వరకు
రాహుకాలం: సా. 4-30 నుంచి 6-00 వరకు
సూర్యోదయం: ఉ.6.28; సూర్యాస్తమయం: సా.6.00

వాతావరణం

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విజయనగరం	17.0	33.0
విశాఖపట్నం	18.4	32.6
రాజమహేంద్రవరం	19.0	38.5
హైదరాబాద్	19.7	32.9
తిరుపతి	20.6	33.2
శ్రీకాకుళం	21.0	31.0
విజయవాడ	21.2	33.6
అనంతపురం	21.3	35.7
కర్నూలు	21.7	37.0
కడప	22.0	34.0
గుంటూరు	22.0	34.0
ఒంగోలు	22.0	34.2
నరసాపురం	22.0	35.0
తాడేపల్లిగూడెం	22.0	36.0
నెల్లూరు	22.6	33.0



సభలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, వేదికపై కలెక్టర్ కృతికా శుక్లా, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, మంత్రి నారాయణ, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, మంత్రి గొట్టిపాటి రవికుమార్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి



సభకు హాజరైన జనం

కాంగ్రెస్ ప్రవర్తన సిగ్గుచేటు

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా బూతులే తిడుతున్నారు. ఇది న్యాయమేనా? మనం తిట్టించుకోవడానికి రాజకీయం చేస్తున్నామా? రెచ్చగొట్టే రాజకీయాలు చేస్తున్నారు. రాష్ట్రాన్ని గంజాయిమయం చేశారు. మదనపల్లెలో ఒకరు గంజాయి తాగి మృగంలా ప్రవర్తించారు. గంజాయి తాగి ఆడబిడ్డల జోలికొస్తే అదే చివరి రోజవుతుందని చెప్పిన మాటకు కట్టుబడి ఉంటాను. అలాంటి మృగాలు జైల్లో ఉండాలి లేదా ఉరిశిక్షతో పైకి పోవాలి.. చట్టం తన పని తాను చేస్తుంది' అని పేర్కొన్నారు.

నెయ్యే కాదని సిట్ తేల్చింది

'తిరుమల తిరుపతి దేవస్థానంలో నాసిరకం ప్రసాదాలు గత ఐదేళ్లు అందరూ తిన్నారు. వైకాపా వారు భక్తుల నమ్మకాన్ని దెబ్బతీశారు. మేము పవిత్రతను కాపాడుతున్నాం. ఎన్నికల్లో నేను ఇచ్చిన హామీ ప్రకారం తితిదే ఈవోగా శ్యామలరావును నియమించి ప్రక్షాళనకు శ్రీకారం చుట్టాం. నెయ్యి నాణ్యంగా లేదని ల్యాబ్‌కు పంపితే జంతు కొవ్వు ఉందని తేల్చారు. ప్రజలకు తెలియజేయకపోతే అప్రతిష్ఠ వస్తుందని ల్యాబ్ రిపోర్టునే నేను ప్రకటించాను. దీన్ని రాజకీయం చేసి సుప్రీంకోర్టు వరకు వెళ్లేలా చేశారు. సిట్ వేశాం. అసలు నెయ్యే కాదని, రసాయనాలు ఉన్నాయని తేల్చింది. సిట్ స్పష్టంగా చెప్పినా.. తిరిగి దాన్ని మాపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారు. హెరిటేజ్ కంపెనీని తీసుకొచ్చి నా పేరు ప్రస్తావించి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. కరడుగట్టిన నేరస్థులతో రాజకీయం చేయాలా? రాష్ట్రాన్ని కాపాడుకునే బాధ్యత నా ఒక్కడిపైనే లేదు.. మీ అందరిపై ఉంది. చెడ్డవారిని దూరం పెట్టినప్పుడే రాజకీయాల్లో ప్రక్షాళన మొదలవుతుంది. నాకెందుకులే అని ఇంట్లో కూర్చుంటే మార్పు రాదు. ప్రజల



స్వచ్ఛ రథాన్ని ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రులు నారాయణ, రవికుమార్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి తదితరులు

దొంగలను నడిరోడ్డుపై నిలబెడతా

సాక్షాత్తూ వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని శాసనమండలిలోకి తీసుకెళ్లారు. పాదరక్షలు వేసుకుని స్వామి చిత్రాలను విసిరేశారు. ఇలాంటి వాళ్లతో రాజకీయం చేయాలా? వేంకటేశ్వరస్వామి విషయాన్ని బయట మాట్లాడకూడదనుకున్నాను. రెండు రోజులు ఓపిక పట్టాను. నాపైనే నెపం వేసే ప్రయత్నం చేస్తుంటే ఎలా ఊరుకుంటాను? దొంగే దొంగ అంటుంటే.. దొంగను పట్టి నడిరోడ్డుపై నిలబెట్టాల్సిన బాధ్యత నాపై ఉంది. అందుకే మాట్లాడుతున్నా. మీరంతా ఈ విషయంలో నాతో నడవాలి.

కోసమే నాడు జైలుకెళ్లాను. కేవలం ప్రజలు, రాష్ట్రాభివృద్ధి కోసమే ఇప్పటికీ పోరాటం చేస్తున్నా.

పరామర్శల పేరిట బలప్రదర్శనలా?

చెత్త, రౌడీ రాజకీయాలు చేస్తున్నారు. పరామర్శల పేరిట బయటకు వస్తారు. మనుషుల్ని బలవంతంగా తెచ్చుకుని బలప్రదర్శనకు దిగుతున్నారు. వాళ్ల కార్ల కింద మనుషుల్ని చంపేసి ప్రభుత్వంపైకి నెట్టేస్తున్నారు. చనిపోయినవారి ఇళ్లకు పరామర్శకు వెళ్లరు.. వాళ్లనే పిలిపించుకుని పరామర్శిస్తారు. ఇదెక్కడా చూడలేదు. బూతులు తిట్టేవారిని పరామర్శిస్తారు. వాళ్ల కోసం చనిపోయిన వారిని మాత్రం పరామర్శించరు. విధ్వంసమైన ఆర్థిక వ్యవస్థ నుంచి రాష్ట్రాన్ని పునర్నిర్మాణం దిశగా తీసుకెళ్తున్నాం. నాడు పెట్టుబడులు పెట్టాలన్నా ఎవరూ ముందుకు రాలేదు. రాష్ట్రాన్ని తాకట్టుపెట్టి, 13 శాతం అప్పులు చేశారు. కూటమిని నమ్మిన ప్రజలకు సూపర్ 6ను అనుకున్న సమయం కంటే ముందుగానే అమలుచేశాం. అవకాశాల్ని అందిపుచ్చుకోవడం ద్వారా రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులొచ్చాయి. దీంతో 23 లక్షల మంది యువతకు ఉద్యోగాలు వస్తాయి. త్వరలో విద్యార్థులకు ఏఐలో శిక్షణ ఇచ్చేందుకు ఏఐ ట్యూటర్ వస్తారు. వ్యవసాయంలో ఏఐ అగ్రి ఎకానమీని తీసుకొస్తాం. ఇటీవల బిల్‌గేట్స్ కూడా వచ్చి రైతులు టెక్నాలజీ వినియోగిస్తున్న తీరును చూసి ఎంతో అభినందించారు.

బూట్లు తొలగించి.. జ్ఞాపిక అందుకుని..

ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, ఆయన భార్య లీలావతి కలిసి సీఎంను సన్మానించారు. అనంతరం వారు వేంకటేశ్వరస్వామి ప్రతిమ ఉన్న జ్ఞాపికను బహూకరిస్తుండగా.. చంద్రబాబు కాళ్లకు ఉన్న బూట్లను తొలగించి అందుకున్నారు.

కోటప్పకొండ ప్రభల ప్రస్తావన

పల్నాడులో అడుగుపెట్టగానే వచ్చే వైబ్రేషన్సే వేరు. ఇటీవలే కోటప్పకొండ తిరునాళ్లు జరిగాయి. మునుపెన్నడూ లేని రీతిలో భక్తులు భారీగా హాజరయ్యారు. జిల్లా అధికారులు బ్రహ్మాండంగా ఏర్పాట్లు చేశారు. శివరాత్రి అనగానే కోటప్పకొండ ప్రభలే గుర్తుకొస్తాయి. నేను అనునిత్యం పర్యవేక్షిస్తూనే ఉన్నాను. అందుకు వేరే కారణాలున్నాయి.

లంచాల కోసమే మద్యం విధానం మార్పు

సీటెల్ సాఫ్ట్‌వేర్ ధ్వంసం చేసి.. దోపిడీకి వాసుదేవరెడ్డి తెరతీశారు

ఏసీబీ కోర్టులో ప్రాసిక్యూషన్స్ జేడీ రాజేంద్రప్రసాద్ వాదనలు

ఈనాడు, అమరావతి: 'మద్యం కుంభకోణంలో వాసుదేవరెడ్డి కీలక సూత్రధారి. బెవరేజెస్ కార్పొరేషన్ ఎండీగా తన అధికారాన్ని ఉపయోగించుకుని.. ఆటోమేటిక్ ఓఎఫ్ఎస్ విధానాన్ని రద్దు చేసి.. మాన్యువల్‌కు మార్చారు. తద్వారా లంచాలిచ్చే కంపెనీలకే మద్యం అమ్ముకునేలా అనుమతులు ఇచ్చారు' అని ప్రాసిక్యూషన్స్ జేడీ రాజేంద్రప్రసాద్ వాదించారు. వాసుదేవరెడ్డిని సిట్ అధికారులు ఏసీబీ కోర్టులో న్యాయాధికారి భాస్కర్‌రావు ఎదుట శనివారం హాజరుపర్చారు. రాజేంద్రప్రసాద్ తన వాదనలు వినిపిస్తూ.. 'గతంలో ఉన్న సీటెల్ సాఫ్ట్‌వేర్‌ని నిందితుడు ధ్వంసం చేసి, దోపిడీకి తెరతీశారు. అతడి నుంచి మరిన్ని వివరాలు సేకరించాలి. వాసుదేవరెడ్డికి రిమాండ్ విధించండి' అని కోరారు. 'సిట్ విచారణకు వాసుదేవరెడ్డి సహకరిస్తున్నారు. ఎప్పుడు పిలిచినా సిట్ ముందు హాజరవుతారు' అని నిందితుడి తరపు న్యాయవాదులు సాయికుమార్, గోపీనాథ్ వాదించారు. వాదనలు విన్న న్యాయాధికారి భాస్కర్‌రావు.. నిందితుడికి ఈ నెల 27 వరకు రిమాండ్ విధిస్తూ శనివారం రాత్రి ఉత్తర్వులిచ్చారు.

మద్యం కుంభకోణంలో వాసుదేవరెడ్డి సహ కుట్రదారు

వైకాపా ముఠాతో కలిసి కుట్రకు రూపకల్పన, అమలులో ప్రధాన పాత్రధారి

- ఆటోమేటెడ్ మద్యం సరఫరా ఆర్డర్ల జారీ వ్యవస్థను విధ్వంసం చేశారు
- మాన్యువల్ విధానంలో ఆర్డర్లు ఇచ్చి కుంభకోణానికి దారులు తెరిచారు
- అందరూ కలిసి రూ.3,570 కోట్లు దోచుకున్నారు
- రిమాండ్ రిపోర్టులో వెల్లడించిన సిట్

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో జరిగిన మద్యం కుంభకోణంలో అప్పటి బెవరేజెస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డి (ఏ-2) సహ కుట్రదారు అని సిట్ తేల్చింది. వైకాపా మద్యం ముఠాతో కలిసి కుట్రకు రూపకల్పన, అమలులో ఆయన ప్రధానపాత్ర పోషించారని స్పష్టం చేసింది. 2019 కంటే ముందువరకూ ఆటోమేటెడ్ విధానంలో ఉన్న మద్యం సరఫరా ఆర్డర్ల జారీ వ్యవస్థను విధ్వంసం చేసి, ఆ స్థానంలో మాన్యువల్ విధానాన్ని ప్రవేశపెట్టటం ద్వారా కుంభకోణానికి దారులు తెరిచారని వెల్లడించింది. వైకాపా ముఠాకు లంచాలిచ్చే బ్రాండ్లకే అత్యధిక సరఫరా ఆర్డర్లు లభించేలా, అందుకు అంగీకరించని బ్రాండ్లను చంపేసేలా చేశారని తెలిపింది. ఆర్డర్లు కావాలంటే లంచాలివ్వాల్సిందేనని డిస్టిలరీలు, మద్యం సరఫరా కంపెనీల యజమానులపై వాసుదేవరెడ్డి ఒత్తిడి తెచ్చారని, బెదిరించారని వివరించింది. తద్వారా ఈ కుంభకోణంలో వాసుదేవరెడ్డి, మిగతావారంతా కలిసి రూ.3,570.87 కోట్లు దోచుకున్నారని నిగ్గుతేల్చింది. వాసుదేవరెడ్డిని అరెస్టు చేసిన సిట్ అధికారులు.. ఈ మేరకు విజయవాడ ఏసీబీ కోర్టులో రిమాండ్ రిపోర్టు సమర్పించారు. ప్రధానాంశాలివీ.

కేసుకు రూ.150-600 వరకూ లంచాలు

బేసిక్ ప్రైస్ ఆధారంగా ఒక్కో మద్యం కేసుకు రూ.150 నుంచి రూ.600 వరకూ, ఒక్కో బీరు కేసుపై రూ.50 చొప్పున లంచాలివ్వాలని వాసుదేవరెడ్డి మద్యం సరఫరా కంపెనీల యజమానులకు హుకుం జారీచేశారు. తొలుత మూలధరలో 12% తీసుకోగా.. తర్వాత దాన్ని 20%కు పెంచారు. ఆపై మద్యం మూలధరలు పెంచేశారు.

■ ఎస్ఎన్‌జే గ్రూపు తొలుత లంచం ఇవ్వకపోవడంతో వారికి ఆర్డర్లు ఇవ్వలేదు, పెండింగ్ బిల్లులూ నిలిపేశారు. లంచాలివ్వాలంటూ ఒత్తిడి తీసుకొచ్చారు. అంగీకరించాకే సరఫరా ఆర్డర్లు దక్కాయి. అనేక డిస్టిలరీలది ఇదే పరిస్థితి. ఈ మేరకు డిస్టిలరీల యజమానులు సిట్‌కు వాంగ్మూలమిచ్చారు.

డేటా ఎప్పటికప్పుడు వైకాపా ముఠాకు చేరవేత

అప్పట్లో ప్రతినెలా 27-30 లక్షల కేసుల మద్యం, 7-10 లక్షల కేసుల బీరు విక్రయించేవారు. తొలుత రాజ్ కసిరెడ్డి, అతని తోడల్లుడు ముప్పిడి అవినాష్‌రెడ్డి (ఏ-7), సజ్జల శ్రీధర్‌రెడ్డి (ఏ-6) మద్యం లంచాలపై సరఫరా కంపెనీలతో చర్చించేవారు. రెండో దశలో ఆ బాధ్యత వాసుదేవరెడ్డి చూసేవారు. ఇలా దోపిడీలో కీలకంగా వ్యవహరించారు.

■ అత్యంత గోప్యంగా ఉండాల్సిన ఎంఐఎస్, విక్రయాల డేటాను వాట్సప్, టెలిగ్రామ్ ఇతర ఛానళ్ల ద్వారా రాజ్ కసిరెడ్డి నేతృత్వంలోని వైకాపా మద్యం ముఠాకు వాసుదేవరెడ్డి చేరవేసేవారు. ఆ సమాచారం ఆధారంగా ఎవరెవరికి ఎంతెంత సరఫరా ఆర్డర్లు లభించాయో గుర్తించి.. ఆ ముఠా లంచాలు వసూలు చేసేది.

కేపీఎంజీ ఎన్నో చెబితే.... దోపిడీకి అనుకూల సిఫార్సులే అమలు

■ లంచాలిచ్చిన డిస్టిలరీలకే పెద్ద ఎత్తున సరఫరా ఆర్డర్లు ఇచ్చేందుకు వీలుగా అడ్డగోలుగా నిబంధనలు మార్చేసిన వాసుదేవరెడ్డి.. అంతా చట్టప్రకారమే చేశామనే భావన కల్పించేందుకు కేపీఎంజీ సంస్థను అడ్డం పెట్టుకున్నారు. ఆ సంస్థ 5 సిఫార్సులు చేయగా.. వాటన్నింటినీ విస్మరించి దోపిడీకి అనుకూలంగా ఉన్న 'డిస్టిలరీలు, సరఫరాదారులకు పీడీ ఖాతా నుంచి ప్రత్యేక గ్రీన్ ఛానల్‌లో చెల్లించాలి' అనే సిఫార్సు ఒక్కటే అమలుచేశారు. తద్వారా ఆయా డిస్టిలరీలకు రంచనుగా చెల్లింపులు జరిగేలా, వారినుంచి ఐదు రోజులకోసారి లంచాల సొమ్ము ముఠాకు అందేలా చేశారు.

కుట్రలో భాగంగానే.. డిప్యుటేషన్‌పై తెచ్చుకున్నారు

ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీస్ (ఐఆర్‌టీఎస్) అధికారైన డి.వాసుదేవరెడ్డిని వైకాపా అధికారంలోకి రాగానే డిప్యుటేషన్‌పై రాష్ట్రానికి తీసుకొచ్చి ఏపీఎస్‌బీసీఎల్ ఎండీగా కీలక బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత డిస్టిలరీస్ అండ్ బ్రూవరీస్ కమిషనర్‌గానూ నియమించారు. ముందస్తు కుట్రలో భాగంగానే ఆయన్ను తీసుకొచ్చారు. రాష్ట్రంలో ఏటా జరిగే మద్యం విక్రయాలు, ఏ కంపెనీకి ఎంత సరఫరా ఆర్డర్లు ఇస్తున్నారు? ఎంత లంచాలు వసూలు చేయాలి? అనేదానిపై మొదట్లో హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోనూ, తర్వాత విజయవాడలోనూ పలుమార్లు కీలక సమావేశాలు జరిగాయి. వాటిలో రాజ్ కసిరెడ్డి, వైకాపా ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, అప్పటి ఎంపీ వి.విజయసాయిరెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి తదితరులతో కలిసి వాసుదేవరెడ్డి పాల్గొనేవారు. డిస్టిలరీల యజమానులతో మాట్లాడే బాధ్యతల్ని వాసుదేవరెడ్డికి అప్పగించారు. తర్వాత ఆయన ఈ కుట్రలో మరింత కీలకమయ్యారు.

మద్యం స్కాంలో వాసుదేవరెడ్డి అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

సిట్ ఎట్టకేలకు అరెస్టు చేసింది.

వాళ్ల సహకారం లేనిదే ఇంత అవినీతి సాధ్యం కాదు: 'బ్యూరోక్రాట్లు, రాజకీయ పలుకుబడితో ఉన్నత హోదాలు అనుభవించేవారు, తుది నిర్ణయాలు తీసుకునేవారి మధ్య నేరపూరిత కుట్ర, సహకారం, కుమ్మక్కు లేకుండా మద్యం కుంభకోణంలో రూ.3,500 కోట్ల భారీ అవినీతి సాధ్యం కాదు. ఇదేమీ చిన్న కేసు కాదు. సంబంధమున్న బ్యూరోక్రాట్లను అరెస్టు చేయకపోవటం దురదృష్టకరం. వారి పాత్ర లోతుగా ఉన్నా తప్పించుకున్నారేమో! బ్యూరోక్రాట్ల నేరపూరిత కుట్ర, కుమ్మక్కు లేకుండా ఇంతటి భారీ అవినీతి ఎలా సాధ్యం? రాజకీయ పక్షపాతంతో ఉన్నత స్థానాలు అనుభవిస్తున్నవారే తుది నిర్ణయాలు తీసుకునేవారికి సహకరిస్తున్నారు' అంటూ సుప్రీంకోర్టు ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డికి బెయిల్‌ను తిరస్కరిస్తూ ఈ మాటలు చెప్పింది. వాసుదేవరెడ్డిని అరెస్టు చేయలేదనే ప్రస్తావన వచ్చినప్పుడు ఈ నెల 5న సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.

■ 'మద్యం కుంభకోణం శరీరమైతే వాసుదేవరెడ్డి దానికి తలలాంటి వారు. తల తీసేస్తే శరీరం మొత్తం కుప్పకూలిపోతుంది. ట్రంకు పెట్టెల కొద్దీ సాక్ష్యాధారాలు ఉన్నప్పుడు అతన్ని అప్రూవర్‌గా మార్చాల్సిన అవసరం లేదు. ముందస్తు బెయిల్ ఇస్తే తప్ప అప్రూవర్‌గా మారబోమనేలా కోర్టుతో బేరమాడుతున్నట్లు వాసుదేవరెడ్డి వ్యవహారశైలి ఉంది. రూ.3,500 కోట్ల ముడుపులు చేతులు మారిన ఇలాంటి తీవ్రమైన కేసులో ఆయనకు ముందస్తు బెయిల్ ఇవ్వలేము' అంటూ కొన్ని నెలల కిందటే ఏసీబీ కోర్టు స్పష్టం చేసింది. దీంతో వాసుదేవరెడ్డి హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ వేశారు. ప్రస్తుతం ఆ పిటిషన్ అక్కడ పెండింగ్‌లో ఉంది.



గుంటూరు జైలుకు వాసుదేవరెడ్డిని తీసుకెళ్తున్న పోలీసులు

గుంటూరు జైలుకు తరలింపు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: వాసుదేవరెడ్డిని పోలీసులు శనివారం రాత్రి 8.55 గంటలకు గుంటూరు జిల్లా జైలుకు తరలించారు.

అనంతబాబుతో అంటకాగిన ఖాకీలపై వేటు!

(మొదటి పేజీ తరువాయి)

పర్యవేక్షణ లోపాలకు బాధ్యులుగా పేర్కొంటూ నాడు డీఎస్పీలుగా పనిచేసిన వి.భీమారావు, పి.మురళీకృష్ణారెడ్డి, సీఐ ఆకుల మురళీకృష్ణ, ఎస్.ఐ ఎన్.సతీష్‌బాబును సస్పెండ్ చేస్తూ ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులు జారీచేశారు. వీరిపై శాఖాపరమైన విచారణ చేపట్టాలని ఆదేశించారు.

నాటి కేసులో ఎవరి పాత్ర ఏమిటంటే..

రక్తపు మరకలున్నా అనుమానాస్పద మృతిగానే: సుబ్రహ్మణ్యం మృతదేహంపై ఎర్రమట్టి, ఇసుక కనిపించినా, మృతుని కుటుంబసభ్యులు హత్యచేసి ఉంటారని ఫిర్యాదు చేసినా ఎస్.ఐ సతీష్‌బాబు (ఇప్పుడు కాకినాడ పోర్టుస్టేషన్ ఎస్.ఐ) పట్టించుకోలేదు. అనుమానాస్పద మృతి కింద ఎఫ్ఐఆర్ నమోదుచేశారు.

నిందితుడిని స్వేచ్ఛగా తిరగనిచ్చారు: నాడు డీఎస్పీ వి.భీమారావు (ఇప్పుడు భీమవరం అదనపు ఎస్పీ).. నిందితుడిని వెంటనే అదుపులోకి తీసుకోకుండా సాక్ష్యాలను తారుమారు చేయడానికి, సాక్షులను అనంతబాబు బెదిరించడానికి అవకాశం ఇచ్చారు. మూడురోజుల తర్వాత మృతుని బంధువులు, ఎస్సీ సంఘాల ఒత్తిళ్లతో అరెస్టు చూపించారు.

సీసీ కెమెరాల పుటేజీలు మాయం: సీఐ ఆకుల మురళీకృష్ణ (ప్రస్తుతం కోనసీమ జిల్లా డీసీఆర్బీలో సీఐ) నిందితునికి అనుకూలంగా సీసీ కెమెరాల్లో పుటేజీలు మాయం చేయడానికి సాయం చేశారనే ఆరోపణలున్నాయి. అనంతబాబు నివాస పరిసరాల్లో సేకరించిన చాలా పుటేజీలను తప్పించారు. కొన్ని డిలీట్ చేయించినట్లు సమాచారం.

ఆర్ఎఫ్ఎస్ఎల్‌లో నివేదిక లోపభూయిష్టంగా: మరో డీఎస్పీ పి.మురళీకృష్ణారెడ్డి (ప్రస్తుతం వీఆర్‌లో ఉన్నారు) సీసీ కెమెరాల పుటేజీని రీజనల్ ఫోరెన్సిక్ ల్యాబ్‌లో విశ్లేషించాక లోపభూయిష్టంగా నివేదిక వచ్చేలా చూశారన్న ఆరోపణలున్నాయి. నిందితుని భార్య ఉన్న పుటేజీలను పక్కనపెట్టించి ఈ కేసులో వేరొకరు లేరని రెడ్ విత్ 34 సెక్షన్‌ను తొలగించినట్లు సమాచారం.

'అనంతబాబు గారు' అంటూ: సుబ్రహ్మణ్యం మృతదేహంపై ఎర్రమట్టి, ఇసుక కనిపించినా అప్పటి ఎస్పీ రవీంద్రనాథ్‌బాబుకు పట్టలేదు. అపార్ట్‌మెంట్ గేటు దగ్గర 'అనంతబాబు గారు' క్షణికావేశంలో తోయడం వల్ల పడిపోయి చనిపోయాడని చెప్పుకొచ్చారు. రిమాండ్ రిపోర్టు, కోర్టుకు సమర్పించిన అరెస్టు సమాచారంలో అనంతబాబుకు నేరచరిత్ర లేదని చూపించారు. అతనిపై రౌడీషీట్ ఉండగా వైకాపా ప్రభుత్వం వచ్చాక తొలగించుకున్నారు. మరో 17 కేసులూ ఉన్నాయి. కొన్ని రుజువు కాలేదు, మరికొన్ని కొట్టేశారు.

మొత్తం వారి దర్శకత్వంలోనే..

కేసు విచారణ అప్పటి ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు, ఏలూరు ఐజీగా పనిచేసిన పాలరాజు పర్యవేక్షణలోనే సాగింది. అనంతబాబు హత్య చేసినట్లు ఎస్పీకి తెలిసినా రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించడం, శవపంచనామాను కప్పిపుచ్చేందుకు ప్రయత్నించినట్లు తెలిసింది. ఈ లొసుగులపై నివేదికను డీజీపీ కార్యాలయానికి పంపించారు.

దిల్లీలో అనంతబాబు

కేసు విచారణను నవంబరు 30లోగా పూర్తిచేయాలని సుప్రీంకోర్టు ఆదేశించడంతో అనంతబాబు శుక్రవారమే అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. దిల్లీలో ఉన్నట్లు ఇంటెలిజెన్స్ అధికారులు గుర్తించారు. కేసు విషయమై న్యాయనిపుణులు, నేతలను ఆశ్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఆయన భార్య లక్ష్మీదుర్గ కొన్నిరోజులుగా పరారీలోనే ఉన్నారు. ఆమె హైకోర్టులో ముందస్తు బెయిల్‌కు దరఖాస్తు చేశారు.

భార్యకు వీలైనచోటే విడాకుల కేసు విచారణ

(మొదటి పేజీ తరువాయి)

సూచించింది. విడాకుల కోసం తమ భర్తలు దాఖలు చేసిన పిటిషన్లను తాము నివసించే ప్రాంతంలోని కోర్టులకు బదిలీ చేయాలంటూ ఇద్దరు మహిళలు చేసిన అభ్యర్థనను హైకోర్టు అనుమతించింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెణుతురుమల్లి గోపాలకృష్ణారావు ఇటీవల ఈ మేరకు తీర్పు ఇచ్చారు.

విడాకుల కోసం తన భర్త రేపల్లె కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను తాను నివసిస్తున్న ఒంగోలు కోర్టుకు బదిలీ చేయాలంటూ ఎన్.రాజరాజేశ్వరి హైకోర్టులో పిటిషన్ వేశారు. తిరుపతి కోర్టులో తన భర్త దాఖలు చేసిన పిటిషన్‌ను ఆదోని కోర్టుకు బదిలీ చేయాలని కోరుతూ ఐశ్వర్య హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వారి తరపు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. భార్యలకు అసౌకర్యం కలిగించేందుకు దూరంగా ఉన్న ప్రాంతాల్లోని కోర్టుల్లో భర్తలు విడాకుల కేసులు దాఖలు చేశారన్నారు. దీంతో ఆ మహిళలు వ్యయప్రయాసలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. పిటిషనర్ల అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. ఆ విడాకుల కేసులను భార్యలు కోరుకున్న ప్రాంతానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులిచ్చారు. మరోవైపు క్రాస్ ఎగ్జామినేషన్ తదితర ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే పిటిషనర్ల భర్తలను హాజరుకు ఆదేశించవచ్చని, సాధారణ విచారణలకు వారి హాజరు అవసరం లేదని స్పష్టం చేశారు.

సర్వజన హితాయ.. సర్వజన సుఖాయ

(మొదటి పేజీ తరువాయి)

ముందుకు తీసుకువెళ్లడం ముఖ్యం. ఏఐ వనరుల్ని ప్రజాస్వామ్యీకరించాలి. ఆర్థిక వృద్ధి, సామాజిక మేలుకు దానిని ఉపయోగించాలి. అవి సురక్షితంగా, భద్రంగా ఉండాలి. సామాజిక సాధికారత, మానవ వనరుల అభివృద్ధి, సమర్థమైన-వినూత్నమైన ఏఐ వ్యవస్థల్ని తీర్చిదిద్దడం వంటివి పునాదులుగా నిలవాలి. వీటిపై విస్తృత ఏకాభిప్రాయం కుదిరింది'' అని ప్రకటన వివరించింది. ఆమోదం తెలిపిన దేశాల్లో రష్యా, బెల్జియం, భూటాన్, బ్రెజిల్, కెనడా, జపాన్, ఇటలీ, నేపాల్, సింగపూర్, ఈయూ వంటివి ఉన్నాయి. దీర్ఘకాలిక అంతర్జాతీయ భాగస్వామ్యం, ఆర్థిక వృద్ధికి ఏఐని కీలక సాధనంగా పరిగణించడం వంటివి దీనిలో ప్రస్తావించింది. శాస్త్రీయ సంస్థల్లో ఏఐ వాడుకకు అంతర్జాతీయ వ్యవస్థ ఏర్పాటుచేసి, పరిశోధనల్లో కృత్రిమ మేధను వాడాలని సదస్సు పిలుపునిచ్చింది. ఏఐపై అవగాహన/ నైపుణ్యాల పెంపు, ఏఐ ఆధారిత ఆర్థిక వ్యవస్థల దిశగా దేశాలను సన్నద్ధం చేయడం వంటివీ ప్రస్తావించింది. దార్శనికతను కార్యాచరణలోకి తీసుకువచ్చేలా కట్టుబడి ఉండాలని భాగస్వాములు నిర్ణయించినట్లు ప్రకటన తెలిపింది.

నిరసనలు ఓ కుట్ర: రిజిజు

ఏఐ సదస్సులో యువజన కాంగ్రెస్ కార్యకర్తలు నిరసనలు తెలపడం ఓ కుట్ర అని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. ఇది దేశంపై చేసిన అతిపెద్ద పాపమని మండిపడ్డారు. 'నిరసనలు పొరపాటున జరిగినవి కావు.. ఎంతో కుట్రపూరిత పథకంతోనే దీనికి ఒడిగట్టారు. దేశ ప్రతిష్ఠను మసకబార్చడానికి యువతను వాడుకోవడం కంటే సిగ్గుచేటైన విషయం మరొకటి ఉండదు' అని శనివారం భాజపా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో చెప్పారు. ఈ ఘటనలను దేశమంతా ఖండిస్తున్నా కాంగ్రెస్ మాత్రం క్షమాపణలు చెప్పడం లేదని తప్పుబట్టారు. దేశ పురోగతిని కాంగ్రెస్ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు.

వీళ్లు 'ఏఐ' కృష్ణార్జునులు

ఏఐ ఇంపాక్ట్ సదస్సులో అద్భుత దృశ్యం సాక్షాత్కారం

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో జరుగుతున్న ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో ఓ అద్భుత దృశ్యం సందర్శకులను ఆకట్టుకుంది. రిలయన్స్‌కు చెందిన జియో ఇంటెలిజెన్స్ విభాగం అత్యాధునిక హోలోగ్రామ్ టెక్నాలజీ, కృత్రిమ మేధ ద్వారా శ్రీకృష్ణుడు, అర్జునుడి హైటెక్ డిజిటల్ రూపాలను తన స్టాల్‌లో ప్రదర్శించింది. ఈ కృష్ణుడు, అర్జునుడి రూపాలను సందర్శకులు ప్రశ్నలు అడిగేలా... జియో ప్రత్యేక ఏర్పాటు చేసింది. ధర్మం అంటే ఏమిటి? మనిషికి అతిపెద్ద శత్రువు ఎవరు? జీవితంలో మనం అనుకున్న దానికి భిన్నంగా జరిగినప్పుడు ఏమి చేయాలి? వంటి ప్రశ్నలకు డిజిటల్ కృష్ణార్జునులు సమాధానాలిచ్చేలా ఏర్పాటు చేశారు. ఇది సమిట్‌కు వచ్చిన వారిని విశేషంగా ఆకర్షించింది. ఏఐతో రూపొందించిన కృష్ణార్జునులను ఎంతో సహజ సుందరంగా, ఆకట్టుకునే రూపంలో ప్రదర్శించారు. ఇందులో కృష్ణుడు నీలి రంగులో మెరుస్తూ, చేతిలో పిల్లన గ్రోవిని పట్టుకుని, బంగారు రంగు ధోతి కట్టుకుని, తలకు కిరీటం, ఆ పైన నెమలి పింఛాన్ని ధరించి ఎంతో సహజ సిద్ధమైన రూపంతో కనువిందు చేశారు. వెండి రంగు దుస్తులు, చేతిలో గాండీవం, మేలిమి వర్ణపు శరీరంతో గంభీరంగా, యుద్ధానికి సిద్ధమైనట్లుగా అర్జునుడు చూపరులను ఆకర్షించారు.



మా బిడ్డను చంపిన వారిని కఠినంగా శిక్షించాలి

- సుబ్రహ్మణ్యం తల్లిదండ్రులు

పెదపూడి, న్యూస్‌టుడే: 'మా కుటుంబానికి జరిగిన అన్యాయం మరెవ్వరికీ జరగకూడదు. మా కుమారుడిని చంపిన ఎమ్మెల్సీ అనంతబాబుతో పాటు అతనికి అండగా నిలిచిన వారందరినీ కఠినంగా శిక్షించాలి' అని మృతుడు వీధి సుబ్రహ్మణ్యం తల్లిదండ్రులు నూకరత్నం, సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ కేసుపై సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో శనివారం కాకినాడ జిల్లా జి.మామిడాడలోని తమ నివాసంలో వారు 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. 'ఈ కేసును వేగంగా విచారించాలని సుప్రీంకోర్టు ఆదేశించడం సంతోషంగా ఉంది. మాకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఏర్పడింది. దళిత సంఘం నాయకులు పిట్టా వరప్రసాద్, న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు మా కోసం నాలుగేళ్లుగా పోరాడుతున్నారు. మా బిడ్డను చంపిన కేసులో అనంతబాబు భార్యతో పాటు మరికొందరు ఉన్నారు. వారందరినీ విచారించి, శిక్షించాలి' అని కోరారు. తాము బయటి పనికి వెళ్లాలంటే ఆరోగ్యం సహకరించడం లేదని, ప్రభుత్వం ఇస్తామన్న ఇంటిస్థలం, ఇతర సౌకర్యాలు కల్పించాలని విన్నవించారు. తమ చిన్న కుమారుడికి ఉద్యోగం ఇచ్చినా రూ.12 వేల జీతమే వస్తుందని, కుటుంబం నడవడం కష్టంగా ఉందని ఆవేదన చెందారు.



సత్యనారాయణ నూకరత్నం దంపతులు

రూ.వంద కోట్లతో 'సమగ్ర హ్యాండ్లూమ్ అభివృద్ధి పైలట్ ప్రాజెక్టు'

- చేనేత, జౌళిశాఖ కమిషనర్ రేఖారాణి

ఈనాడు, అమరావతి: రూ.వంద కోట్లతో 'సమగ్ర హ్యాండ్లూమ్ అభివృద్ధి పైలట్ ప్రాజెక్టు' చేపట్టనున్నట్లు చేనేత, జౌళిశాఖ కమిషనర్ జి.రేఖారాణి తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా నాణ్యమైన నూలు సరఫరా, ఆధునిక డిజైన్లు, హామీ వేతనం తదితర సౌకర్యాలు కల్పించనున్నట్లు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విశాఖపట్నం-భీమిలి బీచ్ రోడ్డులోని తిమ్మాపురంలో రూ.172 కోట్లతో యూనిటీ మాల్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. దీని ద్వారా ఓడీఓపీ, జీఐ ట్యాగ్ ఉన్న ఉత్పత్తుల్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తామని వివరించారు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో రూ.38.31 కోట్లతో మెగా క్లస్టర్ మంజూరైందని. 10,114 మంది కార్మికులకు దీని ద్వారా లబ్ధి చేకూరుతుందని వెల్లడించారు.

ప్రకటన

ఈనాడు దినపత్రికను కొందరు వ్యక్తులు తెల్లవారే సరికి ఆన్‌లైన్ నుంచి ఈనాడు ఈపేపర్‌ను పీడీఎఫ్‌గా డౌన్‌లోడ్ చేసుకుని సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఇందుకోసం ప్రత్యేక టెలిగ్రామ్, వాట్సప్ గ్రూపులు కూడా నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఈ విధమైన అనుమతి లేని చర్యలు కాపీరైట్ చట్టానికి విరుద్ధం మరియు శిక్షార్హమైన నేరం. ఎవరైనా వ్యక్తులు, సంస్థలు లేదా గ్రూపులు ఈనాడు పత్రికను, వ్యాసాలను పీడీఎఫ్‌లుగా అనుమతి లేకుండా అప్‌లోడ్ చేయడం, షేర్ చేయడం నేరం. అట్టి చర్యలను ఈనాడు చాలా తీవ్రంగా పరిగణించి బాధ్యులపై సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకుంటుందని హెచ్చరిక జారీచేయడమైంది.

అలాగే ఈనాడు, ఈనాడు.నెట్‌లోని వార్తలను కొందరు పూర్తిగా/ పాక్షికంగా కాపీ చేసి తమ వాణిజ్య ప్రయోజనాల కోసం (వెబ్‌సైట్లలో, న్యూస్ యాప్‌లలో, యూట్యూబ్ ఛానళ్లలో) వినియోగిస్తున్నట్లు కూడా మా దృష్టికి వచ్చింది. అట్టి చర్యలను ఈనాడు తీవ్రంగా పరిగణించి, బాధ్యులపై సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకుంటుందని హెచ్చరిక జారీచేయడమైంది.

ఇట్లు/- **వెల్లంకి రత్నకుమార్**
చీఫ్ మేనేజర్, లీగల్ డిపార్ట్‌మెంట్

ఈనాడు

సరిగమల రహదారి

'కళాపోసన లేకుంటే- మడిసికీ గొడ్డుకీ తేడా ఏటుంటది?' అనే ప్రశ్న వినడానికి మోటుగా ఉన్నా- అందులో నిజముంది. నిస్సారమైన జీవితానికి సంగీత సాహిత్యాది కళల మంత్ర స్పర్శ సోకితే- ఆ బతుకులో నాణ్యత పెరుగుతుంది. సారవంతం అవుతుంది. హిరణ్యకశిపుడి తపోదీక్షను భగ్నం చేయడానికి వచ్చిన అప్సరసల గంధర్వ గాన మాధుర్యాన్ని వివరిస్తూ, నృసింహ పురాణంలో ఎర్రన- ఆ స్వర ప్రభావాన్ని చెప్పారు. 'అమృతంపు సోన -వైన అడరినట్లే (కురిసినట్లుగా) పాట చెన్నుఁను... మోదంబు చివురించాయి. చెట్లు పులకించాయి. సెలయేర్లు ఆనంద బాష్ప ధారలను స్రవించాయి. పర్వతాలు కరిగి నీరయ్యాయి' అన్నాడు. అవి సరే, 'చేతనంబులెల్ల చిత్ర రూపులట్లు సోలి నిలిచె'... కదిలే జీవులు కూడా పరవశంతో బొమ్మల్లా నిలబడి పోయాయట. అలాంటి సంగీతం బండరాళ్ల లాంటి గుండెలనూ సైతం వెన్నముద్దను చేస్తుంది. ఆ మార్దవమే మనిషి బతుకును జీవనయోగ్యం చేస్తుంది. అప్పై 'ఆకు మెదిలినా- పాటే, అలలు కదిలినా- పాటే, కలలు చెదిరినా- పాటే, కలత ముదిరినా- పాటే!'... పసితనం ఎదలో తిరిగి మొలకెత్తాలేగాని- బతుకంతా ఇక తీయని పాటే!

ద విన్చీ సృష్టించిన మోనాలిసా కన్నుల్ని నవ్వులోని కమనీయతనో, అజ్ఞాత ఆదివాసీ కళాకారుడు అరచేతులతో రుద్ది మరీ నునుపు తెచ్చిన దారుప్రతిమ(కర్రబొమ్మ)లోని మహనీయతనో, ఎర్రన వర్ణించిన పై సంగీత మాధుర్య రమణీయతనో తనివితీరా ఆస్వాదించడం అలవడకుండానే జీవితం ముగిసిపోతే- ఆ బతుక్కు అర్థం ఏముంటుంది? కాలానికి నిప్పైన వేసే అపురూప కళా స్వరూపాలను తిలకించి పులకించి తరించిపోవడే కదా బతుకు పండేది! వాటిలో సులభంగా అనుభవంలోకి వచ్చేది- సంగీత కళ. పసివారినీ, పశువులనూ సైతం సంగీతం అలరిస్తుందంటారు. 'వినికిడి కళ' అలవడితే- 'నూతన సంజాత మరందమై శ్రుతి పుటాంతః ప్రీణనం'... చెవి లోలోపలి భాగాలపై సంగీతం మధువును చిలకరిస్తున్నట్లు కవులు. ఎనలేని తృప్తిని కలిగించి, 'హృదయం' అనే పదం మధ్యలో ఇరుక్కున్న 'దయను' వెలికి తీస్తుంది. మనిషిని చేస్తుంది. శ్రీశ్రీ అన్నట్టు 'వృథల్ని చించి సుధల్ని పంచుతుంది'. సంగీతం- మనోవ్యాధులకు పరమౌషధం!

కళగా తెలిగ్గానే పట్టుబడే సంగీతం- జ్ఞానంగా ఓ పట్టాన అంతుచిక్కదు. 'శివద్రోహి' శ్లోకంలో వాస్తవానికి శివుడంటే కుమారస్వామి, పశువంటే నందీశ్వరుడును. సంగీత జ్ఞానులు వారు. అలాగే- నారద, తుంబురుల గానం 'తేనియ ముసురో అమృతపు వానయో పుండ్రేక్షు(చెరకు) రసమో' అన్నట్లుగా ధారాపాతమై ముంచెత్తిందన్నాడు నన్నెచోడుడు. వారిలో ఎవరు గొప్పో చెప్పాలంటే ఒక్క హనుమకే సాధ్యమైంది. హనుమ గాన పటిమను 'వర తారకాంతర స్ఫురిత నాద ప్రౌఢి... మహాయోగులు సహస్రారంబులోని నాద బిందు సంయోగస్థితికి కారణమయ్యే పాండిత్యం' అన్నాడు పుష్పగిరి తిమ్మన. అంటే గొప్ప సంగీతం తొలుత చెవులను, పిదప ఎదలను, తుదకు షట్చక్రాలను సైతం కదిలిస్తుందని అర్థం. 'సంగీతజ్ఞానము, భక్తి వినా సన్మార్గము కలదే' అన్న త్యాగరాజ కీర్తనలో, సన్మార్గం అంటే నిర్వాణ సోపాన అధిరోహణ దిశగా సాగే దారి. అంతటిదైనదా- కనీస కళాపోషణ అభిరుచిని పెంపొందించాలని 'సంగీత రహదారి'ని నిర్మించింది- ముంబయి నగరపాలిక. వాహనాల రాపిడికి సుస్వర ధ్వని తరంగాలు వెలువడ పదేలా 'మ్యూజికల్ స్ట్రిప్స్'ను నేలపై అతికించింది. ఆ సదాలోచన సంగీత సంస్కారాన్ని ఏ మేరకు అలవరుస్తుందో చూడాలి!



జ్ఞానం అనేది ఎవరికీ ఉన్నపళాన ఒక్కరోజులో రాదు. రోజు వివిధ మార్గాల ద్వారా, స్వీయ, ఇతరుల అనుభవాల ద్వారా తెలుసుకునే సమాచారాన్ని మెదడు ప్రాసెస్ చేసి మనిషి మేధను తీర్చిదిద్దుతుంది. మనం చేయాల్సిందల్లా మనసును తెరిచి ఉంచుకోవడం, భిన్నాభిప్రాయాలను స్వాగతించడం.

- పి.ఎం.భార్గవ, శాస్త్రవేత్త

ఆధ్యాత్మిక అద్భుతాలు

ఈ లోకం అనేక వింతలమయం. ఇదొక మయసభ. ప్రపంచ వింతలెన్నో మనకు తెలుసు. కానీ ఆధ్యాత్మిక వింతల గురించి కూడా ఆలోచించాలి. మనిషి మెదడులో అసాధ్యమని భావించిన అద్భుతం రూపంలో సుసాధ్యమై కళ్లముందు కొలువుదీరుతుంది. భగవంతుడు మనిషిని గొప్ప ప్రణాళికతో సృష్టించాడు. ఈ భూమ్మీద అతణ్ని మించిన వింత జీవి మరొకరు లేరు.

మహాభారతంలో 'అన్నింటిలోకీ గొప్ప వింత ఏంటి?' అని యక్షుడు ఒక గాఢమైన ప్రశ్న వేస్తాడు. తన తోటి వారు మరణించినా తాను మాత్రం ఈ లోకంలో శాశ్వతంగా ఉంటానని మనిషి భ్రమిస్తూ ఉంటాడని... ధర్మజుడు సమాధానం చెబుతాడు. పోయినవారి గురించి రేపులో మునుగుతూ దుఃఖపడుతూ ఉంటారు ఉన్నవాళ్లు. తరవాత వంతు తమదే అని వస్తుందని వాళ్లు అలా యమునికి ఒట్టేసి మరీ చెబుతారని 'చనువారిని గని యేడ్చు వారు...' పద్యంలో కవి ధూర్జటి ఈ దుఃఖానికి వింత అర్థం చెప్పాడు. శ్రీరామచంద్రుడి పాదధూళికి శిల స్త్రీగా మారడం ఒక అద్భుతం. సముద్రం మీద సేతువు కడితే రాళ్లు నీటిమీద తేలడం మరో గొప్ప అద్భుతం. రామనామస్మరణతో సద్గతులు కలగడం ఈ అద్భుతాల్లో కెల్లా పెద్ద అద్భుతం అంటాడు దాశరథీ శతకంలో శ్రీరామదాసు. భక్తుల వింత వింత కోరికలు చిట్టాను దేవదేవుడి ముందు ఉంచుతారని అన్నమయ్య ఓ కీర్తనలో గానం చేస్తాడు. కంసుడి నుంచి కృష్ణుణ్ని కాపాడటానికి పసిబిడ్డను తీసుకొని నది దాటుతూ ఉంటాడు వసుదేవుడు. అప్పుడు యమున తన నీటిని తగ్గించుకుని వసుదేవుడికి దారి ఇచ్చింది. భగవంతుడు తన క్షేమం కోసం తాను సృజించుకున్న అద్భుత మార్గం. అర్జునుడిలో భక్తిని పెంచడానికి తన మహిమలను అద్భుతాలుగా ప్రకటించి గీతాచార్యుడు దైవిక శక్తిని తేటతెల్లం చేస్తాడు విభూతి యోగంలో. మన చుట్టూ ఆవరించి ఉన్న ప్రకృతిలోనూ ఎన్నెన్నో వింతలు ఉంటాయి. వాటిని గమనిస్తూ ఉన్నప్పుడు అతీత శక్తులలో కూడా ఇంత అద్భుత సామర్థ్యం ఉంటుందా అనిపిస్తుంది. భగవంతుడు సృష్టించిన వింత జీవులు ప్రకృతికి తమ వంతు ప్రాణాన్ని, విజ్ఞానాన్ని అందిస్తూ ఉంటాయి. ఆ అద్భుతాలను పరికిస్తున్నప్పుడు ఆ దైవం సాధించిన సృష్టి నైపుణ్యం మనకు మళ్లీ సాక్షాత్కారం అవుతుంది. ప్రకృతిని ఎవరూ దోచుకోకుండా సాహసం వేయకూడదు. అది భగవానుడు మన కోసం ఏర్పాటు చేసిన పరమాద్భుత సొత్తుని గుర్తుంచుకోవాలి.



చివరగా అన్ని వింతలలో కాలం చేసే ఇంద్రజాలం ఎవరికీ ఓ పట్టాన అర్థం కాదు. కాలం బికారిని కుబేరుడిగా మారుస్తుంది. శత కోటీశ్వరుడి కుటుంబాన్ని ఒక్కరోజులో చెట్టు కిందికి తీసుకువస్తుంది. అందుకనే కాలాన్ని దైవకార్యాల కోసం వినియోగించుకోవాలి. వర్తమానంలో నిజానికి అనుభవించేది అద్భుత క్షణాలుగా భావించాలి. స్వార్థం లేని పవిత్ర ప్రేమతో ఆధ్యాత్మిక దిశగా అడుగులు వేయాలి.

- భమిడిపాటి వెంకటేశ్వరరావు



రేపటి సాంకేతికతగా 6జీ అభివృద్ధి చెందుతోంది. 6జీ అంటే వేగమైన ఇంటర్నెట్ మాత్రమే కాదు. మనిషి, యంత్రం, సమాజం మధ్య సంబంధాన్ని కొత్తగా నిర్వచించే ప్రయత్నం. ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్, గణితం, కంప్యూటర్స్, మెటీరియల్ సైన్స్ అన్నీ కలిసి రూపొందించే భవిష్యత్తు చిత్రం. ఇది ఆరోగ్యం, రవాణా, పరిశ్రమలు, గ్రామీణ సేవల్లో విప్లవాత్మక మార్పులు తీసుకురానుంది. పాటికి సంసిద్ధమైతేనే రేపటి ప్రపంచంలో మన పాత్ర కీలకంగా మారుతుంది.

రేపటి నవలోకం!

మొబైల్ నెట్‌వర్క్ టెక్నాలజీ నాలుగు దశలు దాటింది. ప్రస్తుతం 5జీ (అయిదోతరం) యుగంలోకి అడుగు పెట్టాం. అయితే, ప్రపంచం ఇక్కడితో ఆగడం లేదు. రేపటి అవసరాలు 5జీ సాంకేతికత సామర్థ్యానికి మించిపోతాయి. డ్రైవర్ లేని వాహనాలు, సుదూర శస్త్ర చికిత్సలు, హోలోగ్రాఫిక్ సమావేశాలు, స్మార్ట్ నగరాలు వంటివన్నీ పని చేయాలంటే, కేవలం వేగం మాత్రమే సరిపోదు. నెట్‌వర్క్ అత్యంత వేగంగా ఆలోచిస్తూ, కచ్చితత్వంతో స్పందిస్తూ, పరిసరాలనూ గమనించగలగాలి. ఇలాంటి అవసరాల నుంచి పుట్టిందే 6జీ పరిజ్ఞానం. ఇది ఆరోతరం సెన్సింగ్, ఏఐ ఆధారిత వైర్‌లెస్ కమ్యూనికేషన్ టెక్నాలజీ. 2030 నాటికి, దీన్ని అందుబాటులోకి తీసుకురావాలని లక్షిస్తున్నారు. 5జీలో మనం డేటానే పంపిస్తాం. 6జీలో నెట్‌వర్క్ ఆ డేటా ఎందుకు పంపుతున్నామో కూడా అర్థం చేసుకుంటుంది. ఉదాహరణకు, ఒక రోగి గుండె చప్పుళ్ల సమాచారం డాక్టర్‌కు పంపితే, అది కేవలం సంఖ్యలుగా కాకుండా, ప్రమాదం ఉంటే, ఆ అర్థంలోనే చేరుతుంది. ఈ మార్పు 6జీని విప్లవాత్మకంగా మార్చనుంది.



నాణ్యమైన వైద్యం... మెరుగైన విద్య

ప్రతి వైర్‌లెస్ టెక్నాలజీకి ప్రాణం ఫ్రీక్వెన్సీ స్పెక్ట్రం. 5జీ వరకు మనం గిగాహెర్ట్జ్ స్థాయిలో (ఒక సెకనులో వందకోట్ల సార్లు జరిగే తరంగ కదలికల పరిమాణం) పనిచేశాం. 6జీలో శాస్త్రవేత్తలు టెరాహెర్ట్జ్(సెకనులో లక్ష కోట్ల ఆవర్తనాలు జరిగే స్థాయి) అనే అత్యధిక ఫ్రీక్వెన్సీ తరంగాలను వాడనున్నారు. అందుకే 6జీలో డేటా వేగం వందల గిగాబిట్స్ నుంచి టెరాబిట్స్ స్థాయికి చేరుతుంది. సాధారణంగా మనం చూసే టవర్లు అన్ని వైపులకీ సిగ్నల్ పంపుతాయి. కానీ 6జీలో వినియోగదారుడు ఎక్కడ ఉంటే అటువైపే సిగ్నల్ కేంద్రీకృతమవుతుంది. ఈ విధానాన్ని 'బీమ్‌ఫార్మింగ్' అంటారు. దీంతోపాటు 'మాసివ్ మిమో' అనే విధానాన్ని వాడతారు. ఇందులో ఒక టవర్ అనేక చిన్న యాంటెన్నాల సాయంతో, ఒకేసారి చాలామందికి వేర్వేరుగా సిగ్నల్ పంపగలదు. ఫలితంగా నెట్‌వర్క్ సామర్థ్యం విపరీతంగా పెరుగుతుంది. సాధారణంగా గోడలు, భవనాలు, చెట్లు అడ్డుపడటంతో మొబైల్ సిగ్నల్ సరిగ్గా రాదు. 6జీలో దీన్ని అధిగమించేందుకు గోడలు, భవనాల మీద ప్రత్యేకంగా తయారు చేసిన స్మార్ట్ ప్యానెల్స్‌ను అమరుస్తారు. ఇవి సిగ్నల్‌ను అవసరమైన దిశగా మళ్లిస్తాయి. దీనివల్ల నగరాల్లో, ఇళ్ల మధ్య, రద్దీ ప్రాంతాల్లో మెరుగైన నెట్‌వర్క్‌ను అందించవచ్చు. 6జీ సిగ్నల్ ద్వారా మన కదలికలు, శ్వాస వేగం, హృదయ స్పందనలను ప్రత్యేక సెన్సర్లు లేకుండానే గుర్తించవచ్చు. కార్లు తమ చుట్టూ ఉండే వస్తువులను రాడార్‌లా గుర్తించగలవు. ఇది భద్రత, ఆరోగ్యం, రవాణా రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తుంది. 'సెమాంటిక్ కమ్యూనికేషన్' అనే కొత్త విధానంలో కేవలం పదాలు, సంఖ్యలనే కాకుండా, వాటి వెనకున్న ముఖ్యమైన భావాన్నీ పంపించగలదు. 6జీ ద్వారా గ్రామాలకు నాణ్యమైన వైద్యం, మెరుగైన విద్య అందుబాటులోకి వస్తాయి. విదేశాల్లో ఉండే డాక్టర్లు రోబోటిక్ సాంకేతికత సాయం రోగులకు అత్యవసర శస్త్ర చికిత్సలు చేయగల సామర్థ్యం వస్తుంది. 3డీ దృశ్యాలు, ఏఐ సహాయంతో విద్యార్థులు పాఠాలను ప్రత్యక్షంగా తరగతిలో కూర్చుని వింటున్న అనుభూతిని పొందవచ్చు. వ్యవసాయంలో నీటి వినియోగం, పంట దిగుబడి అంచనాలు మరింత కచ్చితంగా జరుగుతాయి. పరిశ్రమల్లో ప్రమాదాలు తగ్గించవచ్చు. యువతకు కొత్త తరహా ఉద్యోగ అవకాశాలు ఏర్పడతాయి. 6జీ నెట్‌వర్క్‌లు భూమిపై ఉండే టవర్లకే పరిమితం కాకుండా, శాటిలైట్ ఆధారిత స్పేస్ కమ్యూనికేషన్‌తో అనుసంధానమవుతాయి. దీనివల్ల సముద్రాలు, అడవులు, సరిహద్దు ప్రాంతాలు, అంతరిక్షందాకా నిరంతర కనెక్టివిటీ సాధ్యమవుతుంది.

డిజిటల్ ప్రపంచంపై పట్టుకోసం...

తరంగాలు వేగంగా బలహీనపడటం ఈ సాంకేతికతలోని ఓ సమస్య. దూరం పెరిగే కొద్దీ సిగ్నల్ త్వరగా తగ్గిపోతుంది. గోడలు, భవనాలు అడ్డుపడతాయి. ఈ సమస్యల్ని అధిగమించే దిశగా కసరత్తు జరుగుతోంది. టెరాహెర్ట్జ్ తరంగాలపై పనిచేసే పరికరాల తయారీ కష్టం. కొత్త రకం సెమీకండక్టర్ చిప్‌లు, కొత్త మెటీరియల్స్ అవసరమవుతాయి. ఇవన్నీ ఖరీదైనవే కావడంతో భారీస్థాయిలో 6జీ హార్డ్‌వేర్ తయారీ కొంత కష్టమే. అధిక ఫ్రీక్వెన్సీలపై పనిచేసే వ్యవస్థలు ఎక్కువ విద్యుత్తును వాడటం వల్ల ప్రస్తుత ఫోన్ బ్యాటరీల సామర్థ్యం సరిపోదు. అందుకని, తక్కువ విద్యుత్తుతో పనిచేసే సర్క్యూట్లు, కొత్త బ్యాటరీ టెక్నాలజీలపైనా పరిశోధన జరుగుతోంది. నెట్‌వర్క్ స్మార్ట్‌గా మారినకొద్దీ సైబర్ దాడుల ముప్పు పెరుగుతుంది. ఆరోగ్య సమాచారం, వాహనాల నియంత్రణ, పరిశ్రమల వ్యవస్థలు వంటివన్నీ నెట్‌వర్క్‌తో అనుసంధానమైతే, చిన్న లోపం కూడా పెద్ద ప్రమాదానికి దారితీయొచ్చు. ఇలాంటి సమస్యలన్నింటికీ పరిష్కారాలు గుర్తించడమే ప్రస్తుత 6జీ పరిశోధనల లక్ష్యం.


ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ టెలికాం కంపెనీలు ఇప్పటికే 6జీపై భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. కొత్త ల్యాబ్‌లు, టెస్ట్‌బెడ్‌లు, పరిశోధన కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాయి. ప్రభుత్వాలు కూడా దీన్ని కేవలం టెక్నాలజీగా కాకుండా వ్యూహాత్మక అంశంగా చూస్తున్నాయి. 6జీపై ఆధిపత్యం ఉండే దేశాలే రేపటి డిజిటల్ ప్రపంచాన్ని నియంత్రిస్తాయి. ఐరోపా, అమెరికా, చైనా, జపాన్ వంటి దేశాలు ప్రత్యేక 6జీ మిషన్లు ప్రారంభించాయి. భారత్ ఇప్పటికే 6జీపై స్పష్టమైన దృక్పథాన్ని ప్రకటించింది. మనకున్న అపార ఐటీ ప్రతిభ, ఇంజినీరింగ్ విద్య, స్టార్టప్ సంస్కృతి ఈ రంగంలో మనల్ని కచ్చితంగా ముందుకు తీసుకెళ్లగలవు. సరైన విధానాలు, పరిశోధనలు, పరిశ్రమల సహకారం ఉంటే, ఇండియా కేవలం వినియోగదారుడిగా కాకుండా, 6జీ టెక్నాలజీని రూపొందించే దేశంగా మారగలదు.



డాక్టర్ మంగళంపల్లి కిరణ్
అసోసియేట్ ప్రొఫెసర్, నానో శాస్త్ర పరిశోధకులు
ఎస్.ఆర్.ఎం. యూనివర్సిటీ, అమరావతి

జీవితమంటేనే కష్టసుఖాల కలబోత. అది తెలిసినప్పటికీ రెండింటినీ సమానంగా చూసే స్థితప్రజ్ఞత్వం సాధారణ మనుషులకు ఉండదు. భావోద్వేగాల నిలయమైన మనసును కొన్నిటిని కోల్పోయిన బాధ, కొన్నిటిని వదులుకోలేని వేదన అతలాకుతలం చేస్తాయి. ప్రేమించిన మనుషులు హఠాత్తుగా మాయమైతే వారి జ్ఞాపకాల బరువును జీవితకాలం మోస్తుంది. గతాన్ని తలచుకుని వగస్తూనే బతుకుబండిని ముందుకు లాగడానికి ప్రయత్నిస్తుంటుంది. తల వాల్చుకోవడానికి ఒక భుజం కోసం తపించిపోతుంది. జీవితం కూడా పలుమార్లు దాన్ని నాలుగు రోడ్ల కూడలిలో నిలబెడుతుంటుంది. ఏ మార్గం ఎంచుకోవాలో చెప్పేవారు ఒకరుంటే బాగుండని మనసు ఎదురుచూస్తుంది.

ఉద్వేగాల ఉప్పెన



జపనీస్ రచయిత హరుకి మురకామి రాసిన 'నార్వేజియన్ ఉడ్' పుస్తకం చదువుతుంటే ఇలాంటి భావాలన్నీ కుదిపేస్తాయి. ఈ పుస్తకం ఏ సమస్యలకీ సమాధానం చెప్పదు. కానీ వివిధ పరిస్థితులు మనిషిని ఎలా నలిపేస్తాయో ఎరుక కలిగిస్తుంది. ఆలోచింపజేస్తుంది. మనుషుల్ని అర్థం చేసుకోమంటుంది.

ఈ నవలలోని ముఖ్యమైన పాత్ర నవొకొ అనే అమ్మాయికి 'నార్వేజియన్ ఉడ్' అనే బీటిల్స్ పాట చాలా ఇష్టం. సింబాలిక్‌గా ఆ పేరు పెట్టారు రచయిత. ముప్పై ఏడేళ్ల తోరూ వతనబెకి ఈ పాట వినపడగానే చిన్ననాటి జ్ఞాపకాలు చుట్టుముడతాయి. స్కూల్లో ఉండగా తోరూ, కిజుకి, నవొకొ... బెస్ట్ ఫ్రెండ్స్. ఒకరికోసం ఒకరన్నట్లుగా ఉండే కిజుకి, నవొకొల ప్రేమను అబ్బురంగా చూసేవాడు తోరూ. పదిహేడో పుట్టిన రోజున కిజుకి ఆత్మహత్య వారి హ్యాపీ డేస్‌కి ముగింపు పలుకుతుంది. తోరూకు అనుక్షణం అతడే గుర్తొస్తుంటాడు. నవొకొ తనలోంచి ఒక భాగాన్ని కోల్పోయినట్లు బాధపడుతుంది. ఆ జ్ఞాపకాల్లో కొట్టుమిట్టాడుతూ కొన్నేళ్లకు ఇద్దరూ సన్నిహితమవుతారు. వెంటనే ఆమె ఉత్తరం రాసిపెట్టి శానిటోరియానికి వెళ్లిపోతుంది. క్లాస్‌మేట్ మిడోరి తోరూకు కొత్త ఫ్రెండవుతుంది. తల్లి క్యాన్సర్‌తో చనిపోగా, ఆస్పత్రిలో ఉన్న తండ్రిని చూసుకుంటూ కూడా నవ్వుతూ నవ్విస్తూ ఉండే మిడోరి వ్యక్తిత్వం తోరూను ఆకట్టుకుంటుంది. నవొకొని చూడటానికి శానిటోరియానికి వెళ్లిన తోరూకు అక్కడ రీకో పరిచయమై మానసిక సమస్యలకు మూలాల గురించి చెబుతుంది. నవొకొ అక్క కూడా ఆత్మహత్య చేసుకుందనీ, కిజుకి మరణంతో ఆ జ్ఞాపకాలు తిరగబెట్టి ఆమెను ఆస్పత్రి పాల్జేశాయని తెలుస్తుంది. అక్కడి నుంచి తిరిగివచ్చిన తోరూ అటు నవొకోని మర్చిపోలేక, ఇటు మిడోరిని వదులుకోలేక సతమతమవుతుంటాడు. మిడోరితో నీ జీవితం సంతోషంగా సాగుతుందని సలహా ఇస్తుంది రీకో. ఆ తరవాత నవొకొ ఆత్మహత్య చేసుకుందని తెలుస్తుంది. రీకో, తోరూ కలిసి నవొకొకి శ్రద్ధాంజలి ఘటిస్తారు. మిడోరిని దూరం చేసుకోకూడదని ఆమెకు తన ప్రేమ గురించి చెప్పాలనుకుంటాడు తోరూ.

సాధారణ ట్రయాంగులర్ లవ్‌స్టోరీలా ఉన్నప్పటికీ బలమైన కథనం ఈ నవల ప్రత్యేకత. పాత్రలన్నీ జీవితం తాలూకు చేదు వాస్తవాలను చర్చిస్తూ పాఠకులు కథలో లీనమయ్యేలా చేస్తాయి. 'చనిపోయినవాళ్లు ఎలాగూ చనిపోయారు కానీ మనం బతకాలిగా...' లాంటి వాక్యాలు గతాన్ని దాటి ముందుకు వెళ్లే ప్రయత్నంలో ఎవరికి వారు తమ లోలోపల చేసే పోరాటాలను గుర్తుచేస్తాయి. బాధను ఎదుర్కొనడానికి ముగ్గురూ మూడు రకాలుగా ప్రయత్నిస్తుంటారు. వ్యక్తిత్వం రూపుదిద్దుకునే వయసులో ఎదురయ్యే సంఘటనలూ, మానసిక ఆరోగ్యమూ అనుబంధాలపై చూపే ప్రభావం పుస్తకమంతా కనపడుతూ పాఠకుల్లోనూ రకరకాల భావోద్వేగాలు ముప్పిరిగొనేలా చేస్తుంది. సినిమాగానూ 'నార్వేజియన్ ఉడ్' మంచి ఆదరణ పొందింది.

- మిహిర

భిన్నత్వంలో ఏకత్వమే మన బలం!

అయం నిజః పరో వేతి గణనా లఘుచేతసామ్!
ఉదారచరితానాం తు వసుధైవ కుటుంబకమ్!!

అల్పబుద్ధి కలిగిన వారికే వీడు నావాడు, వాడు పరాయివాడు అన్న ఆలోచనలు వస్తాయి. ఉన్నతాశయాలూ విశాల దృక్పథం ఉన్నవారికి ఈ లోకమంతా ఒకే కుటుంబం. ప్రపంచంలోని ప్రతి వ్యక్తీ తనవాడే, తన కుటుంబ సభ్యుడే... ఇదీ పై శ్లోకానికి అర్థం! ఇదే మన నిజమైన సాంస్కృతిక వారసత్వం! విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని ఆకాంక్షిస్తున్న ఈ మహోన్నత భావనలోంచి ప్రాణం పోసుకున్నదే భారత జాతీయత! అంతేతప్ప- కులమత ప్రాంతాలూ భాషల పేరిట సాటి మనుషులను అసహ్యించుకోవడం అసలు భారతీయతే కాదు. కానీ, దేశం దౌర్భాగ్యం కొద్దీ దున్నపోతు ఈనిందంటే దూడను కట్టేయమనేంత తెలివిపరులు ఎక్కువైపోతున్నారు ఇప్పుడు. గొర్రె ఎంత పెరిగినా తోక బెత్తెడే అన్నట్లుగా ఎన్ని చదువులు చదివినా ఎదగని మెదళ్లతో వారు వాట్సాప్ ఫార్వర్డ్‌లనూ ఫేస్‌బుక్ పోస్టులనూ యూట్యూబ్ కాకమ్మ కబుర్లనూ గుడ్డిగా నమ్మేస్తున్నారు. వింధ్యాచలానికి ఇవతల నుంచి అవతల హిమాలయాల వరకు మేమంతా ఒకటేనంటూ పైకి జాతీయగీతం పాడుతూ లోలోపల కులమత విద్వేషాలతో రగిలిపోతున్నారు. భిన్న వర్గాల ఆహారాలూ ఆచారాలను వెక్కిరిస్తూ వికృతానందం పొందుతున్నారు. ఈ విద్వేష విషం బాగా తలకెక్కించుకున్న వాళ్లు ఇతరులపై భౌతిక దాడులకు దిగుతూ భరతమాత కంట కన్నీరు పెట్టిస్తున్నారు!

జాతి, మతం, కులం, ప్రాంతం ఆధారంగా వ్యక్తులను గుర్తిస్తూ వివక్ష చూపించడం, హింసాత్మక దాడులకు పాల్పడటం తిరోగామి చర్యలని సుప్రీంకోర్టు మూడు రోజుల క్రితం ఛీత్కరించింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయిన తరవాత కూడా ఇలాంటి విద్వేషపూరిత వాతావరణం కొనసాగడం బాధాకరమని వ్యాఖ్యానించింది. భావాలు, భావప్రకటనలు, విశ్వాసాలు, ఆరాధనల్లో స్వాతంత్ర్యాన్ని... అవకాశాల్లో సమానత్వాన్ని... వ్యక్తి గౌరవాన్నీ జాతి ఐక్యతను కాపాడుకోవడం కోసం సౌభ్రాతృత్వాన్ని పెంపొందించుకుంటామంటూ రాజ్యాంగ ప్రవేశిక సాక్షిగా ప్రమాణం చేసి 75 ఏళ్లు దాటిపోయింది. కానీ, ఆ సంవిధాన స్ఫూర్తిని సజీవంగా ఉంచుకోవడంలో మాత్రం మన సమాజం దారుణంగా విఫలమవుతోంది. కులమతాల పేరిట సోషల్ మీడియాలో దుమ్మెత్తిపోసుకోవడాలూ నడిరోడ్లపై కొట్టుకుచావడాలు రోజురోజుకూ పెరుగుతున్నాయే తప్ప తగ్గడం లేదు. 'మనం ప్రగతి సాధించాలంటే ముందు కుల, మత ద్వేషాల సంకెళ్లను తెంచుకోవాలి' అని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ మాటలను చాలామంది చెవికెక్కించుకోవట్లేదు. కులమతాల కత్తుల వంతెనలు దేశాన్ని ఒకదరికి చేర్చవు... వాటి కింద పారే నెత్తుటి నదుల ఒడ్డున నాగరికతలు విలసిల్లవు. దీన్ని ఒంటపట్టించుకోనంత కాలం, దేశాన్ని ప్రేమించడమంటే మనుషులను ప్రేమించడం... మానవత్వాన్ని పూజించడమన్న సంగతిని మనసులో జీర్ణం చేసుకోనంత వరకు దేశాభివృద్ధి రథం ముందుకు కదలదు!



మధ్యాహ్న భోజనం వండేవారిపై వివక్ష చూపిస్తూ పిల్లలను బడికి పంపకపోవడం నుంచి కులాంతర వివాహాలు చేసుకున్నారని చెప్పి చంపేయడందాకా దేశీయంగా కులవివక్ష ఇప్పటికీ బలంగా కోరలుచాస్తూనే ఉంది. వలస కార్మికులపై మూకదాడులతో ప్రాంతీయ వైమనస్యాలు ఎగసిపడుతూనే ఉన్నాయి. 2023తో పోలిస్తే 2024లో మతపరమైన అల్లర్లు, హింసాత్మక ఘటనలు 84శాతం పెరిగాయని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఇవన్నీ జాతీయ సమగ్రతను ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. బయటి శత్రువులకంటే ఎక్కువగా ఈ అంతర్గత వైరభావనలే మన సమాజాన్ని బలహీనం చేస్తున్నాయి.

'కులము హెచ్చుతగ్గు గొడవలు పనిలేదు/ సానుజాతమయ్యే సకలకులము'- మనుషులందరూ సమానమే, ఎక్కువ తక్కువలనే విభజనలు అర్థరహితమైనవి అంటూ వేమన కొట్టిపారేశాడు. 'ఎవరైనా ఏ మతాన్నయినా అనుసరించేందుకు స్వేచ్ఛ ఉంది. అందులో మరెవరూ జోక్యం చేసుకోవడానికి వీల్లేదు' అంటూ ఛత్రపతి శివాజీ తన రాజ్యంలో ఆదేశాలిచ్చాడు. ఆయన కాలం నాటి ఒక లేఖలో ఈ సంగతి స్పష్టంగా ఉంది. వేమన, శివాజీ వంటివారు శతాబ్దాల కిందటే ప్రబోధించిన పురోగామితనం ఇప్పుడేమైంది? ఫలానా కులంలో, మతంలో, ప్రాంతంలో పుట్టడమనేది ఎవరికి వారుగా నిర్ణయించుకునేది కాదు. కాబట్టి పుట్టుకను బట్టి గొప్పదనాన్ని గణించడం మానవీయ లక్షణం కాబోదు. కులమత ప్రాంతాలకు అతీతంగా మనమంతా ఒక్కటేననే జాతీయతా భావన మాత్రమే అనాదిగా ఆసేతుహిమాచలాన్ని కలిపి ఉంచుతోంది. భిన్నత్వాన్ని సహించలేకపోతే యావద్భారతాన్ని ఏకతాటిపై నడిపించగలిగే ఏకత్వం అసాధ్యమవుతుంది. ప్రజలందరినీ సమంగా కదిలించి కార్యాచరణకు సిద్ధంచేసేదే జాతీయత అవుతుంది. ఆ చైతన్యశీలత సమష్టి జీవన విలువల్లోంచి పురుడుపోసుకుంటుంది. కులమతాల పేరిట సమూహాలుగా విడిపోయిన సమాజంలో ఆ జాతీయతకు స్థానముండదు. ఆ ఏకతా భావం లేనిచోట ఎవరికీ భద్రత లభించదు. ఆచార వ్యవహారాలూ వేషభాషలూ ఆహార విహారాల్లో ఎన్ని తేడాలు ఉన్నప్పటికీ 'మనమందరం భారతీయులం' అని మనసా వాచా నమ్మితే... అదే జాతీయత అయ్యి అందరికీ రక్షణఛత్రమవుతుంది!

"ఆస్తి, అధికారం, అంతస్తు, హోదా అన్నీ బాగా సమకూరిన వాళ్లు వాటిని కాపాడుకునేందుకు బలప్రయోగంతోనే సరిపెట్టుకోరు... వాళ్ల భావాలను వాడుకుంటారు. చరిత్రను వాడుకుంటారు. ప్రజలలో అలాంటి భావాలనే ప్రచారం చేస్తారు. జనం ఆ తత్వాన్ని ఒంటపట్టించుకునేట్టు చేస్తారు. తమ ఆధిక్యాన్ని నిలబెట్టే చరిత్రనే చెబుతారు. అలాంటి ఆలోచనలనే, తత్వాన్నే, అలాంటి వక్రీకరించిన చరిత్రనే యథాతథస్థితిని కాపాడుకునేందుకు బోధిస్తారు" అంటారు గోవింద్ పన్సారే. సామాన్యులు తమ దుస్థితికి కారణమైన సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్యలను అర్థం చేసుకోకుండా నిరోధించేందుకు ఆధిపత్య శక్తులు ఇలాంటి ప్రచారాలను బాగా ఉపయోగించుకుంటాయి. కులమతాల పేరిట జనాన్ని రెచ్చగొట్టి ఓట్లు దండుకోవాలనుకునే నేతాగణాలూ ఇటువంటి పాచికలను విసురుతుంటాయి. కాబట్టి ఏ నినాదం వెనక ఎవరి స్వార్థం ఉందో అర్థంచేసుకోకపోతే వర్గాల వారీగా విడిపోయి పడిపోవడం ప్రజల వంతు అవుతుంది!

వ్యక్తిగత స్వేచ్ఛను గౌరవించడం, హేతుబద్ధంగా ఆలోచించడం, ప్రశ్నించేతత్వాన్ని పెంచుకోవడం... ఇవీ ప్రజాస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్తాయి. యుక్తాయుక్త విచక్షణను అలవరిచే శాస్త్రీయ దృక్పథాన్ని నవతరానికి చిన్నప్పటి నుంచి నేర్పిస్తేనే సమాజం ప్రజాస్వామ్యబద్ధమవుతుంది. 'తప్పు చేసినవాళ్లను జైల్లో పెట్టకపోతే మతకల్లోలాలకు అంతమనేది ఉండదు' అంటూ పండిత గోవింద్ వల్లభ్ పంత్ రాజ్యాంగ సభలో చేసిన హెచ్చరికను ప్రభుత్వాలు ఎప్పటికీ గుర్తుంచుకోవాలి. కులమత విద్వేషాలను ఎగదోసి పబ్బం గడుపుకోవాలనుకునే వారిని ప్రజాశత్రువులుగా భావించాలి. అప్పుడే 'భారత ప్రజలమైన మేము...' అంటూ రాసుకున్న రాజ్యాంగానికి విలువుంటుంది!

- శైలేష్ నిమ్మగడ్డ

అమెరికా... ఆ పేరెలా?

అమెరికాను కొలంబస్ కనిపెట్టాడని చెబుతారు కదా! మరి, అతని పేరెందుకు రాలేదు. అదంతా దురదృష్టకర ఉదంతం. ఇటాలియన్ అన్వేషకుడు కొలంబస్ మూడు నౌకలతో తన తొలి సముద్ర యాత్రను ప్రారంభించాడు. ఆసియాకు కొత్త మార్గాన్ని కనిపెట్టాలనేది తన లక్ష్యం. పశ్చిమ దిశగా ప్రయాణం మొదలుపెట్టి, కొన్ని నెలల తరవాత 1492 అక్టోబర్ 12న తెల్లవారుజామున భూమిని చూశారు. వెంటనే తీరంలో దిగాడు. నిధులు సమకూర్చిన కారణంగా స్పెయిన్ కింగ్ ఫెర్డినాండ్, క్వీన్ ఇసబెల్లాల పేరిట ఆ భూభాగాన్ని తన అధీనంలోకి తీసుకున్నారు. దానికి సాన్ సాల్వడార్ అనే పేరు పెట్టారు. నిజానికి కొలంబస్ తాను ఇండియాకు చేరుకున్నానని అనుకున్నాడు. అందుకనే, అక్కడి స్థానికులను ఇండియన్స్‌గా పిలిచాడు. అయితే, అది ఇప్పుడు బహమాస్‌లో వాట్లింగ్ ఐలాండ్‌గా పిలిచే ద్వీపం.



తరవాత జపాన్ కోసం ప్రయాణించి ఇప్పుడు హైతీ, డొమినికన్ రిపబ్లిక్‌గా పిలిచే వాటి దగ్గరికి వెళ్లాడు. 1493 సెప్టెంబర్ 24న మొదలుపెట్టిన తన రెండో యాత్రలో కొలంబస్ వర్జిన్ ఐలాండ్స్, ప్యూయెర్టోరికో, జమైకాలను కనిపెట్టాడు. అప్పటికీ ఇండియాను గుర్తించాలనే స్థిరసంకల్పంతోనే ఉన్నాడతను. కానీ అది తన వల్ల కాలేదు. 1498లో మూడో యాత్రలో ట్రినిడాడ్‌ను గుర్తించడం ద్వారా కొలంబస్ దక్షిణ అమెరికాను చేరినట్లయింది. మరొక ఇటాలియన్ సముద్ర అన్వేషకుడైన అమెరిగో వెస్పూచి దక్షిణ అమెరికా ప్రధాన భూభాగాన్ని తానే తొలిసారిగా చేరుకున్నట్లు ప్రకటించుకున్నాడు. అది 1497 జూన్ 16న జరిగింది. అయితే, 1499 వరకు వెస్పూచి తన ప్రయాణాన్ని అసలు ప్రారంభించలేదని అనే వారూ ఉన్నారు. 1501లో చేపట్టిన ప్రయాణంలో వెస్పూచి దక్షిణ అమెరికా తీరం వెంబడి సాగాడు. తాను రాసిన లేఖల్లో కొత్త ఖండాన్ని కనిపెట్టినట్లు పేర్కొన్నాడు. ఆ సమాచారాన్ని ఆధారంగా చేసుకుని జర్మనీకి చెందిన పటాల నిపుణులొకరు తన మ్యాప్‌లలో కొత్త ఖండానికి అమెరిగో వెస్పూచి పేరిట 'అమెరికా' అనే పేరును ఉపయోగించాడు. అప్పట్నుంచి అదే పేరు వాడుతున్నారు.

- శ్రీజన్

ఆ ఒక్కటి ఏది?

ఇక్కడ ఇచ్చిన వాటిల్లో ఒక్కటి మాత్రం మిగతా వాటికి భిన్నంగా ఉంటుంది. ఆ ఒక్కటి ఏదో కనిపెట్టండి.

1. హైదరాబాద్, విజయవాడ, రాజస్థాన్, తిరుపతి
2. బంగారం, ఇత్తడి, వెండి, ప్లాస్టిక్
3. బర్గర్, ఇడ్లీ, దోస, వడ

జవాబులు: 1.రాజస్థాన్ 2.ప్లాస్టిక్ 3.బర్గర్

దుర్గమ్మ హుండీ ఆదాయం రూ.2.89 కోట్లు


నగదు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని హుండీలను శనివారం లెక్కించారు. మొత్తం రూ.2,89,12,052 నగదు వచ్చిందని ఆలయ అధికారులు తెలిపారు. నగదుతోపాటు బంగారం 171 గ్రాములు, వెండి 880 గ్రాములు వచ్చాయని చెప్పారు. వీటితోపాటు 820 యూఎస్ఏ డాలర్లు, 40 ఇంగ్లండ్ డాలర్లు, 31 మలేషియా రెగ్గిట్, 22 సింగపూర్ డాలర్లు, 105 యూఏఈ దిర్హామ్స్, 20 ఆస్ట్రేలియా డాలర్లు, 1/4 కువైట్ దినార్, 1 ఒమన్ రైల్, 400 ఒమాన్ బైసా, 55 యూరప్ యూరోస్, 505 కెనడా సీఏడీ, 1 సౌదీ రియాల్ వచ్చాయని అధికారులు వెల్లడించారు. ఆలయ ఈవో వీకే శీనానాయక్, ట్రస్టు బోర్డు ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ పర్యవేక్షించారు.



సాంస్కృతిక సంబరం.. సంప్రదాయ సౌరభం

ఈనాడు, అమరావతి: సంస్కృతి పరిఢవిల్లింది.. సంప్రదాయం ఉట్టిపడింది.. ఆకట్టుకునే వేషధారణలు, కనువిందు చేసే నృత్యాలతో అమరావతిలోని వీఐటీ-ఏపీ ప్రాంగణం సందడిగా మారింది. వార్షిక క్రీడా సాంస్కృతిక ఉత్సవం 'విటోపియా-2026' శనివారం ఆద్యంతం భిన్నంగా సాగింది. వివిధ దేశాలకు చెందిన వీఐటీ-ఏపీ విద్యార్థులు తమ జాతీయ పతాకాలు చేతబూని.. తమ ప్రాంత వస్త్రధారణ, సంప్రదాయాలను ప్రతిబింబించేలా వారి మాతృభాషలో గీతాలను ఆలపిస్తూ సందడి చేశారు.

ప్రకృతి ప్రేమికులు.. సేంద్రియ సైనికులు

- రసాయన రహిత సాగులో కర్షకుల అద్భుతాలు
- ఆర్గానిక్ రైతోత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా స్టాల్స్

ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే - ఎ.కొండూరు

నేల తల్లిని కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్న ప్రకృతి ప్రేమికులు వారు.. రసాయనాలు లేకుండా పంటలు పండించాలన్న ప్రభుత్వ పోరాటంలో సేంద్రియ సైనికులు.. బియ్యం మొదలు కూరగాయలు, అపరాలు, ఫలాలను సేంద్రియ విధానంలో పండిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. శనివారం ఎ.కొండూరు మండలం కృష్ణారావుపాలెంలో నిర్వహించిన ఆర్గానిక్ రైతోత్సవంలో ఉత్పత్తులను ప్రదర్శించారు.

రెండెకరాలు.. 25 పంటలు



- **గం**పలగూడెం మండలం మేడూరుకు చెందిన **టి.కోటేశ్వరమ్మ** బీఎస్సీ అగ్రికల్చర్ చదువుతున్నారు. 2 ఎకరాల్లో 25 పంటలు పండిస్తున్నారు. బీజామృతం, ఘన, ద్రవ జీవామృతం స్వయంగా తయారు చేసి వాడుతున్నారు.
- ప్రధాన పంటలుగా వరి, మొక్కజొన్న, మినుములతో పాటు జీవవైవిధ్య పంటలైన నువ్వులు, అలసంద తదితర చిరుధాన్యాలు, కూరగాయలు, ఆకుకూరలను సాగు చేస్తున్నారు.
- ప్రధాన పంటను ఆశించే చీడపీడల దృష్టిని జీవ వైవిధ్య పంటల పైకి మళ్లించి అధిక ఆదాయం పొందుతున్నారు.

మినుము, వరి, మొక్కజొన్నకు ఎకరానికి రసాయన సాగులో రూ.40 వేలు ఖర్చు అయితే.. ఈ విధానంలో రూ.18 వేల నుంచి రూ. 20 వేలు లోపే అవుతోంది. కేజీ బియ్యం రూ.100-రూ.200, మినుము కేజీ రూ.180కు అమ్ముతూ లాభాల బాటలో ఉన్నారు.

వైవిధ్య రకాల అన్నదాత

ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లికి చెందిన **ప్రసాద్** రెండెకరాల్లో రొటేషన్ విధానంలో ఏడు వరి రకాలు పండిస్తున్నారు. కాజీబటలియా, రక్తశాలి, చిట్టిముత్యాలు, రాజముడి, బ్లాక్ రైస్ తదితర రకాలు సాగు చేస్తున్నారు. వాటిలో రక్తహీనత నివారణ, రక్త శుద్ధి, షుగర్ సమస్య నివారించే ఔషధ గుణాలున్నాయని చెబుతున్నారు. ఘన, ద్రవ జీవామృతాలతో పాటు వేప గింజల కషాయం, జామ, వేప, సీతాఫలం, రావి, జిల్లేడు వంటి ఆకులు, బెల్లంతో తయారు చేసిన కషాయాలు వాడుతున్నారు.

రసాయనాల వరికి ఎకరానికి రూ.40 వేల పెట్టుబడి.. వీటికి రూ.25 వేలే. దిగుబడి ఎకరానికి 30 బస్తాలు దాటుతోంది. సాధారణ బియ్యం కేజీ రూ.50-రూ.70, వాటి ధర కేజీ రూ.100-రూ.200.



ఉద్యోగం వదిలిపెట్టి..




చందర్లపాడు మండలం కాండ్రపాడుకు చెందిన **గోటిక వెంకటప్పరెడ్డి** ఎంబీఏ చదివారు. మంచి వేతనం వచ్చే ఉద్యోగం వదిలి అన్నయ్య ప్రోత్సాహంతో సేంద్రియ సాగు చేస్తున్నారు. నాలుగెకరాల్లో సుభాష్ పాలేకర్ విధానం 5 లేయర్ల పద్ధతిలో ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్, దేశవాళీ ఆవులు, కోళ్లు, చేపలు పెంచుతున్నారు. బీఆర్‌సీ (బయో రిసోర్స్ సెంటర్) ఏర్పాటు చేసి ప్రకృతి సాగు రైతులకు సేంద్రియ ఎరువులు అందిస్తూ శిక్షణ కూడా ఇస్తున్నారు.

జామ, బొప్పాయి, సీతాఫలం తదితర ఫలాలు, కూరగాయలు సాగు చేస్తున్నారు. నందిగామలో సొంతంగా స్టోర్ ఏర్పాటు చేసి ఉత్పత్తులు విక్రయిస్తున్నారు. ఏటా దాదాపు రూ.7 లక్షల ఆదాయం పొందుతున్నారు.

నేలమ్మ మురిసేలా.. రైతన్న మెరిసేలా..


జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, ఆర్డీవో మాధురి, జేసీ ఇలక్కియా, ఏపీ ఆర్గానిక్ సర్టిఫికేషన్ అథారిటీ ఛైర్మన్ దేవదత్ తదితరులు

ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే - ఎ.కొండూరు: 'ఎన్టీఆర్ జిల్లాలో ప్రస్తుతం పండిస్తున్న వ్యవసాయ ఉత్పత్తులు స్థానిక అవసరాలకు సరిపోవడం లేదు. అందుకే లక్ష ఎకరాల్లో ప్రకృతి సేద్యాన్ని విస్తరించాలనే లక్ష్యంతో ముందుకెళుతున్నామని' కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. సేంద్రియ సాగు విస్తరణే లక్ష్యంగా శనివారం ఎ.కొండూరు మండలం కృష్ణారావుపాలెంలో ఆర్గానిక్ రైతోత్సవం పేరుతో నేచురల్ ఫార్మింగ్ మేళా నిర్వహించారు. సేంద్రియ ఉత్పత్తులతో ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేశారు. రైతులు, వినియోగదారులకు నిపుణులతో శిక్షణ, అవగాహన కల్పించారు. వెయ్యి మంది రైతులు పాల్గొన్న కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా విచ్చేసి వివిధ అంశాలపై సేంద్రియ సాగు అభ్యున్నతికి చక్కటి ప్రణాళికలను వివరించారు.


సదస్సుకు హాజరైన రైతాంగం

- సమగ్ర వార్త 9లో

ఏమందురు.. ఈ దారుణాన్ని..?

- కాలం చెల్లిన ఔషధాలకు కొత్త తేదీలు
- 22 నకిలీ స్టాంపులు.. మందుల స్వాధీనం

ఈనాడు, అమరావతి

కాలం చెల్లిన ఔషధాలకు.. నకిలీ స్టాంపులతో కొత్తగా మళ్లీ తేదీలను మార్చేసి మార్కెట్‌లో విచ్చలవిడిగా అమ్మేస్తున్నారు. విజయవాడ, విశాఖ డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు రెండు రోజులుగా నిర్వహించిన దాడుల్లో ఈదారుణం వెలుగుచూసింది. సత్యనారాయణపురంలో 'డైకాన్ హెల్త్ కేర్ ఔషధాల హోల్ సేల్ సరఫరా సంస్థలో అధికారులు నిర్వహించిన తనిఖీల్లో కళ్లుబైర్లు కమ్మే వాస్తవాలు వెలుగుచూశాయి.

తొమ్మిది రకాల మందులకు...

మధుమేహం, గ్యాస్ సమస్యలకు వాడే తొమ్మిది రకాల మందులకు గడువు తేదీలు, వివరాలన్నీ నకిలీ రబ్బరు స్టాంపుల సాయంతో మార్చేస్తున్నారు. ఈ మందులకు ఇంకా గడువు 1, 2 నెలలు ఉండగానే.. మరో ఆరు నెలలు అదనంగా పెంచేస్తూ.. నకిలీ ముద్రలు వేస్తున్నారు. డైకాన్ సంస్థ నుంచి రూ.4 లక్షల విలువైన మందులు.. 22 నకిలీ స్టాంపులు, మందులపై పాత వివరాలను చెరిపేందుకు వినియోగించే షినాలిక్ డీ13ఎక్స్ ఎన్‌సీ టిన్నర్, మార్చేసిన బ్యాచ్ నంబర్లు, తయారీ తేదీలు, గడువు తేదీల ముద్రలతో కూడిన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు.


ఫిబ్రవరితో కాలం చెల్లిన మందులు | గడువు తేదీ కనిపించకుండా చెరిపేశారిలా.. | ఆగస్టు వరకు గడువు ఉన్నట్లు ముద్రించారిలా..

ఆర్ఎంపీలు లైసెన్స్‌లు లేకుండా..

జిల్లాలో పలువురు ఆర్ఎంపీలు కూడా లైసెన్స్ లేకుండా పెయిన్ కిల్లర్ మందు బిళ్లలు, ఇంజక్షన్లు, యాంటీ బయాటిక్స్ విచ్చలవిడిగా అమ్మేస్తున్నారు. వీరిపైనా డ్రగ్ కంట్రోల్ అధికారులు దాడులు నిర్వహించారు.

★ జగ్గయ్యపేట మండలం బలుసుపాడులో ఆర్ఎంపీ వల్లంకొండ గోపి వద్ద రూ.లక్ష విలువైన మందులను పట్టుకుని సీజ్ చేశారు.

★ జగ్గయ్యపేటలో తజ్ క్లినిక్ పేరుతో వైద్య సేవలు అందిస్తున్న ఆర్ఎంపీ షేక్ తాజుద్దీన్ నుంచి రూ.2 లక్షల విలువైన మందులు స్వాధీనం చేసుకున్నారు.

★ పెనుగంచిప్రోలు మండలం తోటచర్లలో ఆర్ఎంపీ బిత్రా బాలకృష్ణ వద్ద రూ.లక్షల విలువైన మందులను సీజ్ చేశారు.

★ దాడుల్లో జిల్లా డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ సహాయ సంచాలకులు పి.శ్రీరామమూర్తి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు డి.సునీత, ఎ.కృష్ణ, కె.వి.భూపేష్, బి.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు	
ఇఫ్తార్: (ఆదివారం) సాయంత్రం: 6.17	
సహరి: (సోమవారం) ఉదయం: 5.11	

అనివార్య కారణాలతో విజయవాడ- షార్జా సర్వీసు రద్దు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే : విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి షార్జా వెళ్లాల్సిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానం అనివార్య కారణాలతో శనివారం రద్దు అయ్యింది. దీంతో విమాన ప్రయాణికులు ఆందోళనకు దిగారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరే షార్జా విమానం కోసం 163 మంది ప్రయాణికులు రెండు గంటలు ముందుగానే విమానాశ్రయానికి చేరుకున్నారు. షార్జా నుంచి రావాల్సిన విమానాన్ని అక్కడి పరిస్థితుల కారణంగా అధికారులు రద్దు చేశారు. ఈ క్రమంలో ప్రత్యామ్నాయ విమానాన్ని ఏర్పాటు చేయాలని ప్రయాణికులు నిరసన చేపట్టారు. ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటలకు షార్జా పంపించేందుకు విమానయాన ప్రతినిధులు అంగీకరించడంతో ప్రయాణికులు ఆందోళన విరమించారు.


మేయర్ భాగ్యలక్ష్మి సమక్షంలో చర్చ నేపథ్యంలో వాదోపవాదనలు

వీధి పేర్ల పంచాయితీ..
దద్దరిల్లిన కౌన్సిల్

- అజెండాలోని 165 అంశాల్లో 38 అవే..
- వైకాపా కార్పొరేటర్ల సొంత ప్రయోజనాలకు పెద్దపీట

ఈనాడు, అమరావతి - నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే

విజయవాడ నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం శనివారం రసాభాసగా మారింది. పాలకవర్గ పదవీ కాలం మార్చి 18తో ముగుస్తోంది. ఇదే ఆఖరి సమావేశం. మొత్తం 165 అంశాలు అజెండాలో పెట్టారు. ఐదారు తప్ప.. మిగతావి మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో పాలక పక్షమైన వైకాపా సభ్యులు ఆమోదించుకున్నారు. అందులో ప్రజోపయోగ పనుల కంటే వైకాపా కార్పొరేటర్ల సొంత ప్రయోజనాల కోసం పెట్టినవే ఎక్కువ ఉన్నాయి. అజెండాలో 38 అంశాలు రహదారులకు పేర్లు పెట్టేవే ఉండడం గమనార్హం.

పుట్టబోయే పిల్లల పేర్లూ పెట్టుకోండి..

- పేర్లను ఆమోదించుకోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఒకటో డివిజన్ కార్పొరేటర్ ఉద్దండు సునీత, ఆమె భర్త ఉద్దండు సురేష్, మరికొందరి పేర్లను రోడ్లకు పెట్టుకున్నారు. ఆ పేర్లను చూసి.. వైకాపా కార్పొరేటర్లే అసహ్యించుకుంటున్నారని, పుట్టబోయే పిల్లలు, మనవళ్ల పేర్లు కూడా పెట్టుకోవాలని తెదేపా ఫ్లోర్‌లీడర్ బాలస్వామి సహా పలువురు ఎద్దేవా చేశారు.
- ఇదే చివరి కౌన్సిల్ సమావేశం. కానీ.. మరోసారి సమావేశం ఏర్పాటు చేస్తామని మేయర్ ప్రకటించారు. కనీసం 30 రోజులు దాటాక.. 90 రోజుల్లోపు సమావేశం జరగాలి. అంత సమయం లేనప్పుడు.. మరో కౌన్సిల్ ఎందుకని తెదేపా కార్పొరేటర్లు ప్రశ్నించారు. నిధుల దుర్వినియోగం తప్ప ప్రయోజనం లేదన్నారు.
- పీపీపీ విధానంలో రోడ్ల నిర్వహణపై ఓ కార్పొరేటర్ నిరసనకు దిగారు. జీవో పత్రాలు చింపిపడేశారు. కౌన్సిల్ హాలులో చెత్త పోయడం సరికాదని మేయర్ మండిపడ్డారు.
- గుణదలలో మిగిలిన 70 ఇళ్ల స్థలాల్లో.. 37 మౌలిక వసతులకు, మిగతా 33 సీనియారిటీ ప్రకారం ఉద్యోగులకు కేటాయించేలా తీర్మానించారు.
- వైకాపా హయాంలో నాడు-నేడు పేరుతో పాఠశాలల్లో చేసిన అభివృద్ధి ఏమీ లేదని, నిధులు గోల్‌మాల్ చేశారని తెదేపా ఫ్లోర్‌లీడర్ బాలస్వామి ఆరోపించారు.
- కూటమి ప్రభుత్వం వచ్చాక కావాలనే నగర పరిధిలో.. వైకాపా పాలకపక్షం పారిశుద్ధ్య నిర్వహణను గాలికొదిలేసిందని తెదేపా తదితర కార్పొరేటర్లు పేర్కొన్నారు.

అబ్బురం.. సాంకేతిక సంబరం

టెక్నోఫెస్టివల్ సుప్రజ్ఞ-2026లో సత్తా చాటిన యువత

సిద్ధార్థ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో జరుగుతున్న జాతీయ స్థాయి టెక్నోఫెస్టివల్ సుప్రజ్ఞ- 2026లో సాంకేతిక విద్యార్థులు తమ నైపుణ్యంతో టెక్నాలజీని ఉపయోగించి అబ్బురపరిచే ప్రాజెక్టులు రూపొందించారు. వివిధ బ్రాంచులకు చెందిన విద్యార్థులు తమ లైవ్ ప్రాజెక్టులతో హోరాహోరీగా తలపడ్డారు.

- కానూరు, న్యూస్‌టుడే

కారులో షికారు..



సిద్ధార్థ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో మెకానికల్ విభాగంలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న సాయి వెంకట్ పవన్, షేక్ వలి, అజర్ మహమ్మద్ బృందం సభ్యులు గో-కార్ట్ మోడల్ రేసింగ్ కారును రూపొందించారు. ఇందులో యాక్టివా-2జీ ఇంజిన్, హైడ్రాలిక్ బ్రేక్స్, మాన్యువల్ స్టీరింగ్‌తో కారును రూపొందించారు. 110 సీసీ ఇంజిన్, గంటకు 60 కిలోమీటర్ల వేగంగా వెళ్లేలా తయారుచేశారు. ఇందుకు రూ. 20వేలు ఖర్చు చేశామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ మెకానికల్ విభాగాధిపతి నర్రా రవికుమార్ సాంకేతిక సహకారంతో తాము ఈ ప్రాజెక్టు రూపొందించామని వివరించారు. సుప్రజ్ఞలో ఈ ప్రాజెక్టు అత్యంత ఆకర్షణగా నిలిచింది.

ఎక్కువ లోడ్‌లు మోసేస్తుంది..:

సిద్ధార్థ డీమ్డ్ విశ్వవిద్యాలయం సివిల్ విభాగానికి చెందిన వినయ్, ప్రశాంత్, దుర్గాప్రసాద్‌లు ఎక్కువ బరువులు మోసే తక్కువ బరువున్న ట్రస్ గిర్డర్ బ్రిడ్జిని రూపొందించారు. ఇందులో మొత్తం వుడ్, వాటిని కలపడానికి జిగురు ఉపయోగించారు. ఈ ప్రాజెక్టు చేయటానికి రూ.2 వేలు ఖర్చు చేశామన్నారు. ఈ మోడల్‌లో బ్రిడ్జిలు రూపొందించడం వల్ల భవిష్యత్తులో అతి తక్కువ ఖర్చుతో ఎక్కువ లోడ్‌లను మోసే చెక్క బ్రిడ్జిలను రూపొందించవచ్చన్నారు. ఈ ప్రాజెక్టుకు గైడ్‌గా బి.వెంకటరావు వ్యవహరించారన్నారు.



సంజ్ఞ అందిస్తే..



సంజ్ఞలు అందించడం ద్వారా నిర్ణీత కక్ష్యలో వెళ్లే రోబోను రూపొందించారు సిద్ధార్థ డీమ్డ్ విశ్వవిద్యాలయం మెకానికల్ విద్యార్థులు మనోభిరామ్, దేవిశ్రీఅఖిల్, ప్రేమ్‌లు. ఇందులో ఈఎస్పీ -32 కంట్రోలర్, అల్ట్రాసోనిక్ సెన్సార్లు, ఆటోమెటిక్ డిటెక్టర్లను వినియోగించి రోబోకు సంజ్ఞల ద్వారా సూచించిన దారిలో వెళ్లేలా తయారు చేశారు. ఈ ప్రాజెక్టు చేయడానికి రూ.2 వేలు ఖర్చు చేశామని వివరించారు.

అర్ధరాత్రి దాటితే.. అక్రమార్కుల అలజడి!

ప్రభుత్వ భూముల్లో విచ్చలవిడి మట్టి తవ్వకాలు

ఈనాడు, అమరావతి

జిల్లాలో అర్ధరాత్రి మట్టి తవ్వకాలు ఊపందుకున్నాయి. అసైన్డ్, ప్రభుత్వ అనాధీన, డొంక భూముల్లో అక్రమార్కులు విచ్చలవిడిగా మట్టి తవ్వి తరలిస్తున్నారు. స్థానికుల నుంచి అధికారులకు తవ్వకాలపై సమాచారం అందడం.. వాళ్లొచ్చేలోపు లారీలు, జేసీబీలకు తాళాలు వేసి తవ్వేవాళ్లు పారిపోవడం.. కొన్ని రోజులుగా ఇదేతంతు. అధికారులొచ్చి.. కాసేపు వేచిచూసి వెళ్లిపోతున్నారు. వాళ్లు వెళ్లగానే.. మళ్లీ గద్దల్లా వాలి.. భూమిని గుల్ల చేస్తున్నారు. ప్రస్తుతం మట్టి ధరకు రెక్కలు రావడం.. ఎక్కడా దొరక్కపోవడంతో.. అక్రమార్కులు బరితెగించి.. తవ్వేస్తున్నారు.


సర్వే నంబరు 46, 39లో భారీ యంత్రాలు, టిప్పర్లను మోహరించి తవ్వకాలు

మూడు రోజులుగా...

కొత్తూరు పరిధిలోని సర్వే నంబరు 227లో వసంతరాయుల తిప్ప సమీపంలోని అసైన్డ్ భూములన్నీ.. కొంతకాలంగా అగాధాలుగా మారిపోతున్నాయి. అసైన్డ్ భూముల్లో కేవలం ఎన్వోసీలను చూపించి తవ్వుతుండడంతో అధికారులకు గ్రామస్థులు గత గురువారం సమాచారం ఇచ్చారు. వాళ్లొచ్చేసరికే.. యంత్రాలను వదిలేసి పారిపోయారు. మళ్లీ శుక్రవారం సాయంత్రం 6గంటల తర్వాత వచ్చి తవ్వకాలు మొదలెట్టారు. మైనింగ్ అధికారులు రాత్రివేళ రావడంతో మళ్లీ పారిపోయారు. ఆ తర్వాత శనివారమూ ఉదయాన్నే తవ్వకాలు మొదలెట్టారు. తాడేపల్లి వీఆర్వోలు సాయి, దుర్గారావు, గ్రామస్థులతో కలిసి రావడంతో తవ్వుతున్న వాళ్లంతా లారీలతో పరారయ్యారు. ఒక జేసీబీని పట్టుకున్నారు.

భూమి గుల్ల చేస్తూ...

కొత్తూరు పరిధిలో సర్వేనంబరు 45లో ప్రైవేటు భూముల్లో తవ్వకాలకు.. అనుమతులు తీసుకున్నారు. కానీ.. పక్కనున్న 46, 39లోని ప్రభుత్వ అనాధీన, డొంక భూముల్లో తవ్వేస్తున్నారు. రెండు జేసీబీలు, 15 లారీలను పెట్టి భూమిని గుల్ల చేసేస్తున్నారు. పది రోజుల కిందట రెవెన్యూ అధికారులకు సమాచారం రాగా.. వారొచ్చి వాహనాలను సీజ్ చేశారు. తవ్వేసిన గోతుల్లో కొన్నిచోట్ల మట్టి పోయించారు. ఆ తర్వాత నుంచి అర్ధరాత్రి మొదలుపెట్టి.. తెల్లవారుజాము వరకూ ప్రభుత్వ భూముల్లో తవ్వుతున్నారు. ఏకంగా.. భూమి నుంచి నీళ్లు బయటకొచ్చేంత లోతు వరకూ తవ్వేసి మట్టిని ఎత్తుకుపోతున్నారు. రాత్రంతా తవ్వడం.. ఉదయం వేళ అటువైపు ఎవరూ వెళ్లకుండా ముళ్లకంపలను వేయడం ఇదే తంతు. చివరికి గోతుల్లో అధికారులు కప్పించిన మట్టిని కూడా ఎత్తుకుపోతున్నారు.

నేడూ విద్యుత్తు బిల్లులు చెల్లించొచ్చు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : సెలవు దినమైనప్పటికీ ఆదివారం జిల్లాలోని అన్ని విద్యుత్తు బిల్లుల వసూలు కేంద్రాలు తెరిచి ఉంటాయని ఎస్ఈ యు.హనుమయ్య తెలిపారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏపీ సీపీడీసీఎల్ కస్టమర్ యాప్, గూగుల్‌పే, ఫోన్ పే, అమెజాన్ పే, బిల్ డెస్క్ యాప్‌ల ద్వారా చెల్లించవచ్చని ఆయన తెలిపారు.

కర్కశ తండ్రి.. కటకటాలపాలు

విజయవాడ(చిట్టినగర్), న్యూస్‌టుడే: కూతురితో అసభ్య ప్రవర్తన కేసులో నిందితుడిని కొత్తపేట పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. విజయవాడ శివారు ప్రాంతమైన వైఎస్ఆర్ కాలనీకి చెందిన 6వ తరగతి చదువుతున్న కూతురిపై తండ్రి (40) మద్యం మత్తులో పలుమార్లు అసభ్యంగా వ్యవహరించినట్లు కుమార్తె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. అనంతరం అతడిని కోర్టులో న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచినట్లు సీఐ చినకొండలరావు తెలిపారు. బాలిక వసతి గృహంలోనే ఉన్నట్లు వివరించారు. తండ్రితో పాటు మేనమామ కూడా బాలిక పట్ల తప్పుగా వ్యవహరించినట్లు వస్తున్న ఆరోపణలు నిరాధారమని, నిజం కాదని సీఐ చినకొండలరావు, ఏసీపీ దుర్గారావు వివరించారు.

ధర వరలు



వంకాయలు-20/22, టమాటా-14, బెండ-24, పచ్చిమిర్చి-44, కాకర-30, బీర-26/24, క్యాలీ ఫ్లవర్-15/20, క్యాబేజి-14, క్యారెట్-24, దొండ-32, బంగాళదుంప-22, ఉల్లిపాయలు-22, గోరుచిక్కుళ్లు-26, దోస-16/26, సొర-8/10, పొట్ల-30, అరటికాయ-7/6, చామదుంప-24, అల్లం-76, మునగ-10/8, ఆకు కూరలు (కట్ట)-2. 50, కంద-40, బీట్ రూట్-26, కీర దోస-40, బీన్స్-60/70, క్యాప్సికమ్-60, చింతకాయలు-65, నిమ్మ (డజను)-36/48, కొత్తిమీర-5/10, పుదీనా-5/15, ముల్లంగి-8, పచ్చిమామిడి-20/25/30. (నిన్నటివి). నగరంలోని రైతుబజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి. **- న్యూస్‌టుడే, విజయవాడ రైతుబజారు**

సౌర విద్యుత్తు వినియోగదారులకు ఊరట

రూ.59.83 లక్షల మిగులు బకాయిల చెల్లింపు ★ 'ఈనాడు' కథనానికి స్పందన

సూర్యారావుపేట, న్యూస్‌టుడే

ఎన్టీఆర్ జిల్లా సౌర విద్యుత్తు వినియోగదారులకు 'మిగులు' విద్యుత్తు చెల్లింపు ప్రక్రియను ఆ శాఖాధికారులు చేపట్టారు. ప్రతి నెలా ఉత్పత్తి అయిన సౌర విద్యుత్తును వాడుకోగా.. మిగిలిన విద్యుత్తును ప్రభుత్వం తీసుకుంటుంది. యూనిట్‌కు రూ.2.09ల మేర చెల్లిస్తుంది. కానీ దాదాపు 7 నెలలుగా నగదు ఇవ్వడం లేదు. ఈ ప్రక్రియ జాప్యమవుతున్న వైనంపై ఈ నెల 4న 'మిగులు నగదు... అందక దిగులు' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది.

విద్యుత్తు శాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించారు. వినియోగదారుల మిగులు యూనిట్ల బకాయిలను తక్షణమే చెల్లించాలంటూ ఈ నెల 4వ తేదీనే ఏపీసీపీడీసీఎల్ అన్ని జిల్లాల సర్కిల్ అధికారులు చీఫ్ జనరల్ మేనేజర్ ఆర్‌సీహెచ్.శ్రీనివాసరావు ఆదేశాలు జారీ చేశారు. దీంతో చెల్లింపు ప్రక్రియను మొదలుపెట్టారు.

4,400 మందికి రూ.59.83 లక్షలు.. ఎన్టీఆర్ జిల్లాలో 4,400 మంది విద్యుత్తు వినియోగదారులు ఉన్నారు. వీరికి మే నెల వరకు బకాయిల మొత్తాన్ని జనవరి నెలలో చెల్లించారు. తాజాగా జూన్ నుంచి 5 నెలల బకాయిలు రూ.59.83 లక్షలు విడుదల చేశారు. వీటికి సంబంధించిన చెక్కులను శనివారం బ్యాంకుకు పంపించారు. సోమవారం ఖాతాదారుల ఖాతాల్లో సొమ్ము జమవుతుంది. ఇకపై మార్చి నెల నుంచి ఏ నెల మిగులు నగదు.. అదే నెలలో ఖాతాలో జమ అవుతుందని అధికారులు ప్రకటించారు. కాగా కృష్ణాజిల్లాలో 4,636 మంది వినియోగదారులకు రూ.33.45 లక్షలు జమయ్యాయి.

విజయవాడలోనూ రైల్వే ఉద్యోగాల బాధితులు

డీఆర్‌ఎం కార్యాలయం కేంద్రంగా దందా

విజయవాడ, న్యూస్‌టుడే

రైల్వే శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసిన కేసులో బాధితుల సంఖ్యలో భారీగా పెరుగుతోంది. మచిలీపట్నం కేంద్రంగా రెండేళ్లుగా జరుగుతున్న ఈ దందాలో విజయవాడకు చెందిన బాధితులు పెద్ద సంఖ్యలో ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలింది. మచిలీపట్నానికి చెందిన రైల్వే ఉద్యోగి కిషోర్‌తో పాటు విజయవాడకు చెందిన కొంతమంది రైల్వే ఉద్యోగులు, కార్మిక సంఘ నాయకులు సహకరించినట్లు సమాచారం. విజయవాడ డీఆర్‌ఎం కార్యాలయం కేంద్రంగా ఈ మొత్తం తతంగం కొనసాగింది. రైల్వేలో టీసీ, క్లర్క్, ఇతర విభాగాల ఉద్యోగాల పేరుతో నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్లు సృష్టించి చాలా మంది బాధితులను మోసం చేసిన విషయం తెలిసిందే. ఈ దందాలో డీఆర్‌ఎం కార్యాలయంలో పని చేసే కొందరు ఉద్యోగుల పాత్ర ఉన్నట్లు రైల్వే విజిలెన్స్, మచిలీపట్నం పోలీసుల విచారణలో బయటపడింది. ఈ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న రైల్వే ఉద్యోగి కిషోర్ ఇచ్చిన సమాచారంతో విచారణను వేగవంతం చేశారు. రబ్బరు స్టాంపులతో పాటు నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్లు తయారు చేసింది డీఆర్‌ఎం కార్యాలయంలోనే అని తేలింది. ఇప్పటి వరకు మచిలీపట్నం పరిసర ప్రాంతాలకు చెందిన బాధితులే ఎక్కువగా ఉన్నట్లు తేలగా.. తాజాగా విజయవాడలోనూ సుమారు 50 మందికిపైగా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఒక్కో బాధితుల దగ్గర రూ.ఐదు లక్షల నుంచి రూ.10 లక్షల చొప్పున వసూలు చేసినట్లు పోలీసులు విచారణలో తేలింది. ఈ లెక్క ఇంకా పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. విజయవాడ కేంద్రంగా గతంలోనూ ఇటువంటి సంఘటనలు జరగగా రైల్వే విజిలెన్స్, రైల్వే ఇంటెలిజెన్స్ విభాగం చూసీచూడనట్లు వ్యవహరించడంతో బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. డీఆర్‌ఎం కార్యాలయంలో పని చేసే కొందరు సిబ్బందితో పాటు కొందరు రైల్వే కార్మిక సంఘం నేతలు కూడా ఈ ఘటనతో సంబంధం ఉన్నట్లు సమాచారం.

బాధితులకు న్యాయం దక్కేనా..?

గతంలోనూ ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోగా రైల్వే విజిలెన్స్ విభాగం తూతూ మంత్రంగా విచారణ జరిపి చేతులు దులుపుకొన్నారు. రైల్వే కార్యాలయాల్లో విజిలెన్స్ ఫోన్ నెంబర్లు, అడ్రస్సుతో బోర్డులు ఏర్పాటు చేసినా అలంకార ప్రాయంగా మిగిలిపోతున్నాయి. భారీగా స్థాయిలో అవినీతి జరుగుతున్నా గడిచిన ఐదేళ్లుగా ఒక్క కేసు కూడా విజిలెన్స్ విభాగం నమోదు చేయకపోవడం గమనార్హం. ఈ వ్యవహారంపై రైల్వే జీఎం కార్యాలయం నుంచి ఉన్నతాధికారులు ఆరా తీసినట్లు సమాచారం.

'హిందువుల మనోభావాలు దెబ్బతీశారు'



మాట్లాడుతున్న గద్దె అనూరాధ. వేదికపై శ్రీరామ్, అమ్ములు, చిట్టిబాబు, రఘురామరాజు తదితరులు

పటమట, న్యూస్‌టుడే: శాసనమండలిలో వైకాపా ఎమ్మెల్సీలు వేంకటేశ్వర స్వామి చిత్రపటాలను రాజకీయ ప్లకార్డుల్లా ఉపయోగించడం సరికాదని, దేవుడి చిత్రపటాలతో రాజకీయాలు తగవని ఎన్టీఆర్ జిల్లా తెదేపా అధ్యక్షురాలు గద్దె అనూరాధ మండిపడ్డారు. శాసనమండలిలో వైకాపా సభ్యుల తీరును నిరసిస్తూ శనివారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో కూటమి నేతలతో కలిసి ఆమె మీడియా సమావేశం నిర్వహించారు. వైకాపా ఎమ్మెల్సీలు ఇప్పటికైనా చేసిన తప్పును ఒప్పుకుని హిందూ సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని అనూరాధ డిమాండ్ చేశారు. జిల్లా భాజపా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ మాట్లాడుతూ దేవుడి చిత్రాలను అడ్డుపెట్టుకొని రాజకీయం చేయడం వైకాపా నేతల దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. జగన్ సూచనతో వారు వ్యవహరించిన తీరు అత్యంత బాధాకరమని విమర్శించారు. జనసేన నేత గాదిరెడ్డి అమ్ములు మాట్లాడుతూ హిందూ మత విశ్వాసాలను కించపరిచే విధంగా వ్యవహరించడం ప్రజలు సహించరన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, ఎన్టీఆర్ జిల్లా తెదేపా ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు, ఏపీ బిల్డింగ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ సలహా కమిటీ ఛైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, రాష్ట్ర నాగవంశం కార్పొరేషన్ ఛైర్మన్ ఎరుబోతు రమణారావు, నాయకులు పాల్గొన్నారు.

తిరుపతమ్మ తిరునాళ్లలో నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఆర్డీవో బాలకృష్ణ, పక్కన అధికారులు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలులోని తిరుపతమ్మ అమ్మవారి తిరునాళ్లలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు నిబంధనలు పాటించాలని [illegible] సూచించారు. [illegible] కుంటామని హెచ్చరించారు. సమావేశానికి వేర్వేరు శాఖల అధికారులు గైర్హాజరు కావడంపై ఆర్డీవో అసహనం వ్యక్తంచేశారు. ఈ నెల 26న మరోసారి సమావేశం నిర్వహిస్తానని.. అప్పుడు కూడా రాకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు. మార్చి 7న అనిగండ్లపాడు నుంచి అమ్మవారి పుట్టింటి పసుపు కుంకుమల బండ్లు వస్తాయని తెలిపారు. ఆలయ ఈవో మహేశ్వరరెడ్డి, ఈఈ రమాదేవి, తహసీల్దారు శాంతలక్ష్మి, ఎంపీడీవో శ్రీను, ఎస్సై అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

శస్త్రచికిత్సకు రూ. 7 లక్షల ఆర్థిక సాయం



కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఏసీపీ దామోదర్, సజ్జ లక్ష్మీ కిశోర్

పటమట, న్యూస్‌టుడే: మాచవరం పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న దిలీప్ కుమా[illegible]ర్నారు. వ్యక్తిగత రుణం రూ.3 లక్షలు తీసుకున్నారు. ఇంకా శస్త్ర చికిత్సకు రూ.7 లక్షలు కావాలి.

పెద్ద మనసు చాటుకున్నారు.. [illegible] రమైంది. ఇప్పటికే అప్పుల భారంతో కుంగిపోయిన అతనికి ఏం చేయాలో అర్థం కాలేదు. సీఎంఆర్‌ఎఫ్ కోసం ప్రభుత్వ సాయం కోరితే నీవు ప్రభుత్వ ఉద్యోగివి అర్హత లేదన్నారు. డబ్బులు దొరికే పరిస్థితి లేదు. ఆ సమయంలో ఏసీపీ దామోదర్ తన తోటి సిబ్బందికి విషయాన్ని తెలిపారు. దీంతో కమిషనరేట్‌లో పోలీసులంతా ఏకమై సుమారు రూ.6 లక్షల వరకు సమకూర్చారు. పవర్ మెక్ సంస్థల అధినేతలు సజ్జా లక్ష్మీ, కిశోర్‌ను సంప్రదించడంతో వారు స్పందించి రూ.7 లక్షలను శనివారం ఏసీపీ దామోదర్ సమక్షంలో దిలీప్ కుటుంబ సభ్యులకు అందజేశారు. కానిస్టేబుల్ కుటుంబం తమ కుమారుడి శస్త్ర చికిత్సకు సహకరించిన ఏసీపీ దామోదర్‌తోపాటు పవర్ మెక్ సంస్థల అధినేతలు సజ్జా లక్ష్మీ, కిషోర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగాలకు తెలుగు అర్హత తప్పనిసరి చేయాలి



వేదికపై వెంకయ్యనాయుడు, ఉమామహేశ్వరరావు, గోపాలకృష్ణ తదితరులు

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఆల్ ఇండియా సర్వీసులు మినహా అన్ని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు తెలుగు భాష అర్హతను తప్పనిసరి చేయాలని... తెలుగు తెలిసిన వారికే ఉద్యోగాలు ఇవ్వాలని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు సూచించారు. శనివారం తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జానపద అకాడమీ విశ్రాంత అధ్యక్షుడు పొట్లూరి హరికృష్ణ ఆధ్వర్యంలో ప్రపంచ తెలుగు కవుల మహాసభలు కార్యక్రమం నిర్వహించారు. దీనికి వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రష్యా, చైనా, జర్మనీ, ఫ్రాన్స్ వంటి దేశాలు ఉన్నత విద్యను మాతృభాషలోనే అందిస్తున్నాయని గుర్తుచేశారు. కొత్త జాతీయ విద్యా విధానం కూడా ప్రాథమిక విద్య మాతృభాషలోనే జరగాలని సూచిస్తోందని తెలిపారు. తెలుగు కవులు, రచయితలను సత్కరించడం ద్వారా భాషా సంస్కృతిని ప్రోత్సహించవచ్చని పేర్కొన్నారు. స్మార్ట్ ఫోన్ల ప్రభావంతో కుటుంబ బంధాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నాణ్యమైన బాల సాహిత్యాన్ని ప్రోత్సహించేందుకు చందమామ, బాలమిత్ర వంటి పత్రికలను పునరుద్ధరించాలని కోరారు. తెలుగు భాషా పరిరక్షణ.. మాటలకే పరిమితం కాకుండా ఆచరణలో తెలుగుకు తగిన స్థానం కల్పించాలని ప్రభుత్వాలకు సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వులు, అసెంబ్లీ సమావేశాలు, న్యాయస్థాన తీర్పులు, వైద్య సేవలు అన్నీ తెలుగులోనే అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, బాలసాహితీవేత్త, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావు, జి.ఆర్.కె.పోలవరపు సాంస్కృతిక సమితి అధ్యక్షుడు గోళ్ళ నారాయణరావు, జగన్నాథ్, యామవరం రాజేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై చేపట్టిన్న అభివృద్ధి పనులను కలెక్టర్ జి.లక్ష్మీశ శనివారం తనిఖీ చేశారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం దుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో వీకే శీనానాయక్ అమ్మవారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని అందించారు. అనంతరం భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు, అభివృద్ధి పనులు, మాస్టర్‌ప్లాన్ తదితర అంశాలను పరిశీలించారు.

బ్రాయిలర్ ధరలు (కిలో ఒక రూ.లలో)



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -115 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206 చికెన్ స్కిన్‌లెస్ - 234.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 132, 141, 152 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

మిర్చి తోటలో గంజాయి సాగు



స్వాధీనం చేసుకున్న గంజాయిని పరిశీలిస్తున్న తహసీల్దారు, ఎస్సై

చందర్లపాడు, న్యూస్‌టుడే: చందర్లపాడు మండలం గుడిమెట్ల, లక్ష్మీపురం గ్రామాల మధ్య మిర్చితోటలో గంజాయి సాగు సంచలనంగా మారింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు లక్ష్మీపురం గ్రామానికి చెందిన అంగిరేకుల జ్యోతి తన మిరప పంటలో గుట్టుచప్పుడు కాకుండా గంజాయి మొక్కలు పెంచింది. అవి పక్వానికి రావడంతో పీకి ఎండబెట్టి బస్తాలో వేసి పొలంలోనే దాచి.. గ్రామానికి చెందిన యువకులకు విక్రయించడం ప్రారంభించింది. స్థానిక ఎస్సై ధర్మరాజు ఓ కేసు విచారణ నిమిత్తం గుడిమెట్ల వెళ్తుండగా మార్గమధ్యలో గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు అనుమానాస్పదంగా కనిపించారు. వాహనాన్ని నిలిపి విచారిస్తుండగా యువకులు పొలాల్లోకి పరిగెత్తారు. ఎస్సై వారిని వెంబడించి ఇద్దరిని పట్టుకొని ప్రశ్నించగా గంజాయి విషయం వెలుగులోకి వచ్చింది. వెంటనే పొలం వద్దకు వెళ్లి తనిఖీ చేయగా బస్తాలో మూటగట్టిన గంజాయి లభ్యమైంది. తోటలో మొలిచిన చిన్న చిన్న గంజాయి మొక్కలను గుర్తించి పీకేశారు. జ్యోతితోపాటు ఆమె తల్లి గుడారు రమణను, ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నారు. విషయం ఉన్నతాధికారులకు తెలియజేశారు. అనంతరం తహసీల్దారు వాసిరెడ్డి రామకోటేశ్వరరావు సమక్షంలో సుమారు 10 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

తిరువూరు
• తిరువూరు • మైలవరం



మసీదుల వద్ద ఆష్ పంపిణీ

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : రంజాన్ మాసం సందర్భంగా కేతనకొండ, కాచవరం, గుంటుపల్లి, ఇబ్రహీంపట్నం, కొండపల్లిలోని మసీదుల వద్ద తక్షణం శక్తిని ఇచ్చే పానీయం(ఆష్)ను తయారు చేస్తున్నారు. సాయంత్రం వేళ ఇఫ్తార్ విందు సమయంలో ముస్లింలకు ఉచితంగా అందిస్తున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? కోడూరు ఎస్సీ ఏరియాలో నియంత్రిక పాడైపోయి విద్యుత్తు సరఫరా నిలిచి నెలలు కావస్తున్న మరమ్మతులు చేపట్టలేదు. తక్షణమే నియంత్రిక ఏర్పాటు చేసి విద్యుత్తు సరఫరా అందించాలి. **- ఆర్.బసవేశ్వరరావు, గ్రామస్థుడు**

✔ సమస్య మా దృష్టికి వచ్చింది. నియంత్రిక మరమ్మతులు చేపట్టి విద్యుత్తు సరఫరా అందించేందుకు చర్యలు చేపడతాం. **- సురేష్, లైన్‌మెన్ - న్యూస్‌టుడే, జి.కొండూరు**

? కవులూరు కొత్త కాలనీలోని పంచాయతీ బోరు మరమ్మతులకు గురై నీటి కోసం అవస్థలు పడుతున్నాం. తక్షణమే మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాను పునరుద్ధరించాలి. **- సునీల్, గ్రామస్థుడు**

✔ సమస్య మా దృష్టికి వచ్చింది. తక్షణమే సంబంధిత సిబ్బందిని పంపించి బోరుకు మరమ్మతులు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరిస్తాం. **- సరోజ, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, జి.కొండూరు**

స్పందన: మండలంలోని వెల్వడం ఎస్సీ ఏరియా వద్ద వాటర్ ట్యాంకునకు ఎదురు బజారులో చెత్తా చెదారంతో అపరిశుభ్రంగా ఉందని స్థానికులు 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. కార్యదర్శి సురేష్ స్పందించి కార్మికులను పంపి చెత్తను తొలగించారు. **- న్యూస్‌టుడే, మైలవరం**

మామిడి సాగు విధానంపై రైతులకు శిక్షణ

పెనుగంచిప్రోలు, వత్సవాయి(న్యూస్‌టుడే): మామిడి పూతలో తేనె మంచు, నల్ల తామర పురుగుల ఉద్ధృతి ఎక్కువగా ఉందని నూజివీడు మామిడి పరిశోధనా కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ రాధారాణి తెలిపారు. పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలం దబ్బాకుపల్లి గ్రామాల్లో శనివారం ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో మామిడి రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మామిడి తోటలు పూతకు రాక ముందు, కాయలు కోసిన తర్వాత రెండు నెలలకోసారి వేపనూనె, వేప గింజల కషాయం పిచికారీ చేయాలని సూచించారు. తెల్లపూత వచ్చాక మందులు పిచికారీ చేయకూడదని చెప్పారు. కాయ నిమ్మకాయ సైజులో ఉన్నప్పుడు కవర్లు కట్టాలని సూచించారు. కవర్లకు ప్రభుత్వం హెక్టారుకు రూ.25 వేలు రాయితీ ఇస్తుందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఉద్యాన అధికారి నీలిమ, మునేరు ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ పొన్నం బాలాజీ పాల్గొన్నారు.

యూటీఎఫ్ పాకెట్ డైరీ ఆవిష్కరణ

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : రెడ్డిగూడెం, నాగులూరు జడ్పీ ఉన్నత పాఠశాలల్లో శనివారం యూటీఎఫ్ పాకెట్ డైరీలను ఆవిష్కరించారు. రెడ్డిగూడెంలో జరిగిన కార్యక్రమంలో డీవైఈవో టి. శ్యాంసుందరరావు, ఎంఈవో- 2 పి.రమేష్ బాబు, పి.భవాని, డి.ప్రకాష్, బి.వి.ఎస్.నాగలక్ష్మి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసునికి అలంకరణ



గంపలగూడెం, న్యూస్‌టుడే : మండలంలోని మెట్టగుట్టలో గజలక్ష్మి సమేత శేషాచల శ్రీనివాస స్వామి ఆలయంలో ప్రధానార్చకుడు శ్యామ్‌సుందరాచార్యులు ఆధ్వర్యంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. గుడి అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పి. వెంకట్రావు, సభ్యులు పర్యవేక్షించారు.

వేసవి రాక ముందే.. దాహం కేకలు

విస్సన్నపేట, తిరువూరు, న్యూస్‌టుడే

వేసవి రాక ముందే తిరువూరు నియోజకవర్గ ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రక్షిత నీరు సరఫరా చేసే మంచినీటి ట్యాంకులు మరమ్మతులకు నోచుకోక పోవడం, ఏళ్ల నాడు వేసిన పైపులైన్లు తుప్పుపట్టడం, చేతి పంపుల నిర్వహణ గాలికి వదిలేయడంతో నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా కుళాయి నీటిని ఇంటింటా అందిస్తామని పాలకుల మాటలు నీటి మీద రాతలా మారాయని విమర్శిస్తున్నారు.



శిథిలావస్థకు చేరిన వేమిరెడ్డిపల్లి తాగునీటి ట్యాంకు

పొలాల బోర్ల వద్దకు..

విస్సన్నపేట మండలం వేమిరెడ్డిపల్లిలోని ఓవర్ హెడ్ ట్యాంక్‌లు శిథిలావస్థకు చేరి ఏళ్లు గడుస్తున్నా ఆర్‌డబ్ల్యూఎస్, మండల పరిషత్తు, పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో నీటి ఎద్దడితో పంచాయతీ పరిధిలోని నాలుగు శివారు గిరిజన తండాల ప్రజలు నానా అవస్థలకు గురవుతున్నారు. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే వేసవిలో కి.మీ దూరంలోని పొలాల బోర్ల వద్దకు తాగునీరు కోసం వెళ్లాల్సి వస్తోందని జనాలు భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

విజ్ఞప్తి చేరినా.. వేమిరెడ్డిపల్లిలోని తాగునీటి ట్యాంకు శిథిలావస్థకు చేరి నాలుగేళ్లు గడుస్తోంది. నీటి సరఫరా నివాసితులు ఇబ్బందులు పడుతున్నారు. నూతన ట్యాంకు నిర్మించి రక్షిత జలాలు సరఫరా చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేసినా ట్యాంకుకు ఫిట్‌నెస్ ఉందని, మరో రెండేళ్లు ఆగాలంటున్నారు. **- జువ్వా పూర్ణచంద్రరావు, గ్రామస్థుడు, వేమిరెడ్డిపల్లి**

వృథా అరికట్టాలి కొండపర్వలో మంచినీరు అందించే బోరు పైపులకు మరమ్మతులు చేపట్టక పోవడంతో నీరు లీకై నేలపాలు అవుతుంది. పంచాయతీ అధికారులు స్పందించి వాటిని బాగు చేయించి నీటి వృథా అరికట్టాలి. **- బోట్ల శివకుమార్, సామాజిక కార్యకర్త, కొండపర్వ**

నీటి ఎద్దడి లేకుండా చేస్తాం ఆగిరిపల్లి, నూజివీడు, విస్సన్నపేట, తిరువూరు వరకు లెవెల్ సర్వే చేయడం జరిగింది. ఆయా పనులు త్వరలో ప్రారంభమవుతాయి. దీంతో నీటి ఎద్దడిని నివారించవచ్చు. మండల పరిషత్తు, పంచాయతీ నిధులతో బోర్లకు మరమ్మతులు, పైపులైన్లు మార్చడం వంటి పనులు చేస్తాం. **- లక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ**

సైన్స్‌పై ఆసక్తి పెంపొందించేందుకు కృషి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎంఈవో కేశవరావు తదితరులు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : సైన్స్ ఎక్స్‌పోను విజయవంతం చేయాలని ఎంఈవో ఎల్.కేశవరావు అన్నారు. ఈ మేరకు శనివారం కంభంపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో దీనికి సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. పిల్లలకు సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో దీన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. హెచ్‌ఎం ప్రసాదరావు, శోభన్ బాబు, శరత్, జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్, మండల అధ్యక్షుడు వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

మైలవరం, న్యూస్‌టుడే : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు మైలవరంలోని కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. స్థానిక వీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎస్వీఆర్‌జీఎన్నార్ కళాశాలలో కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీవీఆర్‌లో మొదటి ఏడాది 324 మంది, ద్వితీయ ఏడాది 264 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు సీఎస్ రాధాకృష్ణ తెలిపారు. ఎస్వీఆర్జీలో ప్రథమ సంవత్సరం 261 మంది, ద్వితీయ సంవత్సరం 260 మంది పరీక్షలకు హాజరవుతున్నట్లు సీఎస్ బుచ్చిరావు వెల్లడించారు. ఆయా కేంద్రాల వద్ద పోలీసుల ఆధ్వర్యంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నారు.

పౌల్ట్రీ ఫారమ్స్‌లో పనిచేయుటకు షెడ్ సూపర్‌వైజర్లు కావలెను. (అర్హత: 10thపాస్). వివరాలకు: 94910 37194 చిరునామా: లీలానగర్ గ్రామం, నూజివీడు-విస్సన్నపేట రోడ్డు.

విజయవాడ అన్నదానంలో శాకాహార వంటచేయుటకు అనుభవంగల వంటమేస్త్రీ కావలెను. హిందువులు మాత్రమే. వంటసమయం: 5AM to 7PM ✆9100427894

ప్రముఖ ప్లాస్టిక్ కంపెనీకి అనుభవం గల మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ మరియు డిజిటల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. సంప్ర ✆ 99494 78789.

డిజైనింగ్ వచ్చిన DTP ఆపరేటర్స్ సీనియర్స్/ జూనియర్స్ కావలెను. (Page Maker, ఫొటోషాప్, Coreldraw, Illustrater etc.) Rjy, 92466 57116

విజయవాడ చెర్రీస్ స్వీట్ షాప్‌నందు పనిచేయుటకు సేల్స్ బాయ్స్ & సేల్స్ గరల్స్ కావలెను. ✆ 91778 17557.

ఫర్నీచరు షోరూంనకు హెల్పర్లు కావలెను. Only Male. Q: 10th/Inter. 25-40 సం||. అలంకార్ స్టీలు ప్రోడక్ట్స్, మ్యూజియంరోడ్డు, విజయవాడ ✆ 70325 78687

ఆఫీస్ ఇన్‌ఛార్జ్ (M/F) మరియు ఆఫీస్‌బాయ్ కావలెను. VJA, లబ్బీపేటలో ప్రముఖ ఎడ్యుకేషన్ ఆఫీస్ నందు పనిచేయుటకు కావలెను. ✆ 79953 51919.

SV Express ఇంటర్నేషనల్ కొరియర్ సంస్థలో పనిచేయుటకు పికప్& ప్యాకింగ్ చేయుటకు ఆసక్తి ఉన్న బాయ్స్ కావలెను. Q:ఇంటర్, జీ:15K, గురునానక్ నగర్. VJA. ✆99596 46139

ప్రముఖ కన్‌స్ట్రక్షన్ & రియల్ ఎస్టేట్ కంపెనీకి మార్కెటింగ్ పర్సన్స్, కార్ డ్రైవర్, DTP ఆపరేటర్ కావలెను. జీతం: 12,000 to 18,000 ✆ 94901 84848

శివ కార్తికేయ హోంకేర్‌లో వృద్ధులు, పేషంట్స్, పిల్లలను చూసుకొనుటకు నర్సులు, వర్కర్స్ కావలెను. ఫ్రీ వసతి, భో.జీ. 20K. ✆ 99120 11499, 99120 11899

RSSL అను ప్రముఖ సంస్థలో పనిచేయుటకు మెషిన్ ఆపరేటర్స్, కంప్యూటర్ ఆపరేటర్స్, డెలివరి పర్సన్స్ కావలెను. అర్హత: 10th, ITI & ఏదీ డిగ్రీ. విజయవాడ. ✆ 91000 19295/89

విజయవాడ సూర్యారావుపేటలో ప్రముఖ హాస్పిటల్ నందు పనిచేయుటకు రిసెప్షనిస్ట్, నర్సింగ్ స్టాఫ్, ఫార్మసిస్ట్ మరియు స్టాఫ్ కావలెను. ✆ 98856 66640.

విజయవాడలో హిందూ ఛారిటబుల్ ట్రస్టు నిర్వహించు అన్నదానము మరియు ట్రస్ట్ నిర్వహించు వివిధ కార్యక్రమాలను పర్యవేక్షించుటకు హిందూ సూపర్‌వైజర్ కావలెను. ✆ 89776 10237

నర్సులు, Lab Tech, ఫార్మసిస్ట్ ఆయాలు, సెక్యూరిటీలు బయోడేటాతో కలవండి. మక్కెన హాస్పిటల్స్, సక్కులరోడ్, విజయవాడ. ✆ 85000 74075, 0866-2441010

ఎలక్ట్రీషియన్స్ మరియు హెల్పర్స్ కావలెను. వయస్సు: 18-30సం||లోపు, హౌస్ వైరింగ్‌లో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత. సంప్ర: ✆ 93921 33234

విజయవాడలో ఆటో మొబైల్ ఫైనాన్స్ కంపెనీలో ఫైనాన్స్ కలెక్షన్ చేయుటకు టూ వీలర్ డ్రైవింగ్ లైసెన్సు గల మేల్ కలెక్షన్ ఎగ్జిక్యూటివ్ కావలెను. ✆ 92478 64544

కార్‌డ్రైవర్ కావలెను. బెంజ్, ఆడి, జాగ్వార్ కార్స్ నడుపుటకు విజయవాడ, సూర్యారావుపేట పరిసర ప్రాంతాల్లో నివసించే అనుభవం గల 40-45 సం||లోపు వారు సంప్ర. ✆ 94412 72777.

CC TV/ Solar సిస్టం సేల్స్ & సర్వీస్ సీసీ టీవీ టెక్నీషియన్స్ కావలెను. Qul: 10th, ఇంటర్, టూ వీలర్ మస్ట్. ✆ 94942 33533

రియల్‌ఎస్టేట్‌లో పనిచేయుటకు ఆఫీస్ స్టాఫ్ మరియు మార్కెటింగ్ సిబ్బంది కావలెను. MP. Developers సంప్ర. ✆ 94944 03040

సెంట్రల్ ఫర్నిచర్ షాపు నందు పనిచేయుటకు మగవాళ్ళ ఫిట్టర్ & Accountant కావలెను. విజయవాడ. ✆ 94903 98826

MARKETING/ SALES

Wanted Sales Executives to Promote School Books. Any Graduate with 2 to 3Y. Exp. with 2-Wheeler. Salary 15-25K+ TA+ Incentives. Whatsup Resume 8886436978.

FACULTY/ TEACHERS

Wanted Teachers (Fluent English) Front Office, Telecallers, PROs @ Bhavanipuram, VJA-12. ✆ 89773 04261, 97033 04261.

DRIVERS

Ashok Leyland 4 wheel auto driver required. Only for Vijayawada people Salary: 16,000 to 17,000/- ✆ 94401 53000.

BMPS ట్రాన్స్‌పోర్ట్ కంపెనీకి అనుభవం గల లైట్ & హెవీ లైసెన్స్ గల దోస్త్ డ్రైవర్స్ కావలెను
✆ 92480 18193

ACCOUNTING

Learn GST, TDS, EPF, ESI returns in 9 sundays with live examples (online zoom classes). ✆ 9292959527, 9640054074

MEDICAL

Wanted Doctors MD/MS with 3Yrs., Experience GM/GS/ Ortho/ Pedia/ Endro/ Uro/ Neuro at Vijayawada ✆ 93936 09999.

TOURS AND TRAVELS

శ్రీలంక 4/3న, 4/4న ముక్తినాథ్, నేపాల్, 26/5న యమునానది పుష్కరాలకు చార్‌ధామ్, జులైలో అమరనాథ్, జూన్‌లో కైలాస్ మానస సరోవరం, శ్రీదుర్గా టూర్స్. ✆ 94901 19768

'విద్యుత్తు సుంకం సరికాదు'

గవర్నర్‌పేట: వినియోగదారులపై రూ.3,500 కోట్ల విద్యుత్తు సుంకం భారం మోపుతూ 'ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు సుంకం చట్టం 2026' ఆమోదించడం దుర్మార్గమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సి.హెచ్.బాబూరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. [illegible]

మధ్యవర్తుల్లేని మార్కెటింగ్‌తో అన్నదాతలకు లాభం

ఆర్గానిక్ రైతోత్సవంలో కలెక్టర్ లక్ష్మీశ వెల్లడి

ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే - ఎ.కొండూరు: 'సేంద్రియ సాగు చేస్తున్న రైతులకు ప్రధాన సమస్య మార్కెటింగ్ చేసుకోవడం. [illegible]' కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. [illegible]


యంత్రాలు పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, దేవదత్, ఆంజనేయులు తదితరులు


సేంద్రియ కూరగాయలు పరిశీలిస్తున్న జేసీ ఇలక్కియా, అధికారి మాధురి తదితరులు

ట్రేసబులిటీతో మోసాలకు చెక్...

ప్రస్తుతం మార్కెట్‌లో సేంద్రియ ఉత్పత్తుల ముసుగులో మోసాలు జరుగుతున్నాయి. [illegible]

ఓ ఆలోచనా... విప్లవం

[illegible]

విజయవాడలో నేడు ..

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఆదివారం ఉదయం 10 గంటలకు [illegible]


స్టాల్స్ వద్ద రైతుల సందడి


ఆర్గానిక్ ఉత్పత్తులతో తీర్చిదిద్దిన రంగవల్లులను తిలకిస్తూ..

కృత్రిమ మేధ సమాజ శ్రేయస్సుకే వినియోగించాలి

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: 'కృత్రిమ మేధ సమాజ శ్రేయస్సుకు [illegible]' పూర్వ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు సూచించారు. [illegible] లని సూచించారు. ఎక్కడ స్థిరపడ్డా మాతృ భాషను, చదువుకున్న విద్యాలయాన్ని, గురువులను మరువకూడదని వెంకయ్యనాయుడు సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ మేకా రమేశ్, కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం కన్వీనర్ బోడేపూడి అమరేంద్ర, సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు మలినేని రాజయ్య, కళాశాల కన్వీనర్ నిమ్మగడ్డ లలిత ప్రసాద్ తదితరులు వెంకయ్యనాయుడిని సత్కరించారు. అనంతరం నిర్వహించిన వేడుకల్లో తమకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను పూర్వ విద్యార్థులు సత్కరించారు. కళాశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


వెంకయ్యనాయుడిని సత్కరిస్తున్న అమరేంద్ర, రాజయ్య, రమేశ్, లలిత ప్రసాద్ తదితరులు

ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యంగా ఉద్యమాలు

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యంగా [illegible] అధ్యక్షుడు ఆకూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. జిల్లా అన్ని తాలూకా యూనిట్‌లకు చెందిన నాయకులతో కలిసి వేగవంతంగా భవన నిర్మాణం పూర్తి చేసేలా కృషి చేస్తామని అన్నారు. సంఘ కార్యదర్శి వి.సీతారామయ్య, కోశాధికారి శోభన్‌బాబు, ఉపాధ్యక్షుడు సునీల్, నాయకులు హేమప్రకాష్, రమాదేవి, రజని, చలమలశెట్టి లక్ష్మీశ్రీనివాస్, కార్యదర్శి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యాసాగర్ ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మంత్రి కొల్లు రవీంద్రను మర్యాదపూర్వకంగా కలిశారు.


నాయకులతో చర్చిస్తున్న విద్యాసాగర్

సామాజిక సేవలో కెనరా బ్యాంక్ భాగస్వామ్యం

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : సామాజిక సేవా కార్యక్రమాల్లో కెనరా బ్యాంక్ భాగస్వామ్యం అవుతోందని విజయవాడ రీజనల్ హెడ్ ఎ.రత్నాకర్ అన్నారు. బ్యాంక్ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా వెలగలేరు, జి.కొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పాయకాపురంలోని రెండు సాంఘిక సంక్షేమ కళాశాలల బాలికల వసతి గృహాలు, కస్తూరిబాయిపేటలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాలకు టీవీ, ఎయిర్ కూలర్, కుర్చీలు వంటి వస్తువులు అందజేసినట్లు పేర్కొన్నారు. సమాజ సంక్షేమం, అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తున్నామని తెలిపారు.


వసతి గృహాలకు ఇచ్చే వస్తువుల ఫ్లెక్సీతో బ్యాంక్ అధికారులు

ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌కు రూ.12 వేల లంచం

డిప్యూటీ తహసీల్దారు అరెస్టు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం రూ.12వేలు లంచం తీసుకున్న డిప్యూటీ తహసీల్దారు (ఇన్‌ఛార్జి ఆర్‌ఐ)ను అనిశా అధికారులు వలపన్ని పట్టుకున్నారు. వాంబేకాలనీ జీ బ్లాక్ 265 ఫ్లాట్‌కు చెందిన ఉప్పాడ సాయి ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నారు. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం నార్త్ ఎమ్మార్వో కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. సదరు దరఖాస్తు ఇన్‌ఛార్జి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న డిప్యూటీ తహసీల్దారు చింతకాయల అప్పారావు వద్దకు వచ్చింది. సర్టిఫికెట్ మంజూరు కోసం రూ.15వేలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రూ.12వేలు ఇచ్చేందుకు సాయి అంగీకరించారు. తర్వాత అనిశా అధికారులకు ఫిర్యాదు చేశారు. అప్పారావును పట్టుకునేందుకు అనిశా అధికారులు రంగం సిద్ధం చేశారు. శనివారం ఉదయం రూ.12వేల నగదును సాయికి ఇచ్చి పంపించారు. ఇన్‌ఛార్జి ఆర్‌ఐ.. నగదు తీసుకుని లెక్కించి తన టేబుల్ సొరుగులో పెట్టుకున్నారు. ఆ వెంటనే అనిశా అధికారులు మధ్యవర్తుల సమక్షంలో దాడులు చేశారు. రసాయన పరీక్షలు చేసి.. లంచంగా తీసుకున్న సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. అప్పారావును అరెస్టు చేశారు.


అనిశా అధికారులకు పట్టుబడిన అప్పారావు

సాంకేతిక ప్రతిభకు సాంస్కృతిక శోభ

కానూరు, న్యూస్‌టుడే : సిద్ధార్థ డీమ్డు విశ్వవిద్యాలయంలో సుప్రజ్ఞ- 2026 కార్యక్రమంలో భాగంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అదరహో అనిపించాయి. శనివారం విశ్వవిద్యాలయం ప్రాంగణంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో భాగంగా 50 విభాగాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు రూ.10 లక్షల నగదు బహుమతులు అందజేశారు. సాహిత్య పోటీల్లో భాగంగా విద్యార్థులకు క్విజ్, క్రియేటివ్ రైటింగ్, ఎక్స్‌టెంపోర్, స్పెల్‌బీ, కవితా రచనలు, వాదవివాదం, సోలో, గ్రూపు డ్యాన్స్, సోలో, బృంద సింగింగ్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపకులపతి పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ..మొత్తం దేశ వ్యాప్తంగా టెక్నో ఫెస్టివల్‌కు 3,500 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. సాంకేతిక ప్రతిభకు సాంస్కృతిక శోభ మరింత వన్నెతెచ్చిందన్నారు. కార్యక్రమంలో ప్రోఛాన్సలర్ ఏవీ రత్నప్రసాద్, ప్రోగ్రాం కన్వీనర్ వి.మల్లిఖార్జున, రిజిస్ట్రార్ రవిచంద్, బావినేని పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినుల నృత్యం

కలంకారీ కళను పరిరక్షించుకోవాలి

పెడన, న్యూస్‌టుడే: దేశ సంస్కృతి సంప్రదాయాలకు కలంకారీ హస్తకళలు ప్రతీకగా నిలుస్తాయని విజయవాడ జేడీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ విద్యార్థులన్నారు. పెడనలో ఈ పరిశ్రమను శనివారం సందర్శించిన విద్యార్థులు కలంకారీ ఆవిర్భావం, హస్తకళలు రూపుదిద్దుకునే విధానాన్ని పరిశీలించారు. కలంకారీకి ఫ్యాషన్ రంగంలో మంచి ఆదరణ ఉందని దేశ విదేశాల్లో ఈ దుస్తులకు యువత ఆసక్తి చూపిస్తోందన్నారు. సహజమైన రంగులతో రూపుదిద్దుకునే ఈ హస్తకళను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సులో కలంకారీ ఒక సబ్జెక్టుగా ఉందని విద్యార్థులు చెప్పారు. బ్లాక్ మేకింగ్‌లో జాతీయ అవార్డు గ్రహీతలు కొండ్రు గంగాధర్, కొండ్రు నరసయ్యను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. అధ్యాపకులు మౌలిక, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.


ప్రింటింగ్ విధానం తెలుసుకుంటున్న విద్యార్థులు

వారం రోజులే కాల్వలకు నీరు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలోని పంట కాల్వలకు ఈ నెలాఖారు వరకే నీటిని విడుదల చేయనున్నారు. ఆ తర్వాత నీటి విడుదలను నిలిపివేయాలని జలవనరుల శాఖ అధికారులు నిర్ణయించారు. గుంటూరు, బాపట్ల తదితర జిల్లాలకు మాత్రం మార్చి 15 వరకు ఇవ్వనున్నారు. నగరంలోని ప్రకాశం బ్యారేజీ నుంచి శనివారం 2,656 క్యూసెక్కులు విడుదల చేశారు. వీటిలో కృష్ణా తూర్పు ప్రధాన కాల్వకు 502, కృష్ణా పశ్చిమ ప్రధాన కాల్వకు 200, గుంటూరు ఛానల్‌కు 144 క్యూసెక్కుల మేర ఇస్తున్నారు. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వ నుంచి కేఈబీకి 302, బందరు కాల్వకు 200 క్యూసెక్కుల చొప్పున వదిలారు. ప్రకాశం బ్యారేజీ వద్ద నీటి మట్టం 12 అడుగులకు గాను.. 11.9 అడుగులు ఉంది. పులిచింతల ప్రాజెక్టు నుంచి విద్యుత్తు ఉత్పాదన ద్వారా దిగువకు సుమారు 2,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. వాగులు, వంకల నుంచి వచ్చే నీటితో కలిపి ప్రకాశం బ్యారేజీకి సుమారు 2,650 క్యూసెక్కుల మేర వస్తోంది.

ప్రపంచానికి వామపక్ష సాహిత్యం అవసరం

విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే : సామ్రాజ్యవాద దోపిడీదారుల నియంతృత్వ పోకడలను అడ్డుకునేందుకు వామపక్ష సాహిత్యం ప్రపంచానికి చాలా అవసరమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. శనివారం రాత్రి గవర్నర్‌పేటలోని లెనిన్ విగ్రహం వద్ద విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, ప్రజాశక్తి బుక్ హౌస్ సంయుక్త ఆధ్వర్యంలో 'రెడ్ బుక్ డే' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. 'సామ్రాజ్యవాదం పెట్టుబడిదారి విధానపు అత్యున్నత దశ' అనే పుస్తకాన్ని సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు గుజ్జుల ఈశ్వరయ్య, వి.శ్రీనివాసరావు తదితరులు ఆవిష్కరించారు. ఈశ్వరయ్య మాట్లాడుతూ.. నేడు ప్రపంచవ్యాప్తంగా వామపక్ష, అభ్యుదయవాదుల ఆధ్వర్యంలో రెడ్ బుక్ డే ఆవిష్కరణలు జరుగుతున్నాయన్నారు. కమ్యూనిజం ఉన్నతమైందని, లెనిన్ భావజాలం ఈ ప్రపంచానికి అవసరమని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా రెడ్ బుక్‌ను కోట్లాది మంది కొనుగోలు చేసి అభ్యుదయ భావజాలాన్ని పెంచుకోవాలని కోరారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. వామపక్ష సాహిత్యాన్ని ప్రజలకు అందించేందుకు విశాలాంధ్ర, ప్రజాశక్తి సంయుక్తంగా ముందుకు రావడం శుభపరిణామమన్నారు. 2020లో వామపక్ష ప్రచురణకర్తలు ఏకమై రెడ్ బుక్ ప్రచురణలు ప్రపంచానికి అందించారని గుర్తు చేశారు. మార్క్సిజం, లెనినిజంపై వేలాది పుస్తకాలు అమ్ముడయ్యాయని తెలిపారు. తొలుత ప్రజానాట్యమండలి కళాకారులు విప్లవగేయాలను ఆలపించి.. ఆకట్టుకున్నారు. విశాలాంధ్ర విజ్ఞానసమితి డిప్యూటీ జనరల్ మేనేజర్ టి.మనోహర్‌నాయుడు అధ్యక్షత వహించారు. సమావేశంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, సీపీఐ ఎంఎల్ నాయకులు ఎన్.డి.పి.ప్రసాద్, లిబరేషన్ నాయకులు బంగారురావు, వామపక్ష నాయకులు జె.కిషోర్‌బాబు, ఎం.రామకృష్ణ, నాగభూషణ్, సుందర రామరాజు, జానకిరాములు, కాశీనాథ్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


'సామ్రాజ్యవాదం పెట్టుబడిదారి విధానపు అత్యున్నత దశ' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శ్రీనివాసరావు, ఈశ్వరయ్య తదితరులు

దరఖాస్తు చేశారా?

☛ సీఈఈఆర్ఐలో ప్రాజెక్ట్ స్టాఫ్ ఖాళీలు
చివరి తేదీ: 26-02-2026

☛ ముంబయి పోర్ట్ అథారిటీలో ఉద్యోగాలు
చివరి తేదీ: 25-02-2026

కరెంట్ అఫైర్స్ — మాదిరి ప్రశ్నలు

❖ ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటా అధ్యక్షురాలు, వైస్ ఛైర్మన్‌గా ఇటీవల ఎవరు నియమితులయ్యారు?



జ: దినా పావెల్ మెక్ కార్మిక్ (ఈమె అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు గతంలో సీనియర్ సలహాదారుగా వ్యవహరించారు.)

❖ జపనీస్ సమురాయ్ మార్షల్ ఆర్ట్స్ సంప్రదాయమైన కెంజుట్సులో అధికారికంగా చేరిన మొదటి భారతీయుడిగా ఇటీవల ఎవరు వార్తల్లో నిలిచారు?
(ఈ అరుదైన గుర్తింపు సాధారణంగా జపనీస్ అభ్యాసకులకు మాత్రమే కేటాయిస్తారు. జపనీయులు కానివారికి అసాధారణ సందర్భాల్లో మాత్రమే ఇస్తారు.)
జ: ప్రముఖ నటుడు, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

❖ అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన రెండో ఆటగాడిగా ఇటీవల ఎవరు ఘనతసాధించారు?
జ: విరాట్ కోహ్లి (వడోదరలో న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో కోహ్లి ఈ ఘనతను చేరుకున్నాడు. ఇప్పటి దాకా 28,016 పరుగులతో రెండో స్థానంలో ఉన్న కుమార సంగక్కరను కోహ్లి అధిగమించాడు. సచిన్ తెందూల్కర్ 34,357 పరుగులతో అంతర్జాతీయ క్రికెట్‌లో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.)

❖ జస్టిస్ రేవతి మోహితే డెరే 2026, జనవరి 10న ఏ రాష్ట్ర హైకోర్టు మొదటి మహిళాప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశారు?
జ: మేఘాలయ

మరింత సమాచారం

యుద్ధంతో మొదలై.. యుగంగా మారి!

మధ్య ఆసియాలోని ఫర్గానా లోయలో మొదలైన ఒక చిన్న కల, భారత ఉపఖండపు తలరాతను మారుస్తుందని ఎవరూ ఊహించి ఉండరు. తైమూర్, చెంగిజ్‌ఖాన్ లాంటి వీరుల రక్త వారసత్వంతో, పదునైన యుద్ధ తంత్రాలను పుణికిపుచ్చుకున్న జహీరుద్దీన్ మహమ్మద్ బాబర్, పదహారో శతాబ్దపు మూడో దశకంలో పానిపట్టు మైదానంలో వినిపించిన ఫిరంగుల మోతతో మొగల్ వంశ పాలనకు నాంది పలికాడు. అపార సంపదకు నిలయమైన భారతదేశంపై పట్టు సాధించే క్రమంలో బాబర్ ఎదుర్కొన్న సవాళ్లు ఒక ఎత్తయితే, అతడి కుమారుడు హుమాయూన్ పడిన కష్టాలు, కోల్పోయిన రాజ్యాన్ని తిరిగి దక్కించుకోవడానికి చేసిన పోరాటం మరో చరిత్ర. ఓటమి నుంచి గెలుపు వైపు, ప్రవాసం నుంచి సింహాసనం వైపు సాగిన ఈ తొలి మొగల్ చక్రవర్తుల ప్రస్థానం, భారత చరిత్రలో ఒక అద్భుత అధ్యాయం. ఈ నిరంతర పోరాటాలు, రాజ్య విస్తరణలు, కళాత్మక నిర్మాణాల కలయికతో కూడిన మొదటి తరం మొగల్ వంశ పాలకుల చరిత్రను పోటీ పరీక్షార్థులు సమగ్రంగా తెలుసుకోవాలి. ఒక యుద్ధంతో మొదలై, ఒక మొగల్ యుగాన్ని ఆవిష్కరించి భారతీయ సామాజిక, రాజకీయ ముఖచిత్రంపై చెరగని ముద్ర వేసిన తీరును అర్థం చేసుకోవాలి.



మొదటి పానిపట్టు యుద్ధం (ఊహాచిత్రం)


జనరల్ స్టడీస్ — భారతదేశ చరిత్ర

మొగల్ వంశ పాలన

మొగల్ రాజ్యస్థాపన: లోడి వంశ చివరి పాలకుడు ఇబ్రహీం లోడిని మొదటి పానిపట్టు యుద్ధం(క్రీ.శ.1526)లో ఓడించి, వధించి బాబర్ భారతదేశంలో మొగల్ రాజ్య స్థాపన చేశాడు. అప్పటి నుంచి 1858 వరకు భారతదేశ చరిత్రలో ఈ వంశ పాలన కొనసాగింది.

ఘనులైన మొగల్ చక్రవర్తులు: బాబర్ (1526-30), హుమాయూన్ (1530-40, 1555-56), అక్బర్ (1556-1605), జహంగీర్ (1605-27), షాజహాన్ (1627-1658), ఔరంగజేబు (1658-1707) ఉన్నారు. వీరు భారతదేశంలో మొగల్ రాజ్యం స్థాపించి, దాన్ని సామ్రాజ్య స్థాయికి తీసుకెళ్లిన పాలకులు. ఔరంగజేబు మరణం తర్వాత సింహాసనం అధిష్ఠించిన పాలకులు బలహీనులు. సామ్రాజ్య విచ్ఛిన్నాన్ని అరికట్టలేకపోయారు.

జహీరుద్దీన్ మహమ్మద్ బాబర్



బాబర్ (1526-30) తండ్రి తైమూర్ (తైమురిడ్ సామ్రాజ్య స్థాపకుడు) వంశానికి, తల్లి మంగోల్ పాలకుడు చెంగిజ్‌ఖాన్ వంశానికి చెందినవారు. క్రీ.శ.1494లో తన తండ్రి మరణానంతరం, బాబర్ 11 సంవత్సరాల చిన్న వయసులోనే ట్రాన్సోక్సియానాలోని ఒక చిన్న సంస్థానమైన 'ఫర్గానా' సింహాసనాన్ని అధిష్ఠించాడు. బాబర్ ఉజ్బెక్‌ల చేతిలో ఫర్గానా, సమర్కండ్ రెండింటినీ కోల్పోయాడు. మధ్య ఆసియాలోని తన పూర్వీకుల ప్రాంతాల నుంచి తరిమేయడంతో, బాబర్ భారత్ వైపు రావాల్సి వచ్చింది. బాబర్ కూడా భారత్‌లోని అపార సంపదకు ఆకర్షితుడయ్యాడు. సికిందర్ లోడి మరణానంతరం భారతదేశంలో నెలకొన్న రాజకీయ అస్థిరత అతడి ప్రవేశానికి మరింత సహాయపడింది. పంజాబ్ గవర్నర్ దౌలత్‌ఖాన్ లోడి, ఇబ్రహీం బంధువు ఆలంఖాన్, మేవార్‌కు చెందిన రాణా సంగా ఇబ్రహీం లోడిపై యుద్ధానికి బాబర్‌ను ఆహ్వానించారు.

ఖన్వా యుద్ధం (1527): బాబర్ భారతదేశంలోనే ఉండాలనుకోవడంతో రాణా సంగా అంచనాలు, ప్రయోజనాలు తలకిందులయ్యాయి. దీంతో వారిద్దరి మధ్య యుద్ధం అనివార్యమైంది. ఖన్వా యుద్ధం భారతదేశ చరిత్రలో అత్యంత తీవ్రమైన పోరాటాల్లో ఒకటి. రాణా సంగా ఓడిపోవడంతో ఉత్తర భారతదేశంలో మొగల్ పాలన సుస్థిరమైంది. ఈ యుద్ధంలో బాబర్ తన విజయాన్ని 'జిహాద్'గా ప్రకటించి 'ఘాజీ' బిరుదు వహించాడు.

చందేరీ యుద్ధం (1528): బాబర్, మాళ్వా పాలకుడైన మేదినీ రాయ్ మధ్య జరిగింది. మేదినీ రాయ్ ఓడిపోవడంతో రాజపుత్రులకు గట్టి దెబ్బ తగిలింది.

ఘగ్రా యుద్ధం (1529): బాబర్, మహమ్మద్ లోడి (ఇబ్రహీం లోడి సోదరుడు, అఫ్గాన్ నాయకుడు, బెంగాల్‌లోని నుస్రత్ షా మద్దతుతో) మధ్య జరిగింది.

మొదటి పానిపట్టు యుద్ధం (క్రీ.శ.1526)

భారతదేశ చరిత్రలో అత్యంత నిర్ణయాత్మకమైన యుద్ధాల్లో ఇదొకటి. ఈ యుద్ధంలో ఇబ్రహీం లోడిని బాబర్ ఓడించి, వధించి సుల్తానుల రాజ్యాన్ని చేజిక్కించుకున్నాడు. ఈ యుద్ధంలో రూమీ (ఒట్టోమన్) యుద్ధ పద్ధతిని బాబర్ సమర్థంగా అమలు చేశాడు. దీనినే తుల్గుమా యుద్ధ పద్ధతి అని కూడా అంటారు. మొదటిసారి నిపుణులైన ఉస్తాద్ అలీ, ముస్తాఫాల ఆధ్వర్యంలో తుపాకులు వాడటం ఈ యుద్ధ ప్రత్యేకత. బాబర్ తనను తాను 'హిందుస్థాన్ చక్రవర్తి'గా ప్రకటించుకున్నాడు. పానిపట్టు విజయం భారతదేశ చరిత్రను మలుపు తిప్పిన సంఘటన.

క్రీ.శ.1530లో కాబూల్‌కు వెళ్లే మార్గంలో ఆగ్రాలో బాబర్ మరణించాడు. మొదట ఆగ్రాలోని ఆరాంబాగ్‌లో ఖననం చేశారు, తర్వాత భౌతిక కాయాన్ని కాబూల్‌కు తరలించారు. తన జ్ఞాపకాలను టర్కీ భాషలో 'తుజుక్--బాబ్రీ/బాబర్ నామా' (దీనిని అబ్దుర్ రహీమ్ ఖాన్ పర్షియన్ భాషలోకి అనువదించాడు) పేరుతో రాశాడు.

నసీరుద్దీన్ మహమ్మద్ హుమాయూన్




హుమాయూన్ (1530-1540; 1555-56) అంటే 'అదృష్టవంతుడు' అని అర్థం. కానీ మొగల్ సామ్రాజ్య పాలకుల్లో అతడు అత్యంత దురదృష్టవంతుడని చరిత్రకారులు అంటారు. బాబర్ అకాల మరణంతో అతడి కోరిక ప్రకారం హుమాయూన్ మొగల్ సింహాసనాన్ని అధిష్ఠించాడు. అనేక సమస్యలు అతడిని చుట్టుముట్టాయి. తైమూరిడ్ సంప్రదాయం ప్రకారం, హుమాయూన్ తన సోదరులతో అధికారాన్ని పంచుకోవాల్సి వచ్చింది. ◆ కాబూల్, కాందహార్, పంజాబ్‌లకు కామ్రాన్; అల్వార్, మేవార్‌లకు హిందాల్; సంభాల్‌కు మీర్జా అస్కారి ప్రాంతీయ పాలకులు అయ్యారు. ఈ పరిస్థితి బహుళ అధికార కేంద్రాలను సృష్టించింది. బాబర్ పాలనాకాలం యుద్ధాలతోనే గడిచిపోవడంతో సరైన పాలనా వ్యవస్థను ఏర్పరచలేకపోయాడు. భారతదేశంలో అఫ్గాన్ జాతీయులైన పాలకులు, మొగల్‌ల పాలన పట్ల విముఖంగా ఉన్నారు. హుమాయూన్ చేసిన యుద్ధాల్లో నాలుగు ప్రధానమైనవి ఉన్నాయి.

1) దేవ్రా/దౌరా యుద్ధం (1532): మహమ్మద్ లోడి నాయకత్వంలోని అఫ్గాన్ తిరుగుబాటుదారులను హుమాయూన్ ఓడించాడు. ఈ విజయం అతడి ప్రారంభ పాలనను సుస్థిరం చేసింది.

2) చౌసా యుద్ధం (జూన్ 26, 1539): మధ్యయుగ భారత చరిత్రలో మొగల్ చక్రవర్తి హుమాయూన్, అఫ్గాన్ నాయకుడు షేర్ షా సూరి (అప్పటిపేరు షేర్ ఖాన్) మధ్య జరిగిన కీలకమైన సైనిక సంఘర్షణ. ఈ యుద్ధంలో హుమాయూన్ ఓడిపోయి, యుద్ధ భూమి నుంచి అతి కష్టం మీద ప్రాణాలతో బయటపడ్డాడు. ఇది మొగల్ సామ్రాజ్య తాత్కాలిక పతనానికి, ఉత్తర భారతదేశంలో సూరి రాజవంశ స్థాపనకు దారితీసింది.

3) బిల్‌గ్రామ్ యుద్ధం/కన్నౌజ్ యుద్ధం (1540): కన్నౌజ్ యుద్ధం హోరాహోరీగా సాగింది. హుమాయూన్ మరోసారి షేర్ షా చేతిలో ఘోరంగా ఓడిపోయాడు. ఈ యుద్ధం షేర్ షా, మొగలుల మధ్య ఉన్న ఘర్షణలకు ముగింపు పలికింది. హుమాయూన్ రాజ్యం వదిలి పారిపోయాడు. సింధు, దాని పొరుగు ప్రాంతాల్లో 15 ఏళ్ల పాటు (1540-1555) ప్రవాస జీవితం గడిపాడు. హుమాయూన్ ప్రవాస జీవితంలో రాణా ప్రసాద్ అనే హిందూ రాజు పరిపాలించే అమర్‌కోట్‌లో ఉన్నాడు. సుర్ సామ్రాజ్యం విచ్ఛిన్నమైన తర్వాత హుమాయూన్, పర్షియా రాజు సైనిక సహకారంతో, అఫ్గాన్‌లను సరహింద్ యుద్ధం(1555)లో ఓడించి మొగల్ సింహాసనాన్ని తిరిగి పొందాడు. కానీ తన స్థానాన్ని స్థిరపరచుకోకముందే కేవలం ఆరు నెలల తర్వాత, 1556లో దిల్లీలోని తన గ్రంథాలయ మెట్ల నుంచి పడి మరణించాడు. హుమాయూన్ జీవిత చరిత్రను 'హుమాయూన్-నామా' పేరుతో గుల్బదన్ బేగం రాసింది. హుమాయూన్ సమాధిని మొగల్ నిర్మాణ శైలిలో దిల్లీలో నిర్మించారు. ఇది తాజ్‌మహల్‌కు పూర్వ నమూనా అని కళా విమర్శకుల అభిప్రాయం.


హుమాయూన్ సమాధి


రచయిత: వి.వి.ఎస్.రామావతారం

JUNIOR INTER Chemistry — Thermodynamics

Final Exams-2026 IMPORTANT Q & A

1 Mark

1. **The heat of combustion of Carbon is –393.5 kJ/mol. The enthalpy change in the formation of 35.2g of CO_2 from Carbon and Oxygen gas is** A: 1
   1) –315 kJ 2) + 315 kJ 3) –630 kJ 4) –3.15 kJ
2. **For the reaction, $N_2 + 3H_2 \rightarrow 2NH_3$, ΔH = ?** A: 2
   1) $\Delta U + 2RT$ 2) $\Delta U - 2RT$
   3) $\Delta H = RT$ 4) $\Delta U - RT$
3. **For the reaction, $2Cl_{(g)} \rightarrow Cl_{2(g)}$, the correct option is** A: 3
   1) $\Delta_rH > 0$ and $\Delta_rS < 0$ 2) $\Delta_rH < 0$ and $\Delta_rS > 0$
   3) $\Delta_rH < 0$ and $\Delta_rS < 0$ 4) $\Delta_rH > 0$ and $\Delta_rS > 0$
4. **The correct thermodynamic conditions for the spontaneous reaction at all temperature is** A: 2
   1) $\Delta_rH > 0$ and $\Delta_rS < 0$ 2) $\Delta_rH < 0$ and $\Delta_rS > 0$
   3) $\Delta_rH < 0$ and $\Delta_rS < 0$ 4) $\Delta_rH > 0$ and $\Delta_rS > 0$
5. **$q = W = -P_{ext}(V_f - V_i)$ is for irreversible …….. change.**
   A: Isothermal
6. **In ………… system there is no exchange of matter and energy between the system and surroundings.**
   A: Isolated
7. **For chemical reactions, …… is used to measure the value of heat change at constant volume.**
   A: Bomb calorimeter
8. **What is the work done in the free expansion of an ideal gas in reversible and irreversible processes ?**
   A: In the free expansion of an ideal gas, whether reversible or irreversible, the work done is zero. This is because, the external pressure against which the gas expands is zero during a free expansion.

2 marks

1. **State the first law of the thermodynamics.**
   A: The law of conservation of energy is taken as the first law of thermodynamics. It can be stated as below.
   ◆ Energy can neither be created nor destroyed, although it can be transferred from one form to another. ◆ It is impossible to construct perpetual motion machine of first kind. ◆ The total energy of the system and surroundings is constant.

More Imp Q & Ans


Writer: Dr. P. Trinadha raja

ఎలాంటి శక్తిని ఇవ్వని విలువైన సూక్ష్మపోషకాలు!

మానవ శరీర నిర్మాణం, ఎదుగుదలతో పాటు జీవ క్రియల నియంత్రణకు కావాల్సిన సూక్ష్మపోషకాలే ఖనిజ లవణాలు. ఐరన్, క్యాల్షియం, పొటాషియం, మెగ్నీషియం, సోడియం తదితర ఖనిజ రూపాల్లో ఉండే ఇవి ఎముకలు, దంతాలు, కండరాలను దృఢంగా ఉంచుతాయి. రక్తప్రసరణ, ఆక్సిజన్ రవాణాకు సహకరిస్తూ ద్రవ్య సమతౌల్యతను కాపాడుతుంటాయి. తినే ఆహారంలో భాగమై శరీరానికి అవసరమైన పోషక విలువలను అందించే వివిధ ఖనిజ లవణాల ఉపయోగాలు, అవి లభించే ఆహార పదార్థాలు, వాటి లోపం వల్ల వచ్చే వ్యాధుల గురించి పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. ఆహారంలో ఈ ఖనిజ లవణాలకు ఉన్న ప్రాధాన్యం, ఆ దిశగా ప్రభుత్వం అమలు చేస్తున్న పోషణ ఆధారిత పథకాలను, కార్యక్రమాలనూ తెలుసుకోవాలి.



జనరల్ స్టడీస్ - బయాలజీ

ఖనిజ లవణాలు

1. పోషక పదార్థాలుగా ఉపయోగపడే ఖనిజ లవణాల గురించి కింది వాక్యాల్లో సరైనవి?
   ఎ) ఇవి సూక్ష్మపోషక పదార్థాలు.
   బి) తక్కువ మొత్తంలో శరీరానికి అవసరం.
   సి) శరీర భాగాల్లో, ఎంజైమ్‌ల్లో భాగంగా ఉంటాయి.
   డి) శరీరానికి ఎలాంటి శక్తినివ్వవు.
   1) ఎ, బి, సి, డి 2) బి, సి, డి 3) సి, డి 4) ఎ, బి




2. సోడియం గురించి కింది వాక్యాల్లో సరికాని వాటిని గుర్తించండి.
   ఎ) రక్తంలోని ప్లాస్మాలో ఉండే ముఖ్యమైన కేటయాన్
   బి) శరీరంలో అయాన్‌లు, నీటిక్రమతకు అవసరం.
   సి) ఇది తాగునీటి ద్వారా ఎక్కువగా లభిస్తుంది.
   డి) దీని లోపం వల్ల 'హైపర్ నేట్రిమియా' స్థితి కలుగుతుంది.
   1) ఎ, బి 2) సి, డి 3) బి, సి 4) ఎ, డి
3. కింది వాటిని జతపరచండి.

మూలకం	ఉండే భాగం/లభించే పదార్థం
ఎ) సోడియం	1) ఏటీపీ
బి) పొటాషియం	2) ఎముకలు
సి) క్లోరిన్	3) అరటిపండు
డి) క్యాల్షియం	4) ఉప్పు
ఇ) ఫాస్ఫరస్	5) కన్నీరు

   1) ఎ-4, బి-3, సి-2, డి-1, ఇ-5
   2) ఎ-1, బి-4, సి-3, డి-2, ఇ-5
   3) ఎ-4, బి-3, సి-5, డి-2, ఇ-1
   4) ఎ-3, బి-4, సి-2, డి-1, ఇ-5
4. కింది వాటిలో సరైన వాక్యాలను గుర్తించండి.
   ఎ) పైత్యరస వర్ణకాలు ఏర్పడటానికి సోడియం అవసరం.
   బి) విరేచనాలు, వాంతులు, అధిక చెమట వల్ల శరీరం సోడియం, క్లోరిన్‌లను నష్టపోతుంది.
   సి) నాడీ ప్రచోదనాలకు సోడియం, పొటాషియం, క్యాల్షియం అవసరం.
   డి) ఉప్పు ద్వారా సోడియం, క్లోరిన్ శరీరానికి లభిస్తాయి.
   1) ఎ, బి 2) బి, సి 3) సి, డి 4) ఎ, బి, సి, డి
5. కింది జతలను సరైన విధంగా అమర్చండి.

ఎ) హైపో నేట్రిమియా	1) శరీరంలో తక్కువ క్లోరిన్ ఉన్న స్థితి
బి) హైపర్ నేట్రిమియా	2) శరీరంలో ఎక్కువ పొటాషియం ఉన్న స్థితి
సి) హైపో కాలిమియా	3) శరీరంలో ఎక్కువ సోడియం ఉన్న స్థితి
డి) హైపర్ కాలిమియా	4) శరీరంలో తక్కువ పొటాషియం ఉన్నస్థితి
ఇ) హైపో క్లోరిమియా	5) శరీరంలో తక్కువ సోడియం ఉన్న స్థితి

   1) ఎ-2, బి-1, సి-3, డి-4, ఇ-5
   2) ఎ-4, బి-3, సి-2, డి-1, ఇ-5
   3) ఎ-5, బి-3, సి-4, డి-2, ఇ-1
   4) ఎ-2, బి-3, సి-4, డి-1, ఇ-5
6. కింది వాటిలో క్యాల్షియం గురించి సరైన వాక్యాలను గుర్తించండి.
   ఎ) ఎముకలు, దంతాల్లో భాగంగా ఉంటుంది.
   బి) రక్తం గడ్డ కట్టడానికి ఇది అవసరం.
   సి) కండర సంకోచానికి, నాడీ ప్రచోదనాలకు క్యాల్షియం అవసరం.
   1) ఎ, బి 2) బి, సి 3) ఎ, సి 4) ఎ, బి, సి



7. కింది వాటిని జతపరచండి.

ఖనిజ మూలక లోపం	వ్యాధులు
ఎ) క్యాల్షియం	1) ప్రత్యుత్పత్తి సమస్యలు
బి) ఇనుము	2) సరళ గాయిటర్
సి) అయోడిన్	3) రక్తహీనత
డి) మాంగనీస్	4) ఆస్టియోపోరోసిస్

   1) ఎ-2, బి-3, సి-4, డి-1
   2) ఎ-4, బి-3, సి-2, డి-1
   3) ఎ-1, బి-4, సి-2, డి-3
   4) ఎ-2, బి-1, సి-3, డి-4
8. క్లోరిన్‌కు సంబంధించి కింది వాక్యాల్లో సరైన వాటిని గుర్తించండి.
   ఎ) ద్రవాభిసరణ క్రమతకు, ఆమ్ల క్షార సమతాస్థితికి అవసరం.
   బి) పండ్లు, కూరగాయలు, ఉప్పు ద్వారా మనకు లభిస్తుంది.
   సి) జీర్ణాశయంలో హైడ్రోక్లోరిక్ ఆమ్ల తయారీకి అవసరం.
   డి) లాలాజలం, చెమట, కన్నీటిలో ఉంటుంది.
   1) ఎ, బి, సి, డి 2) ఎ, బి 3) బి, సి 4) సి, డి
9. కింది వాక్యాల్లో సరికాని వాటిని గుర్తించండి.
   ఎ) హిమోగ్లోబిన్‌లో ఇనుము భాగంగా ఉంటుంది.
   బి) ఆస్టియోపోరోసిస్ అనేది రక్తహీనతతో సంబంధం కలిగి ఉంటుంది.
   సి) ఫాస్ఫరస్ డీఎన్ఏ, ఆర్ఎన్ఏలో భాగంగా ఉంటుంది.
   డి) రక్త పరిమాణం సాంద్రత తక్కువగా ఉండటాన్ని 'రక్తహీనత' అంటారు.
   1) ఎ, బి, సి 2) బి, సి, డి 3) బి, డి 4) ఎ, డి



10. కింది వాటిని జతపరచండి.

ఖనిజ లవణాలు	లభించే ఆహార పదార్థాలు
ఎ) క్యాల్షియం	1) ఉల్లి, వెల్లుల్లి
బి) ఇనుము	2) పండ్లు, కూరగాయలు
సి) అయోడిన్	3) ఎండిన పండ్లు, ఆకుకూరలు
డి) సల్ఫర్	4) గుడ్లు, బీట్‌రూట్
ఇ) జింక్	5) పాలు, రాగులు

   1) ఎ-4, బి-3, సి-2, డి-1, ఇ-5
   2) ఎ-5, బి-3, సి-2, డి-1, ఇ-4
   3) ఎ-2, బి-3, సి-4, డి-5, ఇ-1
   4) ఎ-3, బి-5, సి-2, డి-4, ఇ-1
11. మెగ్నీషియం గురించి కింది వాక్యాల్లో సరైన వాటిని గుర్తించండి.



   ఎ) ఇది ఎంజైమ్‌ల ఉత్తేజానికి, నాడీ ప్రచోదనాలకు అవసరం.
   బి) దీని లోపం వల్ల గుండె లయలో మార్పు కలుగుతుంది.
   సి) ఇది ఆకుకూరలు, పూర్తి ధాన్యాల నుంచి లభిస్తుంది.
   1) ఎ, బి, సి 2) బి, సి, 3) ఎ, సి 4) ఎ, బి
12. కింది వాక్యాలను పరిశీలించి, సరైన సమాధానాన్ని ఎన్నుకోండి.
   ఎ) సెలీనియం యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది.
   బి) సెలీనియం తీవ్ర లోపం వల్ల చైనాలో కెషాన్ వ్యాధి వచ్చింది.
   1) ఎ సరైంది, బి సరికాదు 2) ఎ సరికాదు, బి సరైంది
   3) ఎ, బి సరికావు 4) ఎ, బి సరైనవి
13. జింక్‌కు సంబంధించి కింది వాక్యాలను విశ్లేషించి, సరైన సమాధానం కనుక్కోండి.
   ఎ) ఇది కార్బన్ డై ఆక్సైడ్ రవాణాకు, విటమిన్ ఎ జీవక్రియకు అవసరం.
   బి) ఎంజైమ్‌ల ఉత్తేజనానికి, వ్యాధి నిరోధక శక్తికి అవసరం.
   సి) దీని లోపం వల్ల శ్వాసక్రియలో ఇబ్బంది కలుగుతుంది.
   డి) విరేచనాలను నియంత్రించడానికి జింక్ థెరపీలో భాగంగా జింక్ మాత్రలు ఇస్తారు.
   1) ఎ, బి, సి 2) బి, సి, డి 3) ఎ, బి, సి, డి 4) సి, డి



14. కింది వాటిని జతపరచండి.

ఎ) రాగి	1) ఎనామిల్ ఏర్పడటానికి అవసరం.
బి) సల్ఫర్	2) విటమిన్ -బి12లో భాగంగా ఉంటుంది.
సి) సెలీనియం	3) సిస్టీన్, మిథియోనైన్ అమైనో ఆమ్లాల్లో ఉంటుంది.
డి) ఫ్లోరిన్	4) హిమోగ్లోబిన్ తయారీ ప్రక్రియలో అవసరం.
ఇ) కోబాల్ట్	5) యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది.

   1) ఎ-4, బి-3, సి-5, డి-1, ఇ-2
   2) ఎ-5, బి-3, సి-2, డి-1, ఇ-4
   3) ఎ-1, బి-4, సి-2, డి-5, ఇ-3
   4) ఎ-5, బి-4, సి-1, డి-3, ఇ-2
15. కింది వాటిలో సరికాని వాక్యాలను గుర్తించండి.
   ఎ) శరీరంలో ఫ్లోరిన్ ఎక్కువైతే కలిగే వాధి ఫ్లోరోసిస్.
   బి) ఫ్లోరోసిస్ వల్ల గుండె, మూత్రపిండాలు దెబ్బతింటాయి.
   సి) సురక్షిత తాగునీటి ద్వారా ఫ్లోరోసిస్‌ను నియంత్రించొచ్చు.
   డి) వ్యాక్సినేషన్ ద్వారా ఫ్లోరోసిస్‌ను నివారించవచ్చు.
   1) ఎ, బి 2) బి, డి 3) సి, డి 4) ఎ, డి
16. కింది వాటిని జతపరచండి.

మూలకాలు	ఆవశ్యకత
ఎ) మాంగనీస్	1) వ్యాధి నిరోధక శక్తి పెరగడానికి
బి) జింక్	2) ప్రత్యుత్పత్తికి
సి) క్రోమియం	3) నాడీ ప్రచోదనాలకు
డి) మాలిబ్డినమ్	4) కార్బోహైడ్రేట్, లిపిడ్, ప్రొటీన్ జీవక్రియలకు
ఇ) మెగ్నీషియం	5) ఎంజైమ్‌ల ఉత్తేజానికి అవసరం

   1) ఎ-2, బి-1, సి-4, డి-5, ఇ-3
   2) ఎ-5, బి-3, సి-2, డి-1, ఇ-4
   3) ఎ-2, బి-5, సి-3, డి-2, ఇ-1
   4) ఎ-1, బి-4, సి-3, డి-2, ఇ-5
17. ఫ్లోరోసిస్ గురించి సరైన వాటిని గుర్తించండి.
   ఎ) తాగే నీటిలో 1.5 పీపీఎం (పార్ట్స్ పర్ మిలియన్) కంటే ఎక్కువ ఉంటే ఫ్లోరోసిస్ బారిన పడే అవకాశం ఉంది.
   బి) దంత ఫ్లోరోసిస్‌లో దంతాలపై గోధుమ రంగు మచ్చలు ఏర్పడతాయి.
   సి) ఎముకల్లో ఫ్లోరిన్ జమ కూడితే అవి వంగిపోతాయి.
   డి) మెదడు, వెన్నుపాము చుట్టూ ఉన్న మెనెంజెస్‌లో ఫ్లోరిన్ జమ కూడటంతో న్యూరోలాజికల్ ఫ్లోరోసిస్ కలుగుతుంది.
   1) ఎ, బి, సి 2) బి, సి, డి 3) సి,డి 4) ఎ,బి, సి, డి
18. ఇనుము లోపం వల్ల కలిగే పోషకాహార రక్తహీనతను నివారించడానికి దేశం తీసుకుంటున్న కింది చర్యల్లో సరైన వాటిని గుర్తించండి.
   ఎ) నేషనల్ ఐరన్ ప్లస్ ఇనీషియేటివ్ కార్యక్రమం.
   బి) ఎనీమియా ముక్త్ భారత్ కార్యక్రమం.
   సి) ఇనుముతో కూడిన ఫోర్టిఫైడ్ బియ్యం అందించడం.
   డి) ప్రభుత్వ పాఠశాలలో ఇనుము మాత్రలు పంపిణీ చేయడం.
   1) ఎ, బి 2) ఎ, బి, సి, డి 3) సి, డి 4) ఎ, డి
19. ఆహారంలో అయోడిన్ లోపం వల్ల కలిగే సరళ గాయిటర్ వ్యాధి నివారించడానికి ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో సరైనవి?
   ఎ) నేషనల్ అయోడిన్ డెఫిషియన్సీ డిజార్డర్స్ కంట్రోల్ ప్రోగ్రాం.
   బి) ఉప్పులో అయోడిన్ కలపడం తప్పనిసరి.
   సి) అయోడైజ్డ్ ఉప్పును ప్యాక్ చేసి అమ్మడం తప్పనిసరి.
   1) ఎ, బి 2) బి, సి 3) ఎ, సి 4) ఎ, బి, సి


రచయిత: డాక్టర్ బి.నరేష్

సమాధానాలు

1-1; 2-2; 3-3; 4-4; 5-3; 6-4; 7-2; 8-1; 9-3; 10-2; 11-1; 12-4; 13-3; 14-1; 15-2; 16-1; 17-4; 18-2; 19-4.

వసుంధర

vasundhara@eenadu.in

సాంకేతిక రంగంలో మహిళల సంఖ్య పెరగడమే కాదు... ఉన్నత స్థానాల్లోనూ నిలబడి తమ సత్తా చాటుతున్నారు. తాజాగా గేమింగ్ రంగాన్ని శాసించే మైక్రోసాఫ్ట్ గేమింగ్ (ఎక్స్‌బాక్స్) విభాగానికి కొత్త సీఈఓగా భారత సంతతి మహిళ ఆశా శర్మ నియమితులయ్యారు. నాలుగు దశాబ్దాల పాటు మైక్రోసాఫ్ట్‌లో సేవలందించిన రిటైర్ అవుతున్న దిగ్గజ నేత ఫిల్ స్పెన్సర్ స్థానంలో ఆమె ఈ బాధ్యతలు చేపట్టడం... ఇప్పుడు ఓ సంచలనం.



గేమింగ్ సామ్రాజ్యంలో 'ఆశా' కిరణం!

భారతీయ కుటుంబంలో, విలువలతో కూడిన వాతావరణంలో పెరిగారు ఆశ. చిన్నప్పటి నుంచీ చురుకైన అమ్మాయి. 'కష్టపడటం ఒక్కటే సరిపోదు, ఆ కష్టానికి స్పష్టమైన లక్ష్యమూ ఉండాలి' అని తల్లిదండ్రులు చెప్పిన మాటే మంత్రంగా ఆమె తన భవిష్యత్తు నిర్మించుకోవడం ఆరంభించారు. ఆశ బిజినెస్ స్కూల్ బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ పట్టా పొందారు. 17 ఏళ్ల వయసులోనే ఎస్‌సీ జాన్సన్ అండ్ సన్‌లో మార్కెటింగ్ విభాగంలో పనిచేయడం ఆరంభించారు. ఈ అనుభవం ఆమె కెరియర్‌కు బలమైన పునాది వేసింది. ముఖ్యంగా కార్గిల్, డెలాయిట్, మైక్రోసాఫ్ట్ వంటి కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం తెచ్చిపెట్టింది. చదువయ్యాక ఆశ ఒక ఎన్జీవోను స్థాపించారు. మిలియన్ డాలర్లకంటే ఎక్కువగానే నిధులను సేవాకార్యక్రమాల కోసం సేకరించారు.



2011లో మైక్రోసాఫ్ట్‌లో చేరారామె. అయితే కొన్నాళ్లకే అంటే 2013లోనే ఆ సంస్థను వీడారు. ఆ తర్వాత పలు అంతర్జాతీయ టెక్ కంపెనీలలో పనిచేశారు. రెండేళ్ల క్రితం తిరిగి మైక్రోసాఫ్ట్‌లోని కోర్ ఏఐ విభాగంలో సీనియర్ అధికారి హోదాలో చేరారు. ప్లాట్‌ఫామ్‌ల నిర్మాణం, పార్ట్‌నర్‌షిప్‌లు, డిజిటల్ ఎకోసిస్టమ్స్‌లో ఆమెకు ఉన్న అపారమైన అనుభవం ఇప్పుడు ఆమెను గేమింగ్ విభాగానికి నాయకత్వం వహించేలా చేసింది.

దిగ్గజ సంస్థల్లో ముద్ర...

ఆశ శర్మ పేరు టెక్ లోకంలో మారుమోగడానికి కారణం ఆమె 'ఫేస్‌బుక్' మెటా, ఇన్‌స్టాకార్ట్ వంటి సంస్థల్లో పోషించిన కీలక పాత్ర. ముఖ్యంగా 'ఫేస్‌బుక్'లో మెసెంజర్ విభాగానికి వైస్ ప్రెసిడెంట్‌గా ఆమె... కోట్లాది మంది ప్రజలకు చేరువయ్యారు. ఇన్‌స్టాకార్ట్‌లో చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా క్లిష్ట సమయాల్లో కంపెనీని లాభాల బాట పట్టించడంలో ఆమె చేసిన వ్యూహాలు అద్భుతంగా పనిచేశాయి.

సవాళ్లున్నాయి...

గత రెండు సంవత్సరాలుగా మైక్రోసాఫ్ట్‌లో పనిచేస్తూ సంస్థ అంతర్గత వ్యవస్థల, గేమింగ్ వ్యాపార నిర్మాణం, స్టూడియోల సృజనాత్మక శక్తి... వంటి విషయాలన్నీ లోతుగా అర్థం చేసుకున్నారు. అయితే, మైక్రోసాఫ్ట్ గేమింగ్ ఆదాయ వృద్ధి మందగించడం, గేమింగ్ కంటెంట్ కోసం ప్రపంచ మార్కెట్లో ఉన్న తీవ్రమైన పోటీని ఎదుర్కోవడం వంటివి ఆమె ముందున్న సవాళ్లు. ఏఐ సాంకేతికత కంటే, మనుషుల సృజనాత్మకతతో కూడిన ఆటలకే తన ప్రాధాన్యం అంటారామె.

వ్యక్తిగత జీవితం - కుటుంబం

ఆశ తన వ్యక్తిగత జీవితాన్ని చాలా గోప్యంగా ఉంచడానికి ఇష్టపడతారు. వందల కోట్ల డాలర్ల సామ్రాజ్యాన్ని శాసిస్తున్నా ఆమె కుటుంబానికి ప్రాధాన్యం ఇస్తారు. తన విజయానికి కుటుంబం అందించిన నైతిక మద్దతే పునాది అని తరచుగా చెబుతుంటారామె. పాత పద్ధతులను ప్రశ్నించి, కొత్త దారిని వెతకడం. ఎంత ఎదిగినా తన మూలాలను, తన టీమ్ కష్టాన్ని మర్చిపోకపోవడం, టెక్నాలజీ మారుతున్నా, మానవీయ విలువలు తగ్గకూడదని నమ్మడం ఆమె బలాలు.

ఆలోచిద్దాం... స్నేహం చేద్దాం!

ప్రపంచంలో ఏ మూల ఉన్నా మనమంతా ఒక్కటే... సోదరీమణులమే. ఒకరికొకరం సాయం చేసుకోవాలి. సమస్యల పట్ల అవగాహన పెంచుకుని, పరిష్కరించుకోవాలి. సాధికారత దిశగా అడుగులేయాలి. విరాళాలు సేకరించడం, సేవ చేయడం... వంటి కార్యక్రమాల్లో భాగం కావాలి అంటోంది 'వరల్డ్ అసోసియేషన్ ఆఫ్ గర్ల్ గైడ్స్ అండ్ గర్ల్ స్కౌట్స్'. అందుకోసం ఏటా ఒక థీమ్‌తో 'వరల్డ్ థింకింగ్ డే'ను ఫిబ్రవరి 22న జరుపుతోంది. అలా ఈ ఏడాది 'మన స్నేహం' అన్నదాన్ని థీమ్‌గా ఎంపికచేసుకుంది.



కాలచక్రం బుల్లెట్ రైలుతో పోటీపడుతోంది. రెప్ప మూసి తెరిచేలోగా రోజులు కరిగిపోతున్నాయి. ఎంతైనా ఏఐ ప్రపంచం కదా. అప్‌డేట్ కాకపోతే వెనకబడిపోతాం. ఇది సాంకేతికతకే కాదు. స్నేహబంధానికీ వర్తిస్తుంది. లేదంటే నేస్తాల్ని పోగొట్టుకుంటాం.

◆ మేహన, మేఘన ప్రాణ స్నేహితులు. చదువు, పెళ్లి, ఉద్యోగం, పిల్లలు... ఎవరి జీవితాల్లో వాళ్లు బిజీ. భౌతికంగా దూరంగా ఉన్నా ఆరునెలలకో ఏడాదికో కలిసినప్పుడు అదే ఆప్యాయత. కానీ ఈమధ్యే... ఏదో మార్పు. కలిసినప్పుడూ ఎవరి ఆలోచనలు వాళ్లవి. మాట్లాడుకున్నా పెదాలపై పూతలే... ఆనాటి స్నేహంలో ఎక్కడో అపశృతి...



'ఒక వీడ్కోలు... కొత్త హలోకి దారి తీస్తుంద'ని 'ది అల్కెమిస్ట్' రచయిత పాలో కొయిలో అన్నట్లు పాత స్నేహం కీబోర్డు ఫోన్‌లా బోరుకొట్టి ఉండొచ్చు... కొత్త పరిచయాలు స్మార్ట్‌ఫోన్‌లా ఆకర్షిస్తుండొచ్చు. అలాగని దీన్ని తప్పుపట్టలేం. ఎందుకంటే కొన్ని స్నేహాలు కాలంతోపాటు వెనక్కెళ్లిపోతాయి. ఇది సహజం... పరిణామ సూత్రం. సమయం, ప్రాధాన్యతలు, ఆసక్తులు, విలువలు వేరయినప్పుడు బంధాలూ వేరవుతాయి. ఒక దశకే పరిమితమై అక్కడితో ఆగిపోతాయి. అలాగని కొత్త పరిచయాల్నైనా స్నేహంగా మలచుకోగలుగుతున్నామా అన్నది... ఆలోచించాల్సిందే!

◆ ఈమధ్య స్నేహితులనే కాదు, అక్కచెల్లెళ్లు, బంధువుల మధ్యా ఏదో అడ్డగీత. కనిపించని శూన్యం... స్పందన లోపించిన హృదయాలు, భావం లేని మాటలు... ఎందుకిలా? ఏం కొన్నారు, ఎలా జీవిస్తున్నాం... వీటిని మించిన మాటల్లేవా, తీపి జ్ఞాపకాలెటుపోయాయి? ఒక్కసారి టైమ్ మెషీనెక్కి వెనక్కెళితే ఎంత బాగుంటుందో... అని ఏ ఒక్కరికీ అనిపించడం లేదెందుకని? వీళ్లే కాదు, మిలీనియల్స్, జెన్ జీల్లోనూ ఇదే ధోరణి. హాయ్, హలో, వాట్సప్, వావ్‌లతోనే సరి.

'మనసు భారాన్ని పంచుకోవడానికి ఇద్దరు స్నేహితులైనా మిగిలున్నారా' అనుకునే రోజొకటి వస్తుంది అన్నదాని గురించి ఎవరూ ఆలోచించడం లేదు. అందుకే బాగా థింక్ చేయండి. అలాగని ఆలోచిస్తూనే ఉండిపోకండి. నెట్‌వర్క్ పెంచుకోండి. అందరితో స్నేహం చేయండి సంతోషంగా ఉండండి అంటున్నారు గర్ల్ గైడ్స్ అండ్ గర్ల్ స్కౌట్స్ సభ్యులు.

◆ 'ఎంత సంపాదించాం అన్నది కాదు, ఫేస్‌బుక్‌లోనో ఇన్‌స్టాలోనో ఎంత మంది ఫాలో అవుతున్నారనేదీ కాదు. మనకంటూ కష్టం వస్తే ఒక్క క్షణం వెనకా ముందూ ఆలోచించకుండా పరుగెత్తుకొచ్చే ప్రాణ స్నేహితులు ఒక్కరైనా ఉండాలి' అని అనుకుంటాం కదా. మరి మనమూ అలాగే ఉంటున్నామా అన్నదీ ఆలోచించండి. అలాంటి స్నేహితులు మీకున్నా మీరూ అలాగే ఉన్నా గుండెలమీద చెయ్యేసుకుని హాయిగా నిద్రపోవచ్చు... అది ఆరోగ్యాన్నీ ఆయుష్షునీ పెంచుతుంది. అలా లేరనుకుంటే ఈ రోజునుంచే జీవన శైలిని మార్చుకోవాల్సిందే. లేకపోతే ఏదోక దశలో ఒంటరితనం వెతుక్కుంటూ వస్తుంది.

అందుకే మరి... ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుని థింక్ చేద్దాం! సరిహద్దులూ సంస్కృతులతో సంబంధం లేకుండా చేయీ చేయీ కలుపుదాం. స్నేహంగా ఉందాం... స్నేహాన్ని పంచుదాం... సమస్యలకీ స్పందిద్దాం!

ఎలా మొదలైంది?

ప్రపంచవ్యాప్తంగా ఉన్న గర్ల్ గైడ్స్ అండ్ గర్ల్ స్కౌట్స్ ప్రతినిధులు 1926 నాటి సమావేశంలో తమ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ఒక రోజు ఉండాలనుకున్నారు. దానికే 'థింకింగ్ డే'గా పేరు పెట్టడంతోపాటు బాయ్ స్కౌట్ ఉద్యమ స్థాపకులైన లార్డ్ పావెల్, ఆయన భార్య వరల్డ్ చీఫ్ గైడ్ ఒలావ్ పావెల్ ఇద్దరి పుట్టినరోజూ అయిన ఫిబ్రవరి 22ను ఎంపికచేశారు. అలా మొదలైన ఈ థింకింగ్ డేకి నేటికి వందేళ్లు. ఈ గైడ్స్ అండ్ స్కౌట్స్ సంస్థకు అలా మొత్తం ఐదు కేంద్రాలు ఉండగా అందులో ఒకటి మనదేశంలో 'సంగం' పేరుతో పుణెలో ఉంది.

నా వయసు 35. ఈ మధ్య నుదిటి మీద గీతల్లా వస్తున్నాయి. ఇది వృద్ధాప్య ఛాయల్ని సూచిస్తుందని ఎక్కడో చదివాను. నిజమేనా? ఇప్పటికే నా ముఖం నిర్జీవంగా కనిపిస్తోంది. యూత్‌ఫుల్‌గా మారాలంటే నేనేం చేయాలి? - శ్రీనిత, ప్రొద్దుటూరు

నుదిటి మీద గీతలు తగ్గవా?

డియర్ వసుంధర



- సూరపనేని పద్మావతి
డెర్మటాలజిస్ట్

నుదిటి మీద గీతలు రావడానికి రెండు రకాల కారణాలు. ఒకటి చర్మంలో ఎలాస్టిసిటీ, కొలాజెన్ తగ్గడం వల్ల నుదురు, కళ్లు, మూతి చుట్టూ వచ్చే సన్నటి గీతలు. వీటినే స్టాటిక్ లైన్స్ అంటాం. రెండోది మనం ఆశ్చర్యంగా, కోపంగా చూసినప్పుడు, నవ్వినప్పుడు... ఏర్పడే ఎక్స్‌ప్రెషన్ లైన్స్. ఇవి హావభావాలు పలికించినప్పుడు అక్కడ ఉండే ఫ్రంటాలిస్ అనే కండరం మూమెంట్స్ వల్ల వస్తాయి. నుదిటి మీద అడ్డంగానే కాదు, కళ్ల చివర, రెండు కనుబొమల మధ్య కూడా ఏర్పడతాయి. ఇవి చాలా రోజుల నుంచి ఉన్నా, వయసు పెరుగుతున్నా చర్మం మీద శాశ్వతంగా ఉండిపోతాయి. దాంతో మీరు ముఖంలో భావాలు పలికించకపోయినా, ఐబ్రోస్ ఎత్తి ఆశ్చర్యంగా చూడకపోయినా అవి అలానే కనిపిస్తాయి. ఇవి సాధారణంగా క్రీముల వల్ల తగ్గవు. ఎక్స్‌ప్రెషన్స్ పలికించినప్పుడు అతిగా స్పందించే కండరాన్ని రిలాక్స్ చేయాలి. ఇందు కోసం బాటులినం టాక్సిన్ అనే ఇంజెక్షన్ ఆ ప్రదేశంలో ఇస్తాం. అప్పుడు శాశ్వతంగా గీతలు రాకుండా కొంతవరకూ ఆపొచ్చు. ఒకసారి ఈ చికిత్స తీసుకుంటే ఆరునెలల వరకూ ఆ గీతలు కనిపించవు. ఇలా ఏడాదికి రెండు సార్లు చేయించుకోవాలి. ఈ కండరాలకు ఉపశమనం కల్పించినా స్టాటిక్ లైన్స్ కనిపిస్తుంటాయి కొన్నిసార్లు. ఇవి డీప్‌గా మారడం వల్ల ఇలా కావొచ్చు. ఈ గీతలు తగ్గడానికి కొలాజెన్ స్టిములేషన్ ట్రీట్మెంట్స్ అందించొచ్చు. అంటే ఫ్రాక్షనల్ లేజర్స్, మైక్రో నీడిలింగ్ వంటి కొలాజెన్ స్టిములేషన్ చికిత్సల వల్ల ఆ గీతల్లో కొలాజెన్ ఉత్పత్తి అయ్యి చర్మం సాధారణంగా మారుతుంది.

మీకు తెలుసా!

మనకు కితకితలు పెడితే వెంటనే నవ్వొచ్చేస్తుంది కదా! దీనికి కారణం మనపై దాడి జరుగుతుందని శరీరంలో స్పర్శను గుర్తించే నాడులు మెదడుకి వేగంగా సంకేతాలు పంపిస్తాయట. అందుకే ఆ సమయంలో ఉలిక్కిపడటం, నవ్వడం చేస్తామట. పురుషులతో పోలిస్తే మహిళలు, చిన్నారుల్లో ఈ నాడులు సున్నితంగా ఉండటం వల్ల ఎక్కువగా నవ్వుతారని అధ్యయనాలు చెబుతున్నాయి.

అమ్మకి కావాలి రెండేళ్లు..!



దగ్గర వయసున్న అంటే... రెండేళ్లలోపు వయసు తేడా ఉన్న అక్కచెల్లెళ్లు, అన్నదమ్ములు ఒకే రకమైన అవుట్‌ఫిట్స్ ధరించి కనిపిస్తే... అరే చూడ్డానికి భలే ముద్దుగా ఉన్నారే అనుకుంటాం. అంతేనా ఒకరికొకరు తోడుంటారు, కలిసి పెరుగుతారు, ఇద్దరి చదువులు ఒకేసారి పూర్తైపోతాయి. అప్పుడు నీకు బోలెడు తీరిక దొరుకుతుంది. అంటూ ఇంట్లో పెద్దవాళ్ల సలహాలూ చాలానే వినిపిస్తాయి. దీన్నే 'టూ అండర్ టూ' పద్ధతిగా పిలుస్తున్నారు నిపుణులు. చూడ్డానికీ, వినడానికీ ఇది బాగానే ఉన్నప్పటికీ తల్లికి మాత్రం అంత మంచిది కాదంటున్నారు. మొదటికాన్పు అయిన తరవాత మహిళలు శారీరకంగా, మానసికంగా కోలుకోవడానికి దాదాపు రెండేళ్ల సమయం పడుతుందట. అంతేకాదు, వాళ్ల కటి భాగం కోలుకోవడానికీ, హార్మోన్లు తిరిగి సాధారణ స్థితికి రావడానికీ, నిద్రవేళలు గాడిలో పడటానికీ కొంతమందికి రెండు నుంచి ఐదేళ్లు కూడా పడుతోందని చెబుతున్నాయి అధ్యయనాలు. అందుకే రెండేళ్లలోపు ఇద్దరు పిల్లలున్న అమ్మలు నిద్రలేమి, శారీరక శ్రమ పెరిగి తొందరగా అలసిపోతున్నారని చెబుతున్నారు. కొందరిలో కార్టిసాల్ ఉత్పత్తి ఎక్కువై ఒత్తిడి పెరుగుతుందట. బరువు పెరగడంతోపాటు రోగనిరోధక శక్తి తగ్గుతుంది. ఇలా మొదటి శిశువు పుట్టిన పద్దెనిమిది నెలలలోపు మళ్లీ ప్రెగ్నెంట్ అయితే పుట్టబోయే బిడ్డ తక్కువ బరువుతో, నెలలు నిండకుండా పుట్టే అవకాశాలు ఉన్నాయని డబ్ల్యూహెచ్‌ఓ ఒక నివేదికలో వెల్లడించింది. అందుకే మొదటికాన్పు తరవాత రెండో బిడ్డను ప్లాన్ చేసుకుంటే కనీసం రెండేళ్ల వ్యవధి పాటించమంటోంది. అప్పుడే తల్లీ బిడ్డా ఆరోగ్యంగా ఉంటారని చెబుతున్నారు నిపుణులు.

బంగారం - వెండి



21న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,62,500	1,46,400	2,61,444
విజయవాడ	1,57,625	1,46,000	2,74,000
ప్రొద్దుటూరు	1,55,800	1,43,340	2,68,000
రాజమహేంద్రవరం	1,59,280	1,46,000	2,90,000
విశాఖపట్నం	1,59,280	1,46,000	2,69,000
తమిళనాడు	-----	1,46,800	2,90,000

మేక పాల సబ్బుతో స్వావలంబన!



దేశ, విదేశీ కళాకారుల నైపుణ్యాలకు వేదికగా నిలిచింది సూరజ్‌కుండ్ అంతర్జాతీయ క్రాఫ్ట్ మేళా... ఇక్కడ రేవారీకి చెందిన శశిదేవి తన సహజ ఉత్పత్తులతో ఆకట్టుకుంటున్నారు. ముఖ్యంగా ఆమె తయారు చేసిన మేకపాల సబ్బు ఈ మేళాలో ఎక్కువగా అమ్ముడుపోతోన్న ఉత్పత్తి కావడం విశేషం. తన కాళ్లపై తాను నిలబడాలి... నలుగురికి దారి చూపాలి అన్న ఆలోచనతోనే శశిదేవి స్వయం ఉపాధి మార్గాన్ని ఎంచుకున్నారట. మధ్యతరగతి కుటుంబానికి చెందిన ఆమె పీజీ చేశారు. అందరిలా ప్రయత్నిస్తే మంచి ఉద్యోగమూ వచ్చేది. కానీ, తాను సొంతంగా ఏదైనా చేయాలనుకున్నారు. దానికోసం ఎన్నో ఆలోచనలు చేశారు. ఈ రోజుల్లో కలుషిత ఆహారం ఎక్కువ అవ్వడం, రసాయన ఉత్పత్తుల వాడకం పెరగడం శశిదేవికి ఆందోళన కలిగించాయి. ప్రజల్లో ఆరోగ్య స్పృహ పెరగాల్సిన అవసరం ఉందని భావించారామె. దాంతో సహజ ఉత్పత్తులనూ, వాటితో చేసిన పదార్థాలనూ అమ్మడం ఆరంభించారు. వీటిల్లో గోట్‌మిల్క్‌తో చేసిన సబ్బులు ప్రత్యేకం. 17 ఏళ్ల క్రితం శశి ఒక్కరే ప్రారంభించిన ఈ ప్రయత్నం... ఇప్పుడు సుమారు 500 మంది మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతోంది. అదనంగా, దాదాపు 1,500 మంది రైతులు వివిధ రకాలుగా ఈ కార్యక్రమంలో భాగస్వాములు అయ్యారు. ఆడవాళ్లు సాధికారత సాధిస్తే... వారి కుటుంబాలు వృద్ధి చెందుతాయి వారిని ఆ దిశగా నడిపించడమే తన లక్ష్యం అంటారామె.



స్పైసీగా తింటున్నారు!



'ఉన్నది ఒక్కటే జీవితం... దీన్ని పూర్తిగా అనుభవించాలి'... ఈ తరం చెబుతోన్న మాటే ఇది. కాబట్టే, కెరియర్ దగ్గర్నుంచి... టూర్ల వరకూ ఏదైనా నచ్చిందే చేస్తున్నారు. భిన్న రుచులను వెతుక్కుంటూ వెళ్లిమరీ ఆస్వాదించేస్తున్నారు. అన్నట్టూ ఈమధ్య వాళ్లని ఆకర్షిస్తున్నదేంటో తెలుసా? హాట్ హనీ! అంటే తేనెని వేడి చేసి తీసుకోవడం అనుకునేరు. ఇదో తీపి, కారాల కలయిక. తేనెని వేడిచేసి, దానికి చిల్లీఫ్లేక్స్ కలుపుతారు. ఓవైపు తీయగా, మరోవైపు కారంగా... ఆ రుచే వేరు అంటూ పిజ్జా, కూరగాయల సలాడ్, ఫ్రైడ్‌స్నాక్స్, టోస్ట్... ఇలా ప్రతి దానిమీదా వేసుకుని తినేస్తున్నారు. పైగా ఈ స్వీట్, స్పైసీల కలయికకి 'స్వైసీ' అని పేరు పెట్టుకుని మరీ సోషల్ మీడియాలో దీని గురించి పంచుకుంటున్నారు. ఏళ్లనాటి నుంచి వస్తున్న సాస్‌కి దీన్నో ట్రెండీ ప్రత్యామ్నాయంగానూ చెబుతున్నారు. దీంతో చిటికెలో పూర్తయ్యే వంటలు, ఫ్లేవర్ల విషయంలో ప్రయోగాలు చేసే జెన్‌జీ అమ్మాయిల ఫేవరెట్‌గా మారిపోయిందీ స్వైసీ తేనె. మరి మీ సంగతేంటి? మీరూ రుచి చూస్తారా ఓసారి?

ఆట... వ్యాయామం..!

ప్రస్తుతం చిన్నారుల జీవన శైలిలో చాలా మార్పులొచ్చాయి. రోజు మొత్తం స్కూల్, ట్యూషన్, మొబైల్, వీడియో గేమ్స్ అంటూ ఎక్కువ సేపు కూర్చునే పనులకే అలవాటు పడ్డారు. సెలవుల్లో ఆడతారా అంటే అదీ ఉండదు. దాంతో వాళ్లలో శారీరక శ్రమ తగ్గిపోయింది. అందుకే చిన్న వయసులోనే ఊబకాయం పలకరించేస్తోంది. దీనికి పరిష్కారంగా వచ్చినవే ఈ ఉపకరణాలు. వీటితో ఇంట్లోనే ఎప్పుడంటే అప్పుడు ఆడుకుంటూ వ్యాయామం చేయొచ్చు.

కిడ్స్ కార్నర్

స్పీడ్‌గా తొక్కితేనే... గెలిచేది..!





వీడియో గేమ్‌లు ఆడని చిన్నారులుంటారా? రిమోట్ ఆపరేటర్‌ని చేతిలోకి తీసుకుని టీవీలో వీడియో గేమ్ ఆడతారు కదా! దీంతో వాళ్ల కళ్లపై డిజిటల్ ఒత్తిడి పడుతుంది. అందుకే ఈ 'థింక్ అండ్ లెర్న్ స్మార్ట్ ఎక్సర్‌సైజ్ సైకిల్'ని తెచ్చివ్వండి. దీనిలో డ్రైవింగ్, గేమింగ్, రేసింగ్ అని మూడు ఆటలు ఉంటాయి. చిన్నారులు దాని పెడల్ తొక్కే వేగాన్ని బట్టి రేసులో గెలుపోటములుంటాయి. ఎంత వేగంగా తొక్కితే స్క్రీన్‌లో ఉండే కారు లేదా బైక్ అంత వేగంగా ముందుకు కదులుతుంది. దాంతో కాళ్లకు పని చెబుతారు. ఇలా ఇంట్లోనే వినోదం, వ్యాయామం రెండూ ఒకేసారి చేసేస్తారన్నమాట.

మ్యూజిక్‌తో కిక్కివ్వొచ్చు...



శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యం పెంచే వ్యాయామాల్లో బాక్సింగ్ ముందుంటుంది. డబ్బులు ఖర్చు పెట్టి ట్రైనింగ్ సెంటర్‌లో పిల్లల్ని చేర్చాలంటే సమయం కుదరట్లేదా? అయితే... 'స్మార్ట్ మ్యూజిక్ బాక్సింగ్ మెషీన్' మీ ఇంట్లో ఉండాల్సిందే. చిన్నారులకి స్క్రీన్ టైమ్ తగ్గడంతోపాటు ఫిట్‌నెస్‌పైనా శ్రద్ధ పెరుగుతుంది. దీనిలో తొమ్మిది రకాల మోడ్స్ ఉంటాయి. పాట వేగం, ఎక్కడ కిక్ కొట్టాలనుకుంటున్నామో ఆ పాయింట్స్‌ని ఎంచుకుని ఆన్ చేయాలి. దాంతో మ్యూజిక్ ప్లే అవుతూ ఆ పాయింట్లలో లైట్ మార్క్ చూపిస్తుంది. అంతేకాదు, ఎన్ని పంచ్‌లు ఎంత బలంగా కొట్టామో కూడా దీంట్లో చూపిస్తుంది. గోడకు అమర్చుకునేలా ఉండటం వల్ల కనిపించనప్పుడల్లా ఒక కిక్కిచ్చేస్తారు మరి!



ఏకాగ్రతను పెంచే పరుగు...

ఆడుతూ పాడుతూ పరుగు పెట్టడం వల్ల స్ట్రెస్ తగ్గుతుంది. చదువులోనూ చురుగ్గా ఉంటారని చెబుతున్నారు నిపుణులు. 'నువ్వు రోజూ రన్నింగ్ చెయ్యి' అని చెబితే వింటారా ఈ పిల్లలు. అందుకే ఈ 'ఐరిష్ ఫన్ అండ్ రన్నింగ్ ట్రెడ్‌మిల్' ఇచ్చి చూడండి. మాన్యువల్‌గా పనిచేసే ఈ ట్రెడ్‌మిల్ వాళ్ల నడక, పరుగు వేగాన్ని బట్టి కదులుతుంది కాబట్టి పిల్లలు ఉత్సాహంగా వ్యాయామం చేస్తారు. అంతేకాదు, పరుగు పెట్టాలనుకునే చిన్నారులు వాళ్ల పాదాలను ఎక్కడ ఉంచాలో కూడా బెల్ట్‌పై గుర్తులు ఉంటాయి. వాటిని చూస్తూ పరుగుపెట్టడం వల్ల చురుగ్గా కదులుతూ ఏకాగ్రతనీ పెంచుకుంటారు. చేసింది కొంతసేపైనా మైండ్‌ఫుల్ వ్యాయామం చేస్తారు. మీ ఇంట్లోనూ చిన్నారులుంటే ఓ లుక్కేయండి మరి!





మా లక్‌పతి దీదీలు మీరే!

హైదరాబాద్‌లోని స్టార్ హోటల్.. జాతీయ గ్రామీణ జీవనోపాధి పథకం 25వ జాతీయ స్థాయి సమన్వయ కమిటీ సమావేశం జరుగుతోంది. దానికి కేంద్ర జాతీయ గ్రామీణాభివృద్ధి, వ్యవసాయశాఖల మంత్రి శివరాజ్‌సింగ్ ముఖ్యఅతిథిగా హాజరవ్వగా... కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఐఏఎస్‌లు అధికారులతోపాటు 26 రాష్ట్రాల మహిళా స్వయం సహాయక సమాఖ్యల ప్రతినిధులూ పాల్గొన్నారు. ఆ వేదికపై ఇద్దరు సామాన్య మహిళలు వ్యాఖ్యాతలుగా చేశారు. ఉర్దూ, మరాఠీ, భోజ్‌పురి, బిహారీ, ఒరియా యాసల్లో మాట్లాడుతున్న వాళ్లని చూసి కేంద్రమంత్రి ఆరా తీశారు. ఇద్దరూ స్వయం సహాయక సంఘాల మహిళలని తెలిసి 'అద్భుతం... మా లక్‌పతి దీదీలంటే మీరే' అంటూ ప్రశంసించారు కూడా.



వాళ్లిద్దరిదీ వరంగల్ జిల్లానే. ఉప్పునూతుల శోభారాణిది వరంగల్ కాగా, సిరిమల్లె గీతది పెరికవేడు. మహిళా సంఘాల కార్యకలాపాల్లో చురుగ్గా వ్యవహరిస్తోన్న వీళ్లని 2007లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ సూచన మేరకు ఇతర రాష్ట్రాలలోని మహిళా సంఘాలకు శిక్షణ ఇచ్చేందుకు ఎంపిక చేసింది. ఇందుకు హిందీ పరిజ్ఞానం అవసరమవ్వడంతో సెర్ప్ అధికారులు వీరిద్దరికీ ఓరుగల్లు జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏడాది శిక్షణ ఇప్పించారు. వీళ్లు పట్టుదలగా నేర్చుకుని, ఇతర రాష్ట్రాల్లోని మహిళా సంఘాలకు శిక్షణ ఇవ్వడం ఆరంభించారు. ప్రాంతమేదైనా వారి యాస, వాడుక పదాలను గమనించి మాట్లాడుతూ వారితో మమేకమవుతారు. ఆ మధ్య ముస్సోరీలో ఐఏఎస్‌లకూ ఎస్‌హెచ్‌జీల గురించి తరగతులు చెప్పారు. జీ20 సదస్సులోనూ వ్యాఖ్యాతలుగా మెప్పించారు. శోభ దూరవిద్యలో పీజీ చేసి, పీహెచ్‌డీ చేస్తున్నారు. గీత ఎంఏ చదివారు. - ఆకారపు మల్లేశం, హైదరాబాద్

టీ20 ధమాకా ప్రపంచకప్ ఫిబ్రవరి 7 - మార్చి 8

ఛాంపియన్

గ్రూప్ దశలో కాస్త సవాలు ఎదురైనా అంతిమంగా టీమ్‌ఇండియాదే పైచేయి. పాకిస్థాన్ సహా ఏ జట్టూ భారత్‌ను అడ్డుకోలేకపోయింది. డిఫెండింగ్ ఛాంపియన్ అజేయంగా సూపర్-8లోకి అడుగు పెట్టింది. కానీ ఇక్కడి నుంచి మాత్రం ప్రయాణం అంత సాఫీగా ఉండకపోవచ్చు. ఏ ప్రత్యర్థితోనైనా పోరు కఠినమే. అందులోనూ ఈ దశలో తొలి మ్యాచ్ దక్షిణాఫ్రికాతో. గ్రూప్ దశలో భారత్‌ను మించి ఆధిపత్యం చలాయించిన జట్టది. కాబట్టి సూపర్-8లో శుభారంభం చేయాలంటే సూర్యసేన తమ ఆటను టాప్ గేర్‌లోకి తీసుకెళ్లాల్సిందే.


ప్రాక్టీస్ సందర్భంగా భారత ఆటగాళ్లు

అసలు సవాలు ఇప్పుడు..

దక్షిణాఫ్రికాతో భారత్ ఢీ

రాత్రి 7 నుంచి

సూపర్-8లో కీలక సమరం

అహ్మదాబాద్

టీ20 ప్రపంచకప్‌లో ఆతిథ్య భారత్‌కు అసలైన సవాల్! సూపర్ ఫామ్‌లో ఉన్న దక్షిణాఫ్రికాను ఆదివారం సూపర్-8 మ్యాచ్‌లో ఢీకొనబోతోంది టీమ్‌ఇండియా. భారత్ లాగే గ్రూప్ దశను నాలుగు విజయాలతో ముగించింది సఫారీ జట్టు. రెండు నెలల ముందు భారత్‌లో టీ20 సిరీస్ ఆడడం ఆ జట్టుకు అతి పెద్ద సానుకూలత. ఆ సిరీస్‌లో 1-3తో ఓడినప్పటికీ.. ఆతిథ్య జట్టుకు గట్టి పోటీనే ఇచ్చింది దక్షిణాఫ్రికా. ఆ సిరీస్ అనుభవంతోనే టీ20 ప్రపంచకప్ గ్రూప్ దశలో ఆ జట్టు అదరగొట్టింది. గ్రూప్ దశలో అజేయంగా నిలిచినప్పటికీ.. భారత్ ఆట సాధికారికంగా సాగలేదు. నమీబియాతో మినహా మ్యాచ్‌ల్లో తడబాటు తప్పలేదు. జోరుమీదున్న సఫారీలపై నెగ్గాలంటే భారత్ తన అత్యుత్తమ ఆటను ఆడాల్సిందే.

అభిషేక్ ఇప్పుడైనా?: ఎన్నో అంచనాలతో టీ20 ప్రపంచకప్‌లో అడుగు పెట్టిన అభిషేక్ శర్మ.. గ్రూప్ దశ అంతా అసలు ఖాతానే తెరవడని ఎవ్వరూ ఊహించి ఉండరు. అనారోగ్యంతో నమీబియా మ్యాచ్ ఆడని అతను.. మిగతా మూడు మ్యాచ్‌ల్లోనూ డకౌటయ్యాడు. మరి సూపర్-8 నుంచి అయినా అతను అసలు ఆటను బయటికి తీస్తాడేమో అని అభిమానులు ఆశతో ఉన్నారు. అతడి ఓపెనింగ్ భాగస్వామి ఇషాన్ కిషన్ మాత్రం జోరుమీదున్నాడు. పాక్‌పై విధ్వంసక ఇన్నింగ్స్‌తో జట్టును గెలిపించిన అతడిపై మంచి అంచనాలున్నాయి. మూడో నంబర్ బ్యాటర్ తిలక్ వర్మ.. చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్‌లు ఆడుతున్నప్పటికీ.. స్ట్రైక్ రేట్ అతడికి సమస్యగా మారింది. అతను మరింత ధాటిగా ఆడాల్సిన అవసరముంది. కెప్టెన్ సూర్యకుమార్ అమెరికాపై విలువైన ఇన్నింగ్స్ ఆడాక ఇబ్బంది పడుతున్నాడు. తన సహజ శైలిలో చెలరేగలేకపోతున్నాడు. హార్దిక్ పాండ్య, శివమ్ దూబె లయలోనే ఉన్నారు. చివరి లీగ్ మ్యాచ్‌లో జట్టుకు భారీ స్కోరు సాధించి పెట్టింది వీళ్లే. రింకుకు పెద్దగా అవకాశాలు రాలేదు. అహ్మదాబాద్ పిచ్ స్పిన్‌కు అనుకూలమైనప్పటికీ.. ప్రధానంగా పేసర్ల మీదే ఆశలు పెట్టుకుంది దక్షిణాఫ్రికా. రబాడ, యాన్సెన్, ఎంగిడి, బోష్‌లతో ఆ జట్టు పేస్ విభాగం ఎంతో మెరుగ్గా కనిపిస్తోంది. స్పిన్‌లో ఆ జట్టు బలహీనమే. కేశవ్ మహరాజ్ భారత బ్యాటర్లను అడ్డుకోగలడా అన్నది సందేహమే. అతడికి కెప్టెన్ మార్‌క్రమ్ పార్ట్‌టైం స్పిన్‌తో సహకారం అందిస్తాడు.

ప్రమాదకర లైనప్: దక్షిణాఫ్రికాకు ఎంతో లోతైన, ప్రమాదకర బ్యాటింగ్ లైనప్ ఉంది. ఆ జట్టు ప్రధాన బ్యాటర్లందరూ ఫామ్‌లో ఉన్నారు. మార్‌క్రమ్, డికాక్‌లతో స్థిరమైన ఓపెనర్లు ఆ జట్టు సొంతం. తర్వాత రికెల్టన్, బ్రెవిస్, స్టబ్స్, మిల్లర్‌లతో దక్షిణాఫ్రికా బ్యాటింగ్‌కు తిరుగులేదు. 7, 8 స్థానాల్లో ఆడే బోష్, యాన్సెన్ సైతం బ్యాటుతో చెలరేగగలరు. డికాక్, బ్రెవిస్ లాంటి బ్యాటర్లను త్వరగా పెవిలియన్ చేర్చకపోతే కష్టమే. గ్రూప్ దశలో ఉత్తమ ప్రదర్శన చేసిన భారత బౌలర్లు.. ఈ మ్యాచ్‌లో ఎలా రాణిస్తారో చూడాలి. కొత్త బంతితో అదరగొడుతున్న బుమ్రా.. టాప్‌ఆర్డర్‌కు కళ్లెం వేయాల్సిన అవసరముంది. పేస్ ఆల్‌రౌండర్లు హార్దిక్, దూబె కొన్ని ఓవర్లు పంచుకుంటారు. నిలకడగా రాణిస్తున్న అక్షర్, వరుణ్ స్పిన్నర్లకు అనుకూలించే అహ్మదాబాద్‌లో.. బలమైన దక్షిణాఫ్రికా బ్యాటింగ్ విభాగానికి సవాలు విసురుతారేమో చూడాలి. పిచ్‌ను బట్టి మూడో స్పిన్నర్‌గా కుల్‌దీప్‌ను లేదా రెండో పేసర్‌గా అర్ష్‌దీప్‌ను తుది జట్టులోకి తీసుకుంటారు.



7 టీ20 ప్రపంచ కప్‌లో దక్షిణాఫ్రికాతో భారత్ ఆడిన మ్యాచ్‌లు. అయిదు సార్లు నెగ్గి, రెండు మ్యాచ్‌లు ఓడింది.

35 భారత్, దక్షిణాఫ్రికా తలపడ్డ టీ20లు. 21 మ్యాచ్‌ల్లో భారత్ గెలవగా.. 13 సార్లు దక్షిణాఫ్రికా నెగ్గింది. ఒక మ్యాచ్ టై అయింది.

తుది జట్లు (అంచనా)

భారత్: అభిషేక్, ఇషాన్, తిలక్, సూర్యకుమార్ (కెప్టెన్), హార్దిక్, దూబె, రింకు, అక్షర్, కుల్‌దీప్/అర్ష్‌దీప్, బుమ్రా, వరుణ్; **దక్షిణాఫ్రికా:** మార్‌క్రమ్ (కెప్టెన్), డికాక్, రికెల్టన్, బ్రెవిస్, మిల్లర్, స్టబ్స్, బోష్, యాన్సెన్, కేశవ్, రబాడ, ఎంగిడి.

స్పిన్నర్లదే జోరు!

అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం స్పిన్నర్లకు బాగా అనుకూలిస్తుంది. నెదర్లాండ్స్‌తో భారత్ చివరి లీగ్ మ్యాచ్‌లోనూ బంతి బాగా తిరిగింది. డచ్ స్పిన్నర్ ఆర్యన్ దత్ 4 ఓవర్లలో 19 పరుగులే ఇచ్చి 2 వికెట్లు తీశాడు. అనంతరం వరుణ్, అక్షర్ అదరగొట్టారు. కొంచెం మందకొడిగా ఉన్న ఈ పిచ్‌పై బంతి బ్యాట్ మీదికి రాక బ్యాటర్లు ఇబ్బంది పడ్డారు. ఆదివారం కూడా పిచ్ అలాగే ఉండొచ్చని అంచనా. కానీ రెండు జట్లకూ బలమైన బ్యాటింగ్ విభాగాలున్న నేపథ్యంలో స్పిన్నర్లను కొంచెం జాగ్రత్తగా ఆడుకుంటే పెద్ద స్కోర్లే నమోదయ్యే అవకాశాలున్నాయి.


సిరాజ్

హార్దిక్ షాట్‌కు సిరాజ్ విలవిల

దక్షిణాఫ్రికాతో సూపర్-8 మ్యాచ్ ముంగిట టీమ్‌ఇండియా పేసర్ మహ్మద్ సిరాజ్‌కు గట్టి దెబ్బ తాకింది. శనివారం ప్రాక్టీస్ సందర్భంగా హార్దిక్ పాండ్య కొట్టిన షాట్ కాలికి బలంగా తాకడంతో అతను బాధతో విలవిలలాడుతూ కింద పడుకున్నాడు. తర్వాత లేచి నడిచే ప్రయత్నం చేసినా.. అడుగులు తడబడ్డాయి. గాయం తీవ్రత ఎంత అన్నది తెలియరాలేదు. టోర్నీలో అతను ఒకే మ్యాచ్ ఆడాడు. అమెరికాతో ఆరంభ పోరుకు జ్వరం వల్ల బుమ్రా అందుబాటులో లేకపోవడంతో సిరాజ్ తుది జట్టులో ఆడాడు. 3 వికెట్లతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. హర్షిత్ రాణా టోర్నీ ఆరంభానికి ఒక్క రోజు ముందు గాయపడితే.. అతడి స్థానంలో సిరాజ్ జట్టులోకి వచ్చాడు.

తొలి పంచ్ ఎవరిదో?

సూపర్-8లో శ్రీలంకతో ఇంగ్లాండ్ ఢీ

మ॥ 3 నుంచి


బ్రూక్


శానక

పల్లెకెలె: టీ20 ప్రపంచకప్‌లో సూపర్-8 దశ శనివారమే ఆరంభమైనా.. ఫలితం మాత్రం రాలేదు. పాకిస్థాన్, న్యూజిలాండ్ మ్యాచ్ వర్షం వల్ల రద్దవడంతో ఇరు జట్లకూ ఒక్కో పాయింట్ దక్కింది. ఆదివారం ఆతిథ్య శ్రీలంకను.. ఇంగ్లాండ్ ఢీకొనబోతోంది. ఈ మ్యాచ్‌కు కూడా కొంతమేర వర్షం ముప్పుంది. మరి ఇందులోనైనా ఫలితం వస్తుందేమో చూడాలి. గ్రూప్ దశలో లంక, ఇంగ్లాండ్‌లది ఒకలాంటి ప్రయాణమే. ఓ మ్యాచ్ ఓడి, మిగతా మూడూ నెగ్గాయి. బలాబలాల్లో ఇంగ్లాండ్ కొంచెం మెరుగ్గా ఉన్నప్పటికీ.. సొంతగడ్డపై ఆడుతుండడం లంకకు కలిసొచ్చేదే. ఆ జట్టు స్పిన్నర్లను ఎదుర్కోవడం ఇంగ్లిష్ బ్యాటర్లకు సవాలే. కానీ ఇంగ్లాండ్ కూడా స్పిన్‌లో బలంగానే ఉంది. మరి సూపర్-8 బోణీ కొట్టేదెవరో?





పదేళ్ల తర్వాత పడగొట్టారు

- ఆస్ట్రేలియాలో టీ20 సిరీస్ నెగ్గిన భారత్
- మెరిసిన స్మృతి, శ్రేయాంక, శ్రీచరణి

అడిలైడ్

భారత మహిళల క్రికెట్ జట్టు అదరగొట్టింది. స్ఫూర్తిదాయక ప్రదర్శనతో దశాబ్దం తర్వాత ఆస్ట్రేలియాలో టీ20 సిరీస్‌ను కైవసం చేసుకుంది. శనివారం జరిగిన ఆఖరిదైన మూడో టీ20లో హర్మన్‌ప్రీత్ బృందం 17 పరుగుల తేడాతో ఆసీస్‌ను ఓడించింది. మొదట భారత్ 6 వికెట్లకు 176 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' స్మృతి మంధాన (82; 55 బంతుల్లో 8×4, 3×6) మెరుపు ఇన్నింగ్స్ ఆడింది. జెమీమా రోడ్రిగ్స్ (59; 46 బంతుల్లో 4×4) కూడా రాణించింది. శ్రేయాంక పాటిల్ (3/22), శ్రీచరణి (3/32), అరుంధతి రెడ్డి (2/35) విజృంభించడంతో ఛేదనలో ఆసీస్ 159/9కే పరిమితమైంది. ఆష్లీ గార్డ్‌నర్ (57; 45 బంతుల్లో 5×4, 1×6), ఫీబీ లిచ్‌ఫీల్డ్ (26; 17 బంతుల్లో 4×4) మాత్రమే పోరాడారు. ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్‌లో భారత్ నెగ్గగా.. రెండో మ్యాచ్‌ను కంగారూ జట్టు గెలుచుకుంది.

బౌలర్లు చుట్టేశారు: ఛేదనలో ఆస్ట్రేలియా మొదట దూకుడుగానే ఆడింది. తొలి 7 బంతులకు 19 పరుగులు చేసింది. కానీ మరో 14 బంతుల్లో 3 వికెట్లు కోల్పోయి 32/3తో ఇబ్బందుల్లో పడింది. రెండో ఓవర్లోనే జార్జియా వోల్ (10)ను ఔట్ చేసిన శ్రేయాంక.. తర్వాత పెర్రీ (1)ని కూడా పెవిలియన్ చేర్చింది. బెత్ మూనీ (6) కూడా ఎంతోసేపు నిలవలేదు. ఒకవైపు ఆష్లీ గార్డ్‌నర్ పోరాడినా.. ఆమెకు సహకారం ఇచ్చే వాళ్లు కరవయ్యారు. భారత బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీసి.. ఆస్ట్రేలియాను పోటీలో లేకుండా చేశారు. అంతకుముందు భారత ఇన్నింగ్స్‌లో స్మృతి మంధాన మెరుపులే హైలైట్. షెఫాలి వర్మ (7) త్వరగానే ఔటైనా.. స్మృతి తన శైలిలో స్కోరు పెంచింది. ఆఫ్‌సైడ్ ఆమె కొన్ని కళ్లుచెదిరే షాట్లు కొట్టింది. జెమీమా రోడ్రిగ్స్ నుంచి స్మృతికి చక్కటి సహకారం అందింది. మోలనూ వేసిన ఆరో ఓవర్లో స్మృతి రెండు.. జెమీమా ఒక ఫోర్ కొట్టారు. ఈ జంట వీలు చిక్కినప్పుడల్లా బ్యాట్ ఝుళిపించడంతో 10 ఓవర్లకు 86/1తో భారత్ మెరుగైన స్థితిలో నిలిచింది. డార్సీ బ్రౌన్ వేసిన 12వ ఓవర్లో ఓ మెరుపు సిక్స్ బాదిన స్మృతి.. 38 బంతుల్లో అర్ధసెంచరీ అందుకుంది. శతకం చేసేలా కనిపించిన ఆమె.. అనాబెల్ వేసిన 17వ ఓవర్లో ఔటైంది. 41 బంతుల్లో అర్ధసెంచరీ చేసిన జెమీమా.. భారత్ స్కోరును 170 దాటించింది. 20వ ఓవర్లో భారత్ 3 వికెట్లు కోల్పోయి 3 పరుగులే చేసింది.

● ఆస్ట్రేలియా గడ్డపై భారత్ పదేళ్ల తర్వాత ఓ సిరీస్ గెలిచింది. చివరగా 2016లో మిథాలీ రాజ్ సారథ్యంలోని భారత్.. టీ20 సిరీస్‌ను 2-1తో కైవసం చేసుకుంది. మళ్లీ ఇప్పుడు అంతే తేడాతో కంగారూ జట్టును ఓడించింది.

"ఆస్ట్రేలియాను వాళ్ల దేశంలోనే ఓడించడం ఎంతో ప్రత్యేకం. నేనూ ఈ విజయంలో భాగమైనందుకు సంతోషంగా ఉంది. జెమీమా క్రీజులో వచ్చే సమయానికి బంతికో పరుగు చొప్పున చేశా. జెమీమా స్వేచ్ఛగా ఆడుతూ నాపై ఒత్తిడి తగ్గించింది. దీంతో సహజశైలిలో రాణించగలిగా" - స్మృతి మంధాన

భారత్ ఇన్నింగ్స్: స్మృతి మంధాన (సి) ఆష్లీ గార్డ్‌నర్ (బి) అనాబెల్ 82; షెఫాలి వర్మ (సి) అనాబెల్ (బి) కిమ్ గార్త్ 7; జెమీమా (సి) పెర్రీ (బి) అనాబెల్ 59; రిచా ఘోష్ (సి) వోల్ (బి) మోలనూ 18; హర్మన్‌ప్రీత్ నాటౌట్ 2; అమన్‌జ్యోత్ రనౌట్ 1; దీప్తి రనౌట్ 1; ఎక్స్‌ట్రాలు 6 **మొత్తం:** (20 ఓవర్లలో 6 వికెట్లకు) **176**; **వికెట్ల పతనం:** 1-19, 2-140, 3-168, 4-174, 5-175, 6-176; **బౌలింగ్:** డార్సీ బ్రౌన్ 3-0-27-0; ఆష్లీ గార్డ్‌నర్ 4-0-36-0; కిమ్ గార్త్ 3-0-25-1; సోఫీ మోలనూ 4-0-34-1; అనాబెల్ సదర్లాండ్ 4-0-34-2; జార్జియా వేర్‌హామ్ 2-0-19-0

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: జార్జియా వోల్ (సి) రేణుక (బి) శ్రేయాంక 10; బెత్ మూనీ (సి) శ్రీచరణి (బి) రేణుక 6; లిచ్‌ఫీల్డ్ (సి) షెఫాలి (బి) శ్రీచరణి 26; ఎలిస్ పెర్రీ (బి) శ్రేయాంక 1; ఆష్లీ గార్డ్‌నర్ (సి) జెమీమా (బి) అరుంధతి 57; జార్జియా వేర్‌హామ్ (సి) అమన్‌జ్యోత్ (బి) అరుంధతి 12; అనాబెల్ సదర్లాండ్ ఎల్బీ (బి) శ్రేయాంక 14; గ్రేస్ హారిస్ హిట్ వికెట్ (బి) శ్రీచరణి 1; సోఫీ మోలనూ ఎల్బీ (బి) శ్రీచరణి 6; కిమ్ గార్త్ నాటౌట్ 7; డార్సీ బ్రౌన్ నాటౌట్ 8; ఎక్స్‌ట్రాలు 11 **మొత్తం:** (20 ఓవర్లలో 9 వికెట్లకు) **159**; **వికెట్ల పతనం:** 1-19, 2-21, 3-32, 4-63, 5-98, 6-128, 7-130, 8-137, 9-143; **బౌలింగ్:** రేణుక సింగ్ 3-0-29-1; శ్రేయాంక పాటిల్ 4-0-22-3; దీప్తి శర్మ 4-0-27-0; అరుంధతి రెడ్డి 4-0-35-2; శ్రీచరణి 4-0-32-3; అమన్‌జ్యోత్ కౌర్ 1-0-11-0

వరుణ్‌తో జాగ్రత్త


డికాక్

అహ్మదాబాద్: భారత స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిని ఎదుర్కొనేటప్పుడు దక్షిణాఫ్రికా బ్యాటర్లు జాగ్రత్తగా ఉండాలని ఆ జట్టు సీనియర్ బ్యాటర్ క్వింటన్ డికాక్ సూచించాడు. ఆదివారం టీ20 ప్రపంచకప్‌లో టీమ్‌ఇండియాతో సఫారీ జట్టు సూపర్-8 మ్యాచ్ ఆడనున్న నేపథ్యంలో అతడిలా వ్యాఖ్యానించాడు. "వరుణ్ నాణ్యమైన బౌలర్. రెండు నెలల క్రితం భారత్‌లో జరిగిన సిరీస్‌లో అతడు మాపై గొప్పగా బౌలింగ్ చేశాడు. వరుణ్‌ను ఎదుర్కోవడానికి మా జట్టు బ్యాటర్లకు ఎవరి ప్రణాళిక వాళ్లకు ఉంది. అయినా అతడితో జాగ్రత్తగా ఉండక తప్పదు. పరిస్థితులకు తగ్గట్టుగా ఓ అంచనాతో షాట్లు ఆడాల్సి ఉంటుంది" అని డికాక్ తెలిపాడు. టీ20 ప్రపంచకప్‌లో అభిషేక్ శర్మ హ్యాట్రిక్ డకౌట్లు అయినా.. పెద్దగా పట్టించుకోవక్కర్లేదని అతడన్నాడు. "అభిషేక్ నంబర్‌వన్ టీ20 బ్యాటర్. అతడింకా కుర్రాడు. ఒక్కోసారి ఫామ్ కోల్పోవడం సహజం. కానీ అభిషేక్ నంబర్‌వన్ స్థానానికి ఊరికే రాలేదు. కచ్చితంగా అతడు సత్తా చాటుతాడు" అని డికాక్ పేర్కొన్నాడు. భారత్-దక్షిణాఫ్రికా ఆటగాళ్లకు ఒకరి బలాలు ఒకరికి తెలుసని, ఆదివారం సూపర్-8 మ్యాచ్ ఉత్కంఠభరితంగా జరగడం ఖాయమని డికాక్ అన్నాడు.

భారత్‌కు మరో ఓటమి

హాకీ ప్రొ లీగ్

హోబర్ట్: భారత హాకీ జట్టు మళ్లీ నిరాశపరిచింది. ఎఫ్ఐహెచ్ ప్రొలీగ్‌లో సొంతగడ్డపై జరిగిన అంచెలో ఒక్క విజయం కూడా సాధించని భారత జట్టు.. ఆస్ట్రేలియా అంచెను కూడా ఓటమితో ప్రారంభించింది. శనివారం తొలి మ్యాచ్‌లో 0-2 గోల్స్ తేడాతో స్పెయిన్ చేతిలో పరాజయం పాలైంది. ఇగాచియొ అబాజొ (6వ నిమిషం), ఇగాచియొ కొబాస్ (36వ నిమిషం) గోల్స్ కొట్టి జట్టును గెలిపించారు. దూకుడుగా ఆడిన భారత్.. అవకాశాల్ని గోల్స్‌గా మలచడంలో విఫలమైంది. సొంత గడ్డపై జరిగిన అంచెలో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ (బెల్జియం, అర్జెంటీనాలపై) భారత్ ఓడింది. ఆదివారం ఆస్ట్రేలియాతో రెండో మ్యాచ్‌లోనైనా పుంజుకుంటుందేమో చూడాలి.



శిఖర్-సోఫీ ఒక్కటయ్యారు

దిల్లీ: భారత మాజీ స్టార్ క్రికెటర్ శిఖర్ ధావన్ మళ్లీ పెళ్లి చేసుకున్నాడు. స్నేహితురాలు సోఫీ షైన్‌ను శనివారం అతడు మనువాడాడు. కొంతమంది సన్నిహితుల సమక్షంలో ఈ వివాహ వేడుక జరిగింది. జనవరి 12న శిఖర్-సోఫీ నిశ్చితార్థం చేసుకున్నారు. ఐర్లాండ్‌కు చెందిన సోఫీ.. అమెరికాకు చెందిన ఒక ఆర్థిక సంస్థలో ప్రొడక్ట్ కన్సల్టెంట్‌గా పని చేస్తోంది. 2023లో మొదటి భార్య ఆయేషా ముఖర్జీకి శిఖర్ విడాకులు ఇచ్చాడు.

అంధుల క్రికెట్‌కు బీసీసీఐ మద్దతు

దిల్లీ: దేశంలో అంధుల క్రికెట్‌కు మద్దతు ఇవ్వనున్నట్లు బీసీసీఐ ప్రకటించింది. భారత అంధుల క్రికెటర్లు గత దశాబ్దంలో అంతర్జాతీయ స్థాయిలో గొప్ప విజయాలు సాధించారు. పలు ప్రపంచకప్‌లు గెలిచారు. ఈ ఘనతలతో పాటు వాళ్లు ఎదుర్కొంటున్న సవాళ్లనూ బీసీసీఐ గుర్తించింది. అంధుల విభాగంలో భారత పురుష, మహిళల జట్లు రెండింటికీ అండగా నిలవాలని నిర్ణయించింది. వాళ్ల కోసం ఒక విధానాన్ని రూపొందించింది. ఇకపై అంధుల జట్లు ప్రతి ఏటా రెండు విదేశీ పర్యటనలు చేయడానికి బోర్డు ఆర్థిక సహాయం చేస్తుంది. సొంతగడ్డపై సిరీస్‌లు జరిగేటప్పుడు భారత జట్లతో పాటు విదేశీ జట్ల బసకు అయ్యే ఖర్చును భరిస్తుంది. బీసీసీఐ అనుబంధ స్టేడియాలు, మైదానాల్లో.. దేశవాళీ, అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడేందుకు అవకాశం కల్పిస్తుంది. భారత అంధుల క్రికెట్ సంఘంతో కలిసి పనిచేస్తామని బీసీసీఐ తెలిపింది.

భారత్‌కు 4 పతకాలు

దిల్లీ: ఆసియా క్రాస్ కంట్రీ ఛాంపియన్‌షిప్‌లో భారత్ నాలుగు పతకాలు సాధించింది. జపాన్‌లో జరుగుతున్న ఈ పోటీల్లో హర్మన్‌జ్యోత్ రజతం గెలుచుకున్నాడు. శనివారం 10 కిలో మీటర్ల పరుగు పోటీలో అతడు (29 నిమిషాల 21 సెకన్లు) రెండో స్థానంలో నిలిచాడు. టీమ్ పోటీల్లో భారత్ మూడు పతకాలు నెగ్గింది. అండర్-20లో మహిళలు, పురుషుల జట్లు కాంస్యం గెలిచాయి. మహిళల 10 కిలోమీటర్ల టీమ్ విభాగంలో భారత బృందం కంచు కైవసం చేసుకుంది.



ఒక్క బంతీ పడకుండానే..

పాకిస్థాన్-న్యూజిలాండ్ మ్యాచ్ రద్దు

కొలంబో: టీ20 ప్రపంచకప్ సూపర్ 8 దశకు నిరాశాజనక ఆరంభం. శనివారం న్యూజిలాండ్, పాకిస్థాన్ మధ్య జరగాల్సిన గ్రూప్-2 మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. రెండు జట్లకు చెరో పాయింట్ లభించింది. చిరుజల్లుల మధ్య పాకిస్థాన్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. కానీ వర్షం క్రమంగా పెద్దదైంది. కుండపోత వర్షం మైదానాన్ని ముంచెత్తింది. దీంతో అంపైర్లకు మ్యాచ్‌ను రద్దు చేయక తప్పలేదు. ఈ మ్యాచ్ కోసం తుది జట్టులో పాకిస్థాన్ ఒక మార్పు చేసింది. ఖవాజా నఫే స్థానంలో ఫకర్ జమాన్‌ను తీసుకుంది. న్యూజిలాండ్ జట్టులో మూడు మార్పులు జరిగాయి. అనారోగ్యంతో గత మ్యాచ్‌కు దూరమైన కెప్టెన్ శాంట్నర్ తిరిగి జట్టులోకి వచ్చాడు. ఫెర్గూసన్, ఇష్ సోధిలకు కూడా తుది జట్టులో స్థానం లభించింది. అయితే ఎడతెరిపిలేని వాన కారణంగా మ్యాచ్‌లో ఒక్క బంతి కూడా పడలేదు. పాకిస్థాన్ తన తర్వాతి మ్యాచ్‌లో 24న ఇంగ్లాండ్‌తో తలపడుతుంది. న్యూజిలాండ్ జట్టు 25న శ్రీలంకతో ఆడుతుంది.

క్లాబో.. ఆరో స్వర్ణం


క్లాబో

టెసెరో: నార్వే అథ్లెట్ జోహానెస్ క్లాబో వింటర్ ఒలింపిక్స్‌లో సరికొత్త రికార్డు సృష్టించాడు. పురుషుల క్రాస్ కంట్రీ స్కీయింగ్ పోటీల్లో ఆరోసారి విజేతగా నిలిచి.. ఒక వింటర్ ఒలింపిక్స్‌లో ఆరు స్వర్ణాలు గెలిచిన తొలి అథ్లెట్‌గా ఘనత సాధించాడు. శనివారం 50 కిలోమీటర్ల రేసులో అగ్రస్థానం సాధించాడు. క్లాబో సహచరులు మార్టిన్ లూవ్‌స్ట్రామ్ రజతం, ఇవర్సెన్ కాంస్యం గెలిచారు. అమెరికా అథ్లెట్ ఎరిక్ హెయిడెన్ (అయిదు స్వర్ణాలు) పేరిట 50 ఏళ్ల క్రితం నమోదైన రికార్డును క్లాబో అధిగమించాడు. అయితే అతను ఆరు స్వర్ణాల్లో రెండు టీమ్ పోటీల్లో గెలవగా.. ఎరిక్ అయిదింటినీ వ్యక్తిగత విభాగాల్లోనే సాధించడం విశేషం. వింటర్ ఒలింపిక్స్‌లో 18 స్వర్ణాలు గెలిచిన నార్వే అగ్రస్థానంలో కొనసాగుతోంది. 11 స్వర్ణాలతో అమెరికా రెండో స్థానంలో ఉంది.

అది సిగ్గుచేటే: బ్రూక్

పల్లెకెలె: ద హండ్రెడ్ లీగ్ నుంచి పాకిస్థాన్ ఆటగాళ్లను తప్పిస్తే అది అవమానమే అవుతుందని ఇంగ్లాండ్ పరిమిత ఓవర్ల కెప్టెన్ హ్యారీ బ్రూక్ అన్నాడు. భారతీయులు యజమానులుగా ఉన్న ఫ్రాంఛైజీలు వేలంలో పాకిస్థాన్ ఆటగాళ్లను కొనకపోవచ్చన్న వార్తల నేపథ్యంలో బ్రూక్ స్పందించాడు. "ఇప్పుడు మా దృష్టంతా ప్రపంచకప్‌పైనే. వేరే విషయాల గురించి పట్టించుకోం. కానీ పాకిస్థాన్ గొప్ప క్రికెట్ దేశం. ఆ దేశ ఆటగాళ్లు 50-60 మంది వేలంలో ఉన్నారు. వాళ్లలో కొందరు లీగ్‌లో లేకపోతే అది సిగ్గుచేటే" అని బ్రూక్ అన్నాడు. ద హండ్రెడ్ లీగ్‌లో మాంచెస్టర్ సూపర్ జెయింట్స్, ఎంఐ లండన్, సౌథర్న్ బ్రేవ్, సన్‌రైజర్స్ లీడ్స్ ఫ్రాంఛైజీలకు భారతీయులు యజమానులు. ఈ లీగ్‌ను ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు నిర్వహిస్తుంది.

ఏజీ కుమార్తె పెళ్లికి ప్రముఖుల హాజరు

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ హైటెక్స్‌లో శనివారం జరిగిన ఏపీ అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, నాగరాణిల కుమార్తె మానస, గొడవర్తి కోటేశ్వరరావు, శిరీషల కుమారుడు సిద్ధార్థల వివాహానికి ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దంపతులు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. వారితోపాటు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ పి.కె.మిశ్ర, జస్టిస్ జె.కె.మహేశ్వరి, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ వచ్చి వధూవరులను ఆశీర్వదించారు. రామోజీ గ్రూపు సంస్థల సీఎండీ సీహెచ్.కిరణ్, మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్, రామోజీ ఫిల్మ్‌సిటీ ఎండీ విజయేశ్వరి, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ్ లూథ్రా, ఎ.కె.గంగూలీ, తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఏపీ మంత్రులు నారా లోకేశ్, సత్యకుమార్‌యాదవ్, నందమూరి బాలకృష్ణ దంపతులు, తెలంగాణ సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, తెలంగాణ, ఏపీల పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పల్లె నాగేశ్వరరావు, లక్ష్మీనారాయణ, తెలంగాణ హైకోర్టు అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి, అదనపు ఏజీలు తేరా రజనీకాంత్‌రెడ్డి, మహమ్మద్ ఇమ్రాన్ ఖాన్, సుమారు 40 మంది రెండు రాష్ట్రాల హైకోర్టు న్యాయమూర్తులు, మద్రాసు, కర్ణాటక, రాజస్థాన్ హైకోర్టు న్యాయమూర్తులు, హైకోర్టు, సుప్రీంకోర్టుల మాజీ న్యాయమూర్తులు, సీనియర్ న్యాయవాదులు, న్యాయవాదులు, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు



మానస, సిద్ధార్థల వివాహానికి హాజరైన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

విద్యార్థి ఎదుగుదల.. భావితరాలకూ ఆదర్శం

- కేఈసీఏ స్వర్ణోత్సవాల్లో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

రేణిగుంట, తిరుమల, శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ''ప్రతిభావంతులైన గ్రామీణ యువతకు సరైన అవకాశాలు కల్పిస్తే వారు దేశాన్నే ఉన్నత స్థాయికి తీసుకెళ్లగలరు. కృష్ణదేవరాయ విద్యా, సాంస్కృతిక సంఘం (కేఈసీఏ) ఐదు దశాబ్దాలుగా ఉపకార వేతనాలు మాత్రమే ఇవ్వడం లేదు.. సామాజిక మార్పు కోసం ఒక ఉద్యమంలా పనిచేస్తోంది'' అని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు కొనియాడారు. తిరుపతి సమీపంలోని కరకంబాడిలోని అమరరాజ క్యాంపస్ ఆడిటోరియంలో శనివారం కేఈసీఏ స్వర్ణోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర మంత్రి జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక విద్యార్థి జీవితాన్ని మార్చడం అంటే ఆ కుటుంబాన్ని, తద్వారా భవిష్యత్ తరాలను తీర్చిదిద్దడమేనన్నారు. సమాజానికి తిరిగి సేవ చేయడంలో గల్లా కుటుంబం ప్రదర్శిస్తున్న చొరవ ఆదర్శప్రాయమని అభినందించారు. అనంతరం ప్రముఖ రచయిత శాకం నాగరాజ రచించిన 'ప్రజల మనిషి రాజన్న' పుస్తకాన్ని కేంద్ర మంత్రి ఆవిష్కరించారు.

గల్లా అరుణకుమారి రూ.కోటి విరాళం

స్వర్ణోత్సవాల వేళ కేఈసీఏ వ్యవస్థాపకురాలు, మాజీ మంత్రి గల్లా అరుణకుమారి ఉదారత చాటుకున్నారు. తన ఆత్మకథ పుస్తకం విక్రయాల ద్వారా వచ్చిన రూ.కోటి మొత్తాన్ని కేఈసీఏకు విరాళంగా ఇచ్చారు. అమరరాజ గ్రూప్ ఛైర్మన్, మాజీ ఎంపీ గల్లా జయదేవ్ మాట్లాడుతూ.. సమాజం నుంచి పొందిన దానిలో కొంతైనా తిరిగి ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, విద్యారంగానికి తమ మద్దతు కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఒక విద్యార్థితో మొదలైన ఈ ప్రయాణం నేడు వేల కుటుంబాలకు దారి చూపిందని గల్లా రామచంద్ర నాయుడు గుర్తుచేశారు. భవిష్యత్తులో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, సమగ్ర శిక్షణపై దృష్టి సారిస్తామన్నారు. మాజీ ఎంపీ మురళీమోహన్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, కేఈసీఏ అధ్యక్షురాలు డాక్టర్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



రూ.కోటి చెక్కును కేఈసీఏ అధ్యక్షురాలు రమాదేవికి అందజేస్తున్న మాజీ మంత్రి గల్లా అరుణకుమారి. చిత్రంలో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, మాజీ ఎంపీలు మురళీమోహన్, గల్లా జయదేవ్

తితిదే ఏఐ కమాండ్ కేంద్రం వంటిది మాకూ అవసరమే

తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్-1లో ఏర్పాటుచేసిన ఏఐ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రం తరహా సేవలు తమ శాఖలోనూ ప్రారంభించాలని ప్రయత్నిస్తున్నామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు తెలిపారు. శనివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో మాజీ ఎంపీ గల్లా జయదేవ్‌తో కలిసి ఆయన శ్రీవారిని దర్శించుకున్నారు. అదనపు ఈవో వెంకయ్య చౌదరి కేంద్ర మంత్రికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం శ్రీకాళహస్తి వెళ్లి ముక్కంటి దర్శనం చేసుకున్నారు. రెండు చోట్లా విలేకరులతో మాట్లాడారు. తితిదే ఏర్పాటు చేసిన ఏఐ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని బాగా తీర్చిదిద్దారని అభినందించారు. తామూ ఈ మోడల్ పరిశీలిస్తామని, ఈ విషయమై వారితో చర్చిస్తామన్నారు. ప్రయాణికుల సమాచారం, విమానాశ్రయాల కార్యకలాపాలను కమాండ్ కేంద్రం నుంచి నడిపిస్తే ప్రయాణికులకు మంచి సౌకర్యాలు అందించవచ్చని అభిప్రాయపడ్డారు. తిరుపతి నుంచి దేశంలోని పలు ప్రాంతాల్లో ఉన్న ఆధ్యాత్మిక కేంద్రాలకు విమాన సర్వీసులు అందుబాటులోకి తెచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు రామ్మోహన్‌నాయుడు తెలిపారు.

రైలు బొమ్మతో రంగుల నాణెం!



రూ.100 ముందు భాగం ★ నాణెంపై రంగులతో వందేభారత్ రైలు

దేశంలో విద్యుత్తు రైళ్ల పరుగులకు వందేళ్లు కావడంతో.. అందుకు గుర్తుగా కేంద్ర ప్రభుత్వం జనవరిలో రంగుల నాణెం విడుదల చేసింది. దీన్ని శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఏఎస్‌పేట మండలం అనుమసముద్రం గ్రామానికి చెందిన నాణెల సేకర్త మహ్మద్ వాయిజ్ సంపాదించారు. జనవరి 13న ఆన్‌లైన్‌లో రూ.8,072లకు కొనుగోలు చేయగా.. కోల్‌కతా మింట్ నుంచి శనివారం వచ్చిందని వాయిజ్ తెలిపారు. రూ.100 నాణెంపై వందేభారత్ రైలు రంగుల్లో మెరిసిపోతోంది. 35 గ్రాముల బరువున్న నాణేన్ని 50% వెండి, 40% రాగి, 5% చొప్పున నికెల్, జింక్ మిశ్రమాలతో చేశారు. – న్యూస్‌టుడే, అనుమసముద్రం పేట

లంచం తీసుకుంటూ పట్టుబడిన కర్ణాటక భాజపా ఎమ్మెల్యే



చంద్రు లమాణి

గదగ, న్యూస్‌టుడే: కర్ణాటకలోని గదగ జిల్లా శిరహట్టి నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ చంద్రు లమాణి (భాజపా) లంచం తీసుకుంటూ లోకాయుక్తకు చిక్కారు. రహదారి పక్కన గోడ నిర్మించిన విజయ్ పూజార్ అనే గుత్తేదారు నుంచి ఆయన రూ.11 లక్షలు డిమాండ్ చేశారు. లక్ష్మేశ్వరలోని తన ఆసుపత్రిలోనే బయానాగా రూ.5 లక్షలను తీసుకుంటూ ఎమ్మెల్యే దొరికిపోయారు. ఆయన వ్యక్తిగత కార్యదర్శి గురు లమాణి, సహాయకుడు మంజునాథ్‌లనూ అదుపులోనికి తీసుకున్నామని లోకాయుక్త అధికారులు తెలిపారు. ధార్వాడ లోకాయుక్త ఎస్పీ సిద్ధలింగప్ప నేతృత్వంలో అధికారులు, సిబ్బంది, దాడిలో పాల్గొన్నారు. నగదు డిమాండ్ చేస్తూ విజయ్‌కు చేసిన ఫోన్ కాల్ ఆడియో ఆధారంగా ఎమ్మెల్యేపై నిఘా ఉంచినట్లు సమాచారం. అరెస్టు గురించి విధానసభ స్పీకర్ యూటీ ఖాదర్‌కు సమాచారం అందించారు.



జీవితం క్రికెట్ హైలైట్స్‌లా ఉండదు

క్రికెట్ మ్యాచ్ హైలైట్స్‌లో అన్నీ బౌండరీ షాట్లే కనిపిస్తాయి. కానీ పూర్తి మ్యాచ్ చూసినప్పుడు బౌండరీల కన్నా బ్యాటర్ స్కోర్ చేయని బంతులే ఎక్కువన్న విషయం తెలుస్తుంది. సోషల్ మీడియాలో ఇతరులు పోస్ట్ చేసే ఫొటోలు, వీడియోలు కూడా హైలైట్స్ లాంటివే. వాటిని చూసి మీరు జీవితంలో వెనుకబడినట్లు భావించి చింతించకండి. వారి జీవితాల్లోనూ సమస్యలు, వైఫల్యాలుంటాయని తెలుసుకోండి. మీ జీవితంపై మాత్రమే దృష్టిపెట్టండి.

– శరణ్ శ్రీవత్స, ఆంత్రప్రెన్యూర్

అవాంతరాలు.. అధిగమించే యత్నాలు!

- వెలిగొండ టన్నెళ్ల పనుల్లో రోజువారీ లక్ష్యం చేరడంలో తగ్గుదల
- పనివారు దొరక్క.. ట్రాన్సిట్ మిక్సర్లతోనూ సమస్యలు
- సరిదిద్దుతున్న యంత్రాంగం
- 25న ముఖ్యమంత్రి సందర్శన

ఈనాడు, అమరావతి: కరవు ప్రాంతాలైన ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు కీలకమైన వెలిగొండ ప్రాజెక్టు నుంచి ఈ ఏడాది నీళ్లు ఇవ్వాలనేది లక్ష్యం. ఇది నెరవేర్చే క్రమంలో అనేక అవాంతరాలు ఎదురవుతున్నాయి. రోజువారీ లక్ష్యం సాధించకపోయినా- పనుల్లో అడుగులు పడుతున్నాయి. 2026 జులైనాటికి తొలిదశలో 1,19,000 ఎకరాలకు నీళ్లు ఇవ్వాలనేది లక్ష్యం. రూ.2,000 కోట్లకు పైగా ఖర్చుచేస్తే ప్రాజెక్టు తొలిదశ పూర్తిచేయడం సులభమే. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 25న వెలిగొండ ప్రాజెక్టును సందర్శించనున్నారు. శ్రీశైలం ప్రాజెక్టులో వరద జలాలను రెండు టన్నెళ్ల ద్వారా మళ్లించి నల్లమలసాగర్ జలాశయానికి తరలించి అక్కడ 53.85 టీఎంసీల నీరు నిలపాలి. ఆ నీటిని మూడు ప్రధాన కాలువల ద్వారా ఆయకట్టుకు అందించాలి. వచ్చే నీటి సంవత్సరంలో వరద సీజన్‌లో వెలిగొండ టన్నెళ్ల ద్వారా నల్లమలసాగర్ జలాశయం నింపే లక్ష్యంతో పనులు సాగుతున్నాయి.

శ్రామికుల కొరత

మొదటి టన్నెల్ పనులు దాదాపు పూర్తయ్యాయి. రెండో టన్నెల్‌లో 6,700 మీటర్లకు బెంచింగ్ పనులు పూర్తిచేశారు. లైనింగ్ పనులు 3,400 మీటర్లకు పైగా పూర్తయ్యాయి. మరో సగం పనిమిగిలింది. రోజుకు 20 మీటర్ల లక్ష్యంతో పనులు చేస్తున్నా 10-15 మీటర్ల లక్ష్యమే చేరిన రోజులూ ఉన్నాయి. పెండింగ్ లక్ష్యం కూడా జత కలిపి మరిన్ని పనులు చేయాలని చూస్తున్నా.. రోజువారీ లక్ష్యసాధనలోనే అవాంతరాలు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం వేసవి ఛాయలు ఏర్పడ్డాయి. టన్నెల్‌లో గాలి ఆడదు, ఉక్కపోత. దీంతో శ్రామికులు ఇబ్బందులు పడుతున్నారు. రోజూ టన్నెల్‌లో షిఫ్టుకు 120 మంది పనిచేయాలి. ప్రస్తుతం రెండు షిఫ్టుల్లో పని చేయిస్తున్నారు. అంతసేపు టన్నెళ్లలో పనివారు నిలబడాలంటే ఇబ్బంది పడుతూ వెళ్లిపోతున్నారు. షిఫ్టుల సంఖ్య పెంచాలని, అదనపు పనివారిని తెచ్చుకోవాలని అధికారులు గుత్తేదారులకు సూచించారు. పనివారి కొరత వల్ల కూడా లక్ష్యం చేరుకోవడం కష్టమవుతోంది.

ట్రాన్సిట్ మిక్సర్ల సమస్యలు

ట్రాన్సిట్ మిక్సర్ల సమస్య కూడా కొంత ఇబ్బంది పెట్టింది. ఎప్పట్నుంచో వాటినే వాడడంతో అనుకున్నంత మేర అవి పని చేయట్లేదు. తాజాగా 15 ట్రాన్సిట్ మిక్సర్లు కొత్తవి తెచ్చారని అధికారులు చెబుతున్నారు. సమస్యలపై గుత్తేదారులతో చర్చించామంటున్నారు.

నీటిమట్టం తగ్గితే..

టన్నెళ్ల వద్ద హెడ్ రెగ్యులేటర్లు, రిటైనింగ్ వాల్, వింగ్‌లు, రిటర్న్‌ల నిర్మాణం పూర్తిచేయాలి. ఇంకా 2,100 క్యూబిక్ మీటర్ల పనిచేయాలి. శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం 840 అడుగులకు తగ్గితే పని చేసుకోవడానికి వీలవుతుంది. దిగువన నీటి సరఫరా అవసరాలు ఉన్నందున త్వరలోనే నీటిమట్టం తగ్గే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు. ఫీడర్ కాలువ, నల్లమలసాగర్ నుంచి కాలువలకు నీళ్లు మళ్లించే హెడ్ రెగ్యులేటర్ పనులు జరుగుతున్నాయి. కొంత వేగం పెరగాలి.

బడ్జెట్ రూ.492 కోట్లు

వచ్చే ఆర్థిక సంవత్సరంలో వెలిగొండ ప్రాజెక్టుకు రూ.492 కోట్లు కేటాయించారు. ఈ ప్రభుత్వం వచ్చాక గత ఆర్థిక సంవత్సరంలో రూ.284 కోట్ల బిల్లులు చెల్లించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మరో రూ.300 కోట్లు చెల్లించారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.492 కోట్లు కేటాయించినా ఈ నిధులు సకాలంలో ఖర్చుచేస్తే అదనపు బడ్జెట్ ఇచ్చేందుకు సిద్ధమని ప్రభుత్వవర్గాలు చెబుతున్నాయి.

పోలవరం నిర్మాణ పనులు 81.45% పూర్తి

- భూసేకరణ, సహాయ, పునరావాసం 27.40%
- 2025 అక్టోబరు నాటికి పనుల పురోగతి వెల్లడించిన జలశక్తి శాఖ

ఈనాడు, దిల్లీ: పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు 2025 అక్టోబరు నాటికి 81.45% పూర్తయినట్లు కేంద్ర జలశక్తి శాఖ వార్షిక నివేదిక వెల్లడించింది. భూసేకరణ, సహాయ, పునరావాస కల్పన 27.40% చేసినట్లు తెలిపింది. ప్రాజెక్టు నిర్మాణ పనులు, భూసేకరణ, సహాయ, పునరావాస కార్యక్రమాలను కలిపి చూస్తే ఓవరాల్‌గా 60.40% పూర్తయినట్లు పేర్కొంది. ఈ వార్షిక లెక్కల ప్రకారం ఏడాదిలో ప్రాజెక్టు ఓవరాల్ పనుల్లో 6.94% మేర పురోగతి నమోదైంది. ఇందులో నిర్మాణ పనుల్లో 4.66%, సహాయ-పునరావాసంలో 4.82% వృద్ధి కనిపించింది. ప్రాజెక్టులో తొలిదశ కింద (41.15 మీటర్ల వరకు) ముంపునకు గురయ్యే కుటుంబాలు 38,060 మేర ఉండగా ఇప్పటివరకు 14,371 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. గతేడాది కాలంలో కొత్తగా 1,574 కుటుంబాలను ముంపు ప్రాంతం నుంచి తరలించినట్లు వార్షిక లెక్కలు వెల్లడించాయి. ఇంకా 23,689 కుటుంబాలను తరలించాల్సి ఉంది. 2025 డిసెంబరు నాటికి మట్టి పనులు 90.20%, కాంక్రీట్ పనులు 85%, స్ట్రక్చర్స్ 55% పూర్తయినట్లు నివేదిక వెల్లడించింది.

ఏడాది కాలంలో ప్రాజెక్టు పనులు సాగిన తీరిలా (%లో)

వివరం	2024 నవంబరు నాటికి	2025 అక్టోబరు నాటికి
హెడ్‌వర్క్స్	74.27	81.61
కుడి ప్రధాన కాలువ	92.75	92.79
ఎడమ ప్రధాన కాలువ	72.62	73.40
మొత్తం నిర్మాణ పనులు	76.79	81.45
భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్	22.58	27.40
ఓవరాల్‌గా ప్రాజెక్టు పనులు	53.46	60.40

స్థానిక సంస్థల్లో పార్టీ బలం పెంచేలా సభ్యత్వ నమోదు

- జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్



ఈనాడు, అమరావతి: 'జనసేన సభ్యత్వ నమోదు పవన్‌కల్యాణ్ ఉన్నత ఆలోచనలు, ఆశయాలతో నిండిన మహాయజ్ఞం. భవిష్యత్తులో పార్టీ కార్యక్రమాల నిర్వహణ, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి బలాన్ని సమీకరించేలా ఈ బాధ్యత నిర్వర్తించాలి' అని పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కోరారు. ఆయన పార్టీ సమన్వయకర్తలతో శనివారం సభ్యత్వ నమోదుపై టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమానికి పార్లమెంటు నియోజకవర్గాల వారీగా సమన్వయకర్తలను పార్టీ అధ్యక్షులే నియమించారన్నారు.

పార్టీకి సమయం కేటాయించాలి

''ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు చట్టసభల సమావేశాలకు హాజరవుతూనే మిగిలిన సమయాన్ని పూర్తిగా పార్టీకి కేటాయించాలి. క్షేత్రస్థాయిలో నాయకత్వాన్ని బలోపేతం చేయాలి. స్థానికంగా దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తే పార్టీకి, ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంది. ప్రతివారం నాయకులు సమావేశాలు ఏర్పాటు చేసుకుని ఎన్ని సభ్యత్వాలు చేశాం? ఇంకా ఎంత అవకాశముందో లెక్కలు వేసుకోవాలి. క్షేత్రస్థాయిలో పార్టీకి సానుకూలతలు, ప్రతికూలతలపై స్పష్టమైన అభిప్రాయాలు సేకరించి నివేదికలు ఇవ్వాలి'' అని మనోహర్ తెలిపారు.

కొత్త సభ్యులే పార్టీకి బలం: పి.హరిప్రసాద్, ఎమ్మెల్సీ

''పార్టీలో కొత్త సభ్యులను చేర్చడమే అదనపు బలం. జెన్‌జీని పార్టీకి దగ్గర చేయాలి. గతంలో ప్రతి నియోజకవర్గం నుంచి ఇన్‌ఛార్జికే బాధ్యత ఉండేది. ఇప్పుడు పార్టీ అధ్యక్షుడు ప్రతి నియోజకవర్గంలో కీలకమైన ఇతర నాయకులను భాగస్వాములను చేసేలా నిర్ణయం తీసుకున్నారు. కిందటిసారి 12.6 లక్షల మంది పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. ఈ ఏడాది రెట్టింపు కంటే అధికంగా పార్టీకి కొత్త సభ్యులను చేర్చాలి'' అని హరిప్రసాద్ సూచించారు.

25 నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జుల నియామకం

సభ్యత్వ నమోదు కోసం 25 పార్లమెంటు నియోజకవర్గాల వారీగా ఇన్‌ఛార్జులను జనసేన పార్టీ నియమించింది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి... శ్రీకాకుళం- కోరికాన రవికుమార్, విజయనగరం- లోకం నాగమాధవి, విశాఖపట్నం- వంశీకృష్ణ శ్రీనివాస్, అనకాపల్లి: పంచకర్ల రమేష్‌బాబు, అరకు- సుందరపు విజయకుమార్, కాకినాడ- తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, అమలాపురం: బత్తుల బలరామకృష్ణ, రాజమండ్రి- కందుల దుర్గేష్, నరసాపురం: చిల్లపల్లి శ్రీనివాసరావు, ఏలూరు: గిడ్డి సత్యనారాయణ, విజయవాడ: బొమ్మిడి నాయకర్, మచిలీపట్నం: వల్లభనేని బాలశౌరి, గుంటూరు: పిడుగు హరిప్రసాద్, నరసరావుపేట: పంతం నానాజీ, బాపట్ల: పత్సమట్ల ధర్మరాజు, ఒంగోలు: కొణతాల రామకృష్ణ, నెల్లూరు: బొలిశెట్టి శ్రీనివాస్, కడప: టి.సి.వరుణ్, రాజంపేట: కల్యాణం శివ శ్రీనివాసరావు, కర్నూలు: చిలకం మధుసూదన్‌రెడ్డి, నంద్యాల: కిలారు రోశయ్య, అనంతపురం: పి.హరిప్రసాద్, హిందూపురం: ఎస్.కె.రియాజ్, చిత్తూరు: వేగుళ్ల లీలాకృష్ణ, తిరుపతి: ఆరణి శ్రీనివాసులు.

పెట్టుబడి వాతావరణానికి నష్టం కలిగించిన వ్యక్తి జగన్

- అలాంటి వ్యక్తి 'యూత్ కాంగ్రెస్' నిరసనలపై ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు నటిస్తున్నారు: లోకేశ్



ఈనాడు, అమరావతి: పెట్టుబడి వాతావరణానికి దేశంలో అత్యంత ఎక్కువ నష్టం చేసిన వ్యక్తి వైకాపా అధినేత జగన్ అని మంత్రి నారా లోకేశ్ మండిపడ్డారు. అలాంటి వ్యక్తి ఇప్పుడు దేశ ప్రయోజనాల కోసం చింతిస్తున్నట్లు నటించడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. దిల్లీలో ఏఐ ఇంపాక్ట్ సదస్సులో యూత్ కాంగ్రెస్ నిరసనలపై జగన్ ఆందోళన వ్యక్తం చేయడం ఆయన ద్వంద్వ వైఖరికి నిదర్శనమని ఎక్స్ వేదికగా శనివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్టుబడుల్ని అడ్డుకోవడానికి, పారిశ్రామికవేత్తల్ని బెదిరించడానికి గతంలో జగన్ చేసిన చర్యలని పలు సంఘటనల్ని ఈ సందర్భంగా మంత్రి వివరించారు. '2017లో ఇన్వెస్ట్‌మెంట్ సదస్సుకు భంగం కలిగించేందుకు ఎయిర్‌పోర్టు వద్ద ధర్నా చేశారు. 2019లో ప్రపంచ పెట్టుబడిదారులతో కుదుర్చుకున్న విద్యుత్తు ఒప్పందాల్ని రద్దు చేశారు. 2020లో అమరావతిలో సింగపూర్ ప్రభుత్వం పెట్టుబడుల్ని అడ్డుకున్నారు. 2025లో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న నిధుల సమీకరణను అడ్డుకోవడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు లేఖ రాశారు. 2026లో (ఇప్పుడు) ఏఐ సదస్సులో చోటుచేసుకున్న ఘటనపై ఆందోళన అంటూ అకస్మాత్తుగా నటిస్తున్నారు'' అని ఎద్దేవా చేశారు.

ఇంటివద్దకే సీతారామచంద్రుల కల్యాణ తలంబ్రాలు: తెలంగాణ ఆర్టీసీ

ఈనాడు, హైదరాబాద్: శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో జరిగే శ్రీసీతారామచంద్రుల కల్యాణోత్సవ తలంబ్రాలను భక్తులకు అందించాలని తెలంగాణ ఆర్టీసీ నిర్ణయించింది. మార్చి 27న శ్రీసీతారామచంద్రుల కల్యాణోత్సవం అనంతరం తలంబ్రాలను భక్తులకు ఆర్టీసీ హోం డెలివరీ చేయనుంది. తెలుగు రాష్ట్రాల భక్తుల సౌలభ్యం మేరకు ఈ ఏర్పాట్లు చేసినట్లు ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి తెలిపారు. 'ఆర్టీసీ లాజిస్టిక్స్ కేంద్రాల్లో రూ.151 చెల్లించి..వివరాలు నమోదు చేసుకోవాలి. ఆర్టీసీ వెబ్‌సైట్ ద్వారా కూడా బుకింగ్ చేసుకుని తలంబ్రాల ప్యాకెట్లను భక్తులు పొందవచ్చు. వివరాలకు 040-23450033, 040-69440069 ఫోన్ నంబర్లను సంప్రదించండి' అని ఆర్టీసీ సూచించింది.

వైకాపాకు దేవుడంటే భయం భక్తీ లేవు

హోంమంత్రి అనిత



బజ్జీలు వేస్తున్న హోంమంత్రి అనిత

నక్కపల్లి, న్యూస్‌టుడే: దేవుడంటే వైకాపా నేతలకు భయం భక్తీ లేవని హోంమంత్రి అనిత దుయ్యబట్టారు. ఆ పార్టీ సభ్యులు శాసనమండలిలో స్వామివారి చిత్రపటాలను జోళ్లు, బూట్లు వేసుకుని ప్రదర్శించారని, అది క్షమించరాని అపరాధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం ఉపమాకలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణోత్సవ ఏర్పాట్లను శనివారం ఆమె పరిశీలించారు. అనంతరం ఆలయ ఆవరణ బయటకు వచ్చిన ఆమె ఓ బజ్జీల దుకాణం వద్దకు వెళ్లి యజమానితో మాట్లాడారు. వారి నుంచి పిండి తీసుకుని కొన్ని బజ్జీలు వేశారు.

ఆప్కోతో తితిదే ఒప్పందం

కండువాలు, శాలువాలు, ఇతర వస్త్రాల కోసం ఆర్డర్

ఈనాడు, అమరావతి: శ్రీవారిని దర్శించుకునే భక్తులు, ప్రముఖులకు వేదాశీర్వచనంలో అందజేసే కండువాలు, శాలువాలు, దుప్పటాలు, కాటన్ బ్లౌజ్‌ల సరఫరా కోసం ఆప్కోతో తితిదే ఒప్పందం చేసుకొంది. ఇప్పటికే తితిదే మార్కెటింగ్ విభాగం నుంచి ఆప్కోకు ఆర్డర్ కాపీ వచ్చింది. మొదటి విడతగా 3 వేల కండువాలు, 5 వేల శాలువాలు, 90 వేల కాటన్ అప్పర్‌లు, 75 వేల కాటన్ బ్లౌజ్‌లు సరఫరా చేయనున్నారు. వీటిపై 'ఓం నమో వేంకటేశాయ' అని తెలుగు, సంస్కృతంలో ముద్రించాలని తితిదే స్పష్టం చేసింది. ఆప్కో చరిత్రలో తితిదే ఒప్పందం చేసుకోవడం ఇదే తొలిసారని మంత్రి సవిత తెలిపారు. ఈ మేరకు తితిదే పాలకమండలికి ధన్యవాదాలు తెలియజేశారు.

ఇప్పటికీ అనంతబాబును సమర్థిస్తారా జగన్?

ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు

ఈనాడు, అమరావతి: డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసుపై సుప్రీంకోర్టు చీవాట్లు పెట్టినా ఎమ్మెల్సీ అనంతబాబును సమర్థిస్తారా? అని వైకాపా అధినేత జగన్‌ను తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు ప్రశ్నించారు. అప్పట్లో బెయిల్‌పై బయటకు వచ్చిన అనంతబాబుకు జగన్ రెడ్‌కార్పెట్ వేశారని, ఇప్పటికీ పెంచి పోషిస్తున్నారని మండిపడ్డారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు.

పెళ్లిచూపుల భవనంగా మారిన బిహార్ ప్రయాణికుల షెడ్డు

ఉత్తర భారతదేశంలో పెళ్లికి ముందు అమ్మాయి, అబ్బాయిల పరిచయ కార్యక్రమం చాలా ముఖ్యమైన రివాజు. దీని కోసం ఫంక్షన్ హాళ్లు, రెస్టారెంట్లకు వెళ్లే ఆర్థికస్తోమత అందరికీ ఉండదు కాబట్టి చాలామంది దేవాలయాలను వేదికగా చేసుకొంటూ ఉంటారు. ఇటువంటి కుటుంబాలకు అనుకూలంగా బిహార్‌లోని జిల్లా కేంద్రం జముయిలో 'దేఖా దేఖీ భవన్' ఏర్పాటైంది. ఈ భవనంలో రెండు వైపులా కూర్చొని మాట్లాడుకునే పెద్దలు, వారి మధ్య ఇటూ అటూ నిలబడి సిగ్గులొలుకుతూ కళ్లతోనే ఊసులాడుకునే యువజంటల దృశ్యాలు బయటి నుంచి చూసేవారికి భలే గమ్మత్తుగా అనిపిస్తాయి. గతంలో ప్రయాణికుల షెడ్డుగా ఉండి శిథిలావస్థకు చేరిన ఈ నిర్మాణాన్ని సమీపంలోని కాళీమాత గుడి వ్యవస్థాపకుడైన అశోక్‌సింగ్ ఆలయ కమిటీ తరఫున పునరుద్ధరించారు. వెనుకవైపు మరుగుదొడ్లు నిర్మించి.. షెడ్డు లోపల కూర్చునేందుకు బల్లలు, లైట్లు, ఫ్యాన్లు, మంచినీటి సదుపాయాలు కల్పించారు. దీనికి పెళ్లిచూపుల భవనంగా నామకరణం కూడా చేశారు. ఆలయ కమిటీ నిర్వహణలో ఉన్న ఈ షెడ్డుకు గతంలో ఉన్న ఎంపీ సైతం నిధులు ఇచ్చి సహకరించారు. ఇటువంటి భవనాలు అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేయాలని ఇక్కడికి వచ్చినవారు కోరుతున్నారు.



ఐసీయూ నుంచి వచ్చి.. ఆక్సిజన్ సాయంతో పరీక్ష

చండీగఢ్‌కు చెందిన కనిష్కా బిష్త్ (17) అనే విద్యార్థిని ఆసుపత్రి నుంచి అంబులెన్సులో నేరుగా పరీక్ష కేంద్రానికి వచ్చి ఆక్సిజన్ సాయంతో 12వ తరగతి బోర్డు పరీక్షను రాసింది. ఆమెతోపాటు వైద్య సహాయకులు కూడా వచ్చారు. బాల్యం నుంచీ ఆరోగ్య సమస్యలున్న కనిష్క గత నెల రోజులకు పైగా తీవ్రమైన నిమోనియాతో పోరాడుతోంది. ఐసీయూలో ఉన్న 13 రోజుల్లో పది రోజులు వెంటిలేటరు పైనే ఉంచారు. మూడు రోజుల కిందటే వెంటిలేటరు తొలగించారు. వైద్యులు, కుటుంబసభ్యులు వారించినా ససేమిరా అంటూ ఆమె చండీగఢ్‌లోని మనీమాజరా ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటుచేసిన కేంద్రానికి వచ్చి ఫిజిక్స్ పరీక్ష రాసింది. స్ట్రెచరుపై ఆమెను లోపలికి తీసుకువచ్చారు. కనిష్క ఆరోగ్య పరిస్థితి కారణంగా సీబీఎస్ఈ బోర్డు ఓ గంట అదనపు సమయం ఇచ్చింది. ఈ నెల 18 నుంచి పరీక్షలు మొదలుకాగా, కష్టమైనా అన్ని పరీక్షలు రాస్తానంటున్న కనిష్క పట్టుదల చూసి గర్వపడుతున్నట్లు తండ్రి ప్రేమ్‌సింగ్ తెలిపారు.



కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడిని తొలగించండి

- ప్రధానికి రోహిత్ పవార్ లేఖ
- అవి నిరాధార ఆరోపణలు: తెదేపా

ముంబయి: విమాన ప్రమాదంలో మహారాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి అజిత్‌పవార్ దుర్మరణం చెందడంపై విచారణ పూర్తయ్యేవరకు పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడిని ఆ పదవి నుంచి తొలగించాలని ఎన్సీపీ (ఎస్పీ) ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే రోహిత్ పవార్ డిమాండ్ చేశారు. దర్యాప్తుపై ప్రభావం పడకుండా చూసేందుకు ఇది అవసరమంటూ ప్రధాని మోదీకి శనివారం లేఖ రాశారు. కూలిపోయిన విమానాన్ని నిర్వహిస్తున్న వీఎస్ఆర్ వెంచర్స్ కంపెనీతో నాయుడుకు సంబంధాలున్నాయని శనివారం దిల్లీలో విలేకరుల సమావేశంలో ఆరోపించారు. తలెత్తుతున్న తీవ్రమైన ప్రశ్నలపై స్వతంత్ర దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు.

■ మంత్రిపై రోహిత్ చేసిన ఆరోపణలు రాజకీయ ప్రేరేపితమని తెదేపా తోసిపుచ్చింది. ఇవి పూర్తి నిరాధారమని పార్టీ వర్గాలు ఖండించాయి. పవార్ దుర్మరణంతో నాయుడుకు, తెలుగుదేశం పార్టీకి సంబంధం లేదన్నాయి. దర్యాప్తు సంస్థల్ని స్వతంత్రంగా పనిచేయనివ్వాలని, అంతా పారదర్శకంగా ఉంటుందని స్పష్టంచేశాయి. అజిత్ పవార్ అంటే తమకెంతో గౌరవమని, ప్రమాదానికి ఎవరైనా కారణమైఉంటే వారికి జవాబుదారీతనాన్ని నిర్ణయించాలని పేర్కొన్నాయి.




మీరు ఎదుగుతున్నప్పుడు కొన్నింటిని కోల్పోతారు

జీవితంలో మీరు ఒక్కో మెట్టు ఎక్కేకొద్దీ మీ నుంచి కొన్ని దూరమవుతుంటాయి. మీ అలవాట్లు, స్నేహాలు, ఇంకా చెప్పాలంటే ఒకప్పటి మిమ్మల్ని కూడా మీరు కోల్పోతారు. అయితే ఇవేవీ మీకు జరిగిన నష్టాలు కాదు, మీ ఎదుగుదలకు ప్రతీకలు.
– నిత్యశ్రీ, కంటెంట్ క్రియేటర్

ఖనిజ రంగంలో సహకారానికి
భారత్-బ్రెజిల్ ఒప్పందం

- మోదీ, లులా చర్చలు

దిల్లీ: రానున్న ఐదేళ్ల కాలంలో వార్షిక ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 3,000 కోట్ల డాలర్ల స్థాయికి తీసుకెళ్లాలని భారత్-బ్రెజిల్ నిర్ణయించాయి. ప్రధాని మోదీ, బ్రెజిల్ అధ్యక్షుడు లులా డసిల్వాల మధ్య శనివారం జరిగిన చర్చల పర్యవసానంగా ఇరు దేశాలు కీలక ఖనిజాల రంగంలో సహకారం ఇచ్చిపుచ్చుకునేందుకు ఉద్దేశించిన ఒప్పందంపై సంతకాలు చేశాయి. అనేక ద్వైపాక్షిక అంశాలతోపాటు, ట్రంప్ సుంకాలను రద్దుచేస్తూ అమెరికా సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు పర్యవసానాలపై లులా, మోదీ చర్చించుకున్నారు. రక్షణ, ఇంధనం, వైద్యసేవ, డిజిటల్ మౌలిక సదుపాయాలు వంటి అనేక ఇతర రంగాల్లోనూ సంబంధాలను బలోపేతం చేయాలని ఇరుదేశాల నేతలూ నిర్ణయించారు. ఉగ్రవాదం, దానికి మద్దతునిచ్చేవారు మానవాళికి శత్రువులన్న విషయంపై భారత్, బ్రెజిల్ ఏకాభిప్రాయానికి వచ్చాయని మోదీ అన్నారు. కశ్మీర్‌లో ఉగ్రదాడుల్ని బ్రెజిల్ అధ్యక్షుడు ఖండించారు. అయితే ఏ మతానికీ, జాతికీ ఉగ్రవాదంతో లంకె పెట్టకూడదని అభిప్రాయపడ్డారు. ఏఐ సదస్సులో పాల్గొనడంతో పాటు మోదీతో చర్చల కోసం లులా ఈ నెల 18న భారత్‌కు వచ్చారు.



దిల్లీలోని హైదరాబాద్ హౌస్ వద్ద ప్రధాని మోదీతో బ్రెజిల్ అధ్యక్షుడు లులా డసిల్వా

గణాంకాలు కాదు.. విశ్వాసానికి ప్రతీక

భారత్-బ్రెజిల్ వాణిజ్య సహకారం కేవలం గణాంకాలకు పరిమితం కాదని, అది ఇరుదేశాల పరస్పర విశ్వాసానికి ప్రతీక అని లులా సమక్షంలో విడుదల చేసిన ప్రకటనలో మోదీ పేర్కొన్నారు. కృత్రిమ మేధ, సూపర్ కంప్యూటర్లు, సెమీ కండక్టర్లు వంటి రంగాల్లో పరస్పర సహకారానికి ఇరు దేశాలూ ప్రాధాన్యం ఇస్తున్నాయని చెప్పారు.

యువజన కాంగ్రెస్.. 'లష్కరే రాహుల్': భాజపా

- దేశవ్యాప్తంగా నిరసనలు

దిల్లీ, ముంబయి: కృత్రిమ మేధ సదస్సులో యువజన కాంగ్రెస్ కార్యకర్తలు చొక్కాల్లేకుండా నిరసన తెలపడానికి వ్యతిరేకంగా భాజపా పలు రాష్ట్రాల్లో శనివారం ప్రదర్శనలు నిర్వహించింది. యువజన కాంగ్రెస్ చర్య అంతర్జాతీయ వేదికపై దేశానికి తలవంపులు తెచ్చిందని ఆరోపించింది. రాహుల్ దిష్టిబొమ్మను దహనం చేసింది. ఉగ్రవాద సంస్థ పేరు స్ఫురించేలా యువజన కాంగ్రెస్ కార్యకర్తల్ని "లష్కరే రాహుల్" అని అభివర్ణించింది. యువజన కాంగ్రెస్ చర్యను దేశద్రోహంగా పేర్కొంది. ఏఐ సదస్సు వేదిక వద్ద యువజన కాంగ్రెస్ కార్యకర్తలు శుక్రవారం కొద్దిసేపు నిరసన ప్రదర్శన నిర్వహించిన విషయం విదితమే. కాంగ్రెస్ చేసింది దేశద్రోహంతో సమానమని భాజపా అధికార ప్రతినిధి సుధాంశు త్రివేది అన్నారు. మరోవైపు.. కోర్టుకు హాజరయ్యేందుకు ఠాణె జిల్లాలోని భివండీకి రాహుల్ వెళ్తున్నప్పుడు ఒక టోల్‌ప్లాజా వద్ద భాజపా కార్యకర్తలు నల్లజెండాలు చూపారు. దిల్లీలో అరెస్టయిన నలుగురు యువజన కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు శనివారం కోర్టులో హాజరుపరిచారు. వారికి ఐదు రోజుల పోలీసు కస్టడీ విధించారు.



దిల్లీలో భాజపా శ్రేణుల ఆందోళన

కేరళలో దాదాపు 9 లక్షల ఓటర్ల తొలగింపు

'సర్' ప్రక్రియ అనంతరం తుది జాబితా విడుదల చేసిన ఈసీఐ

తిరువనంతపురం: ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) ప్రక్రియ అనంతరం కేరళ ఓటర్ల తుది జాబితాను కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీఐ) శనివారం విడుదల చేసింది. ఈ జాబితాలో మొత్తం 2.69 కోట్ల ఓటర్లు ఉన్నారు. సర్ ప్రక్రియకు ముందు ఆ సంఖ్య 2.78 కోట్లుగా ఉండేదని, దాదాపు 9 లక్షల మంది ఓటర్ల పేర్లను ద్వారా తొలగించినట్లు ఈసీఐ తెలిపింది. సవరించిన తుది జాబితా ఓటర్లలో 1.31 కోట్ల మంది పురుషులు, 1.38 కోట్ల మంది మహిళలు, 277 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 16 మధ్య సవరణల కోసం నాలుగు లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయని ఈసీఐ వెల్లడించింది.

రష్యాను భయపెట్టిన ఉక్రెయిన్

1,400 కిలోమీటర్ల దూరంలోని ప్లాంట్‌పై దాడి

కీవ్: రష్యాపై ఉక్రెయిన్ శుక్రవారం తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. సరిహద్దు నుంచి 1,400 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉడ్ముర్ట్ రిపబ్లిక్‌లోని వొట్కిన్స్క్ మెషిన్ ప్లాంట్‌పై దాడి చేసింది. ఇస్కందర్ క్షిపణులను ఈ ప్లాంట్‌లోనే రష్యా ఉత్పత్తి చేస్తోంది. ఖండాంతర క్షిపణులు కూడా ఇక్కడే తయారవుతాయి. ఈ ప్లాంట్‌పై ఉక్రెయిన్ దేశీయంగా తయారు చేసిన ఫ్లెమింగో క్షిపణులు ప్రయోగించినట్లు తెలుస్తోంది. వీటి పరిధి 3 వేల కిలోమీటర్లు. ఈ దాడిలో 11 మందికి గాయాలయ్యాయి. బెల్గరోడ్ ప్రాంతంపైనా ఉక్రెయిన్ డ్రోన్ దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడులకు ప్రతిగా ఉక్రెయిన్‌లోని రష్యా ఒడెసా, సుమీ నగరాలపై దాడి చేసింది.

ఆరోగ్యకర వాతావరణం.. జీవించే హక్కులో భాగం



- పౌరుల్ని మమేకం చేయండి: సుప్రీంకోర్టు

దిల్లీ: పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యకరమైన వాతావరణం.. జీవించే హక్కులో విడదీయరాని భాగమేనని సుప్రీంకోర్టు పేర్కొంది. ఘనవ్యర్థాల నిర్వహణ నియమాల అమలులో నెలకొన్న లోపాలను ఎత్తిచూపుతూ.. వ్యర్థాల సమర్థ నిర్వహణకు నేటి తరం నడుం బిగించాలని, ప్రభుత్వం చట్టాలు రూపొందించి చర్యలు చేపట్టే వరకూ చూస్తూ ఊరుకోవడం తగదని స్పష్టంచేసింది. ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్న 'ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు-2026'కు సంబంధించి కోర్టు అనేక మార్గనిర్దేశకాలు జారీ చేసింది. ఘన వ్యర్థాలను నిర్లక్ష్యం చేయడం ప్రజల ఆరోగ్యంపై, దేశ ఆర్థికంపై ప్రభావం చూపుతుందని జస్టిస్ పంకజ్ మిథల్, జస్టిస్ ఎస్.వి.ఎన్.భట్‌ల ధర్మాసనం పేర్కొంది. భారత్ వైపు ప్రపంచ దేశాలు గౌరవప్రదమైన దృష్టితో చూస్తున్న తరుణంలో దేశం యావత్తూ ఘన వ్యర్థాల నిబంధనల్ని సమర్థంగా పాటించక తప్పదని అభిప్రాయపడింది. ఇళ్లవద్దే తడి, పొడి చెత్తగా విభజించే ప్రక్రియ ఇప్పటికీ జరగడం లేదని ఇటీవలి తీర్పులో వ్యాఖ్యానించింది. వ్యర్థాలను ప్రక్షాళించే చర్యలు చేపడుతున్నప్పటికీ ఇప్పటికీ మెట్రోపాలిటన్ ప్రాంతాల్లో భారీ డంపింగ్ యార్డులు కొనసాగుతున్నాయని తెలిపింది. పర్యావరణాన్ని పరిరక్షించి, పౌరుల సుఖజీవనాన్ని పదిలపరచాలని కోర్టు అనేక సార్లు ప్రభుత్వానికి తెలియజేసిందని గుర్తుచేసింది. ప్రజల్లో అవగాహన పెంపొందించే బాధ్యతను పురపాలక కౌన్సిలర్లు, ఛైర్‌పర్సన్లు, మేయర్లు తదితరులపై ఉంచుతున్నామని తెలిపింది. ప్రతి స్థానిక సంస్థా ఒక గడువును విధించుకొని లక్ష్యం సాధించాలని న్యాయమూర్తులు పేర్కొన్నారు. నిబంధనల అమలులో తాత్సారాన్ని అధికారిక వైఫల్యంగా కొట్టిపారేయకుండా ఉల్లంఘనులపై జరిమానాలు వంటి చర్యలు చేపట్టాలని ఆదేశించింది.


బంతి ఇంట్లో పడిందని.. పిల్లలపై టీచర్ కాల్పులు

ఈటీవీ భారత్: విద్యార్థులకు మంచీచెడు చెప్పాల్సిన ఉపాధ్యాయుడే విచక్షణ కోల్పోయాడు. పిల్లలు ఆడుకుంటున్న బంతి తన ఇంటిలో పడిందన్న కోపంతో వారిపై తుపాకీతో కాల్పులకు తెగబడ్డాడు. భయంతో పరుగులు తీసిన పిల్లల్లో ఒక బాలుడి చేతికి బుల్లెట్ తగిలింది. పశ్చిమబెంగాల్‌లోని ముర్శిదాబాద్ జిల్లా రఘునాథ్‌గంజ్ ఠాణా పరిధి బనిపుర్ ప్రాంతంలో శుక్రవారం ఈ ఘటన జరిగింది. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడైన నిందితుడు సమీర్‌కుమార్ మండల్‌ను పోలీసులు అరెస్టు చేశారు. గాయపడిన బాలుడు ఆసుపత్రిలో కోలుకొంటున్నాడు. నిందితుడి తుపాకీ స్వాధీనం చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ చెప్పారు.



పంజాబ్‌లో కత్తులు చేతబట్టి.. దొంగలను తరిమిన వీరనారి

ఇంటర్నెట్ డెస్క్: రాత్రివేళ దారిదోపిడీకి ప్రయత్నించిన దుండగుల ఆట కట్టించేందుకు ఓ మహిళ అసమాన ధైర్య సాహసాలను ప్రదర్శించారు. రెండు చేతుల్లో కత్తులు పట్టుకొని వారికి ఎదురెళ్లారు. దీంతో దొంగలు తోక ముడిచారు. హర్‌జిందర్ కౌర్ అనే ఎన్ఆర్ఐ మహిళ ఇటీవలే ఆస్ట్రేలియా నుంచి పంజాబ్ వచ్చారు. కుటుంబసభ్యులతో కలిసి లుధియానాలోని బంధువుల ఇంటికి కారులో బయల్దేరగా.. మధ్యలో బైకుపై వచ్చిన ఇద్దరు దారిదోపిడీకి ప్రయత్నించారు. వాహనం నడుపుతున్న హర్‌జిందర్ కత్తులతో రోడ్డు మీదకు వచ్చి దొంగలను తరిమారు. పోలీసులు నిందితులను అరెస్టు చేశారు.



ఐదేళ్లలో చొరబాటుదారులనూ తరిమేస్తాం: అమిత్ షా

గువాహటి: రాబోయే ఐదేళ్లలో చొరబాటుదారుల్ని ఓటరు జాబితాల నుంచే మాత్రమే కాదు దేశం నుంచీ తరిమేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా శనివారం వ్యాఖ్యానించారు. అస్సాంలోని కామ్‌రూప్‌లో పదో అస్సాం బెటాలియన్ కొత్త క్యాంపస్ శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన ప్రసంగించారు. "నక్సలిజం నుంచి విముక్తి పొందుతున్నట్లే.. అక్రమవలసదారుల ఏరివేత కూడా సాధ్యమే. చొరబాటుదారుల్ని వారు నివసిస్తున్న స్థలం నుంచి తరిమికొట్టడమే కాదు. వేరే చోట స్థిరపడకుండా దేశం నుంచి బయటకు పంపించాలి. అక్రమ వలసదారులను తరిమేస్తామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ గతంలో చెప్పారు. కానీ వారు ఆ పని చేయరు. ఎందుకంటే వారే ఆ పార్టీ ఓటు బ్యాంకు" అని అమిత్ షా పేర్కొన్నారు. రానున్న ఐదేళ్లలో ఈశాన్య భారత్‌లో అస్సాం పారిశ్రామిక కేంద్రంగా మారుతుందని ఆయన పేర్కొన్నారు.

వచ్చేనెల 31 నాటికి నక్సలిజాన్ని నిర్మూలిస్తాం..

అంతకుముందు అమిత్ షా అస్సాంలో తొలిసారిగా జరిగిన సీఆర్పీఎఫ్ 87వ డే పరేడ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వచ్చేనెల 31 నాటికి దేశంలో నక్సలిజాన్ని నిర్మూలిస్తామని వ్యాఖ్యానించారు. "మూడేళ్లలోనే మావోయిస్టుల వెన్నువిరిచి భద్రతా దళాలు గొప్ప విజయం సాధించాయి. 12 ఏళ్ల క్రితం ఉగ్రవాదంతో జమ్మూకశ్మీర్, నక్సలిజం, తిరుగుబాటుతో ఈశాన్య రాష్ట్రాలు భయం గుప్పిట్లో ఉండేవి. ఇప్పుడు అవి శాంతి, పురోగతికి కేంద్రాలుగా మారుతున్నాయి. సీఆర్పీఎఫ్ జవాన్ల త్యాగాలు లేకుండా ఈ ప్రాంతాల్లో అభివృద్ధి సాధ్యమయ్యేది కాదు. అస్సాంలో శాంతిని నెలకొల్పేందుకు 79 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు ప్రాణత్యాగం చేశారు. శౌర్యపరాక్రమాలు, దేశభక్తిలో సీఆర్పీఎఫ్ అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది" అని అమిత్ షా ప్రశంసించారు.



పరువు నష్టం కేసులో కోర్టుకు హాజరైన రాహుల్ గాంధీ

ఠాణె: మహారాష్ట్రలో నమోదైన ఓ పరువు నష్టం కేసులో కొత్త హామీదారు దాఖలు చేయడానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ శనివారం భివండీ మెజిస్ట్రేట్ కోర్టు ముందు హాజరయ్యారు. ఆ కేసులో మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు హర్షవర్ధన్‌ను తన కొత్త హామీదారుగా రాహుల్ పేర్కొన్నారు. ఈ కేసులో ఇప్పటి వరకు హామీదారుగా ఉన్న కేంద్ర మాజీ మంత్రి శివరాజ్ పాటిల్ గతేడాది డిసెంబరు 12న మరణించారు. దీంతో ఆయన స్థానంలో కొత్త హామీదారు పేరును నమోదు చేయాల్సిందిగా న్యాయస్థానం రాహుల్‌ను ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే ఆయన కోర్టుకు హాజరయ్యారు. 2014 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మహారాష్ట్రలోని సోనాలే గ్రామంలో ర్యాలీలో రాహుల్ గాంధీ పాల్గొని మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ హత్య వెనుక ఆర్ఎస్ఎస్ హస్తం ఉందని ఆరోపించారు. ఆయన వ్యాఖ్యలు ఆర్ఎస్ఎస్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉందని పేర్కొంటూ.. అప్పట్లో సంఘ్ కార్యకర్త రాజేశ్ కుంటే భివండి మెజిస్ట్రేట్ కోర్టులో ఫిర్యాదు చేశారు. దీంతో ఈ కేసుపై విచారణ కొనసాగుతోంది.

దేశ రాజధానికి ఉగ్ర ముప్పు

- నిఘా వర్గాల హెచ్చరికలు

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో ఉగ్ర దాడులు జరిగే అవకాశముందని నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఉగ్ర సంస్థ లష్కరే తయ్యిబా దిల్లీలోని ఎర్రకోట, చాందినీ చౌక్‌లోని వివిధ ప్రాంతాలే లక్ష్యంగా దాడులకు కుట్ర పన్నినట్లు వెల్లడించాయి. ఇందుకు భారీ మొత్తంలో పేలుడు పదార్థాలను వినియోగించే అవకాశముందన్నాయి. దీంతో అప్రమత్తమైన భద్రతా సంస్థలు దిల్లీలో హైఅలర్ట్ ప్రకటించాయి. దేవాలయాలు, రద్దీగా ఉండే ప్రదేశాల్లో అదనపు సిబ్బందిని మోహరించాయి. బాంబ్ స్క్వాడ్ బృందాలు రంగంలోకి దిగాయి. ఈ నెల 6న పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లోని ఒక మసీదులో జరిగిన పేలుడుకు ప్రతీకారంగా, భారత్‌లోని ప్రముఖ ధార్మిక స్థలాలపై దాడులు చేయాలని లష్కరే ప్లాన్ చేస్తోందని నిఘా వర్గాలు చెబుతున్నాయి. అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే సమాచారమివ్వాలని పోలీసులు స్థానికులను కోరారు. గతేడాది ఎర్రకోట వద్ద జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో.. నిఘా వర్గాల హెచ్చరికలతో అధికారులు అప్రమత్తమయ్యారు.



దిల్లీలోని ఎర్రకోట వద్ద భద్రతా సిబ్బంది పహారా

గుజరాత్‌లో డివైడర్‌ను ఢీకొన్న మినీవ్యాన్

ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురి దుర్మరణం

మెహసాణా: గుజరాత్‌లోని ఉంఝా-మెహసాణా జాతీయ రహదారిపై శనివారం మినీ వ్యాన్ డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మృతిచెందగా, మరో ఆరుగురు గాయపడ్డారు. రాజస్థాన్‌లోని పాలి జిల్లాలోని వివాహ వేడుకకు హాజరైన ఓ కుటుంబం అహ్మదాబాద్‌కు తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. డ్రైవర్ నియంత్రణ కోల్పోవడమే ప్రమాదానికి కారణమని పోలీసులు తెలిపారు. రాంలాల్ కుమావత్, కోమల్ కుమావత్, కైలాశ్‌బాయి కుమావత్, ఆయుశ్ కుమావత్(4) అక్కడికక్కడే మృతిచెందగా.. మిగతా ఏడుగురు ప్రయాణికులను స్థానిక ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వృద్ధ మహిళ మధురాదేవి కుమావత్ కూడా మరణించింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.

మధ్యప్రదేశ్‌లో రోడ్డు ప్రమాదం.. నలుగురి మృతి

భింద్, కాన్పూర్: మధ్యప్రదేశ్‌లోని భింద్ జిల్లాలో జాతీయ రహదారిలో ఓ వ్యాన్‌ను అతివేగంగా వస్తున్న బస్సు ఢీకొన్న ఘటనలో నలుగురు మృతిచెందారు. ఈ ప్రమాదంలో మరో ఏడుగురు గాయపడగా వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు శనివారం వెల్లడించారు.

యూపీలో నలుగురు: రోడ్డు పక్కన చెరువులో ఓ వ్యాన్ పడిపోవడంతో రెండేళ్ల చిన్నారి సహా ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతిచెందిన ఘటన ఉత్తరప్రదేశ్‌లో చోటుచేసుకుంది. ఔరయ్యా అనే వ్యక్తికి చెందిన కుటుంబం కళ్యాణ్‌పుర్‌లోని బంధువుల ఇంట్లో వేడుకకు హాజరై వస్తుండగా కాన్పూర్‌లోని సవాయి గ్రామ సమీపంలోని చెరువులోకి దూసుకెళ్లింది. ప్రమాద సమయంలో వ్యాన్‌లో ఉన్న 11 మంది ఉన్నారు.

శ్రీనగర్‌లో నదిలో పడిన వాహనం


9 మంది సీఆర్పీఎఫ్ సిబ్బందికి గాయాలు

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్‌లో సీఆర్‌పీఎఫ్ జవాన్లు ప్రయాణిస్తున్న వాహనం నదిలో పడింది. శనివారం జరిగిన ఈ ఘటనలో 9 మందికి గాయాలయ్యాయి. శ్రీనగర్ శివారులోని అహ్మద్‌నగర్ ప్రాంతంలో డాగ్‌పొరా-ఉమర్‌హెయర్ రోడ్డుపై ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు పేర్కొన్నారు. డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో వాహనం నదిలో పడినట్లు వెల్లడించారు.

ఎప్‌స్టీన్ ఫైల్సే కారణమా?

- అమెరికాతో ఒప్పందంపై మల్లికార్జున ఖర్గే ప్రశ్న

దిల్లీ: అమెరికాతో వాణిజ్య ఒప్పందం విషయంలో తొందరపాటు ద్వారా మోదీ ప్రభుత్వం జాతీయ ప్రయోజనాలను పణంగా పెట్టిందని, దేశ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తికి తిలోదకాలిచ్చిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. దేశ ప్రయోజనాలను దెబ్బతీసే ఒప్పందంపై సంతకాలు చేసేలా ఆయనపై ఎవరు ఒత్తిడి చేశారో ప్రజలకు మోదీ తెలియజెప్పాలన్నారు. ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో దాగివున్న విషయాల కారణంగానే వాణిజ్య ఒప్పందం విషయంలో అమెరికా ఒత్తిడికి తలొగ్గారా అని ఖర్గే ప్రశ్నించారు. అమెరికా విధించిన సుంకాలపై ఆ దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పు వెలువడే వరకూ ఆగకుండా మోదీ ప్రభుత్వం.. ట్రంప్ యంత్రాంగ వలలో పడిందని ఆయన శనివారం సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. "ఇది విదేశాంగ విధానంలో నెలకొన్న అయోమయమా, లేక ఏకపక్ష లొంగుబాటా? సుంకాలపై అమెరికా సుప్రీంకోర్టు తీర్పు వచ్చేదాకా మోదీ ప్రభుత్వం ఎందుకు ఆగలేకపోయింది? తొందరపాటుతో వ్యవహరించి అమెరికాకు భారీ వాణిజ్య రాయితీలు ఎందుకిచ్చింది?" అని ఆయన ప్రశ్నించారు. "అమెరికా చేసే అనేక ఎగుమతులపై ఎలాంటి సుంకమూ విధించలేదు. తద్వారా అక్కడి వ్యవసాయ ఉత్పత్తులకు మన దేశ తలుపులు బార్లా తెరిచారు. అమెరికా నుంచి 500 బిలియన్ డాలర్ల విలువైన సరుకు దిగుమతి చేసుకుంటామని మోదీ ప్రభుత్వం హామీ ఇచ్చింది. రష్యా నుంచి చమురు కొనుగోలు నిలిపివేస్తామని కూడా పేర్కొంది. ఇది మన ఇంధన భద్రతకు గొడ్డలిపెట్టు. డిజిటల్ వాణిజ్యానికీ అనేక రాయితీలు ఇచ్చారు" అని ఖర్గే ఆరోపించారు.



వాణిజ్య ఒప్పందం నిలిపివేయండి: కాంగ్రెస్

ట్రంప్ ప్రభుత్వం విధించిన ఏకపక్ష సుంకాలను అమెరికా సుప్రీంకోర్టు రద్దుచేసిన నేపథ్యంలో భారత్ అమెరికాతో కుదుర్చుకున్న మధ్యంతర వాణిజ్య ఒప్పందాన్ని నిలిపివేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. భారతీయ రైతుల ప్రయోజనాలను కాపాడుతామని అమెరికా నుంచి స్పష్టమైన వివరణ వచ్చే దాకా దిగుమతుల సరళీకరణ చేపట్టబోమని ట్రంప్ యంత్రాంగానికి తేల్చి చెప్పాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ఎలాఉన్నా భారత్‌తో ఒప్పందంలో మార్పు ఉండబోదంటూ ట్రంప్ చేసిన వాదనతో మోదీ ఏకీభవిస్తున్నారా అని ప్రశ్నించారు.

లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు.. 12 మంది మృతి

బీరుట్: లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన రెండు వేర్వేరు దాడుల్లో ముగ్గురు చిన్నారులు సహా దాదాపు 12 మంది ప్రాణాలు కోల్పోయారు. తూర్పు లెబనాన్‌లోని బెకా వ్యాలీ లక్ష్యంగా జరిపిన వైమానిక దాడుల్లో 10 మంది మరణించగా, 24 మంది గాయపడ్డారు. హెజ్‌బొల్లాకు చెందిన కమాండ్ సెంటర్లను లక్ష్యంగా చేసుకున్నట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. సిడాన్‌లోని పాలస్తీనా శరణార్థి శిబిరంపై జరిపిన దాడిలో ఇద్దరు హమాస్ సభ్యులను హతమార్చినట్లు పేర్కొంది.

అయోధ్య రాముడి సేవలో
గుయానా ఉపాధ్యక్షుడు భరత్ జగదేవ్

అయోధ్య: గుయానా ఉపాధ్యక్షుడు భరత్ జగదేవ్ శనివారం అయోధ్య రాముడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మహర్షి వాల్మీకి అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రత్యేక విమానంలో ఉదయం 11 గంటలకు చేరుకున్న ఆయనకు అయోధ్య మేయర్ గిరీశ్ త్రిపాఠి రాష్ట్ర ప్రభుత్వం తరఫున లాంఛనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో 11వ నంబరు గేట్ వద్దకు చేరుకుని ఆలయంలోకి ప్రవేశించారు. రాముడి దర్శనం చేసుకున్నారు. సుమారు గంటన్నర పాటు ఉన్న ఆయన ఆలయ సముదాయంలోని కుబేర్ టీలా, సప్త రుషి మందిరాన్ని దర్శించుకున్నారు. ఆలయం వద్ద రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రలు గుయానా ఉపాధ్యక్షుడికి స్వాగతం పలికారు.



ప్రసవం చేసిన స్వీపర్

శిశువు మృతి

ఈటీవీ భారత్: దాదాపుగా అర్ధరాత్రి సమయం.. పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని కుటుంబసభ్యులు ఆస్పత్రికి తీసుకువచ్చారు. మర్నాడు ఉదయం ఏడింటికి నొప్పులు ఎక్కువయ్యాయి. డాక్టర్లు, నర్సులు అందుబాటులో లేకపోవడంతో స్వీపరు శ్యామ్‌పతి తానే వైద్యురాలి అవతారమెత్తి ప్రసవం చేయడానికి ప్రయత్నించింది. శిశువు కడుపులో అడ్డం తిరగడంతో ఏమిచేయాలో ఆమెకు పాలుపోలేదు. ఈలోపు విషయం తెలుసుకున్న డాక్టర్లు, నర్సులు ఆస్పత్రికి పరుగున వచ్చి ప్రసవం చేశారు. అప్పటికే పరిస్థితి చేయిదాటిపోయి శిశువు మృతిచెందింది. ఛత్తీస్‌గఢ్‌లోని సర్గుజా జిల్లా లఖన్‌పుర్ గ్రామ కున్నీ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఈ నెల 17న ఈ దారుణం జరిగింది. ఆసుపత్రిలో వైద్యసిబ్బంది అందుబాటులో ఉండి ఉంటే ఇలా జరిగేది కాదని, బిడ్డ బతికేవాడని బాధితురాలు గౌరీ యాదవ్‌తోపాటు ఆమె బంధువులు నిరసన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ పీఎస్ మార్కో స్పందించారు. నిర్లక్ష్యం ఉన్నట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.



బాధితురాలు గౌరీ యాదవ్

లిఫ్టులో చిక్కిన చిన్నారులు.. సాహసంతో కాపాడిన బాలిక

లిఫ్టులో చిక్కుకున్న ఇద్దరు చిన్నారులను ఓ బాలిక సమయస్ఫూర్తితో కాపాడిన వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. సీసీ కెమెరాలో రికార్డయిన వీడియో ప్రకారం.. ఇద్దరు చిన్నపిల్లలు లిఫ్టు లోపల నిలబడి ఉండగా డోరు వద్ద బాలిక నిలబడి వారితో మాట్లాడుతోంది. ఆ సమయంలో హఠాత్తుగా లిఫ్ట్ డోర్లు మూసుకుపోవడం ప్రారంభించాయి. వెంటనే అప్రమత్తమైన బాలిక డోర్ల మధ్యలో కాలు పెట్టి మూసుకుపోకుండా ఆపడానికి ప్రయత్నించింది. క్రమంగా బాలిక కాలు లిఫ్టులో ఇరుక్కుపోయి, లోపల ఉన్న పిల్లలు ఆందోళనకు గురయ్యారు. బాలిక భయపడకుండా డోర్లను తెరవడానికి తన శక్తినంతా ఉపయోగించింది. వీరి కేకలు విని అక్కడికి వచ్చిన కొందరు మహిళలు డోర్లు తీయడానికి సహాయం చేయడంతో బాలిక వెంటనే లిఫ్ట్‌లోకి వెళ్లి పిల్లలు ఇద్దరినీ సురక్షితంగా బయటకు తీసుకువచ్చింది. ఈ ఘటన ఎక్కడ జరిగిందో వివరాలు తెలియనప్పటికీ, చిన్నారులను కాపాడటానికి బాలిక చూపిన ధైర్యాన్ని నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. – ఇంటర్నెట్ డెస్క్



రైతుబడి.. సాంకేతిక ఒరవడి

- నాగలి నుంచి నవతరం డ్రోన్ల వరకు
- సరికొత్త ఆవిష్కరణలకు వేదికైన 'అగ్రి షో'



మట్టిని నమ్ముకున్న మనిషికి.. హైదరాబాద్ వేదికగా సరికొత్త సాంకేతిక సొబగులు పరిచయమవుతున్నాయి. చెమట చిందించే రైతు చేతికి.. శ్రమను తగ్గించే ఆధునిక యంత్రం తోడైతే ఎలా ఉంటుందో 'రైతుబడి– వ్యవసాయ ప్రదర్శన' కళ్లకు కడుతోంది. అన్నదాతల అభ్యుదయ పరికరింపులు, వ్యవసాయ యంత్రాల సందడితో హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియం శనివారం పంట పొలాలను తలపించింది. నాగలి నుంచి నవతరం డ్రోన్ల వరకు.. విత్తనం నుంచి విక్రయం వరకు అన్నదాత ఎదుర్కొనే సవాళ్లకు పరిష్కారం చూపిస్తోంది 'అగ్రి షో'. శనివారం ప్రారంభమైన ఈ వ్యవసాయ ప్రదర్శన ఆదివారం వరకు కొనసాగనుంది.

వారం ముందే హెచ్చరికలు



శాటిలైట్ డేటా, కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో 'క్రిషివాస్' సంస్థ రూపొందించిన సాంకేతిక రైతులకు సాయపడుతుంది. ఆధునిక పరికరం లేకుండా మొబైల్ యాప్ ద్వారా రైతులు తమ పొలాన్ని పర్యవేక్షించవచ్చు. జీపీఎస్ ఆధారంగా యాప్‌లో పొలాన్ని నమోదు చేస్తే కంటికి కనిపించక ముందే.. పంట సమస్యలను 5-7 రోజుల ముందే గుర్తించి తెలియజేస్తుంది. రోజూ పంట పరిస్థితిపై రియల్ టైమ్‌లో సమాచారం ఇస్తుంది. వాతావరణం, ఆకు, నేలలోని తేమ ఆధారంగా సూచనలిస్తుంది. పొలంలో సమస్య ఎక్కడ ఉందో కచ్చితత్వంతో గుర్తించి, అక్కడ చేరుకోవడానికి సాయం చేస్తుంది. ఈ సాంకేతికతను 62 పంటలపై పరీక్షించినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.

ఎక్కడి నుంచైనా పొలానికి నీరు ఆపేలా..

ఆధునిక సాంకేతికతతో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు 'ఆటోఫామ్- టోటల్ ఫార్మ్ ఆటోమేషన్' విధానం అందుబాటులోకి వచ్చింది. దీని ద్వారా రైతులు స్మార్ట్‌ఫోన్ నుంచే పొలాన్ని పర్యవేక్షించవచ్చు. మొబైల్ అప్లికేషన్ ద్వారా ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం పొలంలోని స్మార్ట్ ఇరిగేషన్ వాల్వ్‌లు, వ్యవసాయ పంపులు, నేల, వాతావరణ సెన్సార్లను ఈ ప్లాట్‌ఫామ్ నియంత్రిస్తుంది. సౌరశక్తి ద్వారా పనిచేస్తుంది. అంతర్గత బ్యాటరీతో రాత్రిళ్లు కూడా ఉపయోగించవచ్చు. వాల్వ్ కంట్రోలర్లను రైతు ఎక్కడి నుంచైనా ఆపరేట్ చేయవచ్చు. సంబంధిత సంస్థను సంప్రదించి ఈ సిస్టమ్‌ని కొనుగోలు చేసుకోవచ్చు. ధర రూ.1.2 లక్షల నుంచి ప్రారంభమవుతుంది.



గంటన్నరలో ఎకరం నాటు

వరి నాటు వేయడానికి మార్కెట్‌లో రెండు రకాల యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. నడిచే యంత్రం వెనకాల నుంచి నడుపుకుంటూ ఆపరేట్ చేయాల్సి ఉంటుంది. ఇది చిన్న, మధ్యస్థ స్థలాలకు సరిపోతుంది. మరొకటి ట్రాక్టర్ లాగా ఉండే దానిపై కూర్చుని పెద్ద పొలాల్లో వేగంగా నాట్లు వేయొచ్చు. రైతు వెనకాల నడుచుకుంటూ నాటు వేసే యంత్రం.. 2 లీటర్ల పెట్రోల్‌తో కేవలం గంటన్నరలో ఎకరం నాటు వేయవచ్చు. దీనిని 15 రోజుల లేత వయసున్న నారును సులభంగా వేసుకోవచ్చు. దీనివల్ల ఎండ ఎక్కువగా తాకి పైరుకి దోమ దాడి తగ్గుతుంది. ఈ యంత్రానికి ఇద్దరు కూలీలు సరిపోతారు. నాలుగు వరసలున్న యంత్రానికి సుమారు రూ.3.5 లక్షలు, ఆరు వరసలున్న యంత్రానికి రూ.4.2 లక్షలు, కూర్చుని నడిపే భారీ యంత్రానికి రూ.14 లక్షల వరకు ధర ఉంటుంది.



తక్కువ శ్రమ.. అద్భుత ఫలితం

చేతితో పిచికారీ చేయడం వల్ల రైతులకు శ్రమ పెరగడమే కాకుండా సమయం వృథా అవుతుంది. ఈ యంత్రం రైతు చేతికి రెట్టింపు శక్తి నిస్తుంది. పిచికారీ పనులను సులభతరం చేస్తుంది. యంత్రానికున్న పెద్ద చక్రం వల్ల పొలాల్లో గట్లపై, ఇరుకైన దారుల్లోనూ సులభంగా ముందుకు తోసుకువెళ్లవచ్చు. దీని హైగ్లాన్సు అమర్చిన పైపులకు పలు నాజిల్స్ ఉంటాయి. దీనివల్ల ఒకే సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో మందును సమానంగా చల్లవచ్చు. ఇందులో పెద్ద ట్యాంకు ఉండటంతో ఎక్కువ ద్రావణాన్ని ఒకేసారి నిల్వ చేసుకోవచ్చు. పెట్రోల్‌తో నడిచే స్ప్రే పంప్.. 15 నుంచి 20 నిమిషాల్లో ఎకరం వరకు పిచికారీ చేస్తుంది. లీటరు పెట్రోల్‌తో మూడు ఎకరాలు వాడుకోవచ్చు. ధర రూ.13 వేల నుంచి రూ.17 వేల వరకు ఉంటుంది.



కోళ్ల ఫారాల్లో పని సులభతరం



స్థానిక సమస్యకు స్థానిక పరిష్కారం అనే ఆలోచనతో రైతులను ఆదుకునేందుకు ఉద్దేశంతో ఈ యంత్రాన్ని రూపొందించారు. ప్రధానంగా పౌల్ట్రీ (కోళ్ల ఫారాలు), పంట పొలాల్లో నేలను చదును చేయడానికి, చెత్తను పోగు చేయడానికి ఉపయోగపడుతుంది. ముందు భాగంలోని గట్టి చక్రం, వెనుక వైపు నేలను దున్నడానికి, చదును చేయడానికి వీలుగా బలమైన పళ్ల (రేక్) ఉన్నాయి. తక్కువ బరువు ఉండటం వల్ల ఒక వ్యక్తి సులభంగా ఆపరేట్ చేయవచ్చు. రీఛార్జబుల్ బ్యాటరీ ఉండటం వల్ల తక్కువ శబ్దం చేస్తుంది. దీనివల్ల కోళ్లఫారాల్లో కోళ్లు భయపడకుండా ఉంటుంది. ఒక గంటపాటు ఛార్జింగ్ చేస్తే.. రెండు గంటల పాటు పనిచేస్తుంది. కోళ్ల ఎదుగుదల దశ వరకు వినియోగించవచ్చు. ధర రూ.12 వేలు.

- ఈనాడు డిజిటల్, హైదరాబాద్



చాగంటి కోటేశ్వరరావుకు పురస్కారం అందిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

తెలుగు భాషకు మంత్ర శక్తి ఉంది

- ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు
- మండలి వెంకటకృష్ణారావు తెలుగు వైభవ పురస్కారం స్వీకరణ

అవనిగడ్డ, న్యూస్‌టుడే: తెలుగుకున్న గొప్పదనం మరే భాషకూ లేదని, ఈ భాష మంత్ర శక్తిని కూడా కలిగి ఉందని ప్రభుత్వ నైతిక విలువల సలహాదారు, ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు అన్నారు. అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం సందర్భంగా శనివారం కృష్ణా జిల్లా అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. కన్నడిగులు తెలుగు భాగవతం చదవడానికి ఇష్టపడతారని, వాగ్గేయకారులు తెలుగులోనే కవితలు రాశారంటే మన భాష గొప్పతనం ఏంటో అర్థమవుతుందని చాగంటి కోటేశ్వరరావు పేర్కొన్నారు. బాలలకు తెలుగు భాష నేర్పడాన్ని ఇంటి నుంచే ప్రారంభించాలని ఆయన సూచించారు. కాళహస్తీశ్వర, సుమతీ శతకాల వంటివి అందుబాటులో ఉన్నాయని, వాటిని తర్వాతి తరాలు నేర్చుకునేలా చేయాలన్నారు. మాజీ మంత్రి మండలి వెంకటకృష్ణారావు గురించి మాట్లాడుతూ ఆయనకు తెలుగు భాషపై ఉన్న అభిమానం ఎనలేనిదన్నారు. 1977 ఉప్పెన సమయంలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. సేవ ద్వారా తరించారని, కులం కోసం ఎక్కడా పనిచేయలేదని గుర్తుచేశారు. తొలుత మండలి వెంకటకృష్ణారావు విగ్రహానికి చాగంటి నివాళులర్పించారు. అనంతరం ఆయనకు.. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ కుటుంబ సభ్యులు 'మండలి వెంకటకృష్ణారావు తెలుగు వైభవ పురస్కారం' ప్రదానం చేశారు. బుద్ధప్రసాద్ మాట్లాడుతూ ఈ పురస్కారాన్ని చాగంటి కోటేశ్వరరావుకు ప్రదానం చేయడం అదృష్టంగా భావిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో చిన్నారుల నృత్య ప్రదర్శన, భువన విజయం నాటిక ఆకట్టుకున్నాయి.

విద్యతో పాటు కళలు, క్రీడల్లోనూ రాణించాలి

- వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ పి.అరుల్మొళివర్మన్
- అమరావతిలో ఘనంగా ప్రారంభమైన విటోపియా-2026



ఆకట్టుకున్న విద్యార్థినుల సంప్రదాయ నృత్యం

ఈనాడు, అమరావతి: ప్రతి ఒక్కరి జీవితంలో విద్యార్థి దశ కీలకమైందని.. ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలంటే విద్యతోనే సాధ్యమని వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి.అరుల్మొళివర్మన్ అన్నారు. విద్యార్థులు విద్యతో పాటు కళలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ నైపుణ్యాలను ప్రదర్శించడం ద్వారా ప్రతిభకు పదును పెట్టాలని ఆకాంక్షించారు. అమరావతిలోని వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో వార్షిక క్రీడా సాంస్కృతిక ఉత్సవాలు 'విటోపియా-2026' శనివారం ఘనంగా మొదలయ్యాయి. ఈ వేడుకలను విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ జగదీశ్ చంద్ర ముదిగంటి, విటోపియా కన్వీనర్ ఎస్.గోపీకృష్ణన్, స్టూడెంట్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఖదీర్‌పాషా, వైస్ ఛాన్సలర్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. వివిధ దేశాలు, దేశంలోని అనేక రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే వస్త్రధారణతో కూడిన 'వసుధైకం' ర్యాలీ నిర్వహించారు. వివిధ రాష్ట్రాల విద్యార్థులు జానపద, సంప్రదాయ కళారూపాలతో సందడి చేశారు. వీసీ అరుల్మొళివర్మన్ మాట్లాడుతూ సాంస్కృతిక ప్రదర్శనలు మన మూలాలను, ప్రాచీన సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని చెప్పారు.



సమావేశంలో పాల్గొన్న షర్మిల, రేవంత్‌రెడ్డి, మహేశ్‌గౌడ్

పార్టీ పటిష్ఠతకు డీసీసీ అధ్యక్షులు కృషి చేయాలి

ఈనాడు, హైదరాబాద్: పార్టీ పటిష్ఠానికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కృషిచేయాలని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల పిలుపునిచ్చారు. తెలంగాణలోని వికారాబాద్‌లో ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన డీసీసీ అధ్యక్షులకు ఏర్పాటు చేసిన పదిరోజుల శిక్షణ శిబిరం శనివారం ప్రారంభమైంది. ఇందులో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌తో పాటు షర్మిల ప్రసంగించారు. పది రోజుల శిక్షణ శిబిరంలో నాయకత్వ నైపుణ్యాలు, ప్రజా సమస్యల పరిష్కార విధానాలు, ఎన్నికల వ్యూహాలు, మీడియా నిర్వహణ తదితర అంశాలపై శిక్షణ పొందాలని నాయకులకు షర్మిల సూచించారు.

అక్రమంగా తరలిస్తున్న 320 తాబేళ్లు స్వాధీనం



అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న తాబేళ్లు

ఏలేశ్వరం, కిర్లంపూడి, న్యూస్‌టుడే: అక్రమంగా తరలిస్తున్న 320 తాబేళ్లను అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సేకరించిన తాబేళ్లను ఇద్దరు వ్యక్తులు ఓ వాహనంలో తరలిస్తున్నారని కాకినాడ జిల్లా డీఎఫ్‌వోకు సమాచారం అందింది. ఈ మేరకు అటవీ శాఖ అధికారులు శనివారం కిర్లంపూడి మండలం కృష్ణవరం టోల్‌ప్లాజా వద్ద మాటు వేశారు. ఓ కారును తనిఖీ చేసి 18 గోనె సంచుల్లో 320 తాబేళ్లను రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన మహాదేవ్ దే, సమీర్‌లపై వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసి ప్రత్తిపాడు కోర్టుకు తరలించారు. కోర్టు వారికి రిమాండ్ విధించిందని, తాబేళ్లను ఏలేశ్వరం రిజర్వాయర్‌లో విడిచిపెట్టినట్లు అధికారులు తెలిపారు. ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో తాబేళ్ల మాంసానికి ఎక్కువగా డిమాండ్ ఉండటంతో కోనసీమలో అక్రమంగా కొనుగోలు చేసి విక్రయిస్తున్నట్లు నిందితులు అంగీకరించారని వారు వివరించారు.



మేధస్సుతో పాటు జ్ఞానమూ ముఖ్యం

వృత్తి జీవితంలో రాణించాలంటే అన్నీ ఇట్టే నేర్చేసుకొనే మేధస్సు ఒక్కటే సరిపోదు. ముందుచూపుతో కూడిన జ్ఞానమూ ముఖ్యం. అంటే ఏయే పరిస్థితుల్లో ఎవరితో ఎలా వ్యవహరించాలి? పురోగతి కోసం ఎలాంటి సవాళ్లను స్వీకరించాలి? వేటిని విస్మరించాలనేది తెలిసి ఉండటం, సందర్భానుసారం సరైన నిర్ణయాలు తీసుకొనే వివేకం కలిగి ఉండటం. మేధస్సు అనేది ప్రస్తుతం యంత్రాలకూ సాధ్యమవుతోంది, కానీ జ్ఞానం ఎప్పటికీ మనుషులకే ప్రత్యేకం.

– రాధికా గుప్తా, ఆంత్రప్రెన్యూర్

ప్రపంచంపై మళ్లీ పిడుగు

(మొదటి పేజీ తరువాయి)

అమల్లోకి వస్తాయని వెల్లడించారు. ఒక రోజు తిరిగే సరికల్లా 10 శాతం కాదు.. 15 శాతం విధిస్తామని తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ ద్వారా ప్రకటించారు. 'చట్టానికి నిలిచే విధంగానే 10 శాతం నుంచి 15 శాతానికి సుంకాలను పెంచుతాం. అమెరికాకు వ్యతిరేకంగా హాస్యాస్పదంగా, పేలవంగా రాసిన అసాధారణ కోర్టు తీర్పును సమగ్రంగా, వివరంగా పూర్తిగా సమీక్షించాకే సుంకాల పెంపుపై నిర్ణయానికి వచ్చాం' అని ట్రంప్ ప్రకటించారు. 'అమెరికా అధ్యక్షుడు చెప్పాలనుకున్న విషయాన్ని చెప్పడానికి అవకాశమివ్వండి. ప్రతీకార సుంకాల్లేకుండా ఎన్నో దశాబ్దాలుగా అమెరికాను దోచుకుంటున్న ఆయా దేశాలు ఇందులో ఉన్నాయి. చట్టానికి నిలిచేలా 15 శాతం స్థాయికి సుంకాలను తీసుకెళ్తాం' అని ట్రంప్ పేర్కొన్నారు. రానున్న కొద్ది నెలల్లోనే మరిన్ని సుంకాలను విధిస్తామని ప్రకటించారు. సుప్రీం తీర్పు తర్వాతా ఏమీ మారలేదని, భారతే తమకు సుంకాలను చెల్లిస్తుందని, తాము ఎటువంటి సుంకాలను ఆ దేశానికి చెల్లించబోమని ట్రంప్ స్పష్టం చేశారు. తొలుత 10 శాతం సుంకాలపై శ్వేత సౌధం విడుదల చేసిన ఫ్యాక్ట్ షీట్‌లో.. అమెరికా ఆర్థిక వ్యవస్థకు దన్నుగా నిలిచే, భవిష్యత్తులో మరింత పకడ్బందీగా సుంకాలు విధించే అవకాశమున్న కొన్ని వస్తువులకు ఈ తాత్కాలిక సుంకాలు వర్తించబోవని పేర్కొంది.

సుంకాలు వర్తించనివి..

- కరెన్సీ, బులియన్, ఇంధనం, ఇంధన ఉత్పత్తుల్లో ఉపయోగించే కొన్ని ప్రత్యేక కీలక ఖనిజాలు, లోహాలు.
- పెరిగే, తవ్వితీసే అవకాశం లేని సహజ వనరులు, ఎరువులు.
- బీఫ్, టమాటా, నారింజ వంటి కొన్ని వ్యవసాయ ఉత్పత్తులు.
- ఔషధాలు, వాటిలో వాడే దినుసులు.
- కొన్ని ఎలక్ట్రానిక్ వస్తువులు.
- వ్యక్తిగత వాహనాలు, తేలికపాటి ట్రక్కులు, మధ్య, భారీ శ్రేణి వాహనాలు, బస్సులు, వ్యక్తిగత వాహనాల విడిభాగాలు, కొన్ని విమాన విడిభాగాలు.

'మోదీ తెలివైనవారు': సుంకాలను విధిస్తానని హెచ్చరించి భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని ఆపానని మరోసారి ట్రంప్ పేర్కొన్నారు. ప్రధాని మోదీతో తనకు గొప్ప సంబంధాలున్నాయని తెలిపారు. 'ఏమీ మారదు. భారత్ సుంకాలను చెల్లిస్తుంది. మేం చెల్లించం. భారత్ చేసుకున్న ఒప్పందమే అలాంటిది. ప్రధాని మోదీ గొప్ప జెంటిల్‌మన్. అమెరికా విషయంలో నేను వ్యతిరేకించే వారి కంటే ఆయన తెలివైనవారు. ఆయన మమ్మల్ని చీల్చి చెండాడుతున్నారు. దీంతో మేం ఒప్పందం చేసుకున్నాం. ఇది పారదర్శక ఒప్పందం. కానీ వారే సుంకాలు చెల్లించేలా ఒప్పందాన్ని కాస్త తిప్పాం. భారత్‌తో నా సంబంధాలు అద్భుతంగా ఉన్నాయి. మా విజ్ఞప్తితో రష్యా నుంచి చమురును ఆ దేశం నిలిపేస్తోంది' అని ట్రంప్ పేర్కొన్నారు.

వైకాపా నేతల భూములు.. 22ఏ నుంచి తొలగింపు

- అన్నమయ్య జిల్లాలో అధికారుల బహుమానం
- లబ్ధిదారుల్లో ఎర్రచందనం స్మగ్లర్ కొల్లం గంగిరెడ్డి భార్య
- నిషేధం సడలించిన భూముల విలువ రూ.50 కోట్లు

ఈనాడు, కడప: రాష్ట్రవ్యాప్తంగా లక్షల మంది రైతులు 22ఏ కబంధ హస్తాల నుంచి తమ భూములు విడిపించాలంటూ రెవెన్యూ శాఖకు ఏడాదిన్నరగా మొరపెట్టుకుంటున్నారు. వైకాపా ప్రభుత్వం కావాలనే తమ పట్టా భూములను 22ఏ కింద నిషిద్ధ జాబితాలో చేర్చిందని, కూటమి ప్రభుత్వమైనా ఈ సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు. అయినా తేల్చడం లేదు. కానీ అన్నమయ్య జిల్లాలో మాత్రం వైకాపా నేతలు అడిగిందే తడవుగా అధికారులు స్పందిస్తున్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రాన్ని రాయచోటి నుంచి మదనపల్లెకు మార్చిన రోజే 2025 డిసెంబర్ 30న.. ఎర్రచందనం అంతర్జాతీయ స్మగ్లర్ కొల్లం గంగిరెడ్డి భార్య మాళవిక పేరిట ఉన్న 5 ఎకరాల భూమిని 22ఏ జాబితా నుంచి తొలగించాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశాలిచ్చారు. 2025 ఏప్రిల్ 2న అప్పటి కలెక్టర్ చామకూరి శ్రీధర్ మరో ముగ్గురికి చెందిన 6 ఎకరాలకు పైగా నిషేధిత జాబితా నుంచి తొలగించారు. 22ఏ నుంచి తొలగించాలని హైకోర్టు 2022, 2023 సంవత్సరాల్లో ఇచ్చిన ఉత్తర్వుల్ని అధికారులు ప్రస్తావించారు. వాటిపై కనీసం అప్పీలు చేయకపోవడం చర్చనీయాంశమైంది.

డీకేటీ భూములకు రుణాలు.. ఆపై వేలం: వైఎస్సార్ కడప జిల్లా రాజంపేట మండలం తాళ్లపాక రెవెన్యూ గ్రామంలో 2010 జనవరి 6న మూడు సర్వే నంబర్లలోని 10.70 ఎకరాల భూమిపై రమణయ్య, చంద్రశేఖర్, సరస్వతి అనే ముగ్గురు(బినామీ).. మన్నూరు పీఏసీఎస్ నుంచి రూ.1.20 లక్షల (ఒక్కొక్కరి పేరిట రూ.40 వేల చొప్పున) రుణం తీసుకున్నారు. రెవెన్యూ అడంగల్ ప్రకారం వీటిని డీకేటీ, చుక్కల భూములుగా పేర్కొన్నారు. అప్పట్లో డీసీసీబీ ఛైర్మన్‌గా కాంగ్రెస్ నేత కొల్లం బ్రహ్మానందరెడ్డి (కొల్లం గంగిరెడ్డి సోదరుడు) ఉన్నారు. అత్యంత ఖరీదైన ప్రభుత్వ భూములకు బినామీ పేర్లతో ఫోర్జరీ పత్రాలు సృష్టించి పీఏసీఎస్‌లో తాకట్టు పెట్టారనే ఆరోపణలున్నాయి. బ్యాంకు నిబంధనల ప్రకారం వీరు ఏడాదిలోగా అప్పు తిరిగి చెల్లించాల్సి ఉంది. కొన్ని క్లాజ్‌ల కింద మరికొంత కాలం గడువు కూడా ఉంటుంది. అయితే, 2010 జనవరి 6న ఈ ముగ్గురూ రుణం తీసుకోగా, 2010 ఆగస్టు 30న సెక్షన్ 71 నోటీస్ (రుణం తీసుకున్న వారు గడువులోగా చెల్లించకపోతే జారీ చేసేది) ఇచ్చారు. డిసెంబరు 27 నాటికి వేలం పెట్టారు. వీటిని ముద్దా సుబ్రమణ్యంరెడ్డి, మేడా నాగేశ్వరరెడ్డి, జి.వెంకట సుబ్బారెడ్డి కొన్నట్లు రికార్డుల్లో పేర్కొన్నారు. అంటే, రుణం తీసుకుని ఏడాది కాకముందే వేలానికి నోటీసు ఇచ్చారు. సదరు ఆస్తి ఎన్‌పీఏగా మారకముందే వేలం వేశారు. ఇలా ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి బదలాయించినట్లైంది.

కుమ్మక్కు గుర్తించి.. నిషేధిత జాబితాలోకి

రెవెన్యూ అధికారులు ఈ అక్రమాన్ని గుర్తించి.. వేలం వేసిన భూముల్ని నిషేధిత జాబితాలో చేర్చారు. వైకాపా హయాంలో రాజకీయ పలుకుబడితో ఎన్నిరకాలుగా ప్రయత్నించినా, ఈ భూముల్ని 22ఏ జాబితా నుంచి తప్పించడానికి వీలుకాలేదు. 2022, 2023 సంవత్సరాల్లో ఈ భూములపై హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. నిషేధిత జాబితా నుంచి తొలగించాలని న్యాయస్థానం ఆదేశించినప్పటికీ, నాటి వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. అలాంటిది.. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాకే ఈ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించే ప్రక్రియ మొదలు పెట్టడం గమనార్హం. తాళ్లపాకలోని సర్వే నంబరు 1,115లోని 5.93 ఎకరాల భూములను రాజంపేటకు చెందిన వైకాపా నేతలు వీరంరెడ్డి జంగంరెడ్డికి 3.65 ఎకరాలు, జీవీ సుబ్బారెడ్డికి 1.14, నాగ చంద్రశేఖర్‌కు 1.14 ఎకరాల చొప్పున కట్టబెడుతూ నిషేధిత జాబితా నుంచి తొలగించాలని 2025 ఏప్రిల్ 2న అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ ఆదేశాలిచ్చారు. ఈ సర్వే నంబరులో 11 సబ్ డివిజన్ నంబర్లు ఉంటే మూడింటిని మాత్రమే నిషేధిత జాబితా నుంచి తొలగించాలని, మిగిలిన 8 యథాతథంగా ఉంచాలని ఆదేశాలివ్వడం గమనార్హం. ఇదే గ్రామంలోని సర్వే నంబర్ 1,116/2లో 5 ఎకరాల భూముల్లో తిరుపతి జిల్లా పుల్లంపేటకు చెందిన కొల్లం గంగిరెడ్డి భార్య కొల్లం మాళవికకు చెందిన 4.25 ఎకరాలు, ముద్దా సుబ్రమణ్యంరెడ్డికి చెందిన 0.75 ఎకరాలను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని ప్రస్తుత అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. ఈ మొత్తం భూముల విలువ సుమారు రూ.50 కోట్లకు పైనే ఉంటుందని అంచనా.

కాంగ్రెస్ కార్యాలయాలపై భాజపా శ్రేణుల దాడి

- అడ్డుకున్న పోలీసులు.. ఉద్రిక్తత

గుంటూరు (పట్నంబజారు), విజయవాడ (గవర్నర్ పేట), న్యూస్‌టుడే: దిల్లీలో ఏఐ సదస్సులో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు దేశాన్ని కించపరిచేలా ప్రవర్తించారంటూ.. అందుకు నిరసనగా భాజపా శ్రేణులు రాష్ట్రంలోని కాంగ్రెస్ కార్యాలయాలపై శనివారం ఉదయం దాడులకు ప్రయత్నించడంతో పలుచోట్ల ఉద్రిక్తత నెలకొంది. గుంటూరు డీసీసీ కార్యాలయంపై భాజపా కార్యకర్తలు కోడిగుడ్లు, రాళ్లు విసరడంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. విషయం తెలిసి లాలాపేట, నగరంపాలెం పోలీసులు రాజీవ్‌గాంధీ భవన్ ఎదుట మోహరించారు. ఉదయం 10 గంటల సమయంలో భాజపా కార్యకర్తలు అక్కడికి చేరుకోగా.. అప్పటికే కార్యాలయంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే మస్తాన్ వలీ, కాంగ్రెస్‌పార్టీ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ లింగంశెట్టి ఈశ్వరరావు, సీనియర్ నాయకులు అంబటి రత్తయ్య, కరీం తదితరులు బయటకు వచ్చేందుకు ప్రయత్నించారు. పోలీసులు గేటు మూసేశారు. అప్పటికే భాజపా కార్యకర్తలు అక్కడున్న సోనియాగాంధీ ఫ్లెక్సీలను చించేశారు. కొంతమంది కార్యకర్తలు కాంగ్రెస్ నాయకులపై కోడిగుడ్లు, రాళ్లు విసిరారు. మాజీ ఎమ్మెల్యే మస్తాన్ వలీపై దాడికి యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఇరు పార్టీల శ్రేణుల వాగ్వాదాలతో అరగంటకు పైగా ట్రాఫిక్ నిలిచిపోయింది. కొంతమంది భాజపా నాయకులు అల్లర్లకు పాల్పడ్డారని మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్ వలీ ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు.



విజయవాడలో నినాదాలు చేస్తున్న భాజపా నాయకులను తాళ్లతో అడ్డుకుంటున్న పోలీసులు

విజయవాడలో ఉద్రిక్తత.. అరెస్టులు

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయమైన ఆంధ్రరత్నభవన్‌ను ముట్టడించేందుకు భాజపా నాయకులు చేసిన యత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. అనంతపురంలోని కాంగ్రెస్ కార్యాలయంపై శనివారం ఉదయం భాజపా నేతలు దాడి చేశారు. విజయవాడలోనూ భాజపా నాయకులు వస్తున్నారన్న సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. చుట్టూ రహదారులను బారికేడ్లతో మూసివేశారు. భాజపా నాయకులు నినాదాలు చేసుకుంటూ రాగా.. పోలీసులు మార్గమధ్యంలోనే అడ్డుకున్నారు. దీంతో వారు రోడ్డుపై బైఠాయించారు. దుర్గయ్య వీధిలో నుంచి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలోకి దూసుకువెళ్లేందుకు ప్రయత్నించగా.. పోలీసులు నిలువరించారు. ఈ క్రమంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నిరసనకారులు రాహుల్‌గాంధీ చిత్రపటాలు పట్టుకుని కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు నాయకులను బలవంతంగా వ్యానుల్లోకి ఎక్కించారు.

పిరికిపంద చర్య: షర్మిల

రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలపై భాజపా దాడులు పిరికిపంద చర్య అని ఏపీసీసీ ఉపాధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 'దిల్లీలో ఏదో జరిగిందని ఇక్కడ పార్టీ కార్యాలయాలపై దాడులా? ఇదెక్కడి ప్రజాస్వామ్యం? ఇదెక్కడి దారుణం? ఈ దుశ్చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాం. ప్రజాకోర్టులో భాజపా తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. దేశంలో ప్రశ్నించే హక్కును భాజపా కాలరాస్తోంది' అని ఆ ప్రకటనలో మండిపడ్డారు.

కాంగ్రెస్‌కు ప్రధాని కుర్చీ ముఖ్యం.. భాజపాకు దేశం ముఖ్యం..

- రాజ్యాంగాన్ని కాపాడుతున్నది మోదీ ప్రభుత్వమే
- ఎస్సీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లాల్ సింగ్ ఆర్య



మన్ కీ బాత్ క్విజ్ గోడప్రతులు ఆవిష్కరిస్తున్న భాజపా ఎస్సీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లాల్ సింగ్ ఆర్య, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్. చిత్రంలో నాగలక్ష్మి, అనిమా సుంకర్, కుమార్, దేవానంద్, శ్రీరామ్

ఈనాడు, అమరావతి: భాజపా ఉన్నంత కాలం రాజ్యాంగానికి ఎలాంటి హానీ ఉండదని భాజపా ఎస్సీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లాల్ సింగ్ ఆర్య స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు రద్దు చేస్తారని కాంగ్రెస్ చేస్తున్న ప్రచారం నమ్మవద్దని అన్నారు. విజయవాడలో శనివారం జరిగిన ఎస్సీ మోర్చా రాష్ట్ర పదాధికారులు, జిల్లా అధ్యక్షులు, సోషల్ మీడియా, మన్ కీ బాత్ కన్వీనర్ల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 'అంబేడ్కర్‌ను గౌరవిస్తూ రాజ్యాంగం ప్రకారం కేంద్ర ప్రభుత్వం నడుస్తోంది. రాజ్యాంగాన్ని గౌరవించడం, దళిత-గిరిజన వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేయడంలో మోదీ ప్రభుత్వం ముందుంటుంది. భాజపాకు దేశం ముఖ్యం.. కాంగ్రెస్‌కు దేశం కంటే ప్రధాని కుర్చీ, కుటుంబం ముఖ్యం. దేశ ప్రతిష్ఠ పెంచేలా దిల్లీలో అంతర్జాతీయ ఏఐ సమిట్ నిర్వహిస్తుంటే.. కాంగ్రెస్ నాయకులు నిరసన తెలపడం దేశాన్ని అవమానించడమే' అని పేర్కొన్నారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ 'మిగతా పార్టీల్లా భాజపా ఎస్సీలను ఓటు బ్యాంకులా చూడడం లేదు. వీరిని అడ్డుపెట్టుకుని అరాచకాలు చేయ్యాలనే ఆలోచనా లేదు. ఎస్సీలకు సముచిత గౌరవం ఇవ్వాలన్నదే భాజపా ఉద్దేశం. దిల్లీలోని ఏఐ సదస్సులో యువజన కాంగ్రెస్ నేతల తీరు సిగ్గుమాలిన చర్య. దేశ ప్రతిష్ఠ దిగజారుస్తున్న రాహుల్ గాంధీని దేశ బహిష్కరణ చేయాలి' అని డిమాండ్ చేశారు. ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి మోర్చా శ్రమించాలని సూచించారు. ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జాతీయ మీడియా కన్వీనర్ అనిమా సుంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవానంద్, రాష్ట్ర కార్యదర్శి బొడ్డు నాగలక్ష్మి, ఎన్టీఆర్ జిల్లా భాజపా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.



ఆ బడిలో బింబ ప్రతిబింబాలు!

ఒకే పాఠశాలలో చదివే 30 మంది కవలలు.. శనివారం ఒకే వేదికపై మెరిశారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకులోని మాంటిస్సోరీ పాఠశాలలో శనివారం కవలల దినోత్సవం(ఫిబ్రవరి 22న) నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ బడిలో చదువుతున్న కవలలందరితో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు వారికి పూల మొక్కలు, మిఠాయిలు అందించారు. ఒకే పాఠశాలలో ఇంత మంది ఒకేలా ఉండటం అరుదని.. వీరిని పోల్చుకోవడమూ కష్టమేనని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. – న్యూస్‌టుడే, తణుకు

హృదయం అతనిది.. స్పందన ఆమెది

బ్రెయిన్‌డెడ్ అయిన యువకుడి గుండెతో యువతికి పునర్జన్మ

ఈనాడు, అమరావతి: సత్యవతి.. విజయనగరం జిల్లా గుర్రన్నపేట గ్రామానికి చెందిన 21 ఏళ్ల యువతి. నాలుగేళ్లుగా డైలేటెడ్ మయోకార్డియోపతి సమస్యతో బాధపడుతోంది. తీవ్ర ఆయాసం, ఉన్నట్టుండి ఎగఊపిరితో నరకం అనుభవించేది. గుండె మార్చకపోతే బతకడం కష్టమని వైద్యులు తేల్చేశారు. అసలే పేద కుటుంబం.. గుండె మార్పిడి శస్త్రచికిత్స అంటే మాటలా? బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి నుంచి మాత్రమే గుండె తీసుకోగలరు. అది కూడా ఆ కుటుంబం అంగీకరిస్తేనే. గుండె దొరికినా శస్త్రచికిత్స చేయాలంటే రూ.లక్షల్లో ఖర్చవుతుంది. దీంతో సత్యవతి కుటుంబం దాదాపుగా ఆశలు వదిలేసుకుంది. ఆమెకు చికిత్స చేస్తున్న తాడేపల్లిలోని మణిపాల్ ఆస్పత్రి వైద్యులు జీవన్‌దాన్ ట్రస్ట్‌కు సమాచారం ఇచ్చారు.

కేఎల్ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న ఖమ్మం జిల్లా మధిరకు చెందిన యువకుడు (20) ఈ నెల 6న తాడేపల్లిలో రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. సత్యవతి చికిత్స పొందిన ఆసుపత్రిలోనే ఆ యువకుణ్ని చేర్చారు. వైద్యులు బ్రెయిన్‌డెడ్ కేసుగా నిర్ధారించారు. జీవన్‌దాన్ సిబ్బంది ఆ యువకుడి తండ్రిని కలిసి మాట్లాడారు. కుమారుడి అవయవాలు దానం చేసేందుకు ఆయన పెద్దమనసుతో అంగీకరించారు. ఆ యువకుడి గుండెను సేకరించి సత్యవతికి అమర్చారు. ఆమె పూర్తిగా కోలుకుంది. కాలేయాన్ని అదే ఆస్పత్రిలో ఇద్దరికి అమర్చారు. ఊపిరితిత్తుల్ని హైదరాబాద్, కిడ్నీలను గుంటూరులోని వేర్వేరు ఆసుపత్రులకు, కార్నియాను ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రికి తరలించారు.

ఇక మన రాష్ట్రంలోనే గుండెమార్పిడి

ఇది వరకు రాష్ట్రంలో గుండెమార్పిడి శస్త్రచికిత్సలకు సదుపాయాలు లేవు. నిపుణులైన వైద్యులూ అందుబాటులో లేరు. బ్రెయిన్‌డెడ్‌కి గురైన వ్యక్తి అవయవ దానానికి వారి కుటుంబం అంగీకరిస్తే.. గ్రీన్‌ఛానల్ ఏర్పాటు చేసి, ప్రత్యేక విమానంలో గుండెను చెన్నై, హైదరాబాద్, బెంగళూరు వంటి మహానగరాలకు తరలించి, అక్కడి ఆసుపత్రుల్లో రోగికి అమర్చేవారు. ఇది చాలా భారీ ఖర్చు. దాత నుంచి గుండె తీసి, రోగికి అమర్చేందుకు మధ్యలో ఉన్న వ్యవధి ఎంత తక్కువైతే ఫలితం అంత మెరుగ్గా ఉంటుంది. గుండె ఇక్కడి నుంచి ఏ చెన్నైకో తరలించి, అమర్చేందుకు సమయం ఎక్కువ పట్టేది. కొన్నేళ్ల క్రితం గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో గుండె మార్పిడి శస్త్రచికిత్స జరిగినా అది హైదరాబాద్ నుంచి వచ్చిన డాక్టర్ గోఖలే చేశారు. ఇప్పుడు రాష్ట్రంలోని ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ గుండెమార్పిడి శస్త్రచికిత్సకు సదుపాయాలున్నాయి. వైద్య నిపుణులూ ఉన్నారు. దాత నుంచి గుండె సేకరించడం, సత్యవతికి అమర్చడం ఒకే ఆసుపత్రిలో జరిగాయి కాబట్టి ఆమె వేగంగా కోలుకుంది. గుండె మార్పిడి శస్త్రచికిత్స అవసరమైన వారికి ఇప్పుడు సీఎంఆర్ఎఫ్ నుంచి ప్రభుత్వం కూడా సాయమందిస్తోంది కాబట్టి పేదలకు కూడా మన రాష్ట్రంలోనే గుండెమార్పిడి శస్త్రచికిత్సలు చేసి పునర్జన్మ ప్రసాదించే అవకాశం ఏర్పడింది. బ్రెయిన్‌డెడ్‌కి గురైన ఒక వ్యక్తి అవయవాల్ని దానం చేసేందుకు కుటుంబం ముందుకొస్తే 8 మందికి పునర్జన్మ ప్రసాదించొచ్చు. ఆ దిశగా ప్రభుత్వం విస్తృత అవగాహన కల్పించాలి.



శస్త్రచికిత్స వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ రట్టి దిలీప్‌కుమార్. చిత్రంలో గుండె మార్పిడి చేయించుకున్న సత్యవతి, ఆమె తల్లి, వైద్య బృందం

ఎనిమిది మంది జీవితాల్లో వెలుగులు

'ఊపిరాడక ప్రతి రోజూ ఒక పోరాటంలా ఉండేది. నా జీవితం ముగిసిపోతుందేమో అనుకున్నాను. ప్రాణాలు నిలవాలంటే గుండె మార్పిడి తప్పదని డాక్టర్లు చెప్పడంతో ఆశలు వదిలేసుకున్నాం. సీఎం సహాయనిధి, మణిపాల్ ఫౌండేషన్ ఆర్థికంగా ఆదుకున్నాయి. గుండె దానం చేసేందుకు ముందుకు వచ్చినవారికి జీవితాంతం రుణపడి ఉంటాను' అని సత్యవతి తెలిపారు. గుండె మార్పిడి శస్త్రచికిత్స విజయవంతమై, ఆమె పూర్తిగా కోలుకున్న సందర్భంగా మణిపాల్ ఆసుపత్రిలో శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. 'ఆరోగ్యంగా ఉన్న వ్యక్తుల్లో గుండె రక్తాన్ని పంప్ చేసే సామర్థ్యం (ఎజెక్షన్ ఫ్రాక్షన్).. 65-75 వరకు ఉంటుంది. సత్యవతిలో అది 20 కంటే తక్కువకు వచ్చేసింది. దాదాపుగా ఆశలు వదిలేసుకున్న దశలో గుండె దానం చేసేందుకు ఆ యువకుడి తల్లిదండ్రులు పెద్దమనసుతో ముందుకు రావడంతో ఆమె ప్రాణాలు కాపాడగలిగాం. మిగిలిన అవయవాలు కూడా వేరేవారికి ఉపయోగపడుతున్నాయి. ఒక తల్లి అంత విషాదంలోనూ ధైర్యంగా తీసుకున్న నిర్ణయం.. 8 మంది అమ్మల కళ్లల్లో వెలుగులు నింపుతుంది' అని సత్యవతికి గుండె మార్పిడి శస్త్రచికిత్స చేసిన డా.రట్టి దిలీప్ కుమార్ తెలిపారు. ఆ బృందంలోని కార్డియాక్ అనస్థీషియా విభాగానికి చెందిన డాక్టర్ శంకర్రావు, నెఫ్రాలజిస్ట్ డాక్టర్ శ్రీధర్, చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ మురళీకృష్ణ, ఆసుపత్రి డైరెక్టర్ రామాంజనేయరెడ్డి విలేకర్ల సమావేశంలో పాల్గొన్నారు. ఏపీ జీవన్‌దాన్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.రాంబాబు విశాఖ నుంచి వర్చువల్‌గా హాజరయ్యారు.

మా వాటా మేరకే 465 టీఎంసీలు వాడుకున్నాం

కృష్ణా బోర్డుకు ఏపీ ఈఎన్‌సీ లేఖ

ఈనాడు, అమరావతి: 'ప్రస్తుత నీటి సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ కృష్ణా నది నుంచి 465.66 టీఎంసీల నీటిని వినియోగించుకుంది. అంటే, మా వాటా మేరకు మాత్రమే తీసుకున్నాం. రెండు రాష్ట్రాల సాగు, తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకున్నాం. ఇంకా ఏపీకి ఉమ్మడి జలాశయాల్లో 40.51 టీఎంసీల నీళ్లు వాడుకునే హక్కు ఉంది' అని రాష్ట్ర జలవనరుల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ నరసింహమూర్తి కృష్ణా బోర్డు ఛైర్మన్‌కు లేఖ రాశారు. 'వరద కాలంలో మళ్లించిన నీటిని లెక్కలోకి తీసుకోకూడదు. ఆ నీటిని లెక్కించినా రాష్ట్ర వాటాగా పరిగణించకూడదు. సాగర్ కుడి, ఎడమ కాలువల కింద సాగు, తాగునీటి అవసరాలకు మే నెలాఖరు వరకు 73.50 టీఎంసీల నీరు అవసరం' అని లేఖలో పేర్కొన్నారు.

- 2025-26 నీటి సంవత్సరంలో శ్రీశైలం ప్రాజెక్టుకు వరద ప్రవాహం ఆశించిన మేర వచ్చింది. 2025 జూన్ 13 నుంచి నవంబరు చివరి వరకు 2,343 టీఎంసీల జలాలు ఈ రిజర్వాయర్‌కు చేరాయి. జూరాల ప్రాజెక్టు నుంచి ప్రకాశం బ్యారేజ్ వరకు కృష్ణాలో మిగులు జలాలున్న సమయంలో 58 రోజుల పాటు 1,513 టీఎంసీలు శ్రీశైలానికి వచ్చాయి.
- అలా భారీగా వరద పోటెత్తిన సందర్భంలోనే విద్యుత్ కేంద్రం, స్పిల్ వేతో పాటు శ్రీశైలం అన్ని అవుట్ లెట్‌ల ద్వారా నీళ్లు వదిలేశాం. వెరసి, నీటి వనరులను ఉత్తమంగా వినియోగించాం.

ఇతరుల సంక్షేమానికి కృషి చేయడమే దైవత్వం

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఇతరుల సంక్షేమానికి కృషి చేయడం దైవత్వంతో సమానమని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ అన్నారు. మహిళలు, అంధులు, వయోధికుల సంక్షేమానికి విశాఖపట్నం కేంద్రంగా పని చేస్తున్న మహిళా చైతన్య స్రవంతి సంస్థ రజతోత్సవం, 26వ వార్షికోత్సవాన్ని శనివారం హైదరాబాద్ నానక్‌రాంగూడలోని ఓ హోటల్‌లో ఆయన ప్రారంభించారు. సంస్థ ప్రస్థానాన్ని వివరించే సావనీర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కష్టకాలంలో చేయూతనిచ్చి అండగా నిలవడం సమాజంలో నైతికత నిర్మాణాన్ని బలోపేతం చేస్తుందన్నారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ మాట్లాడుతూ.. మహిళా చైతన్య స్రవంతి సమాజానికి చేస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో సంస్థ ఛైర్‌పర్సన్ డి.వెంకటలక్ష్మి, న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ. చిత్రంలో మహిళా చైతన్య స్రవంతి ఛైర్‌పర్సన్ వెంకటలక్ష్మి, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్

ఏబీవీపీ ఆందోళన.. ఏయూలో ఉద్రిక్తత

విశాఖపట్నం (ఏయూ ప్రాంగణం), న్యూస్‌టుడే: ఏబీవీపీ విద్యార్థులు, ఆరెస్సెస్ కార్యకర్తలు, వారి మద్దతుదారుల నిరసనలతో శనివారం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈ నెల 17న తమపై దాడి చేసినవారిని అరెస్టు చేయాలని, శుక్రవారం ఆర్ట్స్ కళాశాలలో ఆరెస్సెస్‌కు వ్యతిరేకంగా కరపత్రాలు పంపిణీ చేస్తూ పట్టుబడిన 8 మందిపై, వారికి మద్దతు తెలిపిన ఆచార్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం ఏయూ ప్రధానద్వారం వద్ద ఏబీవీపీ విద్యార్థులు, ఆరెస్సెస్ కార్యకర్తలు నిరసనకు దిగారు. ఏసీపీ లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు ఏయూకు ఉన్న దారులన్నీ మూసేశారు. ఏబీవీపీ విద్యార్థులు ప్రధాన ప్రవేశద్వారం గేటు, గోడలు దూకి వర్సిటీలోకి ప్రవేశించేందుకు చేసిన ప్రయత్నాలను అడ్డుకున్నారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ అక్కడికి చేరుకుని నిరసనకారులతో మాట్లాడారు. ఆధారాలు సమర్పిస్తే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఏబీవీపీ విద్యార్థులతో సమావేశమై చర్చించడంతో వారు శాంతించారు.



ఏయూ ప్రధాన ప్రవేశద్వారం వద్ద ఏబీవీపీ విద్యార్థులను నిలువరిస్తున్న పోలీసులు

కోతి పోవడానికి కోటి విద్యలు



కోతులను బెదరగొట్టేందుకు రైతులు ఎలుగుబంటి, పులుల వేషధారణతో తోటల్లో తిరుగుతున్నారు. దీంతో అవి ఆ పరిసరాల్లోకి రావడం లేదు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలంలో కొబ్బరి, కూరగాయలు, అరటి తోటలను వానరాలు ధ్వంసం చేస్తున్నాయి. కాపలా ఉన్నా.. ఏ మూల నుంచో ఒక్కసారిగా పంటపై పడుతున్నాయి. ఒక్కోసారి కాపలాదారులనూ బెదిరిస్తున్నాయి. వీటి ఆటకట్టించాలని మాసాహెబ్‌పేట, సత్యవరం, కేశవరం తదితర గ్రామాల్లో కొందరు రైతులు ఎలుగుబంట్లు, పులుల వేషంలో తోటల్లో తిరుగుతూ వాటిని బెదరగొట్టే యత్నం చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, పాయకరావుపేట

ఆయన ఆటోలో ప్రయాణం సురక్షితం, వస్తువులు భద్రం

ప్రయాణికులు మరిచిపోయిన రూ.16 లక్షల బంగారాన్ని అప్పగించిన డ్రైవర్

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆటోడ్రైవర్ నిజాయతీ ప్రయాణికుల నగలను వారికి భద్రంగా అందేలా చేసింది. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో శనివారం ఈ సంఘటన జరిగింది. ఆత్మకూరులోని శివాలయం సెంటర్‌కు చెందిన దాసరి అమృతలక్ష్మి, పూజారి మంగమ్మలు ఊరు వెళ్లేందుకు ఆటో ఎక్కి.. పట్టణంలోని పురపాలక బస్టాండ్ వద్ద దిగారు. ఈ క్రమంలో నగలు, నగదు ఉన్న సూట్‌కేస్ మరిచిపోయి వెళ్లిపోయారు. ఇది గమనించిన ఆటోడ్రైవర్ రమణయ్య ఓ దుకాణంలో సూట్‌కేసు ఉంచారు. ఎవరైనా వస్తే తనకు ఫోన్ చేయాలని చెప్పి వెళ్లారు. సూట్‌కేస్ పోగొట్టుకొన్న మహిళలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సైలు సాయిప్రసాద్, జిలానీలు బస్టాండ్ వద్ద సీసీ టీవీ ఫుటేజీ పరిశీలించి ఆటోను గుర్తించి రమణయ్యకు ఫోన్ చేశారు. సూట్‌కేసు దుకాణంలో ఉంచానని తెలపడంతో పోలీసులు దానిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం తెరిచి చూడగా రూ.16 లక్షలకుపైగా విలువచేసే 15 సవర్ల బంగారు నగలు, రూ.10,000 నగదు భద్రంగా ఉన్నాయి. దీంతో వాటిని మహిళలకు అప్పగించారు. నిజాయతీతో వ్యవహరించిన రమణయ్యను పోలీసులు సన్మానించారు.



ఆటోడ్రైవర్ రమణయ్యను సన్మానిస్తున్న సీఐ గంగాధర్‌రావు. చిత్రంలో ఎస్సైలు జిలానీ, సాయిప్రసాద్ తదితరులు

మీ శరీరానికి మీరిచ్చే కానుక అదే..



నడకను మీ శరీరానికి ప్రతిరోజూ మీరిచ్చే కానుకగా భావించండి. క్రమం తప్పకుండా కనీసం 7 వేల అడుగులు నడవండి. నడకను ఆస్వాదిస్తూ పూర్తి చేయాలి తప్ప భారంగానో, చేయక తప్పని పనిగానో భావించకండి. ఈ అలవాటును కొనసాగించడం వల్ల మీ రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. జీర్ణక్రియ మెరుగవుతుంది. మనసు తేలికపడుతుంది.

– వి.మోహన్, వైద్య నిపుణులు

EENADU Vol: 52, Issue: 193 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

బ్యాచిలర్స్ కిచెన్

బీటెక్ చేసేందుకు హైదరాబాద్ వచ్చాను. అప్పటివరకూ అమ్మ చేసిన వంటకు వంకలు పెట్టడం తప్పితే.. కాఫీ కలపడం కూడా రాదు. హాస్టల్ తిండి కొన్నాళ్లకే విసుగొచ్చేసింది. కడుపు మాడ్చుకోలేక గది తీసుకుందామనిపించింది. ఆ సంగతి చెబితే.. నా ఫ్రెండ్స్ ఎప్పుడు, ఎక్కడ.. అనకుండా 'వంటొచ్చా?' అనడిగారు. నేర్చుకోవచ్చులెమ్మన్న ధీమాతో 'అదేం బ్రహ్మవిద్యా?' అనేశా. నా తిక్క కుదర్చాలన్నట్టు.. వెళ్లిన మొదటిరోజే వంట చేయమన్నారు. నేను బిక్కచచ్చిపోయి.. నిజం చెప్పేసి రెండ్రోజుల్లో నేర్చేసుకుంటానన్నాను.

ఏ కర్రీకైనా ఒకటే ఫార్ములా!



'ఈ తెలివితోనే కెఫే పెట్టాలనుకున్నావా?'- అన్నారు వెటకారంగా. 'అది బిజినెస్ ఐడియా. నేనెందుకు చేస్తా, వంటొచ్చినవాళ్లతో చేయిస్తా' అన్నాను ఉక్రోషంగా. వాళ్లిద్దరూ ఇంకాసేపు ఆటపట్టించి.. అమోఘంగా వంట చేసేశారు. 'ఈజీ వంటకి టెక్నిక్ చెప్పనా?'- అంది దివ్య. 'మీరుండగా నాకెందుకు?' అన్నాను. 'ఇవే తగ్గించుకుంటే మంచిది' అంది ప్రకాశ్‌రాజ్‌ని అనుకరిస్తూ. ఆ వెంటనే బాలకృష్ణ గొంతుతో 'కడాయిలో నూనె వేడిచేసి పోపుగింజలు, కరివేపాకు, ఉల్లిపాయ ముక్కలు ఒకదాని తర్వాత ఒకటి వేసెయ్! మూత పెట్టి రెండు నిమిషాలుంచు. తర్వాత ఏ కూర చెయ్యాలో.. ఆ ముక్కలు వేసి.. మళ్లీ మూత పెట్టు! అవి ఉడికిపోయాక.. కారం, ఉప్పు, మసాలా పొడర్లు, కొత్తిమీర తరుగు చల్లి.. స్టవ్ కట్టేయ్! అంతే.. సూపర్ డూపర్ కర్రీ తయారైపోతుంది' అంది. నేనిక ఏ కూర చేయాలన్నా అదే యూనివర్సల్ ఫార్ములాను ఫాలో అయిపోయా. తర్వాత చాలానే నేర్చుకుని, మాస్టర్ షెఫ్‌ని అయిపోయి, వంటలో వంద టిప్స్ చెప్పే స్థాయికి ఎదిగిపోయా. కానీ ఈ రహస్యం మాత్రం నా ఫ్రెండ్స్‌తో చెప్పొద్దు.. 'అంతా ఉత్తిదే' అనేస్తారు- జెలసీతో.

– సీహెచ్. పూజిత, సూర్యాపేట

కూర, చారుల్లో చింతపండు వేయాలంటే.. దాన్ని నానబెట్టడం, గుజ్జు తీయడం ప్రహసనంలా తోస్తుంది. అదే చింతపండు పొడి సిద్ధంగా ఉంటే పని సులువైపోతుంది. ఇదెలా చేయాలంటే..

చింతపండు పొడి.. ఎంత సులువో!



నాణ్యమైన చింతపండును ఎంచుకోవాలి. పెంకు, పీచు, గింజలను తొలగించాలి. దీన్ని పళ్లెంలోకి తీసి.. ఎండబెట్టాలి. ఒకట్రెండు రోజులు సరిపోదు. బాగా ఎండ తగిలే స్థలంలో.. ఎంతమాత్రం తేమ లేకుండా పెళుసుగా అయ్యే వరకూ ఎండనివ్వాలి. ఇందుకు ఆరేడు రోజులు పడుతుంది. తర్వాత దాన్ని మెత్తటి పొడి అయ్యేలా గ్రైండ్ చేయాలి. ఈ పౌడర్‌ను గాలి చొరబడని సీసాలోకి తీసి రిఫ్రిజిరేటర్‌లో భద్రం చేసుకోవాలి. తడి స్పూన్ వాడకూడదు.

ఇవీ లాభాలు..

సాంబార్, రసం, పులుసు కూరలు, చట్నీలు, పులుపు అవసరమయ్యే ఇతర వంటకాల్లో వేసుకోవడానికి రెడీగా ఉంటుంది. పులిహోర వంటి వాటికి సులభంగా పులుపును జోడించడానికి ఉపయోగపడుతుంది. చింతపండు నానబెట్టడం, పులుసు పిండటం లాంటి శ్రమ లేకుండా పని సులువుగా, వేగంగా పూర్తవుతుంది. చింతపండు జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఇందులో ఉండే పొటాషియం, మెగ్నీషియం, ఫ్లేవనాయిడ్స్ రక్తపోటును నియంత్రణలో ఉంచుతాయి. కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. రోగనిరోధకశక్తి పెరుగుతుంది. ఊబకాయం రాకుండా తోడ్పడుతుంది.

ఇలా కూడా చేయొచ్చు..

ఆవాలు, మెంతులు, శనగపప్పు, మినప్పప్పు, ధనియాలు, జీలకర్ర, ఎండు మిరపకాయలను సమాన పాళ్లలో తీసుకోవాలి. వాటిని సువాసన వచ్చే వరకూ వేయించాలి. చల్లారాక ఉప్పు చేర్చి గ్రైండ్ చేయాలి. దీనికి తగినంత మోతాదులో చింతపండు పొడి కలపాలి. ఈ పౌడర్‌ను వేడి అన్నంలో నెయ్యితో తింటే సూపర్‌గా ఉంటుంది. ఇందులో కాస్త పెరుగు లేదా నెయ్యి జోడిస్తే.. ఇడ్లీ, దోశ వంటి ఫలహారాలకు ఇన్‌స్టంట్ చట్నీలా ఉంటుంది.

నూనె లేకుండా.. నోరూరించే కూర!

చాలామంది కూరల్లో నూనె ఎక్కువ వేస్తుంటారు. అలా అయితేనే కూరకు రుచి వస్తుందని. నిజానికి తక్కువ నూనెతోనూ చక్కటి వంటకాలు చేసుకోవచ్చు. నేను అసలు నూనే లేకుండా పనీర్ బఠాణీ కూర చేస్తానిలా...

పాఠక వంట



ఈ కూర కోసం.. పనీర్ - 200 గ్రాములు, పచ్చి బఠాణీలు - 100 గ్రా, టొమాటోలు అరకిలో, ఉల్లిపాయలు - 3, పచ్చిమిర్చి - 2, ఉప్పు - రుచికి తగినంత, జీడిపప్పులు - 10, అల్లం - రెండంగుళాల ముక్క, వెల్లుల్లి రెబ్బలు - 6, కసూరీ మేథీ - టేబుల్‌స్పూన్, మిరియాల పొడి - అర స్పూన్, కొత్తిమీర తరుగు - గుప్పెడు, ధనియాలు, జీలకర్ర పొడులు, గరం మసాలా, కారం, నిమ్మరసం - స్పూన్ చొప్పున తీసుకోవాలి. ఎలా చేయాలంటే.. బఠాణీలను ఉడికించి ఉంచాలి. ఉల్లి, మిర్చి, టొమాటోలను పెద్ద ముక్కలుగా కోసుకోవాలి. అందులో కొన్ని నీళ్లు పోసి ఉడికించాలి. చల్లారాక.. అల్లం, వెల్లుల్లి, జీడిపప్పు జతచేసి గ్రైండ్ చేయాలి. ఈ పేస్టుని అదే కడాయిలో వేసి.. ఉడికించిన బఠాణీలు, గరంమసాలా, ధనియాలు, జీలకర్ర, మిరియాల పొడులు, కారం, ఉప్పు వేసి సన్న సెగ మీదుంచాలి. అడుగంటకుండా మధ్యలో కలియతిప్పుతుండాలి. తర్వాత పనీర్, కసూరీ మేథీ చేర్చి ఇంకో రెండు నిమిషాలుంచాలి. చివర్లో కొత్తిమీర, నిమ్మరసం వేసి దించేయాలి. ఒకసారి బాగా కలిపి, సర్వింగ్ బౌల్‌లోకి తీసుకుంటే, నోరూరించే జీరో ఆయిల్ మటర్ పనీర్ రెడీ! ఇది అన్నంలోకే కాకుండా చపాతీల్లోకి కూడా బాగుంటుంది. ఈ కూరతో పోషకాలు అందుతాయి. నూనె వాడకపోవడం వల్ల ఆరోగ్యకరం. – ప్రభారమ్య మండవిల్లి, కాకినాడ



చారులో ముల్లంగి వేస్తే రుచి రెట్టింపైపోతుంది. ఆయుర్వేదంలో పైల్స్ లాంటి అనేక సమస్యలకు దీన్ని ఔషధంగా ఉపయోగిస్తారు. దీంతో క్యాండీ చేస్తారంటే ఆశ్చర్యమే కదూ.. కానీ సహజమైన వెగటు పోయి.. ప్రత్యేకమైన రుచి వస్తుంది.

రుచీ ఆరోగ్యాల ముల్లంగి క్యాండీ



కావలసినవి: తాజా ముల్లంగి ముక్కలు - కప్పు, పంచదార - ముప్పావు కప్పు, పంచదార పొడి - అర స్పూన్, నీళ్లు - తగినన్ని, అల్లం ముద్ద, నిమ్మరసం - స్పూన్ చొప్పున, నెయ్యి - అర స్పూన్, ఎండుకొబ్బరి పొడి - ముప్పావు స్పూన్

తయారీ: ముల్లంగిని కడిగి చెక్కు తీసి.. సన్నని ముక్కలుగా కోయాలి. వాటిలో నీళ్లు పోసి మరిగించాలి. ముల్లంగి మెత్తగా అయ్యే వరకూ ఉడికించి సెగ తీయాలి. చల్లారాక మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ ముల్లంగి పేస్ట్‌ను ఒక పాత్రలోకి తీసి.. పంచదార, అల్లం ముద్ద, కొన్ని నీళ్లు జతచేసి.. సన్న సెగ మీద ఉడికించాలి. ఆపకుండా కలుపుతూ మిశ్రమం చిక్కబడే వరకూ ఉంచాలి. అందులో నిమ్మరసం జోడించి దించేయాలి. చల్లారిన మిశ్రమాన్ని నెయ్యి రాసిన పళ్లెంలో సమంగా సర్దాలి. గట్టిపడిన తర్వాత నచ్చిన ఆకృతిలో ముక్కలుగా కట్ చేయాలి. వాటిమీద ఎండుకొబ్బరి పొడి, పంచదార పొడి చల్లితే సరిపోతుంది.. క్యాండీలు పూర్తిగా చల్లారిన తర్వాత తడి లేని, గాలి చొరబడని సీసాలోకి తీసి.. రిఫ్రిజిరేటర్‌లో భద్రం చేసుకుంటే చాన్నాళ్లు నిలవుంటాయి.

ఇదెంతో మంచిది..

ముల్లంగి క్యాండీలు రుచే కాదు ఆరోగ్యం కూడా. ఇవి పిల్లలూ పెద్దలూ అందరికీ నచ్చేస్తాయి. గొంతు నొప్పి, దగ్గు లాంటి సమస్యలను నివారిస్తాయి. వీటితో జీర్ణక్రియ సాఫీగా ఉంటుంది. వేళకు ఆకలి వేస్తుంది.

గసగసాల పానీయం తాగుదామా!



గసగసాలను మసాలా కూరల్లో వేస్తాం కదా! వీటితో కాన్సన్‌ట్రేట్ సిద్ధం చేసి ఉంచితే.. ఎంచక్కా శీతల పానీయాలకు బదులుగా తాగొచ్చు.

కావలసినవి: గసగసాలు (ఖస్ ఖస్) - గుప్పెడు, పంచదార - పావున్నర, యాలకుల పొడి - అర స్పూన్, నిమ్మరసం - స్పూన్, రోజ్ వాటర్ - కొద్దిగా

తయారీ: గసగసాలను కడిగి.. అర కప్పు నీళ్లు పోసి పక్కనుంచాలి. రెండు గంటల తర్వాత నానిన గసగసాలను ఆ నీళ్లతో సహా మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని పల్చని వస్త్రంతో వడకట్టాలి. వచ్చిన తెల్లటి పాలను ఒక పాత్రలోకి తీసుకోవాలి. అందులో పంచదార, యాలకుల పొడి వేసి సన్న సెగ మీద మరిగించాలి. ఐదారు నిమిషాల తర్వాత సెగ తీసేయాలి. ఇప్పుడు నిమ్మరసం, రోజ్ వాటర్ కలపాలి. సిరప్ పూర్తిగా చల్లారిన తర్వాత తడి లేని, గాలి చొరబడని సీసాలోకి తీసి.. రిఫ్రిజిరేటర్‌లో భద్రం చేయాలి. తడి తగలకుండా చూడటం, ప్రతిసారీ పొడి స్పూనే వాడటం వంటి జాగ్రత్తలు తీసుకుంటే పది నుంచి పదిహేను రోజులు నిలవుంటుంది. తాగదలచినప్పుడు నీళ్లు లేదా పాలలో 2 టేబుల్ స్పూన్ల సిరప్ కలిపితే సరిపోతుంది. గసగసాలను ఎక్కువసేపు మరిగిస్తే.. రంగు మారుతుంది, రుచి తగ్గుతుంది- అని గుర్తుంచుకోవాలి.



రంజాన్ మాసం వచ్చిందంటే ఇఫ్తార్ విందులు షురూ. రోజంతా ఉపవాసం చేశాక.. సాయంత్రం బంధుమిత్రులతో కబుర్లు కలబోసుకుంటూ తినడం ఎంత బాగుంటుంది కదూ! ఈసారి ఇఫ్తార్‌లో ఈ మెనూ చేర్చి చూడండి.. వహ్వారే అనేస్తారంతా..

ఇఫ్తార్.. షాన్దార్!

మటన్ హలీమ్

కావలసినవి: మాంసం - అర కిలో, గోధుమలు - కప్పు, శనగపప్పు, ఎర్ర కందిపప్పు, పెసరపప్పు, బియ్యం, అల్లం వెల్లుల్లి పేస్ట్ - 2 టేబుల్ స్పూన్ల చొప్పున, పచ్చిమిర్చి ముద్ద - టేబుల్ స్పూన్, ఉల్లితరుగు - కప్పు, పసుపు - అర స్పూన్, ధనియాల పొడి, కారం - స్పూన్ చొప్పున, గరం మసాలా - అర స్పూన్, ఉప్పు - రుచికి తగినంత, నెయ్యి - అర కప్పు, నూనె - 3 టేబుల్ స్పూన్లు

తయారీ: మటన్‌లో తగినన్ని నీళ్లు, కొద్దిగా నూనె, అల్లం వెల్లుల్లి పేస్ట్, కారం, పసుపు వేసి.. ఐదు విజిల్స్ వచ్చే వరకూ ఉడికించాలి. ఉడికిన ముక్కల్లో అదనంగా ఉన్న నీటిని వేరుచేసి ఉంచాలి. గోధుమలు, బియ్యం, అన్ని రకాల పప్పులను మూడు గంటలు నానబెట్టి, తర్వాత ఉడికించాలి. చల్లారాక మెత్తగా గ్రైండ్ చేయాలి. కడాయిలో నూనె వేడిచేసి.. ఉల్లితరుగును లేత బంగారు రంగులోకి మారే వరకూ వేయించాలి. అందులో పచ్చిమిర్చి ముద్ద, మటన్ ముక్కలు జోడించాలి. వాటిని కొద్దిసేపు వేయించి.. మాంసం ఉడికించిన నీళ్లు పోయాలి. ఇప్పుడు గోధుమలు - పప్పుల పేస్ట్, ధనియాల పొడి, గరం మసాలా, ఉప్పు చేర్చి.. 40 నిమిషాల వరకూ కలియబెడుతూ ఉడికించాలి. మటన్ ముక్కలను గరిటెతో మెదిపి.. నెయ్యి, నిమ్మరసం జోడించాలి. ఇక నోరూరించే హలీమ్ తిని ఆనందించడమే తరువాయి.



రొయ్యల పులావ్



కావలసినవి: బాస్మతి బియ్యం - కప్పున్నర, ఉల్లిపాయ ముక్కలు - ముప్పావు కప్పు, రొయ్యలు - కప్పున్నర, పచ్చిమిర్చి - రెండు, అల్లం వెల్లుల్లి పేస్ట్ - టేబుల్ స్పూన్, సన్నగా తరిగిన టొమాటో, పుదీనా, కొత్తిమీర - గుప్పెడు చొప్పున, దాల్చిన చెక్క - అంగుళం ముక్క, లవంగాలు - 6, యాలకులు - 2, బిర్యానీ ఆకు - ఒకటి, కారం, జీలకర్ర, మిరియాలు, ధనియాల పొడులు - స్పూన్ చొప్పున, షాజీరా - అరస్పూన్, ఉప్పు - రుచికి తగినంత, ఎండు కొబ్బరి పొడి - గుప్పెడు, నూనె, నెయ్యి - 2 టేబుల్ స్పూన్ల చొప్పున, నిమ్మరసం - ముప్పావు స్పూన్

తయారీ: బియ్యం కడిగి అరగంట నానబెట్టాలి. శుభ్రం చేసిన రొయ్యల్లో ఉప్పు, పసుపు వేసి మ్యారినేట్ చేయాలి. ప్యాన్‌లో నూనె వేడి చేసి.. దాల్చిన చెక్క, బిర్యానీ ఆకు, యాలకులు, లవంగాలు, జీలకర్ర, షాజీరా వేయాలి. మంచి వాసన వస్తుండగా.. పుదీనా, ఉల్లి, అల్లం వెల్లుల్లి పేస్ట్, సగానికి చీల్చిన పచ్చిమిర్చి, టొమాటో ముక్కలు జోడించాలి. అవి వేగాక.. రొయ్యలు చేర్చి కొంచెం మగ్గనివ్వాలి. అందులో కారం మిరియాలు, ధనియాల పొడులు, ఉప్పు, నానబెట్టిన బియ్యం, తగినన్ని నీళ్లు జోడించి ఉడికించాలి. చివర్లో కొత్తిమీర తరుగు, నిమ్మరసం, నెయ్యి చల్లి.. సెగ తీసేయాలి. రైతాతో వడ్డిస్తే రొయ్యల పులావ్ అద్దిరిపోతుంది.

చికెన్ జహాపనా



కావలసినవి: చికెన్ - అర కిలో, ఉల్లిపాయలు - 3, టొమాటో ప్యూరీ - పావు కప్పు, పెరుగు - అర కప్పు, అల్లం వెల్లుల్లి పేస్ట్ - 2 టేబుల్ స్పూన్లు, పచ్చిమిర్చి - 3, షాజీరా - అర స్పూన్, దాల్చినచెక్క - అంగుళం ముక్క, లవంగాలు - 4, యాలకులు - 3, బిర్యానీ ఆకు - 1, పసుపు - అర స్పూన్, కారం, ధనియాల పొడి - స్పూన్ చొప్పున, జీలకర్ర పొడి, గరం మసాలా - అర స్పూన్ చొప్పున, ఉప్పు - రుచికి తగినంత, నెయ్యి - 2 టేబుల్ స్పూన్లు, నూనె - 3 టేబుల్ స్పూన్లు, కొత్తిమీర, పుదీనా - గుప్పెడు చొప్పున, నిమ్మరసం - టేబుల్ స్పూన్

తయారీ: ఉల్లి, మిర్చిలను సన్నగా తరగాలి. చికెన్ కడిగి పక్కనుంచాలి. కడాయిలో నూనె వేడిచేసి.. బిర్యానీ ఆకు, దాల్చినచెక్క, యాలకులు, లవంగాలు, షాజీరా వేయాలి. మంచి వాసన వస్తుండగా.. ఉల్లితరుగు వేసి.. బంగారు రంగులోకి మారే వరకూ వేయించాలి. అందులో పుదీనా, అల్లం వెల్లుల్లి పేస్ట్, పచ్చిమిర్చి జతచేయాలి. పచ్చి వాసన పోయాక.. టొమాటో ప్యూరీ జోడించి నూనె పైకి తేలే వరకూ ఉంచాలి. ఇప్పుడు పెరుగు, తగినన్ని నీళ్లు, కారం, పసుపు, ధనియాలు, జీలకర్ర పొడులు, గరం మసాలా, ఉప్పు, చికెన్ ముక్కలు చేర్చి.. మధ్యస్థమైన సెగ మీద ఉడికించాలి. ముక్కలు చక్కగా ఉడికి, గ్రేవీ చిక్కగా అయ్యాక.. కొత్తిమీర, నిమ్మరసం చల్లి సెగ తీసేయాలి. ఈ 'చికెన్ జహాపనా' బిర్యానీలోకి మరింత బాగుంటుంది.

షీర్ ఖుర్మా

కావలసినవి: పాలు - లీటర్, గింజలు లేని ఖర్జూరాలు, సేమియా - కప్పు చొప్పున, పంచదార - అర కప్పు, నెయ్యి - రెండున్నర టేబుల్ స్పూన్లు, జీడిపప్పు - 4 టేబుల్ స్పూన్లు, పిస్తా, బాదం పలుకులు, గుమ్మడి గింజలు- ఒకటిన్నర టేబుల్ స్పూన్లు, ఎండుద్రాక్ష- 2 టేబుల్ స్పూన్లు, యాలకుల పొడి - అర స్పూన్, కుంకుమపువ్వు - కొద్దిగా

తయారీ: ఖర్జూరాలను చిన్న ముక్కలుగా చేయాలి. అడుగుభాగం మందంగా ఉన్న పాత్రలో ఒక స్పూన్ నెయ్యి వేడిచేసి.. సేమియా వేయించాలి. అందులో పాలు పోసి సన్న సెగ మీద ఉడికించాలి. అడుగంటకుండా మధ్య మధ్యలో కలుపుతుండాలి. సేమియా మెత్తబడిన తర్వాత ఖర్జూర ముక్కలు, యాలకుల పొడి కుంకుమ పువ్వు జతచేయాలి. నాలుగైదు నిమిషాల తర్వాత.. పంచదార జోడించాలి. చిన్న ప్యాన్‌లో మిగిలిన నెయ్యి వేసి.. బాదం, పిస్తా, గుమ్మడి గింజలు, జీడిపప్పు, ఎండు ద్రాక్షలను దోరగా వేయించి.. షీర్ ఖుర్మాలో కలపాలి. ఇది చల్లారిన తర్వాత గట్టిపడుతుంది కాబట్టి కొంచెం పల్చగా ఉండగానే సెగ తీసేయాలి. ఇఫ్తార్ సమయంలో ఇది శక్తినిచ్చే స్వీట్.




కీమా సమోసా



కావలసినవి: మటన్ కీమా - పావు కిలో, మైదా - ఒకటిన్నర కప్పులు, పంచదార - ముప్పావు స్పూన్, నెయ్యి - 2 స్పూన్లు, ఉల్లి తరుగు, పచ్చి బఠాణీలు - గుప్పెడు చొప్పున, అల్లం వెల్లుల్లి పేస్టు - ఒకటిన్నర స్పూన్లు, కారం - 2 స్పూన్లు, ఉప్పు - రుచికి తగినంత, గరం మసాలా, మిరియాలు, ధనియాల పొడులు, పసుపు - ముప్పావు స్పూన్ చొప్పున, కొత్తిమీర తరుగు - పావు కప్పు, నిమ్మరసం - అర స్పూన్, నూనె - వేయించడానికి సరిపడా

తయారీ: వెడల్పాటి పాత్రలో మైదా, తగినన్ని నీళ్లు, నెయ్యి, పంచదార, ఉప్పు వేసి.. ఉండలు కట్టకుండా బాగా కలిపి పక్కనుంచాలి. కీమాలో ఉప్పు, పసుపు వేసి కుక్కర్‌లో ఉడికించాలి. కడాయిలో కాస్త నూనె వేడిచేసి.. ఉల్లి తరుగును గోధుమరంగులోకి మారే వరకూ వేయించాలి. అందులో అల్లం వెల్లుల్లి పేస్టు జోడించి పచ్చి వాసన పోయే వరకూ ఉంచాలి. దానికి మిరియాలు, ధనియాల పొడులు, గరం మసాలా, పచ్చి బఠాణీలు జతచేయాలి. బఠాణీలు మెత్తగా అయ్యాక కీమా చేర్చి వేయించాలి. చివర్లో కొత్తిమీర తరుగు, నిమ్మరసం కూడా వేసి దించేయాలి. నానిన పిండితో చిన్న రొట్టెలు చేసి.. ఒక్కో దాంట్లో తగినంత కీమా మిశ్రమం ఉంచి.. త్రికోణం వచ్చేలా మడవాలి. అన్నీ అయ్యాక.. కాగుతున్న నూనెలో వేయించాలి. అంతే.. 'కీమా సమోసా' రెడీ.



చిత్రంగా..

వెరీ గుడ్డు

గుడ్డులో అనేక పోషకాలుంటాయి. అందుకే రోజుకో గుడ్డు తినమని ఆహార నిపుణులు పదేపదే చెబుతుంటారు. వీటిని పిల్లలు పేచీ పెట్టకుండా తినాలంటే.. చక్కటి ఆకృతులు కల్పించి.. ఇలా ఆకర్షణీయంగా అమర్చి చూడండి.. పోటీలు పడి తినేస్తారు.



ఫిష్ కుర్మా ఇలా చేయండి!

షెఫ్ స్పెషల్




చేపలతో కూర, పులుసు, వేపుడు సాధారణం. వీటితో కుర్మా ఎప్పుడైనా చేశారా? ఒకసారి ఈ కొలతల ప్రకారం ఇలా చేశారంటే.. మహా టేస్టీగా ఉంటుంది. ఇకపై తరచూ ఈ పద్ధతినే అనుసరించడం ఖాయం.

కావలసినవి: చేపలు - అర కిలో, ఉల్లి తరుగు - కప్పు, పచ్చిమిర్చి - రెండు, అల్లం వెల్లుల్లి పేస్ట్ - రెండు స్పూన్లు, జీడిపప్పులు - 12, పెరుగు - కప్పు, ధనియాలు, జీలకర్ర పొడులు, గరం మసాలా - స్పూన్ చొప్పున, పసుపు - అర స్పూన్, ఉప్పు - రుచికి తగినంత, నూనె - 4 స్పూన్లు, యాలకులు - రెండు, లవంగాలు - మూడు, దాల్చిన చెక్క - అంగుళం ముక్క, బిర్యానీ ఆకు - ఒకటి, కొత్తిమీర తరుగు - పావు కప్పు

తయారీ: చేపలను శుభ్రంగా కడిగి ముక్కలుగా కోసుకోవాలి. వాటికి కాస్త పసుపు, ఉప్పు పట్టించి పక్కనుంచాలి. జీడిపప్పులు నానబెట్టి మెత్తగా నూరి ముద్ద చేయాలి. పెరుగును గిలకొట్టాలి. ప్యాన్‌లో నూనె వేడిచేసి.. దాల్చినచెక్క, బిర్యానీ ఆకు, యాలకులు, లవంగాలు ఒక్కొక్కటిగా వేయాలి. మంచి వాసన వస్తుండగా.. ఉల్లితరుగు వేసి సన్న సెగ మీద బంగారు రంగులోకి మారే వరకూ వేయించాలి. అందులో అల్లం వెల్లుల్లి పేస్ట్, పచ్చిమిర్చి జోడించి.. పచ్చి వాసన పోయే వరకు కలిపి.. చేప ముక్కలు, పావు కప్పు గోరువెచ్చని నీళ్లు చేర్చి.. మూత పెట్టాలి. ముక్కలు మెత్తబడ్డాక.. ధనియాలు, జీలకర్ర పొడులు, గరం మసాలా పసుపు, జీడిపప్పు పేస్ట్ జతచేయాలి. ముక్కలకు మసాలా పట్టిందనుకున్నాక.. గిలకొట్టిన పెరుగు కొద్దికొద్దిగా వేసి కలియబెడుతుండాలి. చిక్కటి గ్రేవీ తయారై.. నూనె పైకి తేలుతున్నప్పుడు.. కొత్తిమీర చల్లి దించేయాలి. ఇది అన్నంలోకే కాదు.. చపాతీ, రుమాలీ రోటీ, పరోటా ఎందులోకైనా బాగుంటుంది.

ఈనాడు సినిమా




కమల్‌హాసన్, రజనీకాంత్

మళ్లీ కలిశారు... మరి హీరో ఎవరు?

సినీ ప్రయాణం ఆరంభమైన తొలి రోజుల్లో అగ్ర కథానాయకులు రజనీకాంత్ - కమల్‌హాసన్ కలిసి పదుల సంఖ్యలో సినిమాలు చేశారు. పలు భాషల్లో ఆ సినిమాలు విడుదలై విజయాల్ని అందుకున్నాయి. అగ్ర కథానాయకులు అయ్యాక వీరి కలయికలో సినిమాలు రాలేదు. ఈ ఇద్దరూ కలిసి నటించనున్న సినిమా కోసం ఎప్పట్నుంచో ఎదురు చూస్తున్నారు అభిమానులు. 47 ఏళ్ల తర్వాత మళ్లీ ఈ ఇద్దరి కలయికలో సినిమా రూపొందుతోంది. కమల్‌హాసన్ వర్సెస్ రజనీకాంత్ అనే వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రానికి నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. రెడ్ జెయింట్ మూవీస్ సంస్థ నిర్మిస్తోంది. శనివారం ఈ సినిమాకు సంబంధించిన ప్రత్యేకమైన వీడియోను విడుదల చేసింది చిత్రబృందం. హీరో ఎవరు? అనే ప్రశ్నతో ముగిసే ఆ వీడియోలో కమల్‌హాసన్, రజనీకాంత్‌తోపాటు దర్శకుడు నెల్సన్, సంగీత దర్శకుడు అనిరుధ్ కనిపించారు. "భారతీయ సినిమాకి ఇవి చారిత్రక క్షణాలు. ఇద్దరు దిగ్గజ కథానాయకుల కలయికలో సినిమాని నిర్మిస్తుండడం గర్వంగా, గౌరవంగా ఉంది. ఈ సినిమాని ఎంతో బాధ్యతగా తీసుకుని రూపొందిస్తున్నాం. ప్రేక్షకులకు ఓ గొప్ప అనుభూతిని పంచుతామ"ని నిర్మాణ వర్గాలు చెప్పాయి. నెల్సన్ గతంలో రజనీకాంత్‌తో 'జైలర్' తీసి విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం 'జైలర్ 2' చేస్తున్నారు. ఆ వెంటనే కమల్ - రజనీకాంత్ కలయికలో సినిమాని రూపొందిస్తుండడం విశేషం.

ట్రైలర్‌తో ధురంధర్ 2 యాక్షన్ ట్రీట్?



రణ్‌వీర్ సింగ్

గతేడాది బాక్సాఫీసు వద్ద వసూళ్ల మోత మోగించిన 'ధురంధర్' సీక్వెల్ ఎప్పుడెప్పుడు వస్తుందా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు సినీప్రియులు. ఇప్పుడు వారందరికీ ట్రైలర్‌తో మరోసారి యాక్షన్ హంగామాని రుచి చూపించడానికి సన్నాహాలు చేస్తోందట చిత్రబృందం. బాలీవుడ్ కథానాయకుడు రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రమే 'ధురంధర్ 2'. ఆదిత్య ధర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్ర ట్రైలర్‌ను మార్చి మొదటి వారంలో విడుదల చేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. "ధురంధర్ 2'.. ప్రతి సన్నివేశంలోనూ మొదటి భాగాన్ని మించేలా ఉంటుంది. ఇప్పుడు రాబోయే ట్రైలర్ యాక్షన్ ట్రీట్‌లా ఉంటుంది అభిమానులకు. యాక్షన్ నుంచి భావోద్వేగాల వరకూ.. ప్రతిదీ మునుపెన్నడూ చూడని విధంగా ఉంటుంద"ని రణ్‌వీర్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. జియో స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ సీక్వెల్ మార్చి 19న థియేటర్లలోకి రానుంది.

సరస్వతి కాళికాదేవిలా మారితే...!



బన్నీ వాస్, వరలక్ష్మి, గోపీచంద్, పూజా శరత్‌కుమార్, సాయికృష్ణ

ప్రతి అమ్మాయి ఒక సరస్వతిలా ఉండదు. అవసరమైతే కాళికలా కూడా మారుతుందంటూ తనదైన శైలిలో హెచ్చరించింది ఓ యువతి. ఆమె ఎందుకలా చెప్పింది? అసలు సరస్వతి ఎవరు? కాళిలా మారి కన్నెర్ర జేయాల్సిన అవసరం ఎవరికి, ఎందుకొచ్చిందో తెలియాలంటే 'సరస్వతి' చూడాల్సిందే. ప్రముఖ నటి వరలక్ష్మీ శరత్‌కుమార్ కీలక పాత్ర పోషిస్తూ, స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రమిది. తన సోదరి పూజా శరత్‌కుమార్‌తో కలిసి దోస డైరీస్ పతాకంపై నిర్మించారు. ఈటీవీ విన్ సమర్పిస్తోంది. ప్రియమణి, ప్రకాశ్‌రాజ్ తదితరులు కీలక పాత్రల్ని పోషించారు. హై కాన్సెప్ట్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రం మార్చి 6న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ని డిజిటల్ వేదికల్లో కథానాయకుడు నాని, శనివారం నిర్వహించిన వేడుకలో దర్శకుడు గోపీచంద్ మలినేని విడుదల చేశారు. ఈ సందర్భంగా వరలక్ష్మీ శరత్‌కుమార్ మాట్లాడుతూ "మహిళా ప్రధానమైన సినిమా అని సందేశం ఇచ్చినట్టుగా ఉండదు ఈ చిత్రం. థ్రిల్లింగ్‌గా సాగుతూ ప్రేక్షకులకు వినోదాన్ని పంచుతుంది. తెలుగులో నటిగా నన్ను పునః పరిచయం చేసి రెండో జీవితాన్నిచ్చారు గోపీచంద్ మలినేని. ఆయన ఈ వేడుకకు రావడం ఆనందంగా ఉంది. చిత్ర పరిశ్రమలో మహిళలు ఎదిగేందుకు అందరూ మరింతగా సహకారం అందించాలని కోరుకుంటున్నా" అన్నారు. వేదికపై వరలక్ష్మి భావోద్వేగానికి గురయ్యారు. గోపీచంద్ మలినేని మాట్లాడుతూ "నేను తీసిన 'క్రాక్'లో జయమ్మ పాత్రని పోషించిన వరలక్ష్మీ శరత్‌కుమార్‌ని చూసి మా ప్రకాశం జిల్లా వాసులంతా షాక్ అయ్యారు. జయమ్మ అంటే ఇలాగే ఉంటుందేమో అనుకున్నారు. సావిత్రి, శారదలా మంచి నటి వరలక్ష్మి. ఆమె 'సరస్వతి' కథని చెప్పిన విధానంతో నేను ఆశ్చర్యపోయా. థియేటర్లో ఈ సినిమా చూసి అందరూ షాక్ అవుతారు. ప్రతి తల్లిదండ్రులు చూడాల్సిన సినిమా ఇది" అన్నారు. నిర్మాత బన్నీ వాస్ మాట్లాడుతూ "నాణ్యతలో రాజీపడకుండానే వేగంగా ఈ సినిమాని పూర్తి చేశారు వరలక్ష్మి. మంచి నటులు, స్క్రీన్‌ప్లేతో తెరకెక్కించారు. గీత ఆర్ట్స్ విడుదల చేస్తున్న ఈ సినిమాతో దర్శకురాలిగానూ వరలక్ష్మికి మంచి పేరొస్తుంది" అన్నారు. ఈటీవీ బిజినెస్ హెడ్ సాయికృష్ణ మాట్లాడుతూ "ఒక లక్ష్మి... సరస్వతిని ఎలా చూపిస్తుందో అలాంటి సినిమానే ఇది. మా సంస్థ నుంచి దర్శకులుగా పరిచయమైనవాళ్లలో వరలక్ష్మి తొమ్మిదో వ్యక్తి. ఈ సినిమాతో దర్శకురాలిగా కూడా బిజీ అవుతారని కోరుకుంటున్నా" అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత పూజా శరత్‌కుమార్‌తోపాటు ఇతర చిత్రబృందం పాల్గొంది.

తిప్పుకుంటన్నావ్.. నన్నే నీ సుట్టూ!



హర్ష్ రోషన్, శ్రీదేవి

'కోర్ట్' విజయం తర్వాత హర్ష్ రోషన్, శ్రీదేవి జంటగా నటించిన కొత్త చిత్రం 'బ్యాండ్ మేళం'. కోన ఫిల్మ్ కార్పొరేషన్ సంస్థ నిర్మించింది. సతీశ్ జవ్వాజీ తెరకెక్కించారు. సాయికుమార్ కీలక పాత్ర పోషించారు. ఈ సినిమా మార్చి 13న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే దర్శకుడు అనిల్ రావిపూడి శనివారం ఈ చిత్ర గీతాన్ని విడుదల చేశారు. "తిప్పుకుంటన్నావ్.. నన్నే నీ సుట్టూ తిప్పు తిప్పేస్కుంటన్నావ్' అంటూ సాగిన ఈ మాస్ పాటకు విజయ్ బుల్గానిన్ స్వరాలందించగా.. చంద్రబోస్ సాహిత్యమందించారు. రాము రాథోడ్, అదితి భవరాజు ఆలపించారు. ఈ పాటలో హర్ష్, శ్రీదేవి వేసిన హుషారైన స్టెప్పులు ఆకర్షణగా నిలిచాయి. "గ్రామీణ నేపథ్యంలో సాగే ఫీల్‌గుడ్ ప్రేమకథతో రూపొందిన చిత్రమిది. తప్పకుండా అందరికీ నచ్చేలా ఉంటుంద"ని చిత్ర వర్గాలు తెలిపాయి.

కొత్త కథ 'ఆకర్షిత'

త్రిగుణ్, పదినే కుమార్ జంటగా సూరిశెట్టి కిశోర్ 'ఆకర్షిత' పేరుతో ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. కోరె సందీప్ యాదవ్, శ్రీకాంత్ బట్టు నిర్మిస్తున్నారు. రాజ్‌కుమార్ కసిరెడ్డి, సత్యం రాజేశ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా శనివారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి సి.కల్యాణ్ క్లాప్ కొట్టగా.. బేబీ ఆష్కా, కీర్తన కెమెరా స్విచ్చాన్ చేశారు. వేణుస్వామి స్క్రిప్ట్‌ని అందించారు. నటి ప్రియ టైటిల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హీరో త్రిగుణ్ మాట్లాడుతూ.. 'ఈ చిత్రానికి కసిరెడ్డి హీరో. నేను కాదు. తనతో కలిసి పని చేయడం ఆనందంగా ఉంది" అన్నారు. "ఓ కొత్త కథాంశంతో రూపొందుతున్న చిత్రమిది. కచ్చితంగా అందరికీ నచ్చుతుందనే నమ్మకముంది" అన్నారు దర్శకుడు సూరిశెట్టి. ఈ కార్యక్రమంలో రవివర్మ, రాజ్‌కుమార్, సత్యం రాజేశ్, దామోదర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రాజ్‌కుమార్, త్రిగుణ్, సి.కల్యాణ్

రహస్యాల్ని కనిపెట్టడానికి మీరు సిద్ధమా?



తన వైద్య వృత్తిలో మంచి పేరు, గుర్తింపును సంపాదించుకోవడానికి దాదాపు 14 ఏళ్లు కష్టపడింది డాక్టర్ గీతిక. కానీ తనపై వచ్చిన ఆరోపణల కారణంగా ఇప్పుడా ప్రపంచం తన కళ్ల ముందే కూలిపోతుందని ఆందోళన పడుతుందామె. అందరూ తమకు తోచిందే అనుకుంటున్నారు తప్పా.. నిజం తెలుసుకోవడానికి ఎవరూ ప్రయత్నించట్లేదని ప్రశ్నిస్తుంది. ఇంతకీ ఆమెపై వచ్చిన ఆరోపణలు ఏంటి? అందరి ముందు తనేంటో నిరూపించుకుందా? అనేది తెలుసుకోవాలంటే 'అక్యూజ్డ్' సినిమా చూడాల్సిందే. కొంకణా సేన్ శర్మ, ప్రతిభా రంతా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రమిది. అనుభూతి కశ్యప్ తెరకెక్కించారు. ఈ నెల 27న నెట్‌ఫ్లిక్స్ వేదికగా రాబోతుందీ సినిమా. ఈ నేపథ్యంలోనే ట్రైలర్‌ను ఇన్‌స్టా వేదికగా విడుదల చేసింది ఓటీటీ సంస్థ. "ప్రతి బంధానికి కొన్ని రహస్యాలు ఉంటాయి. మరి వాటిని కనిపెట్టడానికి మీరు సిద్ధంగా ఉన్నారా" అనే వ్యాఖ్యను జోడించింది. ఇందులో గైనకాలజిస్ట్ గీతిక పాత్రలో కనిపించనుంది కొంకణ.

ఒకేసారి నాలుగు చిత్రాలతో విక్రమ్



విక్రమ్

పాత్రలతో ప్రయోగాలు చేసే కథానాయకుల్లో ముందు వరుసలో ఉంటారు హీరో విక్రమ్. ఈ మధ్య కాలంలో 'తంగలాన్', 'వీర ధీర శూర' లాంటి వైవిధ్యమైన సినిమాలతో అలరించినా.. ఏదీ బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని సాధించలేకపోయింది. కానీ ఈ ఏడాది అదిరిపోయే కథలతో రావడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారాయన. తాజాగా విక్రమ్.. ఒకేసారి నాలుగు చిత్రాల్ని ప్రకటించి సినీప్రియుల్ని ఆశ్చర్యపరిచారు. ఈ ప్రాజెక్టులకు సంబంధించిన వివరాల్ని పూర్తిగా వెల్లడించనప్పటికీ.. సామాజిక మాధ్యమాల వేదికగా ఈ విషయం గురించి ఓ పోస్ట్ పెట్టారాయన. 'కొన్నిసార్లు నిశ్శబ్దం కూడా ఒకలాంటి ప్రిపరేషన్ లాంటిదే. ఈ సంవత్సరం నన్ను కదిలించే కథల కోసం ఎదురు చూస్తూ గడిపాను. నేను ఎంతో ఆరాధించే దర్శకులతో విభిన్నమైన నాలుగు చిత్రాలతో రాబోతున్నాను. ఈ ప్రయాణాలను మీతో పంచుకోవడానికి వేచి ఉండలేన"ని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు. మరి ఆ 4 సినిమాల కథలు, దర్శకుల వివరాలు తెలియాలంటే కొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

భోగి.. పోరు బాటలో



శర్వానంద్

'నారీ నారీ నడుమ మురారి' విజయంతో జోరు మీదున్నారు హీరో శర్వానంద్. ఇప్పుడాయన సంపత్ నంది దర్శకత్వంలో 'భోగి' అనే పాన్ ఇండియా సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. కేకే రాధామోహన్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఇప్పటికే ఓ షెడ్యూల్ పూర్తి చేసుకుంది. తాజాగా హైదరాబాద్‌లో మరో కొత్త షెడ్యూల్‌ను ప్రారంభించినట్లు శనివారం ప్రకటించారు. దీనిలో భాగంగా ప్రత్యేకంగా సిద్ధం చేసిన భారీ సెట్‌లో రెండు భారీ పోరాట ఘట్టాల్ని తెరకెక్కించనున్నారు. దీనికి దిలీప్ సుబ్బరాయన్ కొరియోగ్రఫీ చేస్తున్నట్లు చిత్ర వర్గాలు ప్రకటించాయి. దీనికి సంబంధించి శర్వా పంచెకట్టులో చేతిలో సుత్తితో నిల్చొని ఉన్న వర్కింగ్ స్టిల్‌ను నెట్టింట పంచుకున్నారు. '1960 నేపథ్యంలో సాగే రా రస్టిక్ యాక్షన్ చిత్రమిది. శర్వా దీంట్లో ఓ సరికొత్త లుక్‌లో అలరించనున్నారు" అని దర్శక నిర్మాతలు తెలిపారు. ఇందులో అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి కథానాయికలు. సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ఛాయాగ్రహణం: కిశోర్ కుమార్ ఆరోకియా.

అన్నీ తెలుసుకొనే '#కల్ట్' చేశా!



విష్వక్‌సేన్, గాయత్రి, రవి బస్రూర్

చిన్నారులూ... సున్నితమైన హృదయం ఉన్నవాళ్లూ మా '#కల్ట్' సినిమాకి దూరంగా ఉండాలంటున్నారు విష్వక్‌సేన్. ఆయన కథానాయకుడిగా నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రమే... '#కల్ట్'. గాయత్రి భరద్వాజ్ కథానాయిక. సందీప్ కాకరాల నిర్మిస్తున్నారు. ఈ సినిమా టీజర్ ఆవిష్కరణ వేడుక శనివారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా విష్వక్‌సేన్ మాట్లాడుతూ "సామాజిక మాధ్యమాల్లో ఏం జరుగుతోందో, ప్రేక్షకులు ఏం కోరుకుంటున్నారో, ఏం మిస్ అవుతున్నారో అన్నీ తెలుసుకునే ఈ సినిమా చేశా. సినిమాకి తరుణ్ భాస్కర్ ఒక కన్ను అయితే, సంగీత దర్శకుడు రవి బస్రూర్ మరో కన్ను" అన్నారు. ఈ వేదికపైనే రవి బస్రూర్‌కి రోలెక్స్ వాచీని బహుమతిగా ఇచ్చారు విష్వక్‌సేన్. రవి బస్రూర్ మాట్లాడుతూ "సంగీత దర్శకుడిగా 25 ఏళ్ల ప్రయాణం నాది. విష్వక్... రవిబస్రూర్‌ని చూడకుండా నా ఆత్మని గుర్తించారు. సంగీతం తప్ప మరో ప్రపంచం తెలియని నేను ఓ దశలో నిరాశతో చనిపోవాలనుకున్నా. అప్పుడే ఓ వ్యక్తి నా గురించి తెలుసుకుని కీ బోర్డ్ కొనుక్కునేందుకు రూ.35 వేలు ఇచ్చారు. ఆయన పేరు రవి. అప్పటి నుంచి నా పేరుని రవి బస్రూర్‌గా మార్చుకున్నా. ఇప్పుడు విష్వక్‌కూ కృతజ్ఞతలు చెబుతున్నా. తను ఇచ్చిన ఈ బహుమానం సంగీత దర్శకులకు దక్కిన ఓ గౌరవం. ఈ సినిమాలో సంగీతం అందరూ ఆశ్చర్యపోయేలా ఉంటుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో తరుణ్ భాస్కర్, అరవింద్‌తో పాటు ఇతర చిత్రబృందం పాల్గొంది.

సందేశమిచ్చే 'ది రైజ్ ఆఫ్ అశోక'



వర్ధన్ హరి, సత్యదేవ్, సతీశ్, సప్తమి గౌడ

"బలమైన భావోద్వేగాలతో పాటు మంచి సందేశం ఉన్న చిత్రం 'ది రైజ్ ఆఫ్ అశోక'" అంది నటి సప్తమి గౌడ. ఇది తప్పకుండా తెలుగు ప్రేక్షకులకీ నచ్చేలాగే ఉంటుందని తెలిపింది. ఆమె.. సతీశ్ నీనసాం జంటగా నటించిన ఈ చిత్రాన్ని వినోద్ వి.ధుండలే తెరకెక్కించారు. వర్ధన్ హరి, జైష్ణవి, సతీశ్ నిర్మించారు. ఈ సినిమా నిర్మాత రవిశంకర్ ద్వారా ఈ నెల 27న తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే హీరో సత్యదేవ్ ఇటీవల హైదరాబాద్‌లో ట్రైలర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. "కన్నడ నుంచి వచ్చే రూటెడ్ సినిమాల్ని తెలుగు ప్రేక్షకులు ఇష్టపడుతున్నారు. ఈ చిత్రం కూడా అదే కోవలో ఉంటుంది. ఈ సినిమా చిత్రీకరణ సమయంలోనే దర్శకుడు మరణించడంతో సతీశ్ దీన్ని పూర్తి చేసి ఈ స్థాయికి తీసుకొచ్చార"న్నారు. "ఇది రెగ్యులర్ కమర్షియల్ సినిమా కాదు. చాలా విభిన్నంగా ఉంటుంది. కొత్తదనాన్ని కోరుకునే తెలుగు ప్రేక్షకులకు ఇది కచ్చితంగా నచ్చుతుందని నమ్ముతున్నా" అన్నారు సతీశ్. నటి సప్తమి గౌడ మాట్లాడుతూ.. "ఇది ఓ గ్రామం చుట్టూ తిరిగే కథ. ప్రత్యేకంగా ఓ తెగ గురించి చర్చిస్తుంది" అంది. ఈ కార్యక్రమంలో రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

బాలీవుడ్‌ని వదిలి వెళ్లాలని ఎప్పుడూ అనుకోలేదు!



ప్రియాంక చోప్రా

హాలీవుడ్, బాలీవుడ్.. ఈ రెండు పరిశ్రమలలో పనిచేయడం తనకెంతో సంతోషమని అంటోంది అందాల తార ప్రియాంక చోప్రా. త్వరలో 'వారణాసి' చిత్రంతో తెలుగు ప్రేక్షకుల్ని అలరించడానికి ముస్తాబవుతోందీ భామ. మరోవైపు హాలీవుడ్ చిత్రాలతోనూ బిజీగానే గడుపుతోంది. ఇందులో భాగంగానే ఆమె నటించిన 'ది బ్లఫ్' ఈ నెల 25న రాబోతుంది.

ఈ నేపథ్యంలోనే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ప్రియాంక హాలీవుడ్‌కి వెళ్లడం గురించి తన మనసులోని మాటల్ని బయట పెట్టింది. "నేను బాలీవుడ్‌ని వదిలి వెళ్లాలని ఎప్పుడూ అనుకోలేదు. హిందీ చిత్రాలలో పనిచేస్తున్నప్పుడు కొన్ని కారణాల వల్ల నాకు పరిమితమైన అవకాశాలు వచ్చాయనే భావన కలిగింది. ఒక నటిగా నాకు ఉత్సాహాన్నిచ్చే ప్రాజెక్టులను వెతకడంలో చాలా ఒత్తిడికి గురయ్యాను. ఇలాంటి పరిస్థితుల్లో హాలీవుడ్‌లోకి అడుగు పెట్టాను. నాకు భారతీయ సినిమాలంటే చాలా ఇష్టం. మళ్లీ ఇక్కడ 'వారణాసి' చేస్తున్నందుకు సంతోషంగా ఉంది. హాలీవుడ్, బాలీవుడ్ ఈ రెండింటిలో ఒకదాన్నే ఎంచుకోమంటే... దానికి అస్సలు ఇష్టపడను. ఈ రెండు పరిశ్రమల సంస్కృతులు ఎలా భిన్నంగా ఉంటాయో.. పని చేయడం కూడా అలాగే విభిన్నంగా ఉంటుంది. ఇలా ఒకే సమయంలో రెండు చోట్లా పనిచేయడం ఓ సరదా అనుభవం" అని చెప్పుకొచ్చింది ప్రియాంక.

విష్ణు విన్యాసం.. ఒకరోజు ముందుగానే



నయన్, శ్రీవిష్ణు

కథానాయకుడు శ్రీవిష్ణు వారం వ్యవధిలోనే వరుసగా రెండు సినిమాలతో ప్రేక్షకుల్ని అలరించనున్నారు. ఇప్పటికే ఆయన నటించిన 'మృత్యుంజయ్' మార్చి 6న రానున్నట్లు ప్రకటించగా.. ఇప్పుడు మరో సినిమా 'విష్ణు విన్యాసం' కూడా కొత్త తేదీని ఖరారు చేసుకుంది. నిజానికి దీన్ని ఈనెల 28న విడుదల చేయనున్నట్లు తొలుత ప్రకటించారు. కానీ, దీన్నిప్పుడు ఒకరోజు ముందుగానే ఈనెల 27న థియేటర్లలోకి తీసుకొస్తున్నట్లు నిర్మాతలు వెల్లడించారు. "ఆద్యంతం వినోదాత్మకంగా సాగే ప్రేమకథా చిత్రమిది. శ్రీవిష్ణు ఇందులో జాతకాల పిచ్చి ఉన్న ఫన్నీ పాత్రలో అలరించనున్నారు" అని చిత్ర వర్గాలు తెలిపాయి. యదునాథ్ మారుతీరావు తెరకెక్కించిన ఈ సినిమాని సుమంత్ నాయుడు.జి నిర్మించారు. నయన్ సారిక కథానాయిక. సత్య, బ్రహ్మాజీ తదితరులు కీలక పాత్రలు పోషించారు. రధన్ సంగీతమందించారు.


శత్రుఘ్న సిన్హా వ్యక్తిగత హక్కులకు రక్షణ

బాలీవుడ్ సీనియర్ నటుడు శత్రుఘ్న సిన్హా తన వ్యక్తిగత హక్కులను కాపాడాలని కోరుతూ ముంబయి హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. అనుమతి లేకుండా తన పేరు, ఫొటోలు, తన ఐకానిక్ డైలాగ్ 'ఖామోష్'ను సామాజిక మాధ్యమాల్లో దుర్వినియోగం చేస్తున్నారని పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన ముంబయి హైకోర్టు.. సిన్హాకు ప్రత్యేకమైన సంభాషణా శైలి ఉందని, ముఖ్యంగా తెరపై 'ఖామోష్' అనే డైలాగ్ ఆయన వ్యక్తిత్వంతో ప్రత్యేకంగా ముడిపడి ఉందని పేర్కొంది. సామాజిక మాధ్యమాల్లో అనుమతి లేకుండా సిన్హా వాయిస్, ఫొటోలను దుర్వినియోగం చేయడాన్ని నిషేధిస్తూ.. అన్ని వెబ్‌సైట్‌లు, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు ఇలాంటి కంటెంట్‌ను వెంటనే తొలగించాలని ఆదేశించింది. తదుపరి విచారణ మార్చి 30కి వాయిదా పడింది.

ఈనాడు బిజినెస్ వారాంతం

రక్షణ రంగంలో అంతరిక్ష సాంకేతికత వినియోగంపై చర్చ

వచ్చే వారంలో డిఫ్‌శాట్ సదస్సు



దిల్లీ: రక్షణ రంగంలో అంతరిక్ష సాంకేతికత వినియోగంపై భారత సైన్యంలోని ఉన్నతాధికార్లు, విధాన రూపకర్తలు, సాంకేతికత భాగస్వాములు, సంస్థల ప్రతినిధులు చర్చించనున్నారు. వచ్చే వారం దిల్లీలో జరగనున్న డిఫ్‌శాట్ నాలుగో ఎడిషన్ సదస్సు ఇందుకు వేదిక కానుంది. జాతీయ భద్రతలో అంతరిక్ష రంగ పాత్రపై ఫిబ్రవరి 24-26 వరకు మానేక్‌షా సెంటర్ వద్ద ఈ సదస్సు జరగనుంది. 'అంతర్జాతీయంగా 50కి పైగా దేశాలు మిలిటరీ లేదా డ్యుయల్ యూజ్ శాటిలైట్‌లను ఉపయోగిస్తున్నాయి. శత్రు దాడులను నిరోధించడం, ఎదుర్కొనే సన్నద్ధత విషయంలో అంతరిక్ష సాంకేతికత కూడా కీలకంగా మారింద'ని శాట్‌కామ్ ఇండస్ట్రీ అసోసియేషన్ (ఎస్ఐఏ) ఇండియా ప్రెసిడెంట్ సుబ్బారావు పావులూరి తెలిపారు.

డిఫ్‌శాట్-2026 సదస్సులో సుమారు 20 దేశాల నుంచి 500 మంది పాల్గొననున్నారు. 20 మందికి పైగా వక్తలు, సుమారు 60 సంస్థల ప్రతినిధులు కూడా హాజరు కానున్నారు. కాగా.. 2026-27 ఆర్థిక సంవత్సరానికి ఇటీవల సమర్పించిన బడ్జెట్లో రక్షణ రంగానికి గణనీయంగా రూ.7.85 లక్షల కోట్లను కేటాయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ సదస్సు జరుగుతుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. దేశ రక్షణ విషయంలో ముందస్తు సన్నద్ధత కోసం భారత్ భారీగా వెచ్చిస్తోందనడానికి ఈ కేటాయింపులే సంకేతమని ఎస్ఐఏ ఇండియా డైరెక్టర్ జనరల్ అనిల్ ప్రకాశ్ తెలిపారు.

ఫార్మా ఎగుమతుల్లో రెండంకెల వృద్ధి

వాణిజ్య మంత్రిత్వ శాఖ అంచనా

దిల్లీ: గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో దేశీయ ఫార్మా ఎగుమతులు 9.4 శాతం వృద్ధితో రూ.2.7 లక్షల కోట్లకు చేరుకున్నాయని వాణిజ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. 2026-27 నాటికి ఇందులో రెండంకెల వృద్ధిని పరిశ్రమ లక్ష్యంగా పెట్టుకుందని తెలిపింది. ప్రస్తుతం ఫార్మా రంగం పరిమాణం రూ.5.4 లక్షల కోట్ల దరిదాపుల్లో ఉండగా, 2030 నాటికి రూ.11.70 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా వేసింది. ఉత్పత్తి పరంగా ప్రపంచవ్యాప్తంగా మూడో స్థానంలో ఉన్న భారత్ 200కు పైగా దేశాలకు మందులను ఎగుమతి చేస్తోంది. మొత్తం ఎగుమతుల్లో 60 శాతానికి పైగా కఠిన నిబంధనలు ఉన్న మార్కెట్లకు వెళ్తున్నాయని, భారత ఫార్మా ఎగుమతుల్లో అమెరికా వాటా 34%, ఐరోపా వాటా 19 శాతంగా ఉంది. ఎగుమతుల్లో వేగాన్ని కొనసాగించేందుకు అనుకూలమైన పరిస్థితులను కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని వివరించింది. 2026-27లో రెండంకెల వృద్ధిని లక్ష్యంగా చేసుకునేందుకు పరిశ్రమ సైతం సిద్ధంగా ఉందని పేర్కొంది. అహ్మదాబాద్ వేదికగా జరిగిన 'చింతన్ శిబిర్'లో భాగంగా పరిశ్రమ వర్గాలు, వాణిజ్య మంత్రిత్వ శాఖ ప్రతినిధుల మధ్య చర్చలు జరిగాయి. ప్రపంచ మార్కెట్లను చేరుకునేందుకు అడ్డంకిగా ఉన్న సమస్యలను గుర్తించి, వాటిని పరిష్కరించేందుకు విదేశాల్లోని నియంత్రణ సంస్థలు, భారత రాయబార కార్యాలయాలతో సంప్రదింపులు కొనసాగిస్తామని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.



ట్రంప్.. ఆ రూ.12 లక్షల కోట్లు వెనక్కి ఇస్తారా?



- రిఫండ్ ప్రక్రియ సంక్లిష్టమే
- కొద్ది నెలల సమయం పట్టొచ్చు: విశ్లేషకులు

ట్రంప్ విధించిన టారిఫ్‌లపై సుప్రీం కోర్టు తీర్పయితే వచ్చింది కానీ.. ప్రపంచ దేశాల నుంచి వసూలు చేసిన భారీ మొత్తాన్ని ఎలా తిరిగి చెల్లిస్తారనే విషయమై అనిశ్చితి నెలకొంది. ట్రంప్ ప్రభుత్వానికి టారిఫ్‌ల ద్వారా ఇప్పటివరకు సుమారు 133 బిలియన్ డాలర్లు వచ్చాయి. ఈ మొత్తం భారత కరెన్సీలో దాదాపు రూ.12 లక్షల కోట్లు. ఇప్పుడు ఆ డబ్బును ఎలా తిరిగి ఇస్తారనేదే పెద్ద ప్రశ్న.

ఎవరికిస్తారు..

ట్రంప్ ప్రభుత్వం దిగుమతుల ద్వారా 133 బిలియన్ డాలర్లు వసూలు చేయడం చట్టవిరుద్ధమని అమెరికా సుప్రీం కోర్టు న్యాయమూర్తులు ప్రకటించారు. ఈ రిఫండ్లు ప్రధానంగా వస్తువులను దిగుమతి చేసుకున్న కంపెనీలకే అందుతాయని తెలుస్తోంది. వస్తువుల ధరలు పెరగడం వల్ల నష్టపోయిన సాధారణ వినియోగదారులకు డబ్బులు వాపసు వచ్చే అవకాశం తక్కువని సమాచారం. ఈ నేపథ్యంలో రిఫండ్ కోసం కంపెనీలు కోర్టులో కేసులు దాఖలు చేస్తున్నాయి. ఇప్పటికే వెయ్యికి పైగా కేసులు నమోదైనట్టు సమాచారం. మరిన్ని కేసులు దాఖలయ్యే అవకాశాలున్నాయి. రిఫండ్ ప్రక్రియ చాలా క్లిష్టంగా ఉండబోతోందని న్యాయ నిపుణులు అంటున్నారు. దీనికి 12 నుంచి 18 నెలల సమయం పట్టవచ్చని అంచనా వేస్తున్నారు.

న్యాయపరమైన చిక్కులు..

ప్రస్తుతం భారీ మొత్తంలో డబ్బు వెనక్కి తిరిగి ఇవ్వాల్సి ఉండటంతో కంపెనీల కోసం ట్రంప్ ప్రభుత్వం ఓ వెబ్‌సైట్ రూపొందించే అవకాశం ఉన్నట్టు నిపుణులు అంచనా వేస్తున్నారు. రిఫండ్ ప్రక్రియలో పలు న్యాయపరమైన సవాళ్లు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయి. ఒకవేళ సరఫరాదారులకు ఏదైనా రిఫండ్ దక్కితే దానిలో భాగం కావాలని ఉత్పత్తిదారులు కేసులువేయవచ్చని నిపుణులు పేర్కొన్నారు. ఈ తరహా ఘటనల్లో కొన్నేళ్ల నుంచి కోర్టుల్లో కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. సుంకాలపై అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ట్రంప్ అసహనం వ్యక్తం చేశారు. ఇది కోర్టుల్లో మరో అయిదేళ్ల పాటు కొనసాగుతుందని పేర్కొన్నారు. మరోవైపు పలు రాష్ట్రాల గవర్నర్లు తమ రాష్ట్ర ప్రజల తరఫున బిలియన్ల కొద్దీ డాలర్లను ట్రంప్ ప్రభుత్వం నుంచి రిఫండ్‌గా డిమాండ్ చేస్తున్నారు.

కార్మిక రంగాలకు ఊరటే..

సెక్షన్ 232 కింద ఉక్కు, అల్యూమినియంపై విధించిన 50 శాతం సుంకం, కొన్ని వాహన విడిభాగాలపై ఉన్న 25 శాతం సుంకాలు యథాతథంగా కొనసాగుతాయి. ఈ అంశంపై స్పష్టత కోసం భారత ప్రతినిధి బృందం వచ్చే వారం అమెరికా వెళ్తుంది. భారత ఎగుమతిదారులు, ముఖ్యంగా కార్మికులు ఎక్కువగా పనిచేసే వస్త్ర, ఆభరణాల రంగాలకు రాబోయే 150 రోజుల పాటు ఈ తగ్గిన టారిఫ్ రేటు పెద్ద ఊరటనిస్తుందని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.

అమెరికా మనకు ఎందుకు ముఖ్యం అంటే..

2021–25 మధ్య భారత్‌కు అమెరికా అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉంది. భారత మొత్తం ఎగుమతుల్లో 18% వాటా అగ్రరాజ్యానిదే. 2024-25లో ద్వైపాక్షిక వాణిజ్యం 186 బి.డాలర్లు(రూ.16.7 లక్షల కోట్లు)గా ఉంది. సేవల విషయానికొచ్చినా భారత్ నుంచి 28.7 బి.డాలర్ల మేర ఎగుమతులు జరుగుతున్నాయి. మొత్తం మీద (వస్తువులు, సేవలు) చూస్తే వాణిజ్య మిగులు అమెరికాతో 44.4 బి. డాలర్లుగా ఉంది.

2024లో ఈ రంగాల నుంచే అధిక ఎగుమతులు: ఫార్మాస్యూటికల్స్, బయోలాజికల్స్ (8.1 బి.డాలర్లు), టెలికాం ఇన్‌స్ట్రుమెంట్లు (6.5 బి. డాలర్లు), విలువైన, పాక్షిక విలువైన రాళ్లు (5.3 బి.డాలర్లు), పెట్రోలియం ఉత్పత్తులు (4.1 బి.డాలర్లు), వాహన, వాహన విడి భాగాలు (2.8 బి.డాలర్లు), బంగారం, ఇతర ఆభరణాలు (3.2 బి.డాలర్లు), రెడీమేడ్ దుస్తులు, యాక్సెసరీలు (2.8 బి. డాలర్లు), ఇనుము-ఉక్కు ఉత్పత్తులు (2.7 బి. డాలర్లు).

తీర్పును పరిశీలిస్తున్నాం..

'సుంకాలపై శుక్రవారం అమెరికా సుప్రీంకోర్టు తీర్పును గమనించాం. దీనిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే స్పందించారు. ఆ దేశ యంత్రాంగం కొన్ని చర్యలను ప్రకటించింది. ఈ పరిణామాలన్నింటి ప్రభావాలపైనా నిశితంగా అధ్యయనం చేస్తున్నాం.'

– కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ

40% వస్తువులు మినహాయింపులోనే..

'అమెరికా సుప్రీం కోర్టు నేపథ్యంలో ప్రతీకార సుంకాలు తగ్గాయి. ఆ దేశంతో మధ్యంతర వాణిజ్య ఒప్పందాన్ని పునఃసమీక్షించుకోవాలి. ప్రస్తుతం అమెరికాకు భారత ఎగుమతుల విలువలో 55 శాతంపై మాత్రమే ప్రతీకార సుంకాలు వర్తిస్తాయి. సుమారు 40 శాతం వస్తువులు మినహాయింపు పొందిన విభాగాల్లో ఉన్నాయి. అయితే రంగాల వారీ సుంకాలు (ఉక్కు, అల్యూమినియం, రాగి-50 శాతం, కొన్ని వాహన విడిభాగాలు -25 శాతం) కొనసాగుతాయి.'

– జీటీఆర్ఐ వ్యవస్థాపకులు అజయ్ శ్రీవాస్తవ

ఎంఎఫ్ఎన్ సుంకానికి అదనంగా..

'ఇప్పుడు భారతీయ వస్తువులపై సుంకాలు తగ్గాయి. అమెరికాలో ప్రస్తుతం ఉన్న మోస్ట్ ఫేవర్డ్ నేషన్ (ఎంఎఫ్ఎన్) లేదా దిగుమతి సుంకాలకు మించి ఇవి ఉంటాయి. ఉదాహరణకు ఒక ఉత్పత్తి 5 శాతం ఎంఎఫ్ఎన్ సుంకాన్ని ఎదుర్కొంటుంటే, అదనంగా ట్రంప్ ప్రకటించిన సుంకాన్ని విధిస్తారు. గతంలో ఇది 5+25 శాతంగా ఉంది'.

– ఫియో డైరెక్టర్ జనరల్ అజయ్ సహాయ్

దేశీయంగా చిప్‌ల తయారీ ముఖ్యం

ప్రధాని నరేంద్ర మోదీ



గ్రేటర్ నోయిడా: అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే దేశీయంగా చిప్‌లు తయారు చేయడం చాలా ముఖ్యమని ప్రధాని నరేంద్ర మోదీ శనివారం వెల్లడించారు. హెచ్‌సీఎల్ గ్రూప్, ఫాక్స్‌కాన్‌ల సంయుక్త సంస్థ (జేవీ) అయిన ఇండియా చిప్ ప్రైవేట్ లిమిటెడ్ శంకుస్థాపనకు దృశ్య మాధ్యమ విధానంలో మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొవిడ్-19 మహమ్మారి సమయంలో చిప్‌ల సరఫరా వ్యవస్థలో అంతరాయాలు అనేక ఆర్థిక వ్యవస్థల అభివృద్ధిని నిలిపివేసిందని, వివిధ ప్లాంట్లలో పనులు నిలిచిపోయాయని తెలిపారు. 'మన దేశం స్వయం సమృద్ధిగా ఉన్నప్పుడే అభివృద్ధి చెందిన దేశంగా నిర్మితమవుతుంది. దీని కోసం మేడిన్ ఇండియా చిప్ చాలా ముఖ్యం. మన దేశం సాంకేతిక రంగంలో ఏం చేసినా, అది 21వ శతాబ్దంలో మన సామర్థ్యానికి పునాది అవుతుంద'ని మోదీ వెల్లడించారు. హెచ్‌సీఎల్ గ్రూప్, ఫాక్స్‌కాన్ జేవీ ఓశాట్ (ఔట్‌సోర్స్‌డ్ సెమీకండక్టర్ అసెంబ్లీ అండ్ టెస్ట్) ప్లాంట్ గ్రేటర్ నోయిడాలోని జెవార్ దగ్గరున్న యమునా ఎక్స్‌ప్రెస్‌వే పారిశ్రామిక అభివృద్ధి ప్రాధికారిక సంస్థ (వైఈఐడీఏ) వద్ద రాబోతోంది. ఇండియా చిప్ ప్రై.లి.లో హెచ్‌సీఎల్ గ్రూప్‌నకు 60 శాతం, ఫాక్స్‌కాన్‌కు 40 శాతం వాటా ఉంది. ఈ సంస్థ వచ్చే కొన్నేళ్లలో రూ.3,700 కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టబోతోంది. 2028 నాటికి కార్యకలాపాలు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ ప్లాంటులో డిస్‌ప్లే డ్రైవర్ చిప్‌లు తయారవుతాయి. ఈ సంస్థ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 3,500 మందికి పైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

ఇ175 జెట్‌ల తయారీకి ఫైనల్ అసెంబ్లీ లైన్

దిల్లీ: దేశీయంగా ఇ175 రీజినల్ జెట్‌ల తయారీ కోసం ఫైనల్ అసెంబ్లీ లైన్‌ను ఏర్పాటు చేసేందుకు అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్, బ్రెజిల్ దిగ్గజం ఎంబ్రాయర్‌లు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాయి. దీనికి సంబంధించి ఇరు కంపెనీల అధికారులు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్, బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డ సిల్వా సమక్షంలో మెరుగుపర్చిన అవగాహనా ఒప్పంద (ఎంఓయూ) పత్రాలను మార్చుకున్నారు. గత నెల 27న ఇరు కంపెనీలు ప్రకటించిన వ్యూహాత్మక సహకారానికి ఇది కొనసాగింపు. ఇ175 విమానంలో 88 మంది వరకు ప్రయాణికులు కూర్చొనే వీలుంటుంది. ప్రాంతీయ అనుసంధానతను ప్రోత్సహించేలా ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలను అనుసంధానం చేసేలా వీటిని వినియోగించనున్నారు. వచ్చే 20 ఏళ్లలో భారత్‌కు కనీసం 500 విమానాలు (80-146 సీట్ల విభాగంలో) అవసరమవుతాయని అంచనా. ఎంఓయూ పత్రాలను అదానీ డిఫెన్స్ డైరెక్టర్ జీత్ అదానీ, ఎంబ్రాయర్ ప్రెసిడెంట్-సీఈఓ ఫ్రాన్సిస్కో గోమ్స్ నెటో పరస్పరం మార్చుకున్నారు.

కోడి గుడ్లు

22న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	495
వరంగల్	497
విజయవాడ	530
తూ/ప గోదావరి	490
విశాఖపట్నం	500
చిత్తూరు	573

సబ్బు, షాంపూ ధరలు ప్రియం!

- ఎఫ్ఎంసీజీ వస్తువులు 5% వరకు పెరుగుతున్నాయ్
- జీఎస్టీ రేట్ల కోత ప్రభావం ముగింపు దశకు



రోజువారీ వినియోగించే సబ్బులు, టూత్‌పేస్ట్-బ్రష్‌లు, షాంపూల వంటి ఎఫ్ఎంసీజీ ఉత్పత్తుల ధరలను కంపెనీలు 5% వరకు పెంచేందుకు కంపెనీలు సిద్ధమవుతున్నాయని సమాచారం. గతేడాది సెప్టెంబరులో వీటిపై జీఎస్టీ రేటును 12% నుంచి 5 శాతానికి తగ్గించడంతో, కంపెనీలు ఆమేర ధరలు తగ్గించాయి. ఇప్పటివరకు ఈ ఉత్పత్తుల ధరలు స్థిరంగా ఉంటూ వచ్చాయి. 'జీఎస్టీ రేట్ల కోత ప్రభావం ముగింపు దశకి వచ్చినట్లు ఉందని, తయారీదార్లు కొన్ని ఎఫ్ఎంసీజీ ఉత్పత్తుల ధరలను 5% వరకు పెంచే పనిలో ఉన్నారని' ఆంగ్లపత్రికలు తెలిపాయి. కమొడిటీల ధరలు పెరగడం, రూపాయి క్షీణత కారణంగా, కంపెనీల మార్జిన్లపై ప్రభావం పడుతుండటమే ఇందుకు కారణంగా చెబుతున్నారు.

పెంచిన గరిష్ఠ విక్రయ ధర (ఎంఆర్‌పీ)లు ముద్రించిన ప్యాక్‌ల వస్తువులు తమకు సరఫరా అయినట్లు డిస్ట్రిబ్యూటర్‌లు చెబుతున్నారు. డిటర్జెంట్లు, తలనూనె, చాక్‌లెట్‌లు, నూడిల్స్, అల్పాహారంగా తీసుకునే పలు ఉత్పత్తుల ధరలు పెంచుతున్నట్లు సమాచారం. ప్రస్తుత త్రైమాసికంలో 2% ధరలు పెంచుతామని డాబర్ ఇండియా ముఖ్య కార్యనిర్వహణాధికారి మోహిత్ మల్హోత్రా పేర్కొన్నారు కూడా. 2026-27లోనూ ధరల పెంపు కొనసాగొచ్చని ఆయన తెలిపారు. గృహ సంరక్షణ ఉత్పత్తుల ధరల పెంపు త్వరలోనే ఉంటుందని.. ఇప్పటికే పెంచిన ధరలతో ఉత్పత్తులను మార్కెట్లోకి పంపించామని హిందుస్థాన్ యునిలీవర్ లిమిటెడ్ (హెచ్‌యూఎల్) ముఖ్య ఆర్థిక అధికారి నిరంజన గుప్తా తెలిపారు. సర్ఫ్ ఎక్సెల్, రిన్, విమ్, డోమెక్స్ లాంటి గృహ సంరక్షణ విభాగ ఉత్పత్తుల ధరలను హెచ్‌యూఎల్ పెంచుతోంది. డిసెంబరు త్రైమాసికంలోనే టీ ధరలను కొంత మేర పెంచినట్లు టాటా కన్జ్యూమర్ ప్రోడక్ట్స్ తెలిపింది.

ఇతరులను అనుకరించకండి సొంతంగా ఆవిష్కరించండి

సెబీ ఈడీ సునీల్ కదమ్



మార్కెట్ వ్యవస్థలు ఇతరులను అనుకరించడం మానుకోవాలని, సొంతంగా ఆవిష్కరణలు చేయాలని సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ) సునీల్ కదమ్ సూచించారు. శనివారం స్టాక్ బ్రోకర్ల సంఘం ఏఎన్ఎంఐ ముంబయిలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఇటీవల చైనాకు చెందిన ఒక ఉత్పత్తిని కొందరు మన దేశంలోనే తయారు చేసినట్లుగా చెప్పి, ప్రదర్శించడం మనం చూశాం. ఇది వివాదానికి దారి తీసిన సంగతి తెలిసిందే. మనం ఆ విధంగా ఇతరులను అనుకరించకూడదు. సొంత ఆవిష్కరణలు చేయాలి' అని కదమ్ స్పష్టం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే భారత్ పరిశోధన, అభివృద్ధి రంగాల్లోకి మరింత నిధులను మళ్లించాల్సిన అవసరం ఉందన్నారు. ఆవిష్కరణలలో అగ్రగామిగా మారే సామర్థ్యాలు భారత్‌కు ఉన్నాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

ఒక ప్రైవేటు విశ్వవిద్యాలయం చైనా కంపెనీ తయారు చేసిన 'రోబో డాగ్'ను తన సొంత ఆవిష్కరణగా ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026లో ప్రదర్శించిన సంగతి విదితమే. వ్యాపార నమూనాలను కృత్రిమ మేధ (ఏఐ) సమూలంగా మార్చబోతోందని, విలువలను లెక్కించడం వంటి అంశాలను అంచనా వేసేందుకు, సాంకేతికతను ఎలా ఉపయోగించుకోవాలో మార్కెట్ వ్యవస్థ అర్థం చేసుకోవాలని సూచించారు. సాంకేతికంగా మనం ఏఐ టెక్నాలజీకి తప్పనిసరిగా అలవాటుపడాలని తెలిపారు. పెట్టుబడిదారులకు ఏదైనా ఒక కంపెనీ లేదా మార్కెట్ గురించి వివిధ భాషల్లో, మరింత సమాచారం అందించేందుకు వీలుగా ఏఐ ఆధారిత సాఫ్ట్‌వేర్‌ను ప్రవేశపెట్టేందుకు సెబీ కృషి చేస్తోందని ఆయన వెల్లడించారు.

నానో సెకన్లలో..: ఇదే సమావేశంలో ఎన్ఎస్ఈ చీఫ్ ఎగ్జిక్యూటివ్, మేనేజింగ్ డైరెక్టర్ ఆశిష్ కుమార్ చౌహాన్ మాట్లాడుతూ.. ఈ ఏడాది ఏప్రిల్ 11 నుంచి భారతీయ మార్కెట్లు నానో సెకన్లలోనే ట్రేడింగ్‌ను ఎగ్జిక్యూట్ చేయడం ప్రారంభిస్తాయని వెల్లడించారు. ఇది ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన ట్రేడింగ్ విధానంతో పోల్చితే 1,000 రెట్లు అధిక వేగం అని తెలిపారు.

రేపటి నుంచి క్లీన్‌మ్యాక్స్ ఐపీఓ

దిల్లీ: వాణిజ్య, పారిశ్రామిక పునరుత్పాదక ఇంధన సంస్థ క్లీన్‌మ్యాక్స్ ఎన్విరో ఎనర్జీ సొల్యూషన్స్ రూ.3,100 కోట్ల ఐపీఓ సోమవారం నుంచి ప్రారంభమై, బుధవారం ముగుస్తుంది. ధరల శ్రేణి రూ.1,000-1,053. తాజా షేర్ల జారీ ద్వారా రూ.1,200 కోట్లు సమీకరించనుండగా, ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్)లో ప్రమోటర్లు, వాటాదార్లు రూ.1,900 కోట్ల విలువైన షేర్లను విక్రయించనున్నారు. రిటెయిల్ మదుపర్లు కనీసం 14 షేర్లకు (రూ.14,742) దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. యాంకర్ మదుపర్ల నుంచి కంపెనీ ఐపీఓకు ముందే రూ.921 కోట్లు సమీకరించింది. టెమాసెక్ హోల్డింగ్స్, నొమురా అసెట్ మేనేజ్‌మెంట్ ఈస్ట్‌స్ప్రింగ్, ఎస్‌బీఐ లైఫ్, టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్ప్, హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్, ఏడీఐఏ ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ మ్యూచువల్ ఫండ్, ఎస్‌బీఐ జనరల్, ప్రేమ్‌జీ ఇన్వెస్ట్, 360 వన్ మ్యూచువల్ ఫండ్ వంటి విదేశీ (32 శాతం), దేశీయ సంస్థలు (68 శాతం) యాంకర్ రౌండ్‌లో పాల్గొన్నాయి. బీఎస్ఈ వెబ్‌సైట్‌లో ఉన్న సమాచారం ప్రకారం, క్లీన్‌మ్యాక్స్ ఆయా సంస్థలకు 87,46,437 షేర్లను ఒక్కోటి రూ.1,053 చొప్పున కేటాయించింది.

ఏఐ మనిషికి అనుబంధ పాత్రనే పోషిస్తుంది

సిస్కో ప్రెసిడెంట్ జీత్ పటేల్

దిల్లీ: కృత్రిమ మేధ మానవ అవసరాన్ని పూర్తిగా తగ్గించేస్తుందని భయపడటం.. ఒక తప్పుడు అభిప్రాయమేనని సిస్కో ప్రెసిడెంట్, చీఫ్ ప్రోడక్ట్ ఆఫీసర్ జీతు పటేల్ తెలిపారు. మానవ నిర్ణయానికి, ఏఐ ఆటోమేషన్ కలిసినప్పుడే అసలైన అద్భుతాలు చోటు చేసుకుంటాయని అన్నారు. 'సమాజ పురోగతికి మానవ సహకారం తప్పనిసరి. అందువల్ల మున్ముందు మానవ అవసరం పూర్తిగా తగ్గిపోతుందని నేను అనుకోవడం లేదు. ఏఐ కేవలం మనిషికి అనుబంధ పాత్రనే పోషిస్తుందనే విషయాన్ని ఇక్కడ గుర్తుంచుకోవాలి' అని ఆయన తెలిపారు. 'చాట్‌బోట్‌ల దగ్గర నుంచి అటానమస్ ఏజెంట్ల వరకు ఏఐ సిస్టమ్స్ వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. అయితే అవి సూచనల ఆధారంగా పనిచేసే టూల్స్ మాత్రమే. అందువల్ల మానవ సామర్థ్యాలను అవి భర్తీ చేయలేవు' అని పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో పటేల్ చెప్పారు.

ఎన్ఎండీసీ, వాలే ఎస్.ఎ.తో అదానీ పోర్ట్ ఒప్పందం



దిల్లీ: అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనమిక్ జోన్ లిమిటెడ్ (ఏపీఎస్ఈజెడ్) తన అనుబంధ సంస్థ అదానీ గంగవరం పోర్ట్ లిమిటెడ్ (ఏజీపీఎల్) ద్వారా ప్రభుత్వ రంగ సంస్థ ఎన్ఎండీసీ లిమిటెడ్, వాలే ఎస్.ఎ. (బ్రెజిల్)తో వ్యూహాత్మక అవగాహనా ఒప్పందాన్ని (ఎంఓయూ) కుదుర్చుకుంది. దీనికి దిల్లీలో నిర్వహించిన ఇండియా-బ్రెజిల్ బిజినెస్ ఫోరమ్ సమిట్ వేదికైంది. ఈ ఒప్పందం గంగవరం పోర్టులో డెడికేటెడ్ ఇనుప ఖనిజ మిశ్రమ ప్లాంటు ఏర్పాటు, ప్రత్యేక ఆర్థిక మండలి (ఎస్ఈజెడ్) అభివృద్ధికి ఒక వ్యూహాత్మక చట్రాన్ని ఏర్పాటు చేస్తుంది. దీని ద్వారా ఇనుప ఖనిజం మిశ్రమాన్ని అభివృద్ధి చేయడం, విలువ జోడింపు, వాణిజ్యీకరించడం వంటివి చేస్తాయి.

మార్చి 2న ఐఓబీ ఆఫీసర్స్ అసోసియేషన్ సమ్మె!

దిల్లీ: యాజమాన్యం విధించిన బలవంతపు నిఘా చర్యలు, కార్యాలయ పద్ధతులకు నిరసనగా దేశ వ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలో భాగంగా ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఐఓబీఓఏ) మార్చి 2న ఒక రోజు అఖిల భారత సమ్మెను ప్రకటించింది. దీనికి ఆలిండియా బ్యాంక్ ఆఫీసర్స్ కాన్ఫెడరేషన్ (ఏఐబీఓసీ) కూడా మద్దతు ఇస్తోంది. యాజమాన్య పద్ధతులు కార్యాలయ సంస్కృతిలో తీవ్రమైన, ఆందోళనకరమైన మార్పును సూచిస్తున్నాయని తెలిపింది.

ఏఐ కొలువుల్లో మెట్రో నగరాల జోరు

- బెంగళూరు, దిల్లీ, ముంబయిలదే ఆధిపత్యం
- సీబీఆర్ఈ నివేదిక

దిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ) ఉద్యోగాల్లో మెట్రో నగరాలు దూసుకెళ్తున్నాయి. నౌకరీ.కామ్ పోర్టల్‌పై దాదాపు 70 శాతం ఏఐకు సంబంధించిన ఉద్యోగాలు. . బెంగళూరు, దిల్లీ-ఎన్‌సీఆర్, ముంబయిల్లోనే ఉంటున్నాయని స్థిరాస్తి కన్సల్టెంట్ సంస్థ సీబీఆర్ఈ తాజా నివేదికలో వెల్లడించింది. 2025 డిసెంబరు నాటికి నౌకరీ పోర్టల్‌పై ఉన్న 64,500 క్రియాశీల ఏఐ ఉద్యోగ ప్రకటనలను విశ్లేషించి, ఈ నివేదికను వెలువరించింది. మొత్తం ఏఐ అనుబంధ ఉద్యోగాల్లో బెంగళూరు 25.4 శాతం వాటాతో అగ్రస్థానంలో నిలిచింది. తర్వాతి స్థానాల్లో దిల్లీ-ఎన్‌సీఆర్ (24.8%), ముంబయి (19.2%) ఉన్నాయి. నౌకరీ పోర్టల్‌లో ఏఐ కింద నమోదైన ఉద్యోగ లిస్టింగ్‌ల డేటాను మాత్రమే తీసుకున్నామని, దేశంలో మొత్తం ఏఐ ఉద్యోగాల మార్కెట్‌ను ఇది ప్రతిబింబించదని సీబీఆర్ఈ స్పష్టం చేసింది.

- ఏఐ ఉద్యోగాల మార్కెట్‌లో హైదరాబాద్ (12.5%), పుణె (9.6%), చెన్నై (6.4%), కోల్‌కతా (2.1%) వాటాలను కలిగి ఉన్నాయి.
- ప్రస్తుతం ఏఐ విభాగంలో ప్రధానంగా ఇంజినీరింగ్ (సాఫ్ట్‌వేర్, క్వాలిటీ అస్యూరెన్స్), డేటా సైన్స్-అనలిటిక్స్, కస్టమర్ సేవలు, కార్యకలాపాల రంగాల్లో నియామకాలు జోరుగా సాగుతున్నాయి.
- పెద్ద సంఖ్యలో గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ (జీసీసీ)లకు కేంద్రంగా ఉండటంతో ఏఐ ఉద్యోగాల్లో బెంగళూరు ఆధిపత్యం చెలాయిస్తోంది.
- 'ఏఐ అనేది ఇప్పుడు కేవలం ఒక చర్చాంశం కాదు. భారత ఆర్థిక వృద్ధిలో కీలక భాగం. అంతర్జాతీయ సంస్థలు మన దేశాన్ని కేవలం సేవా కేంద్రంగానే కాకుండా, సరికొత్త ఆవిష్కరణల హబ్‌గా చూస్తున్నాయి' అని సీబీఆర్ఈ ఇండియా ఛైర్మన్ అన్షుమన్ మ్యాగజైన్ పేర్కొన్నారు.



ఫ్రెషర్ల నియామకాలకు సై

73% కంపెనీల సన్నాహాలు: టీమ్‌లీజ్

కొత్తగా డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగ అన్వేషణలో ఉన్న తాజా ఉత్తీర్ణులు (ఫ్రెషర్స్)కు శుభవార్త. 2026 ప్రథమార్ధం (జనవరి-జూన్)లో ఫ్రెషర్లను నియమించుకోవడానికి దాదాపు 73 శాతం కంపెనీలు సిద్ధంగా ఉన్నాయని 'టీమ్‌లీజ్ ఎడ్‌టెక్ కెరీర్ ఔట్‌లుక్' నివేదిక వెల్లడించింది. ఈ ఏడాది జనవరి-జూన్‌లో నాలుగింట మూడు (73%) కంపెనీలు ఫ్రెషర్ల నియామకాలకు మొగ్గుచూపాయి. అంతక్రితం ఆరు నెలలతో పోలిస్తే ఇది 3 శాతం ఎక్కువ. దేశంలో పలు నగరాలు, పరిశ్రమలకు చెందిన దాదాపు 1051 కంపెనీల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ఈ నివేదికను వెలువరించారు.

- నైపుణ్యాలకే పట్టం: ప్రస్తుతం కంపెనీలు కేవలం అకాడమిక్ సర్టిఫికెట్లను మాత్రమే చూడటం లేదని, ఇంటర్న్‌షిప్‌లు, ప్రాజెక్టు అనుభవం ఉన్న అభ్యర్థులకే ప్రాధాన్యత ఇస్తున్నాయని నివేదిక స్పష్టం చేసింది. కేవలం డిగ్రీ ఉన్న వారి కంటే, పని నేర్చుకుని నిరూపించుకున్న వారికే త్వరగా కొలువులు లభిస్తున్నాయి అని టీమ్‌లీజ్ ఎడ్‌టెక్ సీఈఓ శంతను రూజ్ తెలిపారు.
- రంగాల వారీగా చూస్తే.. రిటెయిల్ (91%), ఇ-కామర్స్, టెక్నాలజీ అంకుర సంస్థలు (90%), తయారీ (85%), పర్యాటకం, ఆతిథ్యం (77%) గిరాకీ లభిస్తోంది. రిటెయిల్‌లో డార్క్ స్టోర్ అసిస్టెంట్, ఇన్వెంటరీ మేనేజ్‌మెంట్ అసిస్టెంట్ ఉద్యోగాలకు మంచి గిరాకీ ఉంది. ఇ-కామర్స్, టెక్నాలజీ అంకుర సంస్థల్లో డిజిటల్ సేల్స్ అసోసియేట్, జూనియర్ వెబ్ డెవలపర్ స్థానాలకు ఆదరణ దక్కుతోంది. తయారీలో బ్యాటరీ అసెంబ్లీ టెక్నీషియన్, ఇన్వెంటరీ, లాజిస్టిక్స్ కో-ఆర్డినేటర్ స్థానాలకు ఎక్కువ గిరాకీ ఉంది.
- 84 శాతం ఫ్రెషర్ల నియామకాలతో దేశంలోనే అగ్రస్థానంలో బెంగళూరు నిలిచింది. ఇక్కడ ఐటీ, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్, డిజిటల్ మార్కెటింగ్ విభాగాల్లో ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. ముంబయి (72%) రెండో స్థానంలో ఉంది. రిటెయిల్, ఎఫ్ఎంసీజీ, ఆరోగ్య సంరక్షణ రంగాల్లో ఇక్కడ అత్యధిక ఉద్యోగాలు లభిస్తున్నాయి.
- అప్రెంటిస్‌షిప్‌లకు ప్రాధాన్యం: డిగ్రీతో పాటు అప్రెంటిస్‌షిప్ చేసే సంస్కృతి పెరుగుతోందని, ముఖ్యంగా బెంగళూరులో 45 శాతం కంపెనీలు 'డిగ్రీ అప్రెంటిస్‌షిప్' అభ్యర్థుల పట్ల ఆసక్తి చూపుతున్నాయని నివేదిక పేర్కొంది. విద్యుత్, ఇంధన రంగాల్లో గతంతో పోలిస్తే గిరాకీ 50 శాతం మేర పెరగడం విశేషం.

నొప్పిని 'పీల్చేసుకునే' స్పాంజి!



నొప్పిని స్పాంజిలా పీల్చేసుకునే ఒక కొత్తరకం చికిత్సను అమెరికా శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఇది కీళ్ల అరుగుదల (ఆస్టియోఆర్థరైటిస్)తో బాధపడుతున్న ఎలుకల్లో నొప్పి, ఇన్‌ఫ్లమేషన్‌ను ప్రేరేపించే అంశాలను 'శోషించుకుంది'. దీన్నిబట్టి మానవుల్లోనూ ఆస్టియోఆర్థరైటిస్ వంటి రుగ్మతల కారణంగా ఉత్పన్నమయ్యే దీర్ఘకాల నొప్పిని నయం చేయవచ్చని స్పష్టమవుతోందని శాస్త్రవేత్తలు తెలిపారు. దీనివల్ల బాధితులు ఉపశమనం కోసం ఓపియాడ్ మందులపై ఆధారపడటాన్ని తగ్గించుకోవచ్చు. దీనికితోడుగా ఈ చికిత్స ఎముక, మృదులాస్థి (కార్టిలేజ్) మరమ్మతులకూ ఊతమిచ్చినట్లు ఎలుకలపై జరిపిన పరిశోధనల్లో వెల్లడైంది.

ఏదైనా నొప్పి.. మూడు నెలల కన్నా ఎక్కువకాలం కొనసాగితే దాన్ని దీర్ఘకాల నొప్పిగా పరిగణిస్తారు. దీన్ని ఓపియాడ్ మందులతో నియంత్రిస్తుంటారు. అవి శరీరంలోని గ్రాహకాలతో బంధనాన్ని ఏర్పరుస్తుంటాయి. తద్వారా నొప్పి తీవ్రతను నియంత్రిస్తుంటాయి. అయితే ఓపియాడ్లతో కళ్లు తిరగడం, వాంతులు, ఆ మందులకు మితిమీరి అలవాటుపడటం వంటి దుష్ప్రభావాలు ఉంటాయి. ఈ లోపాలున్నప్పటికీ ప్రపంచవ్యాప్తంగా ఆస్టియోఆర్థరైటిస్ బాధితుల్లో 9 శాతం మంది వీటిని వాడుతున్నారు. అందువల్ల మరింత సురక్షితమైన, సమర్థ ప్రత్యామ్నాయాల కోసం ఎదురుచూస్తున్నారు.

స్పాంజి పనితీరు ఎలా?

నొప్పిని తగ్గించే ఇతరత్రా విధానాలపై తాజాగా అమెరికాలోని జాన్స్ హాప్కిన్స్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ శాస్త్రవేత్తలు పరిశోధనలు జరిపారు. ఈ చికిత్సకు ఎస్ఎన్101 అని పేరు పెట్టారు. ఇందుకోసం మానవ ప్లూరిపొటెంట్ మూలకణాలు (హెచ్‌పీఎస్‌సీ)ని ఉపయోగించారు. ఇవి శరీరంలో ఎలాంటి కణాలుగానైనా రూపాంతరం చెందగలవు.

- తాజా పరిశోధనలో ఇంద్రియ నాడీ కణాలు (సెన్సరీ న్యూరాన్లు)గా వృద్ధి చెందేలా ఈ మూలకణాలను శాస్త్రవేత్తలు తీర్చిదిద్దారు.
- ఎలుకలపై ప్రయోగించినప్పుడు ఈ న్యూరాన్లు ఇన్‌ఫ్లమేటరీ నొప్పి సంకేతాల పాలిట స్పాంజిలా పనిచేశాయి. నొప్పికి సంబంధించిన సంకేతాలు మెదడుకు వెళ్లి, నొప్పి భావనను కలిగించడానికి ముందే ఇవి వాటిని శోషించుకున్నాయి.



- సైద్ధాంతికంగా ఈ విధానం ఎలాంటి దీర్ఘకాలిక నొప్పిపైనైనా పనిచేయగలదని శాస్త్రవేత్తలు తెలిపారు. అయితే ప్రయోగంలో తాము ఆస్టియోఆర్థరైటిస్‌పైనే దీన్ని పరీక్షించామని వివరించారు. ఈ సమస్య ఉన్నవారిలో ఇన్‌ఫ్లమేషన్, కీళ్లపై ప్రభావం చూపే దీర్ఘకాల నొప్పి ఉంటుంది. కీళ్లు పట్టేసినట్లు ఉండటం, ఎముక, మృదులాస్థి, ఇతర కణజాలాల క్షీణత వల్ల ఇన్‌ఫ్లమేషన్ కూడా తలెత్తుతుంది. దీనికి చికిత్స లేదు. ప్రస్తుతం ఆస్టియోఆర్థరైటిస్ లక్షణాలను జీవనశైలి మార్పులు, ఫిజియోథెరపీ, నొప్పి నివారణ మందులు, స్టెరాయిడ్ ఇంజెక్షన్ల ద్వారా అదుపులో ఉంచుతున్నారు.
- మల్టిపుల్ స్కెలోరిసస్, అల్జీమర్స్, పార్కిన్‌సన్స్ వంటి నాడీక్షీణత వ్యాధులకూ హెచ్‌పీఎస్‌సీలతో చికిత్స చేసేందుకు శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తున్నారు. ఎస్ఎన్101 విధానం ఒక ప్రత్యామ్నాయ మార్గాన్ని అందించింది.

ఎరలా పనిచేస్తూ..

కొత్త చికిత్స విధానంలో హెచ్‌పీఎస్‌సీ నుంచి సేకరించిన న్యూరాన్లను ఇన్‌ఫ్లమేషన్ ప్రదేశంలోకి ఎక్కిస్తారు. అక్కడ.. ఇవి నొప్పిని గ్రహించే న్యూరాన్లతో కలిసి సాగుతాయి. ఈ క్రమంలో కొత్త న్యూరాన్లు 'ఎర'లా పనిచేస్తాయి. శరీరంలోని అసలైన న్యూరాన్లు గ్రహించేలోగానే.. సమీపంలోని ఇన్‌ఫ్లమేటరీ అంశాలతో బంధం ఏర్పరుస్తాయి. మూలం వద్దే నొప్పిని లాగేయడానికి ఇది దోహదపడుతుందని శాస్త్రవేత్తలు వివరించారు. దీనిపై ఇంకా మానవ ప్రయోగాలు జరగాల్సి ఉందని శాస్త్రవేత్తలు తెలిపారు.

- ఈనాడు ప్రత్యేక విభాగం

ఔషధ రంగంలో స్వావలంబనే లక్ష్యం

- టీడీ వ్యాక్సిన్‌ను ఆవిష్కరించిన కేంద్ర మంత్రి జేపీ నడ్డా



దిల్లీ: స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ధనుర్వాతం, డిఫ్తీరియా (టీడీ) వ్యాక్సిన్‌ను కేంద్ర వైద్యారోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా శనివారం ఆవిష్కరించారు. హిమాచల్ ప్రదేశ్‌లోని కసౌలీలో ఉన్న సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఆర్ఐ)లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఈ వ్యాక్సిన్ ఆవిష్కరణ ఒక చరిత్రాత్మక సందర్భం. దీని రూపకల్పనలో పాలుపంచుకున్న శాస్త్రవేత్తలకు, సిబ్బందికి శుభాకాంక్షలు. యూనివర్సల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రాం (యూఐపీ) కింద టీడీ వ్యాక్సిన్‌లను సరఫరా చేస్తాం. సీఆర్ఐ త్వరలోనే 55 లక్షల డోసులను యూఐపీకి సరఫరా చేయనుంది. రానున్న రోజుల్లో ఈ సంఖ్య మరింత పెరుగుతుంది. మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆరోగ్య, ఔషధ రంగంలో స్వావలంబన సాధించడానికి నిర్దిష్టమైన లక్ష్యాలను పెట్టుకుంది. టీడీ వ్యాక్సిన్ ఆవిష్కరణ ద్వారా అందుకు సుదృఢమైన మార్గం ఏర్పడినట్టయింది'' అని పేర్కొన్నారు. వ్యాక్సిన్‌లను తయారుచేయడం, మార్కెట్‌లోకి రావడం సుదీర్ఘమైన ప్రక్రియ అయినప్పటికీ భారత్ తక్కువ సమయంలోనే టీకాలను రూపొందిస్తోందని నడ్డా అన్నారు. కొవిడ్-19 వ్యాక్సిన్‌ను 9 నెలల్లోనే రూపొందించామని, 220 కోట్ల డోసులను ప్రజలకు అందించామని గుర్తుచేశారు. 'వ్యాక్సిన్ మైత్రి' కింద ఇప్పటి వరకు 100 దేశాలకు టీకా డోసులు ఎగుమతి చేశామని, అందులో 48 దేశాలకు ఉచితంగానే అందించామని తెలిపారు.

పాకిస్థాన్‌లో స్వల్ప భూకంపం

ఇస్లామాబాద్: ఉత్తర పాకిస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో శనివారం స్వల్ప భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై దీని తీవ్రత 4.4గా నమోదైంది. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం అందలేదు. బుర్హాన్, అటాక్ ప్రాంతాలకు ఈశాన్యంలో 11 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. ఖైబర్ పఖ్తుంఖ్వా, పెషావర్, ఇస్లామాబాద్ వంటి నగరాల్లోనూ ఈ భూకంప ప్రభావం కనిపించింది.

గణిత పరీక్ష సరిగా రాయలేదని విద్యార్థిని ఆత్మహత్య

ఇటావా: గణిత పరీక్ష సరిగా రాయలేదని పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఇటావాలో శుక్రవారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ నెల 17న సీబీఎస్ఈ గణిత పరీక్ష రాసిన 15 ఏళ్ల విద్యార్థిని తీవ్ర ఒత్తిడికి గురయ్యారు. తల్లి, సోదరుడు బజారుకు వెళ్లిన సమయంలో ఆమె ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది.

చట్టమంటే కోట కాదు.. సర్వజనుల వేదిక: సీజేఐ

జోధ్‌పుర్: చట్టమనేది ఎవరూ చొరలేని అభేద్యమైన కోటలా కాకుండా అందరూ పాల్గొనగల సజీవ వేదికగా ఉండాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ ఉద్బోధించారు. జోధ్‌పుర్‌లోని జాతీయ న్యాయవిశ్వవిద్యాలయ 18వ స్నాతకోత్సవంలో శనివారం ఆయన ప్రసంగించారు. అవ్యవస్థ, అనిశ్చితి, అరాచకం, నిరంకుశత్వాల నుంచి రక్షణ కల్పించే కోటగా న్యాయాన్నీ, చట్టాన్నీ చూడటం పాత పద్ధతి అన్నారు. రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యంలో చట్టమనేది అభేద్య కోటలా కాకుండా బేధాభిప్రాయాల గురించి చర్చించుకుని, హక్కులను విస్పష్టంగా నొక్కిచెబుతూ, అధికారాన్ని హేతుబద్ధంగా నిలదీసే వేదికలా ఉండాలని ఉద్ఘాటించారు. దీన్ని సాధించాల్సిన బాధ్యత.. న్యాయశాస్త్రంలో పట్టభద్రులవుతున్నవారిపై ఉందన్నారు. సమాజంతోపాటే చట్టాలూ పరిణామం చెందుతాయనీ, సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా చట్టమూ మారాలని సీజేఐ పేర్కొన్నారు. చట్టమనేది జటిలమైన పరిభాషా చట్రంలో ఇరుక్కుపోకూడదనీ, సంపన్నులకే అందుబాటులో ఉన్న వ్యవస్థగా మారకూడదని అన్నారు. చట్టం, న్యాయం అందరి పట్ల సమంగా ఉండేలా యువ న్యాయశాస్త్ర పట్టభద్రులు చూడాలని పిలుపు ఇచ్చారు.

పేదరికం తాండవించే చోట విలాసవంత విమానమా?

- పాక్‌లో దుమారం

లాహోర్: పాకిస్థానీ పంజాబ్ రాష్ట్ర ముఖ్యమంత్రి, మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ కుమార్తె మర్యం నవాజ్ వ్యక్తిగత పర్యటనల కోసం రాష్ట్ర ప్రభుత్వం 1,170 కోట్ల పాక్ రూపాయల విలాసవంతమైన విమానాన్ని కొనడంపై దుమారం రేగుతోంది. 4.2 కోట్ల డాలర్ల విలువైన ఈ గల్ఫ్ స్ట్రీమ్ విమానంలో 19 సీట్లు ఉన్నాయి. త్వరలో పంజాబ్ రాష్ట్రం ప్రారంభించే ఎయిర్ పంజాబ్ విమానయాన సంస్థ కోసం ఈ విమానం కొన్నామని పంజాబ్ సమాచార మంత్రి అజ్మా బుఖారీ చెప్పుకొచ్చారు. అయితే పాకిస్థాన్ జాతీయ విమానయాన సంస్థ పీఐఏని కేవలం 1,000 కోట్ల పాక్ రూపాయల ధరకు అమ్మగా, ఒక్క మర్యం విమానానికే అంతకంటే ఎక్కువ వెచ్చించడమేమిటని ప్రతిపక్ష 'పాకిస్థాన్ తెహ్రీకే ఇన్సాఫ్' (పీటీఐ) పార్టీ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి మూనిస్ ఇలాహీ నిలదీశారు.

ఇది కత్యాల్ 'విక్టరీ'

- ట్రంప్‌నకు అడ్డుకట్ట వేయించిన భారత సంతతి న్యాయవాది
- సుప్రీం కోర్టులో చిన్న వ్యాపారుల తరఫున వాదించింది ఆయనే..



న్యూయార్క్: ప్రపంచ దేశాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అడ్డగోలుగా విధించిన సుంకాలకు సుప్రీం కోర్టు అడ్డుకట్ట వేయడంలో భారత సంతతి న్యాయవాది నీల్ కత్యాల్ కీలక పాత్ర పోషించారు. సుంకాల ద్వారా జరుగుతున్న అన్యాయంపై ఆయన కోర్టులో చిన్న వ్యాపారుల తరఫున గట్టిగా వాదనలు వినిపించారు. దీంతో ట్రంప్ సుంకాలను చట్ట విరుద్ధమని కోర్టు ప్రకటించి రద్దు చేసింది. భారత్ నుంచి వలసవెళ్లిన వారి కుమారుడైన నీల్ కత్యాల్.. ఒబామా హయాంలో తాత్కాలిక సొలిసిటర్ జనరల్‌గా పని చేశారు. కోర్టు తీర్పు అనంతరం 'విక్టరీ' అని ఎక్స్‌లో కత్యాల్ పోస్టు పెట్టారు.

శక్తిమంతులైనా రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేయలేరు

'ఈ దేశంలో ఇదో అసాధారణ ఘటన. స్వీయ దిద్దుబాటుకు అవకాశమున్న ఆలోచనా వ్యవస్థ మనకు ఉందని నిరూపించింది. మీరు ప్రపంచంలోనే శక్తిమంతమైన వ్యక్తి కావొచ్చు.. కానీ రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేయలేరు' అని కత్యాల్ వ్యాఖ్యానించారు.

చట్టంవైపే కోర్టు నిలిచింది..

సుప్రీం కోర్టు తీర్పు అనంతరం కత్యాల్ ఒక ప్రకటన విడుదల చేశారు. చట్టంవైపే కోర్టు నిలిచిందని వ్యాఖ్యానించారు. 'కోర్టు సందేశం సుస్పష్టం. అధ్యక్షులు శక్తిమంతం కావొచ్చుగానీ రాజ్యాంగం అంతకంటే శక్తిమంతమని చాటిచెప్పింది. అమెరికాలో చట్టసభల సభ్యులే ప్రజలపై పన్నులు వేయగలరు. మేం అడిగిన అన్ని అంశాల్లో కోర్టు అనుకూలంగా ఉత్తర్వులిచ్చింది. ఇతరులు పట్టించుకోని సమయంలో లిబర్టీ జస్టిస్ సెంటర్ నాయకత్వం వహించినందుకు కృతజ్ఞతలు. ఈ కేసు అధ్యక్ష పదవిపైనేగానీ ఫలానా అధ్యక్షుడిపై అని కాదు. ఇది అధికారాల విభజనకు సంబంధించినది. రాజకీయాలకు సంబంధించినది కాదు. 250 ఏళ్లుగా ప్రభుత్వానికి పునాదిగా ఉన్న సుప్రీం కోర్టు.. ప్రాథమిక విలువలను కాపాడుతున్నందుకు సంతోషంగా ఉంది' అని కత్యాల్ వ్యాఖ్యానించారు.


అమెరికా వ్యవస్థల గొప్పదనం

'అమెరికా వ్యవస్థల గొప్పదనాన్ని శుక్రవారం జరిగిన ఘటన నిరూపించింది' అని నీల్ కత్యాల్ వ్యాఖ్యానించారు. వలసదారుల కుమారుడినైన తాను కోర్టుకు వెళ్లగలిగానని, అమెరికా చిన్న వ్యాపారాల తరఫున వాదించగలిగానని, ఈ అధ్యక్షుడు చట్ట విరుద్ధంగా వ్యవహరించారని చెప్పగలిగానని పేర్కొన్నారు. తీర్పు అనంతరం ఆయన 'ఎంఎస్ నౌ'కు ఇంటర్వ్యూ ఇచ్చారు. 'నా కేసును నేను సమర్థంగా సమర్పించగలిగా. నన్ను కఠినమైన ప్రశ్నలు అడగవచ్చని వారికి సూచించా. నిజంగా తీవ్రమైన వాదనలు జరిగాయి. చివరకు వారు ఓటేశారు. మేం గెలిచాం' అని కత్యాల్ వివరించారు.

1970లో జననం

భారత్ నుంచి వలస వచ్చిన దంపతులకు 1970లో కత్యాల్ జన్మించారు. షికాగోలో పుట్టిన ఆయన తండ్రి ఓ ఇంజినీరు. తల్లి పిల్లల వైద్యురాలు. యేల్ లా స్కూల్ నుంచి న్యాయవాద పట్టా పొందారు. ఆ తర్వాత అమెరికా రెండో సర్క్యూట్ అప్పీల్స్ కోర్టు గైడో కాలబ్రెసీవద్ద, అమెరికా సుప్రీం కోర్టు న్యాయమూర్తి స్టీఫెన్ జి.బ్రేయర్‌వద్ద క్లర్క్‌గా పని చేశారు.

- ✦ జార్జిటౌన్ యూనివర్సిటీ లా సెంటర్‌లో కత్యాల్ రెండు దశాబ్దాలకుపైగా లా ప్రొఫెసర్‌గా పని చేశారు. ఆ వర్సిటీ చరిత్రలో అత్యంత పిన్న వయస్కుడైన ప్రొఫెసర్లలో ఒకరిగా నిలిచారు.
- ✦ హార్వర్డ్ వర్సిటీ, యేల్ లా స్కూల్‌లలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా సేవలందించారు.
- ✦ జస్టిస్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన డిప్యూటీ అటార్నీ జనరల్ కార్యాలయంలో జాతీయ భద్రతా సలహాదారుగా పని చేశారు. డిప్యూటీ అటార్నీ జనరల్‌కు ప్రత్యేక సహాయకుడిగా సేవలందించారు.
- ✦ మిల్‌బ్యాంక్ ఎల్ఎల్‌పీ వాషింగ్టన్‌లో కత్యాల్ భాగస్వామిగా ఉన్నారు. ఆ సంస్థ లిటిగేషన్ అండ్ ఆర్బిట్రేషన్ గ్రూపు సభ్యుడిగానూ ఉన్నారు.
- ✦ మిల్‌బ్యాంక్ వెబ్‌సైట్‌లోని వివరాల ప్రకారం.. అప్పిలేట్, సంక్లిష్ట వివాదాల్లో కత్యాల్ వాదనలు వినిపిస్తుంటారు. సుప్రీం కోర్టులో ఆయన 54 కేసులను వాదించారు.
- ✦ అమెరికా న్యాయశాఖలో అత్యున్నత అవార్డు అయిన ద ఎడ్మండ్ రాండాల్ఫ్ అవార్డును ఆయన 2011లో సొంతం చేసుకున్నారు.
- ✦ 2011 నుంచి 2014 వరకూ ఫెడరల్ అప్పిలేట్ నిబంధనల సలహా కమిటీలో నియమితులయ్యారు.



రాష్ట్రపతి భవన్ వద్ద శనివారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో బ్రెజిల్ అధ్యక్షుడు లులా డసిల్వా

2026లో 57 నక్సల్ ఆయుధ డంప్‌లు స్వాధీనం

గువాహటి: నక్సలిజాన్ని వచ్చేనెల 31లోగా అంతమొందించాలన్న సంకల్పాన్ని సాకారం చేసే క్రమంలో కేంద్ర రిజర్వు పోలీసు దళం (సీఆర్‌పీఎఫ్) ఈ ఏడాది ఇప్పటివరకూ ఆరు రాష్ట్రాల్లో దాడులు జరిపి 57 ఆయుధ డంప్‌లను స్వాధీనం చేసుకుంది. ఇందులో 101 తుపాకులు, పేలుడు పదార్థాలు, బాంబుల తయారీ సామగ్రి ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో పారామిలిటరీ బలగాలు దాడులు నిర్వహించి ఏకే-47, ఇన్‌సాస్, .303 తుపాకులతోపాటు నాటు తుపాకులు, 52 బాంబులు, 405 కేజీల పేలుడు పదార్థాలు, 1,093 డిటొనేటర్లు, 2 కిలోమీటర్ల ఫ్యూజ్‌వైరు స్వాధీనం చేసుకున్నాయి. దట్టమైన అడవుల్లో నిర్మించిన 175 నక్సల్ స్మారక స్థూపాలను ఈ సంవత్సరం నేలమట్టం చేశామని, తీవ్రవాద భావజాలం పట్ల సానుభూతి తలెత్తకుండా, ఆ ఉద్యమం మళ్లీ చిగురించకుండా నిరోధించేందుకే ఈ చర్య చేపట్టామని అధికారులు వివరించారు. తమ బలగాలు ఇతర దళాలతో కలిసి నక్సల్ ఉద్యమ నిర్మూలనకు పనిచేస్తున్నాయని, ప్రభుత్వం నిర్ణయించిన తేదీనాటికి వామపక్ష తీవ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలిస్తామని సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్ జనరల్ జి.పి. సింగ్ తెలిపారు.

పశ్చిమ బెంగాల్‌లో జడ్జీల సెలవులు రద్దు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) కార్యక్రమం నడుస్తున్నందున వివిధ కోర్టులలో పనిచేస్తున్న న్యాయాధికారులు వచ్చేనెల 9 వరకు సెలవులు పెట్టకూడదనీ, ఇప్పటికే దరఖాస్తు పెట్టినవారి సెలవులను రద్దుచేస్తున్నామనీ కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సుజయ్ పాల్ శనివారం ప్రకటించారు. సెలవులో ఉన్నవారు ఈ నెల 23కల్లా కోర్టులకు తిరిగి రావాలని ఆదేశించారు. వైద్యపరమైన ఎమర్జెన్సీ వస్తే తప్ప సెలవును ఆమోదించేది లేదని స్పష్టం చేశారు. సర్‌లో మిగిలిన దశలను న్యాయాధికారులు, మాజీ న్యాయమూర్తుల పర్యవేక్షణలో నిర్వహించాలని సుప్రీంకోర్టు శుక్రవారం ఆదేశించింది. అత్యున్నత న్యాయస్థానం జారీ చేసిన ఉత్తర్వుల పర్యవసానంగా కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్ అధ్యక్షతన శనివారం ఇక్కడ సర్‌పై ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. అందులో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కూడా పాల్గొన్నారు. సమావేశం తరవాత జడ్జీలు మార్చి 9 వరకు సెలవులు పెట్టకూడదని నోటిఫికేషన్ జారీ అయింది. ఇది ప్రత్యేక కోర్టులు, సీబీఐ కోర్టులు, వాణిజ్య కోర్టులతోపాటు అన్ని రకాల న్యాయస్థానాల్లో పనిచేస్తున్న న్యాయాధికారులకూ వర్తిస్తుంది.

తృణమూల్ సర్కారుకు ఎదురుదెబ్బ

దిల్లీ: పశ్చిమ బెంగాల్‌లో సర్ నిర్వహణకు న్యాయాధికారులను (జడ్జిలను) నియమించాలని సుప్రీంకోర్టు ఆదేశించడం చాలా ముఖ్యమైన పరిణామమనీ, మమతా బెనర్జీ తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ ఉత్తర్వును పాటించడం వినా గత్యంతరం లేదని కేంద్ర న్యాయ శాఖ మంత్రి కిరణ్ రిజిజు శనివారం వ్యాఖ్యానించారు. రిగ్గింగ్ చేసి, అక్రమ వలసదారులను ఓటర్లుగా చేర్చి అసెంబ్లీ ఎన్నికల్లో గెలవాలన్న తృణమూల్ పన్నాగం ఇప్పుడు బట్టబయలైందని ఆయన అన్నారు.

విమానంలో చిన్న రియాక్టర్ తరలింపు

హిల్ ఎయిర్‌ఫోర్స్ బేస్: అణుశక్తిని సైనిక, పౌర అవసరాల కోసం వేగంగా వినియోగంలోకి తెచ్చే కసరత్తులో భాగంగా అమెరికా సైన్యం తొలిసారిగా ఒక చిన్నపాటి రియాక్టర్‌ను విమానం ద్వారా తరలించింది. దీన్ని కాలిఫోర్నియా నుంచి యూటాకు చేరవేశారు. 5 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఈ మైక్రోరియాక్టర్ 700 మైళ్ల దూరం ప్రయాణించింది. ఈ సందర్భంగా రియాక్టర్‌లో అణు ఇంధనాన్ని ఉంచలేదు. కృత్రిమ మేధ, డేటా కేంద్రాల కారణంగా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను అందుకోవడానికి అణు విద్యుత్‌ను ప్రోత్సహించాలన్న డొనాల్డ్ ట్రంప్ సర్కారు లక్ష్యానికి ఇది దర్పణం పడుతోంది. అలాగే మైక్రోరియాక్టర్లకు వాణిజ్య లైసెన్సులను వేగంగా జారీ చేసేందుకూ ఇది దోహదపడుతుందని అమెరికా విద్యుత్ మంత్రి క్రిస్ రైట్ పేర్కొన్నారు.

నాణేల చెట్టుకు నిత్యం రాళ్ల దెబ్బలు



కాసే చెట్టుకే రాళ్ల దెబ్బలు అంటారు. బిహార్‌లోని ఓ ప్రాంతంలో కోరికలు తీర్చే చెట్టుగా ప్రచారంలో ఉన్న వృక్షరాజానికి నిత్యం రాళ్ల దెబ్బలు పడుతున్నాయి. నలందా జిల్లాలోని రాజ్‌గిర్ పట్టణం చుట్టూ ఉన్న రత్నగిరి పర్వతాలపై వెలసిన విశ్వశాంతి స్తూప సందర్శనకు నిత్యం ఎంతోమంది బౌద్ధులు, పర్యాటకులు వస్తుంటారు. ఈ స్తూపం ఆవరణలో ఉన్న తానికాయ చెట్టుకు 'నాణేల చెట్టు'గా పేరొచ్చింది. ఆయుర్వేదంలో ఈ చెట్టు చాలా ప్రశస్తమైనది. దీని కాండంలోకి నాణేలను చొప్పిస్తే కోరికలు నెరవేరుతాయని చాలామంది విశ్వసిస్తారు. దీంతో రాళ్లతో కొట్టి మరీ నాణేలు పెడుతుంటారు. కొన్ని దశాబ్దాలుగా ఇలా కొనసాగుతుండటంతో ఆ వృక్షం నాణేలతో నిండిపోయింది. పక్కనే ఉన్న మరో ఆరు చెట్లపైనా ఇదే తరహాలో నాణేలను చొప్పిస్తున్నారు. దీని వల్ల చెట్లు చచ్చుబడిపోతాయని వారణాసిలోని బల్దేవ్ పీజీ కళాశాల (బడాగావ్) పర్యావరణవేత్త, భౌగోళికశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఉమాకాంత్ సింగ్ తెలిపారు.

ఈటీవీ భారత్

ట్రంప్‌నకు బొమ్మల కంపెనీ షాక్



ఇంటర్నెట్ డెస్క్: ట్రంప్‌నకు చుక్కలు చూపించడంలో ఓ చిన్నపాటి బొమ్మల కంపెనీ విజయం సాధించింది. లెర్నింగ్ రిసోర్సెస్ లిమిటెడ్ అనే సంస్థ చైనా నుంచి తక్కువ ధరకు ఎడ్యుకేషన్ టాయ్స్ దిగుమతి చేసుకునేది. ట్రంప్ సుంకాలతో అది తీవ్రంగా నష్టపోయింది. దీంతో అధ్యక్షుడి నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మరికొందరు పిటిషనర్లతో కలిసి లెర్నింగ్ రిసోర్సెస్ యజమాని రిక్ వోల్డెన్‌బర్గ్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విజయం సాధించేవరకు వెనక్కి తగ్గకుండా న్యాయ పోరాటం చేసి ప్రపంచ వాణిజ్యంపై ప్రభావం చూపే తీర్పులో భాగమయ్యారు. ప్రభుత్వానికి కట్టిన పన్నులను లెర్నింగ్ రిసోర్సెస్ రికార్డులో రాసుకుంది. పన్నుల రూపంలో చెల్లించాల్సిన దానికంటే అమెరికన్లు అదనంగా కట్టారని తమ డబ్బులు తిరిగి ఇచ్చేయాలని కంపెనీ డిమాండు చేస్తోంది. యూఎస్ దిగుమతిదారుల్లో 97 శాతం మంది చిన్న వ్యాపారులే. ఏటా సుమారు 868 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులను అమెరికాకు తీసుకెళుతున్నారు. ఓఎస్ సెలెక్షన్ అనే ఒక చిన్న వైన్, ఆల్కహాల్ కంపెనీ సైతం ట్రంప్‌నకు వ్యతిరేకంగా తీవ్రంగా పోరాడింది. 1987 నుంచి ఉన్న ఈ సంస్థ ఫ్రాన్స్, ఇటలీ వంటి దేశాల నుంచి వైన్లు, స్పిరిట్‌లను తీసుకొచ్చి అమెరికాలో రెస్టారెంట్లు, రిటెయిలర్లకు అందిస్తోంది. ప్లాస్టిక్ పైపులు, ఎలక్ట్రానిక్ కిట్లు, ఫిషింగ్ సామగ్రి, సైకిల్ భాగాలను అమ్మే అనేక చిన్న కంపెనీలు ట్రంప్ ప్రభుత్వంపై పోరాటం చేశాయి. 12 డెమొక్రటిక్ పాలిత రాష్ట్రాలు ఈ కేసులో దావా వేశాయి. వీటి అటార్నీ జనరళ్లు ట్రంప్ విధానాలను రాజ్యాంగ విరుద్ధమని వాదించారు. టారిఫ్‌లవల్ల ఆర్థికంగా నష్టపోయామని, వినియోగదారులపై భారం పెరిగిందని ఈ రాష్ట్రాలు వాదించాయి.

అమెరికాలో హిందువులే విద్యాధికులు



హ్యూస్టన్: అమెరికాలో అత్యంత విద్యాధిక మతవర్గం హిందువులేనని ప్యూ రీసెర్చ్ సెంటర్ విడుదల చేసిన ఒక సర్వే నివేదిక వెల్లడించింది. యూదులు అత్యంత విద్యాధికుల జాబితాలో రెండో స్థానంలో ఉన్నారు. వివిధ మతవర్గాల స్థితిగతులపై 2023-24లో నిర్వహించిన రిలిజియస్ ల్యాండ్‌స్కేప్ సమగ్ర సర్వే (ఆర్ఎల్ఎస్)లో వెలువడిన గణాంకాల ఆధారంగా ఈ అధ్యయన నివేదిక వెలువరించారు. అమెరికాలో నివసిస్తున్న ప్రతి పదిమంది హిందువుల్లో ఏడుగురు.. అంటే 70% మంది పట్టభద్రులు కాగా యూదుల్లో 65% మందికి బ్యాచిలర్స్ డిగ్రీ ఉన్నట్టు గుర్తించారు. అమెరికా మొత్తం జనాభాలో పట్టభద్రులు సరాసరిన 35% మాత్రమే. జాతీయ సరాసరి కన్నా ఎక్కువ శాతం మంది ముస్లింలు, బౌద్ధులు, సనాతన క్రైస్తవులు, సాధారణ ప్రొటెస్టెంట్ క్రైస్తవులు పట్టభద్రులుగా ఉన్నట్టు సర్వేలో తేలింది. ఇవాంజెలికల్ ప్రొటెస్టెంట్లు, కేథలిక్కులు జాతీయ సరాసరి కన్నా తక్కువ సంఖ్యలో పట్టభద్రులైనట్టు వెల్లడైంది. హిందువులు, ముస్లింలు, బౌద్ధుల్లో అత్యధికులు ఉన్నత విద్యాభ్యాసం కోసమే అమెరికాకు వస్తున్నందున వారిలో పట్టభద్రుల సంఖ్య ఎక్కువగా ఉన్నట్టు సర్వే తెలియజేసింది. దీనికోసం 2023-24 మధ్య 36,908 మందిని ప్రశ్నించారు.

నాసా చందమామ రాకెట్‌లో మరో సమస్య

- మార్చిలో యాత్ర అనుమానమే!

కేప్ కెనావెరాల్: చందమామ వద్దకు మానవసహిత యాత్ర నిర్వహించేందుకు అమెరికా అంతరిక్ష సంస్థ-నాసా సిద్ధం చేసిన స్పేస్ లాంచ్ సిస్టమ్ (ఎస్ఎల్ఎస్) రాకెట్‌లో మరో సమస్య తలెత్తింది. దీంతో వచ్చే నెలలో నిర్వహించతలపెట్టిన యాత్ర అనుమానాస్పదంగా మారింది. రాకెట్ ఎగువదశలో హీలియం ప్రవాహానికి అవాంతరం తలెత్తింది. ప్రయోగం కోసం ఘన హీలియం ప్రవాహం అవసరం. తాజా పరిస్థితుల్లో డేటా మొత్తాన్నీ విశ్లేషిస్తున్నట్లు నాసా పేర్కొంది. అవసరమైతే ఎస్ఎల్ఎస్ రాకెట్‌ను ఫ్లోరిడాలోని కెనెడీ అంతరిక్ష కేంద్రంలోని హ్యాంగర్‌కు తరలించి మరమ్మతులు నిర్వహిస్తామని తెలిపింది. మొత్తంమీద ఇది మార్చిలో ప్రయోగానికి ఉన్న అవకాశంపై ప్రభావం చూపడం ఖాయంగా కనిపిస్తోందని పేర్కొంది.

ఆర్టెమిస్-2 పేరుతో చంద్రుడి వద్దకు నాసా ఈ యాత్రను నిర్వహించతలపెట్టింది. దీనిద్వారా నలుగురు వ్యోమగాములతో కూడిన వ్యోమనౌక చంద్రుడిని చుట్టి, భూమికి తిరిగొస్తుంది. దాదాపు ఐదు దశాబ్దాల తర్వాత నాసా.. చంద్రమండలం వద్దకు మానవసహిత యాత్రను నిర్వహిస్తోంది. హైడ్రోజన్ ఇంధన లీకేజీల సమస్య వల్ల ఆర్టెమిస్-2 యాత్ర ఇప్పటికే ఒక నెల ఆలస్యమైంది. ప్రయోగ సన్నాహాల్లో భాగంగా ఇంధనాన్ని నింపే పరీక్షను శుక్రవారం నిర్వహించి చూశారు. అందులో పెద్దగా లీకేజీలు బయటపడలేదు. దీంతో మార్చి 6న రాకెట్‌ను ప్రయోగించొచ్చని నాసా భావించింది. అంతలోనే హీలియం ప్రవాహ సమస్య తలెత్తింది.

ఫ్రాన్స్‌లో జాతీయవాద కార్యకర్త హత్యపై నిరసన

లియోన్ (ఫ్రాన్స్): జాతీయవాద కార్యకర్త ఒకరిని కొట్టి చంపిన ఘటనపై నిరసన తెలుపుతూ వందలాది మంది శనివారం లియోన్ నగరంలో ప్రదర్శన నిర్వహించారు. వచ్చే సంవత్సరం దేశాధ్యక్ష పదవికి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో చోటుచేసుకున్న ఈ పరిణామాలు వామపక్షాలకూ, జాతీయవాదులకూ మధ్య రాజకీయ ఉద్రిక్తతల్ని మరింతగా పెంచే అవకాశం ఉంది. గతవారం వామపక్షవాదుల దాడిలో క్వెంటిన్ డెరాంక్ అనే 23 ఏళ్ల జాతీయవాద కార్యకర్త మెదడుకు దెబ్బ తగిలి మరణించాడు. లియోన్‌లో జరిగిన ఓ విద్యార్థి సమావేశంలో రెండు భావజాలాలకు సంబంధించిన కార్యకర్తల మధ్య తలెత్తిన ఘర్షణలో డెరాంక్ మృతి చెందాడు.

దీనికి వ్యతిరేకంగా సాగిన ప్రదర్శన భారీ పోలీసు బందోబస్తు నడుమ జరిగింది. ''మృతిచెందిన మన యువ సోదరుడికి, అతని కుటుంబానికి గౌరవాన్ని తెలియజేసే ఘడియ ఇది. బాధ్యతగా ప్రవర్తించాల్సిన సమయమిది'' అని అధ్యక్షుడు మెక్రాన్ ఒక ప్రకటనలో కోరారు. సంయమనం పాటించాల్సిందిగా ఆయన దేశ ప్రజలకు పిలుపునిచ్చారు.

కేంద్ర ప్రభుత్వం - కేంద్ర కార్యనిర్వాహక శాఖ

ప్రభుత్వంలో శాసన నిర్మాణశాఖ, కార్యనిర్వహణశాఖ, న్యాయశాఖ అనే మూడు విభాగాలుంటాయి. ఇవి ప్రభుత్వ విధులైన ప్రజా సంక్షేమం, శాంతిభద్రతలను నిర్వహిస్తాయి. దేశం కీర్తి, ప్రతిష్ఠ, అభివృద్ధి ప్రభుత్వ పనితీరుపై ఆధారపడి ఉంటాయి. రాజ్యాంగంలోని 5వ భాగంలో 52 నుంచి 151 వరకు ఉన్న నిబంధనలు కేంద్ర ప్రభుత్వం గురించి తెలియజేస్తాయి. కేంద్ర ప్రభుత్వ నిర్వహణలో ఈ మూడు శాఖలు సహకారం, సమన్వయంతో వ్యవహరించాలని భారత రాజ్యాంగం తెలియజేస్తుంది.



ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ పాలిటీ

దేశ ప్రథమ పౌరుడు.. సర్వోన్నత కార్యనిర్వహణాధికారి!

రాజ్యాంగంలోని 5వ భాగంలో 52 నుంచి 78 వరకు ఉన్న నిబంధనలు కేంద్ర కార్యనిర్వహణశాఖ గురించి తెలియజేస్తాయి. ఈ శాఖలో రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి, మంత్రి మండలి సభ్యులుగా ఉంటారు. ఈ శాఖాధిపతి రాష్ట్రపతి.

◆ భారతదేశానికి రాష్ట్రపతి రాజ్యాంగబద్ధమైన అధిపతి, దేశ ప్రథమ పౌరుడు. భారత రాజ్యాంగాన్ని, చట్టాలను రక్షించి, కాపాడే బాధ్యత రాష్ట్రపతికి ఉంటుంది. రాష్ట్రపతి సాధారణ పరిస్థితుల్లో నామమాత్రపు కార్యనిర్వహణ అధిపతిగా, అత్యవసర పరిస్థితుల్లో కొన్ని అసాధారణ అధికారాలను కలిగి ఉంటారు. రాజ్యాంగపరంగా అన్ని అధికారాలను రాష్ట్రపతి కలిగి ఉన్నప్పటికీ వాటిని చెలాయించేది మాత్రం ప్రధానమంత్రి, అతడి అధ్యక్షతన ఉండే మంత్రిమండలి.

◆ భారతదేశంలో పార్లమెంటరీ తరహా ప్రభుత్వ విధానాన్ని ఏర్పాటు చేశారు. దీన్ని బ్రిటన్ నుంచి గ్రహించారు. రాష్ట్రపతి ఎన్నిక పరోక్ష విధానంలో జరుగుతుంది. అంటే ప్రజలు నేరుగా రాష్ట్రపతిని ఎన్నుకోరు. రాష్ట్రపతి ఎన్నిక పద్ధతిని ఐర్లాండ్ నుంచి గ్రహించారు.

52వ నిబంధన: భారతదేశానికి రాష్ట్రపతి అధిపతిగా వ్యవహరిస్తారు.

53వ నిబంధన

రాష్ట్రపతి సర్వోన్నత కార్యనిర్వహణాధికారి అని తెలియజేస్తుంది. దేశపాలనను రాష్ట్రపతి పేరు మీద నిర్వహించే పద్ధతిని అమెరికా నుంచి గ్రహించారు.

53(1): భారత యూనియన్ కార్యనిర్వహణ అధికారాన్ని రాష్ట్రపతి కలిగి ఉంటారు. ఈ అధికారాన్ని రాష్ట్రపతి స్వయంగా లేదా ఆయన అధీనంలోని అధికారుల ద్వారా, రాజ్యాంగం ప్రకారం చెలాయిస్తారు.

53(2): రాష్ట్రపతి త్రివిధ దళాలకు అధిపతి (సర్వసైన్యాధిపతి)గా వ్యవహరిస్తారు.

54వ నిబంధన

రాష్ట్రపతి ఎన్నిక గురించి తెలియజేస్తుంది.

◆ రాష్ట్రపతిని ఎన్నుకోవడానికి ఒక ప్రత్యేకమైన ఎన్నికల గణం ఉంటుంది. దీన్నే 'ఎలక్టోరల్ కాలేజ్' అంటారు. ఈ ఎన్నిక పరోక్ష నైష్పత్తిక ప్రాతినిధ్య పద్ధతిలో ఏక ఓటు బదలాయింపు పద్ధతి ద్వారా జరుగుతుంది.

ఎలక్టోరల్ కాలేజ్ సభ్యులు:

- ☛ రాజ్యసభకు ఎన్నికైన సభ్యులు (ఎంపీలు)
- ☛ లోక్‌సభకు ఎన్నికైన సభ్యులు (ఎంపీలు)

◆ రాష్ట్రాల్లోని శాసనసభలకు ఎన్నికైన సభ్యులు, దిల్లీ, పుదుచ్చేరి విధాన సభలకు ఎన్నికైన సభ్యులు.

◆ 70వ రాజ్యాంగ సవరణ ద్వారా 1992లో కేంద్రపాలిత ప్రాంతాలైన దిల్లీ, పుదుచ్చేరి శాసన సభ్యులను కూడా రాష్ట్రపతిని ఎన్నుకునే ఎలక్టోరల్ కాలేజ్‌లోకి చేర్చారు. ఇది 1995 జూన్ 1 నుంచి అమల్లోకి వచ్చింది.

రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటుహక్కు లేనివారు:

◆ రాష్ట్రాల్లోని శాసనమండలి సభ్యులు (విధాన పరిషత్)

◆ శాసన మండలి సభ్యులు (ఎమ్మెల్సీలు) కాకుండా 104వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా కింది వారికి కూడా ఓటు హక్కు లేదు.

- ☛ రాజ్యసభకు రాష్ట్రపతి నామినేట్ చేసిన 12 మంది సభ్యులు.
- ☛ లోక్‌సభకు రాష్ట్రపతి నామినేట్ చేసిన ఇద్దరు ఆంగ్లో ఇండియన్ సభ్యులు.
- ☛ విధాన సభలకు గవర్నర్లు నామినేట్ చేసిన ఆంగ్లో ఇండియన్ సభ్యులు.

55వ నిబంధన

రాష్ట్రపతి ఎన్నిక విధానాన్ని ఈ నిబంధన తెలియజేస్తుంది.

55 (1): రాష్ట్రపతిని ఎన్నుకోవడంలో అన్ని రాష్ట్రాలకు సమాన ప్రాతినిధ్యం ఉండాలి.

55 (2) (ఎ): ఈ నిబంధన ప్రకారం ఒక రాష్ట్ర జనాభాను ఆ రాష్ట్ర శాసనసభకు ఎన్నికైన సభ్యుల సంఖ్యతో భాగించాలి. వచ్చిన లబ్ధాన్ని తిరిగి 1000తో భాగించి, 1000కి ఒక ఓటు చొప్పున ఒక్కొక్క సభ్యుడికి ఉన్న ఓట్లను నిర్ధారిస్తారు.

$$\text{ఎమ్మెల్యే ఓటు విలువ} = \frac{\text{రాష్ట్రం మొత్తం జనాభా}}{\text{ఎన్నికైన ఎమ్మెల్యేల సంఖ్య}} \times \frac{1}{1000}$$

$$\text{ఎంపీ ఓటు విలువ} = \frac{\text{అన్ని రాష్ట్రాల మొత్తం ఎమ్మెల్యేల ఓట్ల విలువ}}{\text{ఎన్నికైన ఎంపీల సంఖ్య}}$$

55 (3): రాష్ట్రపతి ఎన్నిక నైష్పత్తిక ప్రాతినిధ్య విధానంలో ఏక ఓటు బదిలీ పద్ధతిలో రహస్యంగా జరుగుతుంది. దీన్నే దామాషా ఓటింగ్ పద్ధతి అని కూడా అంటారు. రాష్ట్రపతి పదవికి ఒకరి కంటే ఎక్కువ మంది పోటీ చేస్తున్నప్పుడు ఎలక్టోరల్ కాలేజ్ సభ్యులు ప్రాధాన్యత క్రమంలో ఓటు వేయాల్సి ఉంటుంది. దీన్నే ప్రిఫరెన్షియల్ ఓటింగ్ పద్ధతి అంటారు. ◆ రాష్ట్రపతి ఎన్నికలను కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తుంది. ◆ రాష్ట్రపతి ఎన్నికకు రిటర్నింగ్ అధికారిగా ఒకసారి లోక్‌సభ సెక్రటరీ జనరల్, మరొకసారి రాజ్యసభ సెక్రటరీ జనరల్ రొటేషన్ పద్ధతిలో వ్యవహరిస్తారు.

56వ నిబంధన

రాష్ట్రపతి పదవీ కాలపరిమితిని తెలియజేస్తుంది.

56 (1): రాష్ట్రపతి ప్రమాణస్వీకారం చేసిన రోజు నుంచి అయిదేళ్లు పదవిలో ఉంటారు.

56 (1) (ఎ): అయిదేళ్ల లోపు ఏ కారణంతోనైనా రాష్ట్రపతి తన పదవికి రాజీనామా చేయవచ్చు. అయితే రాష్ట్రపతి తన రాజీనామా పత్రాన్ని ఉపరాష్ట్రపతికి సమర్పించాలి. ఒకవేళ ఆయన అందుబాటులో లేకపోతే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేదా సీనియర్ న్యాయమూర్తికి సమర్పించాలి. కానీ తన రాజీనామా విషయాన్ని లోక్‌సభ స్పీకర్, ప్రధానమంత్రికి తెలియజేయాలి.

56 (1) (బి): రాష్ట్రపతి రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడినట్లయితే మహాభియోగ తీర్మానం ద్వారా పదవి నుంచి తొలగించవచ్చు

56 (1) (సి): రాష్ట్రపతి పదవీకాలం ముగిసినప్పటికీ, నూతన రాష్ట్రపతి ప్రమాణ స్వీకారం చేసి, పదవిని చేపట్టే వరకు రాష్ట్రపతిగా కొనసాగుతారు.

56 (2): ఈ నిబంధన రాష్ట్రపతి రాజీనామా లేఖను ఉపరాష్ట్రపతి అందుకున్న వెంటనే ఆ విషయాన్ని లోక్‌సభ స్పీకర్‌కు తెలియజేయాలని సూచిస్తుంది.

57వ నిబంధన

రాష్ట్రపతి పదవికి ఒక వ్యక్తి ఎన్నిసార్లయినా పోటీ చేయవచ్చు, ఎన్నిసార్లయినా రాష్ట్రపతి పదవిని చేపట్టవచ్చు. ఇలా 2 సార్లు రాష్ట్రపతి పదవి చేపట్టిన డా. బాబూ రాజేంద్రప్రసాద్ 3వ సారి పోటీ చేయకుండా ఒక సంప్రదాయాన్ని నెలకొల్పారు.

58వ నిబంధన

రాష్ట్రపతిగా ఎన్నికవ్వాలంటే అవసరమయ్యే అర్హతలను ఈ నిబంధన తెలియజేస్తుంది.

❑ 35 సంవత్సరాల వయసు నిండి భారతీయ పౌరుడై ఉండాలి. లాభదాయక పదవిలో ఉండరాదు. ఆదాయం వచ్చే ప్రభుత్వ పదవిలో ఉండరాదు. లోక్‌సభ సభ్యుడిగా ఎన్నిక కావడానికి తగిన అర్హతలు కలిగి ఉండాలి. దివాలా తీసిన వ్యక్తి అయి ఉండకూడదు. పార్లమెంట్ నిర్ణయించిన ఇతర అర్హతలు కలిగి ఉండాలి.



రచయిత
డా. వి.కుమారస్వామి
విషయ నిపుణులు

Word of the Day

929

Dissonant

Telugu meaning: వైరుధ్యం, అపసవ్యం

English meaning: The word dissonant (డిసొనెంట్) is an adjective that describes a lack of harmony, agreement, or compatibility, especially in sounds or opinions.

Synonyms: Discordant, Harsh; ***Antonyms:*** Harmonious, Melodious

Usage: **1.** The dissonant notes produced by the inexperienced musicians made the performance unpleasant for the audience.

2. There were dissonant opinions within the committee, which delayed the final decision on the important project.

Current Affairs



Vice-President C. P. Radhakrishnan released and launched the book, The Sage who Reimagined Hinduism: The Life, Lessons and Legacy of Sree Narayana Guru, in New Delhi. The book is authored by Member of Parliament, Dr. Shashi Tharoor. The Vice-President said that Sree Narayana Guru emerged as a spiritual guide at a time when caste divisions and social discrimination were deeply entrenched in society.



The DRDO has conducted a successful qualification-level load test of the Drogue Parachute for the Gaganyaan programme in Chandigarh. The Ministry of Defence said that the dynamic test, simulating qualification-level loads which are higher than the maximum flight loads, shows the additional design safety margin of the parachute. The test was conducted with the ISRO, Aerial Delivery Research and Development Establishment, and DRDO, alongside various TBRL's dedicated teams.



India assumed the chairmanship of the Indian Ocean Naval Symposium (IONS) from Thailand during the 9th Conclave of Chiefs held in Visakhapatnam on 20 February 2026, marking its return to the leadership of the forum after 16 years. India will hold the chair for the next two years. Having earlier held the inaugural Chairmanship from 2008 to 2010.

India and the United States have signed the Pax Silica declaration at the India AI Impact Summit in New Delhi on 20 February 2026. This declaration will strengthen collaboration in areas like the production of critical minerals and semiconductors and in the rapidly evolving Artificial Intelligence space, to create a safe and strong global silicon and technology ecosystem.

For more Current Affairs: Scan QR code

సర్ జోసెఫ్ జాన్ థామ్సన్

శాస్త్రవేత్తలు విశేషాలు

జె.జె. థామ్సన్‌గా సుపరిచితులైన ఈయన ఇంగ్లండ్‌కు చెందిన ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త. పరమాణువుల్లో ఎలక్ట్రాన్ అనే ఉపకణం ఉంటుందని తొలిసారిగా గుర్తించింది ఈయనే. శాస్త్ర సాంకేతిక రంగంలో అనేక విప్లవాత్మక మార్పులకు ఇది కారణమైంది. ఎలక్ట్రాన్‌ను కనుక్కున్నందుకు గానూ ఆయనకు నోబెల్ పురస్కారం లభించింది. పరమాణు నమూనాను మొదటిసారి ప్రతిపాదించిన శాస్త్రవేత్త జె.జె. థామ్సన్. దీని ఆధారంగానే ఎందరో శాస్త్రజ్ఞులు వివిధ నమూనాలు అభివృద్ధి చేశారు. ఎలక్ట్రాన్ల పితామహుడిగా (father of electrons) పేరొందిన థామ్సన్ జీవితంలోని ముఖ్య విశేషాల గురించి తెలుసుకుందాం..!

బాల్యం - వృత్తి జీవితం

☛ జె.జె. థామ్సన్ 1856, డిసెంబరు 18న మాంచెస్టర్‌లోని చీతం హిల్‌లో జన్మించారు. పాఠశాల విద్యను మాంచెస్టర్‌లోని ప్రైవేట్ పాఠశాలలో పూర్తి చేశారు. చిన్నతనం నుంచే ఆయనకు సైన్స్ పట్ల ఆసక్తి ఉండేది.


☛ 1876లో కేంబ్రిడ్జ్‌లోని ట్రినిటీ కాలేజీలో గణితం చదివేందుకు థామ్సన్‌కు స్కాలర్‌షిప్ లభించింది. 1880లో బీఏ పట్టా అందుకున్నారు. అదే ఏడాది ట్రినిటీ కాలేజీకి ఫెలోగా ఎన్నికయ్యారు.

☛ 1884, డిసెంబరులో కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలోని కావెండిష్ ప్రయోగశాలలో ప్రొఫెసర్, డైరెక్టర్‌గా చేరారు. అక్కడ ఆయన అనేక ప్రయోగాత్మక పరిశోధనలు నిర్వహించారు.



జె.జె.థామ్సన్ అందుకున్న పురస్కారాలతోపాటు ఎస్ఎస్‌సీ సీజీఎల్, ఎంటీఎస్ పరీక్షల్లో అడిగిన ప్రశ్నలు - జవాబుల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - భారతదేశ చరిత్ర



ఆంగ్లో - మైసూరు యుద్ధాలు

భారతదేశంలో ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారులు తమ రాజ్యవ్యాప్తి విధానంలో భాగంగా బెంగాల్‌ను ఆక్రమించారు. తర్వాత వారి దృష్టి దక్షిణాపథంలోని మైసూర్ రాజ్యంపై పడింది. మైసూర్ రాజ్యాన్ని పరిపాలించిన హైదరలీ (1722 - 82), అతడి కుమారుడు, వారసుడైన టిప్పుసుల్తాన్ (1751 - 99) తమ రాజ్యాన్ని, ప్రజలను కాపాడుకోవడానికి జరిపిన పోరాటం ఆంగ్లేయుల వ్యూహాలను బలహీనపరిచింది. ఫలితంగా మైసూరు పాలకులకు, ఆంగ్లేయులకు మధ్య మొత్తం నాలుగు మైసూరు యుద్ధాలు జరిగాయి. సుదీర్ఘ పోరాటం తర్వాత బ్రిటిష్‌వారు అంతిమ విజయం సాధించారు.

మొదటి మైసూరు యుద్ధం

18వ శతాబ్దపు మొదటి దశలో విజయనగర సామ్రాజ్య పునాదులపై వెలసిన స్వతంత్ర రాజ్యమే మైసూరు.

✦ వడయార్ వంశపు రాజు చిన్న కృష్ణరాజు సోదరులైన దేవరాజు, నంజరాజుల నుంచి హైదరలీ సింహాసనాన్ని ఆక్రమించుకున్నాడు.

✦ మొదటి మైసూరు యుద్ధం (1767 - 69) రెండేళ్ల పాటు జరిగింది.

✦ క్రీ.శ. 1769 ఏప్రిల్ 4న ఆంగ్లేయులతో సంధి కుదిరింది. దీనిలో భాగంగా బ్రిటిష్ వారికి, హైదరలీకి మధ్య పలు ఒప్పందాలు కుదిరాయి.

మొదటి మైసూరు యుద్ధం - కారణాలు - సంధి షరతులు, రెండో మైసూరు యుద్ధం - కారణాలు, మూడో మైసూరు యుద్ధం, నాలుగో మైసూరు యుద్ధం - తీరుతెన్నులు, శ్రీరంగపట్నం సంధి నియమాలు మొదలైన అంశాలతోపాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది.

మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

నోటిఫికేషన్స్

అప్రెంటిస్ పోస్టులు

కేరళ, చవారాలోని ది ఇండియన్ రేర్ ఎర్త్ లిమిటెడ్ (ఐఆర్ఈఎల్) గ్రాడ్యుయేట్ & టెక్నీషియన్ అండ్ ట్రేడ్ అప్రెంటిస్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 89. ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 24 ఫిబ్రవరి 2026.

స్పెషలిస్ట్ గ్రేడ్ - III ఉద్యోగాలు

నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సీడీసీ), ఒప్పంద ప్రాతిపదికన స్పెషలిస్ట్ గ్రేడ్-III (పబ్లిక్ హెల్త్) ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 14. అర్హులైన అభ్యర్థులు 2026, మార్చి 6లోగా ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ ట్రెయినీ పోస్టులు

భారత ప్రభుత్వ రంగ సంస్థ హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్), 2026-27 సంవత్సరానికి దేశవ్యాప్తంగా వివిధ విభాగాల్లో గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ ట్రెయినీ (ఇంజినీరింగ్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 608. అర్హులైన అభ్యర్థులు 2026, మార్చి 2లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తు చేశారా..? కింది ఉద్యోగాలకు నేడే (ఫిబ్రవరి 22) చివరి తేదీ

☛ ఎగ్జిమ్ బ్యాంక్‌లో 20 డిప్యూటీ మేనేజర్స్ ఉద్యోగాలు. డిగ్రీ, సీఏ, పీజీ ఉత్తీర్ణులు అర్హులు.

☛ పీజీఐఎంఈఆర్‌లో ప్రాజెక్ట్ రిసెర్చ్ సైంటిస్ట్-1 పోస్టులు. డిగ్రీ, పీజీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Railway Exams
Reasoning

Missing Letters

Directions (Q.s: 1 - 34): Find the missing letters in the given series.

1. _RU_CRUZ_RU_
A) BQHJ B) OQPJ
C) JWBJ D) CZCZ

2. P_NT_EN_PE_T
A) QNIB B) EPTN
C) WUSB D) BWIH

3. LI_PL_M_LI_P
A) BSIW B) QBWO
C) WJNE D) MIPM

4. _BC_BB_D_BC_
A) LHRSB B) POCSW
C) BDCBD D) RVWIH

5. _IA_AL_AR_LIA_A
A) NAHDO B) IWNAJ
C) BSJBS D) LRIAR

6. C_LO_CH_OR_HLO_
A) HRLCR B) BAINS
C) HWINQ D) NOSHQ

7. c_cde_vcd_cvc_e
A) oann B) janb
C) jqnj D) vced

8. j_ryf_u_yfju_yf
A) biai B) ajab
C) ujrr D) hsjj

9. _inx_mi_xem_nx_
A) menie B) nsjak
C) oandn D) bjskq

10. a_tic_eart_cle_rti_le
A) nakna B) rliac
C) jjana D) bianw

11. c_rim_uri_cur_m
A) bsiq B) qjbd
C) nakn D) ucmi

12. pl_yp_o_plo_
A) acjn B) olyy
C) fjvj D) hihk

13. _ENE_VEN_LVE_EL
A) VIGD B) FJBK
C) INVK D) VLEN

14. _OU_YOU_YOU_
A) GIOP B) YTTT
C) GIVJ D) IGDJ

15. Q_MCQ_M_QQM_
A) QQCC B) KKOP
C) ILPW D) WATR

16. _OU_DGO_RD_OUR_
A) NKFFI B) SHOBK
C) GRUGD D) FKBLL

17. _EA_YLE_FYL_AFY
A) QKBS B) QINB
C) HQIN D) LFAE

18. R_TT_RA_TER_TTE
A) AETA B) USIN
C) QONB D) HSIN



19. _zc_xzcv_zc_
A) akak B) vjbj
C) bakn D) xvxv

20. _ery_mce_yu_
A) curn B) janw
C) bjwj D) qkbs

21. _um_juma_um_
A) jaja B) hajj
C) iqbh D) yaib

22. _UNKF_NKF_N_
A) OQNB B) FUUK
C) HSKB D) HQIH

23. _IM_ILIM_ILI_SI
A) LSSM B) KLOP
C) QIBH D) BINQ

24. BL_WR_LO_RBL_WR
A) OBWO B) HQBJ
C) IQBV D) QOBB

25. _asa_casa_ca_ar
A) iqhh B) elyy
C) crrs D) buhj

26. _ick_mick_mi_ky
A) oqbv B) myyc
C) hqhh D) uqbk

27. o_io_opi_mopio_
A) njzh B) qibb
C) pmom D) hajn

28. p_ick_prick_pric_y
A) opnc B) ryyk
C) hqon D) numi

29. _uni_lun_tlu_it
A) qjjn B) winb
C) innn D) ltin

30. v_sam_esa_ves_m
A) qunn B) evma
C) hsnn D) ajbb

31. c_vh_cv_ccv_
A) nzhh B) cchh
C) ainb D) qihh

32. d_rm_erm_er_
A) akjj B) dkmd
C) meed D) eddm

33. y_riy_ri_ur_
A) qjjv B) uuyi
C) iqhh D) isjj

34. g_a_gla_gl_m
A) lmma B) ghah
C) vibb
D) quhh

Scan the QR code for Key

These model questions were prepared by subject experts

పాదరక్షల రంగానికి కేంద్రం దన్ను

- ఎఫ్‌డీడీఐ స్నాతకోత్సవంలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి



స్నాతకోత్సవ సావనీర్ ఆవిష్కరణలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం.. పాదరక్షలు, తోలు పరిశ్రమల అభివృద్ధికి రూ.1,700 కోట్లు కేటాయించి ఆ రంగం అభివృద్ధికి అండగా నిలుస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ రాయదుర్గంలోని ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌డీడీఐ) 5వ స్నాతకోత్సవానికి శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. '30 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువతో... ప్రపంచంలోనే రెండో అతి పెద్ద పాదరక్షల తయారీ దేశంగా భారత్ నిలిచింది. ఈ రంగంలో 22 లక్షల ఉద్యోగాలు కల్పించడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. ఇందుకోసం ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకాన్ని పరిశీలిస్తున్నాం' అని కిషన్‌రెడ్డి సూచించారు. ఈ సందర్భంగా డిగ్రీ, పీజీ కోర్సులు పూర్తి చేసిన 76 మంది విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. స్నాతకోత్సవ సావనీర్ ఆవిష్కరించారు. ఎఫ్‌డీడీఐ ఎండీ వివేక్ శర్మ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తేజ్ లోహిత్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆఖరిచూపు కోసం వెళ్తూ అనంత లోకాలకు..

- కారు ఢీకొని మామ, అల్లుడు మృతి


రామచంద్రం


శ్రీనివాస్

తిమ్మాపూర్, న్యూస్‌టుడే: బంధువు చనిపోయారని తెలిసి ఆఖరి చూపు కోసం బయల్దేరిన మామ, అల్లుడిని కారు రూపంలో మృత్యువు కబళించింది. కళ్లెదుటే అయినవాళ్లను పోగొట్టుకున్న బాధిత కుటుంబ సభ్యుల రోదనలు అక్కడివారిని కలచివేశాయి. ఈ విషాద ఘటన తెలంగాణలోని కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి గ్రామశివారులో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం బొమ్మనపల్లికి చెందిన అవధూత శ్రీనివాస్(54) సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో 20 ఏళ్లుగా హెయిర్ సెలూన్ నిర్వహిస్తూ భార్య పరమేశ్వరి, నలుగురు కుమార్తెలతో కలిసి ఉంటున్నారు. శ్రీనివాస్ మామ(భార్య తండ్రి), మానకొండూర్ మండలం కొండపల్కల గ్రామానికి చెందిన శ్రీరాముల రామచంద్రం(70), భార్య మల్లవ్వతో కలిసి వారం క్రితం హుస్నాబాద్‌కి వచ్చారు. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం తోటపల్లి వద్ద బంధువు చనిపోవటంతో ఆఖరి చూపు కోసం రామచంద్రం, శ్రీనివాస్ ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. కొత్తపల్లి వద్ద హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. వెనక ఆటోలో వస్తున్న పరమేశ్వరి, ఆమె మూడో కుమార్తె భవాని, తల్లి మల్లవ్వ వెళ్లి చూడగా.. రామచంద్రం అప్పటికే మరణించారు. శ్రీనివాస్‌కు తీవ్రగాయాలు కావటంతో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందారు. శ్రీనివాస్ ఇటీవల పెద్ద కుమార్తె వివాహం జరిపించారు. భర్తను, తండ్రిని పోగొట్టుకున్న పరమేశ్వరి.. ముగ్గురు కుమార్తెలను ఎలా చూసుకోవాలని రోదించిన తీరు అందరిని కలచివేసింది. ఆమె ఫిర్యాదుతో కారు డ్రైవర్, కరీంనగర్‌కు చెందిన సాగి సాయిశ్రవణ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎల్ఎండీ ఎస్సై అన్వర్ చెప్పారు.

ఆదాయానికి మించి ఆస్తులు.. కల్వకుర్తి ఏడీఏ అరెస్టు, రిమాండ్


పానుగోడులోని కిరణ్‌కుమార్ ఇంట్లో తనిఖీలు చేస్తున్న ఏసీబీ అధికారులు

ఈనాడు, సూర్యాపేట: తెలంగాణలో గతంలో సూర్యాపేట డీఆర్‌డీఏగా పనిచేసి.. ప్రస్తుతం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి ఏడీఏగా పనిచేస్తున్న సుందరి కిరణ్‌కుమార్ ఇంట్లో ఏసీబీ అధికారులు శనివారం సోదాలు నిర్వహించి ఆయన్ను అరెస్టు చేశారు. ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయన్న సమాచారం మేరకు కిరణ్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు మహబూబ్‌నగర్ ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ తెలిపారు. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం పానుగోడులోని కిరణ్‌కుమార్ ఇంట్లో అధికారులు విలువైన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే జిల్లాలో పలుచోట్ల ఏకకాలంలో సోదాలు చేశారు. మధ్యాహ్నం వరకు సోదాలు నిర్వహించిన అధికారులు కిరణ్‌కుమార్‌ను అరెస్టు చేసి హైదరాబాద్ తీసుకెళ్లారు. అక్కడ కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు.

రూ.4 కోట్ల అక్రమాస్తుల గుర్తింపు..

ఇప్పటి వరకు లెక్కించిన స్థిర, చరాస్తుల డాక్యుమెంట్ విలువ సుమారు రూ.4 కోట్ల వరకు ఉంటుందని ఏసీబీ అధికారులు అంచనా వేశారు. ఇందులో ఆయన నివాసంతో పాటు కుటుంబ సభ్యులు, దగ్గరి వ్యక్తులు, ఇతర ప్రాంతాల్లో నిర్వహించిన సోదాల్లో సుమారు 97.03 ఎకరాల వ్యవసాయ భూమి, మూడు ఓపెన్ ప్లాట్లు, ఐదు వాహనాలు, రూ.5.50 లక్షల విలువైన ఇన్సూరెన్స్ పాలసీలు, కుటుంబ సభ్యుల పేర్లపై రూ.50 లక్షల పెట్టుబడులు, ఒక నివాస గృహం, రెండు ప్లాట్లు ఉన్నట్లు గుర్తించారు. బహిరంగ మార్కెట్ ధరల ప్రకారం ఆ ఆస్తుల విలువ ఆదాయానికి కంటే దాదాపు పది రెట్లు ఎక్కువగా ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

మూడో వంతు మలేరియా కేసులు.. అల్లూరి, మన్యం జిల్లాల్లోనే

- రాష్ట్రంలో మూడేళ్లుగా తగ్గిన వ్యాధి తీవ్రత
- వైద్యారోగ్య శాఖ గణాంకాలు వెల్లడి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో మలేరియా కేసులు అత్యధికంగా అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లోనే నమోదవుతున్నాయి. 2024లో రాష్ట్రవ్యాప్తంగా 7,891 కేసులు నమోదైతే.. ఈ రెండు జిల్లాల్లోనే 6,347 (80.43%) బయటపడ్డాయి. 2025లో 7,119 మలేరియా కేసులు బయటపడగా, అల్లూరి జిల్లాలో 3,153, మన్యం జిల్లాలో 1,820 చొప్పున వెలుగుచూశాయి. దీంతో రాష్ట్రవ్యాప్త కేసుల్లో ఈ రెండు జిల్లాల్లోనే 69% వరకు ఉన్నట్లు వైద్యారోగ్య శాఖ లెక్కతేల్చింది. రెండేళ్ల సగటును పరిగణనలోకి తీసుకుంటే ఇది మూడోవంతు కావడం గమనార్హం. అటవీ, కొండ ప్రాంతాల్లో గిరిజనుల నివాసం, వాతావరణ మార్పులు మలేరియా వ్యాప్తి తీవ్రతకు కారణాలుగా పేర్కొంది. 'మలేరియా నిర్మూలన జాతీయ కార్యాచరణ రూపకల్పన-2030'లో భాగంగా దశల వారీగా కేసులు తగ్గిస్తూ, పూర్తిగా నిర్మూలించే దిశగా చేపడుతున్న చర్యలను వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు శనివారం అధికారులు వివరించారు. గిరిజనులకు 89,845 దోమ తెరలు త్వరలో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఆ వివరాలివి..

- రాష్ట్రంలో 2015లో 25,042 మలేరియా కేసులు రాగా, 2025లో ఈ సంఖ్య 7,119కి పడిపోయింది.
- బాపట్ల, పశ్చిమ గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో గత మూడేళ్లుగా మలేరియా కేసులు నమోదు కాలేదు.
- తూర్పు గోదావరి, అన్నమయ్య, చిత్తూరు, పల్నాడు, తిరుపతి జిల్లాల్లో ఒకట్రెండు కేసులు బయటపడ్డాయి. అనంతపురం, గుంటూరు, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, శ్రీసత్యసాయి జిల్లాల్లో 10 లోపు, వైఎస్సార్ కడప, నంద్యాల, కర్నూలు జిల్లాల్లో 20 లోపు, ప్రకాశం, శ్రీకాకుళం జిల్లాల్లో 38 లోపు, ఎన్టీఆర్ జిల్లాలో 50 లోపు కేసులు బయటపడ్డాయి.

ఇతర వ్యాధుల్లోనూ కట్టడి తీరు

- రాష్ట్రవ్యాప్తంగా డెంగీ కేసులు 2024లో 5,555 నమోదుకాగా, 2025లో 2,686కు తగ్గాయి.
- నీటి కలుషితం ఘటనలు 2024లో 50 వెలుగుచూస్తే, 2025లో 22 నమోదయ్యాయి.
- కలుషిత ఆహారం కేసులు 2024లో 53, 2025లో 42 బయటపడ్డాయి.
- కలరా కేసులు 2024లో 22, గతేడాది ఆరు నమోదయ్యాయి.

వైకాపా నాయకులది దైవద్రోహం

- స్వామివారిని అవమానించిన వారందరికీ లీగల్ నోటీసులు పంపిస్తాను
- తితిదే బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి

ఈనాడు, దిల్లీ: హిందువుల ఆరాధ్యదైవం శ్రీవేంకటేశ్వరస్వామి పట్ల శాసనమండలిలో వైకాపా నాయకులు వ్యవహరించిన తీరు అత్యంత దారుణంగా ఉందని తితిదే బోర్డు సభ్యుడు, భాజపా సీనియర్ నాయకుడు భానుప్రకాశ్‌రెడ్డి ధ్వజమెత్తారు. దాన్ని తాను దైవద్రోహం, భగవంతుడి పట్ల ఘోర అపచారంగా భావిస్తున్నట్లు చెప్పారు. చెప్పులేసుకొని స్వామివారి చిత్రపటాన్ని ప్రదర్శించడం ద్వారా కోట్ల మంది భక్తుల మనోభావాలను దెబ్బతీసినందుకు వైకాపా ఎమ్మెల్సీలకు లీగల్ నోటీసులు పంపించనున్నట్లు చెప్పారు. ఆయన శనివారం ఇక్కడ ఏపీభవన్‌లో విలేకర్లతో మాట్లాడారు. "వైకాపా నాయకులు కాళ్లకు చెప్పులు, బూట్లు వేసుకొని స్వామివారి చిత్రపటాన్ని పట్టుకొని శాసనమండలిలో ప్రదర్శించడం ఎంతవరకు సమంజసం? అధికారంలో ఉన్నప్పుడు ఒకవైపు స్వామివారి లడ్డూ కల్తీ చేశారు. మరోవైపు దేవాలయాలపై దాడులు చేశారు. ప్రస్తుతం తితిదేను లక్ష్యంగా చేసుకొని దాని ప్రతిష్ఠను దెబ్బతీసేలా కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారు. ఇంత మహాపరాధానికి ఒడిగట్టిన జగన్‌మోహన్‌రెడ్డితోపాటు, ఆ పార్టీ నాయకులంతా అలిపిరి శ్రీవారి పాదాల దగ్గరికి వచ్చి ముక్కు నేలకు రాసి బహిరంగ క్షమాపణ చెప్పాలి. వైవీసుబ్బారెడ్డి తితిదే ఛైర్మన్‌గా ఉన్న సమయంలో జరిగిన బోర్డు మీటింగ్‌లో అజెండా నెం.371లో నెయ్యి కొనుగోళ్లకు సంబంధించిన నిబంధనల్లో మార్పులు చేసినప్పుడు ఎక్స్‌అఫిషియో మెంబర్‌గా ఉన్న భూమన కరుణాకర్‌రెడ్డి ఆరోజు వాటిని ఎందుకు అడ్డుకొని చిత్తశుద్ధి చూపలేదో ప్రజలకు జవాబు చెప్పాలి" అని భానుప్రకాశ్‌రెడ్డి ప్రశ్నించారు.

తెలంగాణలో గోదావరి పుష్కరాలకు ఏర్పాట్లు

- మాస్టర్‌ప్లాన్ తయారుచేయనున్న ఎర్నెస్ట్ అండ్ యంగ్ సంస్థ

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో 2027లో గోదావరి పుష్కరాలు, 2028లో కృష్ణా పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. భారీ సంఖ్యలో వచ్చే భక్తుల్ని దృష్టిలో పెట్టుకుని క్రౌడ్ మేనేజ్‌మెంట్, పుష్కరఘాట్లు సహా ఇతర సౌకర్యాలపై దృష్టి సారించింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన మహాకుంభమేళ తరహాలో రాష్ట్రంలో పుష్కరాలను నిర్వహించాలని భావిస్తోంది. మహాకుంభమేళాకు కన్సల్టెంట్‌గా పనిచేసిన ఎర్నెస్ట్ అండ్ యంగ్ ఎల్ఎల్‌పీ సంస్థను ఇక్కడి పుష్కరాలకు ప్రభుత్వం ఎంపిక చేసిందని దేవాదాయశాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. పుష్కరాలకు ఏర్పాట్లు, నిర్వహణ ప్రణాళికను ఆ సంస్థ రూపొందిస్తుందని పేర్కొన్నారు.

సేంద్రియ పసుపు.. క్వింటా రూ.25 వేలు!

- మూడెకరాల్లో ఐదు రకాల విత్తనాలు సాగు
- ఎకరాకు 20 క్వింటాళ్ల దిగుబడి
- నిజామాబాద్ జిల్లా రైతు అశోక్ ఆదర్శ సాగు


తాను పండించిన మ్యాంగో జింజర్ పసుపు కొమ్ములను చూపుతున్న గంజాల అశోక్

ఈనాడు, నిజామాబాద్: పసుపు కొమ్మును విరవగానే మామిడి సువాసన గుప్పుమంటుంది. పచ్చిదినోట్లో వేసుకున్నా అదే రుచి తగులుతుంది. ఇలాంటి ప్రత్యేకతలున్న వివిధ రకాల పసుపును పుష్కరకాలం నుంచి సేంద్రియ విధానంలో పండిస్తున్నారో ఆదర్శ రైతు. ఆయనే తెలంగాణలోని నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలం షెట్‌పల్లి గ్రామానికి చెందిన గంజాల అశోక్. గ్రామంలో ఆయనకు సొంతంగా 8 ఎకరాల భూమి ఉంది. ఈ ఏడాది మూడు ఎకరాల్లో ఎర్ర గుంటూరు, నల్ల పసుపు, మ్యాంగో జింజర్(మామిడికాయ, పసుపు, అల్లం రుచులు కలగలిపినది), కస్తూరి మంజరి, యెల్లో మంజరి తదితర ఐదు రకాల పసుపు సాగు చేశారు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు రెండెకరాల్లో సుమారు 40 క్వింటాళ్ల దిగుబడి చేతికందింది. గతంలో మాదిరిగానే ముందే బుకింగ్ చేసుకున్న రాజస్థాన్, తమిళనాడు, కర్ణాటక, బెంగళూరు ప్రాంతాల వ్యాపారులు ఇంటికొచ్చి పంటను తీసుకెళ్లారు. క్వింటా రూ.25 వేల వరకు ధర పలికింది. ఎకరాకు పెట్టుబడి సుమారు రూ.1.4 లక్షలు కాగా, రూ.5 లక్షల విలువైన దిగుబడి వచ్చింది. అశోక్ పసుపు విత్తనాలను ఉత్తరాఖండ్, కేరళ, తమిళనాడు రాష్ట్రాల నుంచి సేకరిస్తున్నారు.

మిగతా భూమిలో ఇతర పంటలు

గతేడాది వరకు సుమారు ఆరెకరాల్లో 15 రకాల పసుపు రకాలను సాగు చేసిన అనుభవం అశోక్‌కు ఉంది. మిగతా భూమిలో మొక్కజొన్న, జొన్న, గోధుమ, కూరగాయలు వంటివి పండిస్తుంటారు. 'రసాయన ఎరువులకు బదులు జీవామృతం, వేప కషాయం వినియోగించి ఈ ఏడాది మూడెకరాల్లో పసుపు పండించా. ఈ రకాల పసుపులో ఔషధ గుణాలకు ప్రమాణమైన 'కర్క్యుమిన్' 3.5 శాతం పైగా ఉంటోంది. దీంతో మార్కెట్ కంటే రెట్టింపు ధర వెచ్చించి ఇతర రాష్ట్రాల వ్యాపారులు పంట కొనుక్కెళ్తున్నారు' అని అశోక్ 'ఈనాడు'కు తెలిపారు. 'నల్ల పసుపును క్యాన్సర్ ఔషధాల తయారీకి వినియోగిస్తారు. మ్యాంగో జింజర్‌ను పచ్చళ్లకు ఎక్కువగా వాడతారు' అని మండల వ్యవసాయాధికారి శ్రీకాంత్ 'ఈనాడు'తో పేర్కొన్నారు.

జీఎస్‌టీ 2.0 సరళీకరణ చర్యలతో వ్యాజ్యాల తగ్గుదల

- జీఎస్‌టీఏటీ అధ్యక్షుడు జస్టిస్ డా.సంజయ్ కుమార్ మిశ్రా



హైదరాబాద్, న్యూస్‌టుడే: జీఎస్‌టీ 2.0 కింద ప్రతిపాదించిన సరళీకరణ చర్యలు దీర్ఘకాలంలో జీఎస్టీ అంశాలపై వ్యాజ్యాలను తగ్గించే అవకాశముందని గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ అప్పిలేట్ ట్రైబ్యునల్(జీఎస్‌టీఏటీ) అధ్యక్షుడు, విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ డా.సంజయ్ కుమార్ మిశ్రా అన్నారు. ఫెడరేషన్స్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఎఫ్‌టీసీసీఐ) ఆధ్వర్యంలో జీఎస్టీ అంశాలపై అవగాహన కల్పించేందుకు శనివారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లోని హోటల్ హయత్ ప్లేస్‌లో జీఎస్‌టీఏటీ సమిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా జస్టిస్ సంజయ్ కుమార్ మిశ్రా మాట్లాడుతూ... 'జీఎస్‌టీఏటీ... జీఎస్‌టీ అప్పీళ్ల పరిష్కారానికి రూపుదిద్దుకుంది. పన్ను డిమాండ్ వివాదాలు, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్(ఐటీసీ) సమస్యలు, రిఫండ్ క్లెయిమ్స్, పెనాల్టీలు, వర్గీకరణ వివాదాలు, జీఎస్‌టీ నిబంధనల వివరణ వంటి అంశాలను జీఎస్‌టీఏటీ పరిష్కరిస్తుంది. తద్వారా హైకోర్టులపై భారం తగ్గుతుంది" అని వివరించారు. ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు ఆర్.రవి కుమార్, ఎఫ్‌టీసీసీఐ జీఎస్‌టీ, కస్టమ్స్ కమిటీ ఛైర్ మహ్మద్ ఇర్షాద్ అహ్మద్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల జీఎస్‌టీఏటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి!

- పౌరహక్కుల సంఘం నేతల డిమాండ్

ఈనాడు, హైదరాబాద్: ఆపరేషన్ కగార్, కర్రెగుట్ట ఆపరేషన్-2, తెలంగాణ సరిహద్దుల్లో గ్రేహౌండ్స్ పోలీసుల కూంబింగ్‌లను వెంటనే నిలిపివేయాలని పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు ప్రొ.లక్ష్మణ్ గడ్డం డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ఉన్న అంబేడ్కర్ విగ్రహం కూడలి వద్ద శనివారం ఆ సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ప్రొ.గడ్డం లక్ష్మణ్ మాట్లాడుతూ..సుప్రీంకోర్టు వ్యాఖ్యానించినట్లుగానే భారత ప్రభుత్వం తన పిల్లలను తానే మట్టుపెడుతోందన్నారు. ఫిబ్రవరి 18 నుంచి ఆపరేషన్ కర్రెగుట్ట-2 ప్రకటించి మిగిలిపోయిన మావోయిస్టులు, ఆదివాసీలను చంపేసే కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ నేత సంధ్య, పౌరహక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణరావు, ఉపాధ్యక్షుడు ప్రొ.గుంటి రవి, కె.రవి, న్యాయవాది విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎల్‌బీసీ దుర్ఘటనకు ఏడాది

- నాడు ఎనిమిది మంది కార్మికులు మృతి
- ఇప్పటికీ లభించని ఆరుగురి ఆచూకీ



ఈనాడు, మహబూబ్‌నగర్- న్యూస్‌టుడే, అమ్రాబాద్, అచ్చంపేట న్యూటౌన్: శ్రీశైలం ఎడమ గట్టు కాలువ(ఎస్ఎల్‌బీసీ) టన్నెల్ పైకప్పు కూలి ఏడాది అవుతోంది. 2025 ఫిబ్రవరి 22న జరిగిన ఈ ప్రమాదంలో సొరంగంలో 8 మంది చిక్కుకుపోగా.. ఇద్దరి మృతదేహాలే లభ్యమయ్యాయి. మిగతా ఆరుగురి కోసం గాలించినా లభ్యం కాలేదు. బాధిత కుటుంబాలకు కన్నీరే మిగిలింది. దాదాపు మూడేళ్ల తర్వాత 2025 ఫిబ్రవరి 18న దోమలపెంట ఇన్‌లెట్ వైపు టీబీఎంతో సొరంగం తవ్వకం ప్రారంభించారు. 22న 14వ కి.మీ. వద్ద సొరంగం పైకప్పు ఒక్కసారిగా కుప్పకూలి 8 మంది చిక్కుకున్నారు. వారిని కాపాడేందుకు 12 విభాగాల సిబ్బంది, టన్నెల్ నిపుణులు సహాయక చర్యలు చేపట్టారు. వెయ్యి మందికి పైగా మూడు షిఫ్టుల్లో 24 గంటలు పని పనిచేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్, జూపల్లి, కోమటిరెడ్డి, అధికారులు పర్యవేక్షించారు. సహాయక బృందాలు రెండు నెలలకు పైగా శ్రమించాయి. ఊటల నుంచి భారీగా నీరు వస్తుండడంతో నిపుణుల సూచనలతో సహాయక చర్యలు నిలిపివేశారు. జైప్రకాశ్ (జేపీ) సంస్థకు చెందిన పీఈ మనోజ్‌కుమార్(51), ఎఫ్ఈ శ్రీనివాస్(50), కార్మికులు సందీప్‌సాహు(28), జక్తాజెస్(37), సంతోష్ సాహు(37), అనూజ్ సాహు(25), రాబిన్స్ సంస్థ ఆపరేటర్లు సన్నీ సింగ్(35), గురుదీప్ సింగ్(40) మృతిచెందారు. వీరంతా జమ్మూకశ్మీర్, పంజాబ్, ఝార్ఖండ్, యూపీ రాష్ట్రాల వారు. ఘటన జరిగిన 16వ రోజు గురుప్రీత్ సింగ్, 32వ రోజు మనోజ్‌కుమార్ మృతదేహాలు లభ్యమయ్యాయి. మిగతా కార్మిక కుటుంబాలకు చివరి చూపు దక్కలేదు. టన్నెల్‌లో మృతిచెందిన ఒక్కో కార్మికుడి కుటుంబానికి ప్రభుత్వం రూ.25 లక్షల చొప్పున పరిహారం అందించింది. ఆయా కంపెనీలతో రూ.30 లక్షల వరకు ఇప్పించారు.

కాళ్లూచేతులు కట్టేసి.. దిండుతో ఊపిరాడకుండా చేసి..

- ప్రియుడితో కలిసి భర్తను దారుణంగా హత్య చేసిన భార్య
- రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో దారుణం


నిందితులు రాజేశ్వరి


శరత్‌శరత్

చేవెళ్ల గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యనే ప్రియుడి మోజులో పడి భర్తను దారుణంగా హత్య చేసింది. ఐదేళ్లలోపు ఇద్దరు పిల్లలను అనాథలను చేసింది. తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా చేవెళ్ల సీఐ భూపాల్‌శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం... శంకర్‌పల్లి మండలం పర్వేద గ్రామానికి చెందిన నారగూడం కృష్ణ(35).. జీడిమెట్లకు చెందిన రాజేశ్వరిని ప్రేమించి 2018లో పెళ్లి చేసుకున్నారు. చేవెళ్లలోని చంద్రారెడ్డినగర్‌లో అద్దె ఇంట్లో ఉంటూ కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వారికి ఇద్దరు ఐదేళ్లలోపు పిల్లలు ఉన్నారు. చేవెళ్ల మండల పరిధిలోని ఖానాపూర్ గ్రామానికి చెందిన శరత్ చేవెళ్లలోని గణేశ్ నగర్‌కాలనీలో అద్దెకు ఉంటున్నాడు. రాజేశ్వరికి ఆరు నెలల కిందట అతనితో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైంది. అది ఇద్దరి మధ్య వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈ విషయం కృష్ణకు తెలియడంతో భార్యాభర్తల మధ్య గొడవలు జరిగాయి. దీంతో కృష్ణను అడ్డు తొలగించుకుంటే ఇద్దరం కలిసి జీవించవచ్చని నిశ్చయించుకున్నారు. గురువారం రాత్రి భర్త మద్యం తాగొచ్చి నిద్రపోతుండటంతో ఇదే అదునుగా భావించి ప్రియుడికి ఫోన్ చేసి రప్పించింది. ఇద్దరూ కలిసి కృష్ణ కాళ్లు, చేతులు కట్టేశారు. శరత్ అతని ముఖంపై దిండు పెట్టి శ్వాస ఆడకుండా చేయడంతోపాటు ఛాతీపై దూకాడు. మృతిచెందాడని నిర్ధారించుకున్న తర్వాత శరత్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. రాజేశ్వరి శుక్రవారం ఉదయం భర్త పలకడం లేదని ఆటోలో పట్నం మహేందర్‌రెడ్డి వైద్యకళాశాలకు తీసుకెళ్లింది. వైద్యులు పరీక్షించి మృతిచెందాడని చెప్పడంతో ఇంటికి తీసుకొచ్చి సాధారణ మరణంగా చిత్రీకరించేందుకు ప్రయత్నించింది. కృష్ణ తల్లి అంజమ్మకు ఫోన్ చేసి విషయం చెప్పగా.. ఆమె వచ్చి చూసి రాజేశ్వరిపై అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని డీఐ(సీఐ) ఉపేందర్, ఎస్సై తేజశ్రీ రాజేశ్వరిని అదుపులోకి తీసుకొని విచారించగా అసలు విషయం బయటపడింది. శరత్‌ను కూడా అదుపులోకి తీసుకొని ఇద్దరినీ శనివారం రిమాండుకు తరలించారు. నిందితుడు శరత్‌పై గతంలో బాలికపై అత్యాచారం చేశాడనే కేసు నమోదైందని సీఐ చెప్పారు.

ఏఐ సమిట్‌లో యూత్ కాంగ్రెస్ ఆందోళన దురదృష్టకరం

- విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్

ఈనాడు, అమరావతి: ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో యూత్ కాంగ్రెస్ నేతల ఆందోళన ప్రపంచ దేశాల మధ్య దేశ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ మండిపడ్డారు. వారి ప్రవర్తన దురదృష్టకరమని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. "సాంకేతిక ప్రతిభ, ఆవిష్కరణలు ఆహ్వానించేందుకే ఇలాంటి గ్లోబల్ వేదికలు. ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ వేదికను రాజకీయ ప్రదర్శనకు వాడుకోవడం బాధాకరం. చిన్నచిన్న రాజకీయాల్ని పక్కన పెట్టి అందరం దేశ నిర్మాణంలో భాగస్వాములవుదాం" అని నారా లోకేశ్ పిలుపునిచ్చారు.

యువజన కాంగ్రెస్ మనమంతా సిగ్గుపడేలా చేసింది : జగన్

దిల్లీలో ఏఐ సమిట్‌లో శుక్రవారం యువజన కాంగ్రెస్ కార్యకర్తలు వ్యవహరించిన తీరు మనందరినీ సిగ్గుపడేలా చేసిందని జగన్ విమర్శించారు. అసలు మన రాజకీయాలు ఎటువైపు వెళుతున్నాయని ప్రశ్నించారు. 'ఎవరూ మన దేశాన్ని కించపరచుకోకూడదు.. మన మధ్య రాజకీయ విభేదాలెన్ని ఉన్నా, ప్రపంచం ముందు మన ఐక్యతను చాటాలి' అని పేర్కొన్నారు.

మీ తండ్రి వారసత్వాన్ని దిగజార్చొద్దని యువజన కాంగ్రెస్ కౌంటర్

జగన్ చేసిన వ్యాఖ్యలపై యువజన కాంగ్రెస్‌పై స్పందిస్తూ.. 'మీ తండ్రి వారసత్వాన్ని దిగజార్చకండి' అంటూ హితవు పలికింది. 'మీ తండ్రి, మనం గర్వించదగ్గ నాయకుడు. వైఎస్ రాజశేఖరరెడ్డి మతతత్వ, విభజన శక్తులతో పోరాడేందుకు జీవితాన్ని అంకితం చేశారు. మీరు సీబీఐ, ఈడీ కేసులను ఎదుర్కొంటున్నంత మాత్రాన.. మీ తండ్రి వారసత్వాన్ని అంత బహిరంగంగా దిగజార్చకండి' అని విమర్శించింది.

- దీనిపై వైకాపా నేత అంబటి రాంబాబు స్పందిస్తూ 'మీరు ప్రస్తావిస్తున్న కేసులు మీ పార్టీ మోపినవే. వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబాన్ని మీ పార్టీ ఎలా చూసుకుందనేది దేశమంతా చూసింది. ప్రజాస్వామ్యంలో రాజకీయ విభేదాలు సహజం. కానీ, ప్రపంచం ముందు దేశాన్ని కించపరచడం ఆమోదయోగ్యం కాదు' అని పేర్కొన్నారు.

తెలుగు భాషను కాపాడుకుందాం: జగన్

ఈనాడు, అమరావతి: 'ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలందరికీ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ శుభాకాంక్షలు. మన మాతృభాష తెలుగును కాపాడుకుందాం. మన సంస్కృతిని భావి తరాలకు అందిద్దాం' అని మాజీ సీఎం జగన్ శనివారం 'ఎక్స్'లో పోస్టు చేశారు.

స్నేహితుడు, సోదరుడిగా ఎప్పటికీ గుర్తుంటావ్: జగన్

దివంగత మాజీ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి జగన్ శనివారం 'ఎక్స్'లో చేసిన పోస్టులో గౌతమ్‌రెడ్డిని స్మరించుకుంటూ.. 'ప్రియమైన గౌతమ్, మన స్నేహం మధుర జ్ఞాపకాలను నేను ఎప్పుడూ గుర్తుంచుకుంటా.. ఒక స్నేహితుడు, సోదరుడిగా నీవెప్పుడూ గుర్తుంటావు' అని పేర్కొన్నారు.

అంతర్జాతీయ ఉద్యాన ప్రదర్శనలో తెలంగాణ స్టాల్‌కు ప్రథమ బహుమతి

ఈనాడు, హైదరాబాద్: హరియాణాలోని కర్నాల్‌లో జరిగిన అంతర్జాతీయ ఉద్యాన ప్రదర్శనలో తెలంగాణ స్టాల్‌కు ప్రథమబహుమతి లభించింది. ఈ నెల 19న ప్రారంభమైన ప్రదర్శన శనివారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ఉత్తమ డిజైన్, ఉత్పత్తుల ప్రదర్శన విభాగంలో తెలంగాణ స్టాల్‌ను మొదటి స్థానానికి ఎంపిక చేశారు. హరియాణా వ్యవసాయ శాఖ మంత్రి శ్యామ్ సింగ్ రాణా తెలంగాణ అధికారులకు బహుమతి అందజేశారు.

ఇంధన రంగంలో పెట్టుబడి అవకాశాలు పెంచేలా 'ఇన్వెస్ట్‌మెంట్ బజార్': సీఎస్ విజయానంద్

ఈనాడు-అమరావతి: ఇంధన రంగంలో పెట్టుబడుల అవకాశాలను మరింత పెంచేలా ఈనెల 24న విజయవాడలో ఇన్వెస్ట్‌మెంట్ బజార్ నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. ఇంధన సంరక్షణ, సమర్థ వినియోగంలో దేశంలో ఏపీకి ప్రత్యేక గుర్తింపు ఉందని, అమరావతిని ఇంధన సామర్థ్య పెట్టుబడులకు ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చేయడంపై ప్రభుత్వం దృష్టిసారించినట్లు పేర్కొన్నారు. ఆయన శనివారం జెన్‌కో సీఎండీ, ట్రాన్స్‌కో, డిస్కమ్‌ల అధికారులతో వర్చువల్‌గా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇంధన సామర్థ్య పెట్టుబడులకు ఇన్వెస్ట్‌మెంట్ బజార్ దిశానిర్దేశం చేసే కీలక వేదిక కానుందని చెప్పారు. పరిశ్రమలు, బ్యాంకులు, సాంకేతిక సంస్థలు, విధాన నిర్ణేతలను ఒకే వేదికపైకి తీసుకొస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్స్ చేపట్టిన ఎనర్జీ ఎఫిషియెన్సీ ఫైనాన్సింగ్ ప్లాట్‌ఫామ్ కార్యక్రమంలో భాగంగా దీనిని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఏపీఎస్ఈసీఎం సీఈవో పుల్లారెడ్డి మాట్లాడుతూ.. 50 మందికిపైగా వివిధ పరిశ్రమల, బ్యాంకుల, వివిధ సంస్థల ప్రతినిధులు, ఉన్నతాధికారులు ఇందులో పాల్గొంటారని తెలిపారు.

స్వాతంత్ర్య సమరయోధుల భూమిని 22ఏలో పెట్టి వేధింపులు

- వైకాపా ప్రభుత్వంలో నిర్వాకం
- తెదేపా కేంద్ర కార్యాలయంలో బాధితుడి ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: తన తల్లికి స్వాతంత్ర్య సమరయోధుల కేటగిరిలో ప్రభుత్వం కేటాయించిన 6.82 ఎకరాల్ని .. గత వైకాపా ప్రభుత్వంలో అన్యాయంగా 22ఏలో పెట్టారని విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలానికి చెందిన రూపాకుల రవికుమార్ వాపోయారు. సర్వే జరిపి న్యాయం చేయాలని కోరుతూ మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన ఫిర్యాదు చేశారు. వివిధ సమస్యలతో తరలివచ్చిన బాధితుల నుంచి ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్‌బాబులు వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. వైకాపా నాయకుల అండతో తన స్థలంలో గోడ నిర్మించిన వారిపై చర్యలు తీసుకోవాలని నంద్యాల జిల్లా పాణ్యం మండలానికి చెందిన బాధితుడు కోరారు. గత వైకాపా ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే, మండల పరిషత్తు ఉపాధ్యక్షుడి సహకారంతో అవనిగడ్డ నియోజకవర్గం ఘంటసాల మండలం పాపవినాశనం గ్రామంలో ప్రభుత్వ భూమిని ప్రైవేటు భూమిగా చూపించి అన్యాక్రాంతం చేశారని బుజ్జి అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు.

కుమ్మెర జాతరలో గొడవ.. శిశువు మృతి

- కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు
- పోలీసులు న్యాయం చేయడం లేదని చిన్నారి తల్లి ఆరోపణ

కందనూలు, న్యూస్‌టుడే: తెలంగాణలోని నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర మల్లికార్జున స్వామి జాతరలో జరిగిన గొడవలో కిందపడిన రెండు నెలల శిశువు మృతి చెందిందంటూ అందిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... కుమ్మెరలో ఈనెల 17న జాతర ప్రారంభమవగా 18న అదే గ్రామానికి చెందిన గణేశ్ కుటుంబసభ్యులతో కలిసి దైవ దర్శనానికి వెళ్లారు. దర్శన సమయంలో టికెట్ విషయంలో అక్కడే ఉన్న కొంతమందితో గణేశ్‌కు మధ్య గొడవ జరిగిందని... ఈ సందర్భంగా జరిగిన తోపులాటలో గణేశ్ భార్య మౌనిక, వారి రెండు నెలల ఆడశిశువు పడ్డారని... ఆరోగ్యం విషమించడంతో శిశువు శనివారం మృతి చెందిందని మౌనిక చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. శిశువు మృతదేహానికి పట్టణంలోని జనరల్ ఆసుపత్రిలో పోస్టుమార్టం చేసినట్లు ఎస్సై చెప్పారు. నివేదిక ఆధారంగా నిందితులపై చర్యలు తీసుకుంటామన్నారు. బాధిత కుటుంబ సభ్యులు శనివారం పట్టణంలోని ఠాణాకు వచ్చి విలేకరుల వద్ద తమగోడు తెలిపారు. మౌనిక మాట్లాడుతూ పోలీసులు తమకు న్యాయం చేయకుండా అధికార పార్టీ నాయకులకు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరారు.